

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 149

మంగళవారం 19-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారతీయులందరికీ స్ఫూర్తి
శుభాంశు శుక్లాకు ప్రధాని ప్రశంస

ఐఎస్ఎస్‌కు వెళ్లినప్పుడు వెంట తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చిన త్రివర్ణ పతాకాన్ని సోమవారం ప్రధాని మోదీకి బహూకరిస్తున్న శుభాంశు శుక్లా 6లో



ప్రధానికి పుతిన్ ఫోన్
రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. ట్రంప్‌తో తన భేటీ వివరాలను విశదీకరించారు.
- వివరాలు 6లో▶



ఎస్ఐఆర్‌పై స్తంభించిన సభ
బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో పార్లమెంటులో కార్యకలాపాలు జరగలేదు.
- వివరాలు 6లో▶



గెలిచాక ఈసీ పనిపడతాం
ప్రతిపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్నికల కమిషన్ భరతం పడతామని రాహుల్‌గాంధీ హెచ్చరించారు.
- వివరాలు 6లో▶



సరిహద్దులో మరో సిటీ తుపాకీ
హైదరాబాద్ సంస్థ లోకేశ్ మెషీన్స్ లిమిటెడ్ భారత సైన్యం కోసం తాజాగా మీడియం మెషీన్ గన్ తయారు చేస్తోంది.
- వివరాలు 2లో▶

అడ్డుకుంటున్నది వారే

బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా మోదీ, కిషన్‌రెడ్డి మోకాలడ్డుతున్నారు



మతం రంగు పులిమి రాజకీయం చేస్తున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం
- బీసీలంటే బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదు
- రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులపై కేంద్రం స్పందించడం లేదు
- నాడు కేసీఆర్ చేసిన చట్టం రిజర్వేషన్లకు ఆటంకంగా మారింది
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి సీఎం శంకుస్థాపన

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, తుమ్మల, పొన్నం ప్రభాకర్, మధుయాష్కి, మహేశ్‌కుమార్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్, జాజుల తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటున్నది ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాత్రమే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బీసీల కలను సాకారం చేసేలా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా కసరత్తు చేసిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు, ప్రతిపాదనలకు మతం రంగు పులిమి బీజేపీ నేతలు రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ 2018లో చట్టాన్ని చేయడం ద్వారా అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రిజర్వేషన్లు పెంచే అవకాశం లేకుండా చేశారని విమర్శించారు. ఇప్పుడు రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించాలంటే ఆ చట్టం అడ్డంకిగా మారిందని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న 375 జయంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేడుకలకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ట్యాంక్‌బండ్‌కు సమీపంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సర్వాయి పాపన్న

మిగతా 12వ పేజీలో ▶



సోమవారం వైట్‌హౌస్‌కు చేరుకున్న జెలెన్‌స్కీతో ట్రంప్ కరచాలనం

త్రైపాక్షిక చర్చలే తరువాయి...
- పుతిన్, జెలెన్‌స్కీతో కలిసి రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని సమాప్తం చేస్తా
- శ్వేతసౌధంలో ఈయూ కూటమి అగ్రనేతలతో సంయుక్త సమావేశం అనంతరం ట్రంప్ ప్రకటన
- అంతకు ముందు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ భేటీ
- అమెరికా రాజధానిలో కీలక పరిణామం

- వివరాలు 6లో▶

ఈవీఎంలు రద్దు చేస్తా..
బ్యాలెట్టే బెస్ట్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన

2026 మధ్యంతర ఎన్నికల్లోపే ఆ విధానాలకు స్వస్తి పలుకుతా

ఆ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేస్తా

బ్యాలెట్ పేపరే అత్యంత అనువైనది, భద్రమైనది.. వాటితో ఎలాంటి అనుమానాలకు తావు ఉండదు



వాషింగ్టన్: సంచలనాల తేనెతుట్టెను తరచూ కదుపుతూ వివాదాలను రాజేసే అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ తాజాగా కొత్త అంశంతో తెరమీదకొచ్చారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలాగైనా ఆపుతానని అంతర్జాతీయ అంశాన్ని ఎత్తుకున్న ట్రంప్ హఠాత్తుగా దేశీయ రాజకీయ అంశంపై ప్రధానంగా దృష్టిసారించారు. పోస్టల్ ఓటింగ్(మెయిల్ ఇన్ బ్యాలెట్) విధానం పూర్తి లోపభూయిష్టంగా తయారైందని, పోస్టల్ ఓటింగ్ కారణంగా భారీ స్థాయిలో మోసం జరుగుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ''అత్యంత వివాదాలకు కేంద్రస్థానంగా నిలుస్తున్న ఓటింగ్ మెషీన్లను మూలకు పడేస్తా. 2026లో వచ్చే మధ్యంతర ఎన్నికలలోపే మెయిల్-ఇన్-బ్యాలెట్, ఓటింగ్ మెషీన్లకు చరమగీతం పాడుతూ త్వరలోనే కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేస్తా'' అని ట్రంప్ కుండబద్దలు కొట్టారు. '' మెయిల్-ఇన్ బ్యాలెట్ విధానానికి ముగింపు పలికే ఉద్యమానికి సారథ్యంవహిస్తా. కచ్చితత్వం లోపించిన, అత్యంత ఖరీదైన, వివాదాస్పదమైన ఓటింగ్ మెషీన్లను త్యజిద్దాం. అత్యంత అనువైన, భద్రమైన, సులభతరమైన బ్యాలెట్ (వాటర్‌మార్క్) పేపర్‌తో పోలిస్తే ఓటింగ్ మెషీన్ అనేది పదిరెట్లు ఎక్కువ వ్యయంతో కూడిన వ్యవహారం. బ్యాలెట్ పేపర్‌తో చాలా వేగంగా ఎన్నికలు నిర్వహించవచ్చు. ఎలాంటి అనుమానాలకు తావుండదు. ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో ఇట్టే తెలిసిపోతుంది. మెయిల్-ఇన్-ఓటింగ్‌ను

మిగతా 2వ పేజీలో ▶

21న సీఎం చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఈ నెల 21న సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 12లో▶

కీలక కమిషనరేట్‌లో ఖతర్నాక్ ఖాకీ!



కీలక కమిషనరేట్ పరిధిలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో పనిచేస్తున్న ఓ డీసీపీ వ్యవహారం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఆ అధికారి సివిల్ వివాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తూ అక్రమార్జనకు తెరతీసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

- వివరాలు 5లో▶

యూరియా కోసం ధర్నాలు, రాస్తారోకోలు
యూరియా కొరత రైతులను పరుగులు పెట్టిస్తోంది. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. 12లో

కుండపోత వాన..



ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తర్నం వాగు

సిద్దిపేట జిల్లా గౌరారంలో 23.6 సెం.మీ వర్షం
- పలు జిల్లాల్లో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు.. ఇళ్లలోకి వరద
- జాతీయ రహదారులపైనా వరద.. రాకపోకలకు అంతరాయం
- జలదిగ్బంధంలో గ్రామాలు.. చెరువుల్ని తలపిస్తున్న పొలాలు
- మహారాష్ట్రలో గల్లంతయిన జగిత్యాల మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయి. సంగారెడ్డి, సిద్దిపేట, ఆసిఫాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ములుగు, మంచిర్యాల, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. హైదరాబాద్ నగరంలో ఆదివారం రాత్రి 8 గంటలకు మొదలైన వాన సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. జిల్లాల్లో అనేకచోట్ల 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో 23.6 సెం.మీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలుచోట్ల జనావాసాల్లోకి సైతం వరద నీరు చేరింది. కొన్నిచోట్ల జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

రాజీవ్ రహదారిపై వరద

కుంభవృష్టితో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం వద్ద రాజీవ్ రహదారిపై వరదనీరు చేరడంతో కరీంనగర్–హైదరాబాద్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఒకింత అంతరాయం ఏర్పడింది. పంటపొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అంబర్‌పేట–శాకారం మార్గంలో రవాణా స్తంభించి పోయింది.

గుండాల మండలంలో 16 సెం.మీ వర్షం

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో 16 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో నిన్నటి వరకు చుక్కనీరు లేని శామీర్‌పేట, చిన్నేరు వాగులు పరవళ్లు

మిగతా 2వ పేజీలో ▶

గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ!
- కృష్ణాలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు ప్రాజెక్టులన్నింటి గేట్లు ఎత్తివేత
- గోదావరిలోనూ సింగూరు నుంచి ధవళేశ్వరం వరకు ప్రాజెక్టులన్నింటి గేట్లు బార్లా
- సోమవారం తెరుచుకున్న నిజాంసాగర్, ఎస్సారెస్పీ గేట్లు

- వివరాలు 2లో



గంటలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నా టోల్ చెల్లించాలా?
- ట్రాఫిక్‌లో గంటలపాటు ఇరుక్కుపోయినా టోల్ ఫీజు కట్టాలంటూ వాహనదారులను ఒత్తిడి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. కేరళలోని త్రిస్సూర్ జాతీయ రహదారిపై 65 కిలో మీటర్ల దూరానికి సాధారణ ప్రయాణ సమయం గంట మాత్రమే కాగా.. అదనంగా 11 గంటలు సమయం పట్టినా టోల్ రుసుము ఎందుకు కట్టాలని ప్రశ్నించింది. 6లో



అదే మన సమాధానం అని చెప్పండి!

కృష్ణుడి శోభాయాత్ర
విషాదాంతం

రథాన్ని లాక్కెళ్లే జీపు మొరాయించడంతో భక్తులే దాన్ని లాక్కెళ్తుండగా కేబుల్ వైర్లు తగిలి విద్యుదాఘాతం
- ఐదుగురు మృతి, నలుగురికి తీవ్రగాయాలు
- హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఘటన



శోభాయాత్రకు ఉపయోగించిన రథం ఇదే

సాక్షి, హైదరాబాద్/ఉప్పల్/గాంధీ ఆస్పత్రి: కృష్ణుడి శోభాయాత్ర ఐదు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విద్యుత్ తీగల మీద నుంచి వేలాడుతున్న కేబుల్ వైర్‌కు రథం తగలడంతో విద్యుదాఘాతం ఏర్పడింది. దీంతో ఐదుగురు చనిపోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉప్పల్ పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం...రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 8.15 గంటలకు శోభాయాత్ర మొదలైంది. కృష్ణుడి విగ్రహం ఉన్న మెటల్ రథాన్ని జీపునకు కట్టి ముందుకు లాగారు. ఈ శోభాయాత్ర శారదానగర్, ఆర్టీసీ కాలనీ, ఓల్డ్ రామంతాపూర్, ఎండోమెంట్ కాలనీ వరకు వెళ్లింది. అక్కడి నుంచి గోఖలేనగర్‌కు తిరుగు పయనమైంది. యాత్ర ప్రారంభంలో వందలాది మంది భక్తులున్నా, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా చాలామంది ఊరేగింపు వదిలి వెనుదిరిగారు. శోభాయాత్ర గోఖలేనగర్ చౌరస్తాకు చేరగానే రథాన్ని లాగుతున్న జీపు మొరాయించింది. దీంతో ఆ వాహనాన్ని పక్కకు లాగేసిన భక్తులు.. స్వయంగా వారే రథాన్ని లాగడం, తోయడంలో నిమగ్నమయ్యారు. సమీపంలోనే కేబుల్ కనెక్షన్ వైరుకు సపోర్టుగా వేసిన జీఏ వైరు తెగింది. ఇది విద్యుత్ తీగల్ని తాకుతూ రోడ్డు మీదకు వేలాడుతూ ఉంది. శోభాయాత్ర యాదవ సంఘం సమీపంలోకి అర్ధరాత్రి 12.40 గంటలకు చేరగా, తీగలను గమనించని భక్తులు రథాన్ని ముందుకు లాక్కెళ్లారు. రథం ఆ తీగలకు తగలడంతో ఒక్కసారిగా రథం నుంచి కరెంట్ షాక్ వచ్చింది. దీంతో రథాన్ని లాగుతున్న, తోస్తున్న వారితోపాటు

మిగతా 5వ పేజీలో ▶

నాడు..



ఇరవై రోజుల కింద నీళ్లులేక వట్టిపోయిన పెద్దపల్లి జిల్లా రామగుండం సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇప్పుడు నిండుకుండలా మారింది. వర్షాలు సమృద్ధిగా కురుస్తూ ఎగువ నుంచి వరద పోటెత్తుతుండటంతో జలకళ సంతరించుకుంది. అయితే గతంలో నీళ్లులేక ప్రాజెక్టు వట్టిపోయినప్పుడు.. ముంపునకు గురైన ఎల్లంపల్లి గ్రామం ఆనవాళ్లను, ఇప్పుడు నీటితో నిండిపోయిన ప్రాజెక్టు దృశ్యాలను 'సాక్షి కెమెరా' క్లిక్‌మనిపించింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

నేడు..



గోదావరి బోర్డు చైర్మన్‌గా బన్షమని ప్రసాద్ పాండే



ప్రసాద్ పాండేకు అభినందనలు తెలుపుతున్న అంజాద్ హుస్సేన్


సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) చైర్మన్‌గా బన్షమని ప్రసాద్ పాండే సోమవారం జలసౌధలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఇన్‌చార్జి చైర్మన్‌గా కూడా బన్షమని ప్రసాద్ పాండే వ్యవహరించారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లో చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన్ను ఇటీవల గోదావరి బోర్డు చైర్మన్‌గా కేంద్ర జలశక్తి శాఖ బదిలీ చేసింది.

గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ!

- కృష్ణాలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు ప్రాజెక్టులన్నింటి గేట్లు ఎత్తివేత
- గోదావరిలోనూ సింగూరు నుంచి ధవళేశ్వరం వరకు ప్రాజెక్టులన్నింటి గేట్లు బార్లా
- సోమవారం తెరుచుకున్న నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ గేట్లు



శ్రీరాంసాగర్ గేట్లు ఎత్తివేయడంతో దిగువకు గోదారి పరుగులు



శ్రీశైలంలో పది గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

సాక్షి, హైదరాబాద్: బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. గలగలా గోదావరి ఉరుకులు పరుగులు పెడుతోంది. కృష్ణా పరీవాహకంలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు.. గోదావరి పరీవాహకంలో సింగూరు నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేయడంతో ఉభయ నదులు స్వేచ్ఛగా పరుగెడుతూ కడలిలో కలిసిపోతున్నాయి. కృష్ణా పరీవాహకంలో ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జూరాల ప్రాజెక్టులోకి 1.85 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.79 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు. జూరాల, తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలంకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. సోమవారం సాయంత్రం శ్రీశైలం జలాశయానికి 3.29 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 10 గేట్లను 12 అడుగుల మేర పైకెత్తి 4.03 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు విద్యుదుత్పత్తి ద్వారా మరో 66,099 క్యూసెక్కులను విడుదల చేస్తుండడంతో సాగర్‌లోకి 3.05 లక్షల క్యూసెక్కులకు వరద చేరుతోంది. సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా 299.74 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 26 గేట్లను పైకెత్తి 2.25లక్షల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 28,826 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం 2.47 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 10 గేట్లను పైకెత్తి 2.93 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా మరో 16 వేల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు.

ఉగ్ర గోదావరి...

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువన మహారాష్ట్రలోని జైక్వాడ్ ప్రాజెక్టు గరిష్ఠ నిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా, నిల్వలు 97.86 టీఎంసీలకు చేరాయి. రాష్ట్రంలో మంజీరపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకి 36,309 క్యూసెక్కుల వరద వస్తుండగా, 19.6 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 40,821 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ఠ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 95,000 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 14.98 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 1.25లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీరామ్‌సాగర్ గరిష్ఠ నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రాజెక్టుకి 1.17 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 72.99 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 39 గేట్లను పైకెత్తి 2 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 34,493 క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 3.61 టీఎంసీల నిల్వ కొనసాగిస్తూ, 34,194 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న ఎల్లంపల్లి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 15.78 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 1.69 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సుందిళ్ల బరాజ్‌కి 1.59 లక్షలు, అన్నారం బరాజ్‌కి 6905 క్యూసెక్కులు, మేడిగడ్డ బరాజ్‌కి 4.29 లక్షల క్యూసెక్కులు, సమ్మక్కబరాజ్‌కి 4.98 లక్షల క్యూసెక్కులు, సీతమ్మసాగర్ బరాజ్‌కి 5.87 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి విడుదల చేస్తున్నారు.

కృష్ణా ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాల వివరాలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని టి.రేపాక వద్ద తెగిపోయిన రోడ్డు



వనపర్తి జిల్లా మదనాపురం వద్ద వాగు పారడంతో నిలిచిపోయిన రాకపోకలు



కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో వరద నీటిలో మునిగిన పత్తి పంట



కుండపోత వాన..



ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట పెద్దకాలువ గండి పడడంతో పంటపొలాల మీదుగా ఉధృతంగా పారుతున్న వరద

▶ మొదటి పేజీ తరువాయి

తొక్కుతున్నాయి. బిక్కేరు, మూసీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాజ్‌వేల పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. జిల్లాలోనే అతి పెద్దదైన తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు అలుగుపోస్తోంది. సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ మళ్లీ జలమయమయ్యాయి. కేజీబీవీకి సోమవారం కూడా సెలవు ఇచ్చారు.

చెరువుల్లా పంట పొలాలు : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 1000 చెరువులు అలుగు పారుతున్నాయి.

కొట్టుకుపోయిన కోళ్లు.. కారు

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో 16.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. హత్నూర మండలం ఎల్లమ్మగూడ శివారులోని కాలువ కట్ట కొట్టుకుపోయి సమీపంలో ఉన్న పౌల్ట్రీఫాంను వరద ముంచెత్తడంతో కొన్ని కోళ్లు కొట్టుకుపోయాయి. 3 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామ శివారులో పొంగి ప్రవహిస్తున్న వాగులో పవన్ అనే వ్యక్తికి చెందిన కారు కొట్టుకు పోయింది. పవన్ ప్రమాదం నుంచి బయట పడ్డాడు. వరద తగ్గిన తర్వాత పోలీసులు కారును బయటకు తీశారు. మంజీరా నది మహోగ్ర రూపం దాల్చింది. మెదక్ జిల్లాలోని ప్రసిద్ధి చెందిన వనదుర్గమ్మ ఆలయం జల దిగ్బంధంలోనే కొనసాగుతోంది. కల్యాణి , పోచారం ప్రాజెక్టులు ఉధృతంగా అలుగు పోస్తున్నాయి. వందలాది చెరువులు నిండాయి. బాన్సువాడ నుంచి కామారెడ్డికి వచ్చే రహదారిపై సర్వాపూర్ వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలో 16.2 సెం.మీ వర్షం కురిసింది.

మహారాష్ట్రకు నిలిచిన రాకపోకలు

మంచిర్యాలలో కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ప్రాణహిత, పెన్‌గంగ, వార్ధా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రకు అంతర్రాష్ట్ర రహదారి గుండా రాకపోకలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో పలు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

ములుగులో పోటెత్తుతున్న వాగులు

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట వద్ద జాతీయ రహదారిపై ఉన్న 163 హైలెవల్ వంతెన వద్ద 2 కి.మీ. పొడవునా వరద నీరు ప్రవహిస్తోంది. కొండాయి, ఎలిశెట్టిపల్లి వద్ద జంపన్నవాగు, గోగుపల్లివాగు, ఏటూరునాగారం–భద్రాచలం రహదారి మధ్యలోని జీడివాగు, మంగపేట మండలంలోని కమలాపురం వద్ద ఎర్రవాగు, కన్నాయిగూడెం మండలంలోని హనుమంతుల వాగు, ముళ్లకట్ట వద్ద మేడివాగు పొంగిపొర్లుతున్నాయి. ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నుంచి రెండు మీటర్ల ఎత్తులో వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాగా ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు వరద పరిస్థితిని సమీక్షించారు.

గొర్రెల కాపరులు, రైతును రక్షించిన ఎన్‌డీఆర్‌ఎఫ్

కామారెడ్డి జిల్లాలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. జిల్లాలో అత్యధికంగా పిట్లంలో 17.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిజాంసాగర్, మహ్మద్‌నగర్, నస్రుల్లాబాద్ మండలాల్లో 12 సెం.మీ నుంచి 16 సె.మీ. వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి నిజాంసాగర్ గేట్లు ఎత్తడంతో మంజీరలో ప్రవాహం పెరిగి బిచ్కుంద మండలం శెట్లూర్ వద్ద ప్రవాహంలో ముగ్గురు గొర్రెల కాపరులు, ఒక రైతు చిక్కుకున్నారు. 656 గొర్రెలు కూడా నీటి మధ్యలో ఉండిపోయాయి. అధికారులు సోమవారం తెల్లవారుజామున ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల సాయంతో గొర్రెల కాపరులు, రైతును రక్షించారు. అలాగే గొర్రెలను బయటకు తీసుకువచ్చారు.

మహారాష్ట్ర వరదల్లో జగిత్యాల మహిళల గల్లంతు

జగిత్యాల క్రైం: మహారాష్ట్రలో జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొని కారులో తిరుగు పయనమైన ముగ్గురు మహిళలు అక్కడి వరదల్లో గల్లంతు కావడంతో జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. టీఆర్‌నగర్‌కు చెందిన షేక్ అఫ్రిన (30), సమీన (50), హసీన (28)తో పాటు వారి బంధువు, ఆర్మూర్‌కు చెందిన సోహెబ్ ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముక్తేడ్ తాలూకా దెగ్లూర్‌కు వెళ్లారు. ఆదివారం రాత్రి జగిత్యాల వైపు ఖాళీగా వస్తున్న ఓ కారు డ్రైవర్ వీరిని ఎక్కించుకుని టీఆర్‌నగర్‌కు బయల్దేరాడు. 30 కి.మీ. దూరం రాగానే ఓ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో కారు అందులో చిక్కుకుంది. సోహెబ్, డ్రైవర్ ఎలాగో బయటపడి ఒడ్డుకు చేరారు. ముగ్గురు మహిళలు గల్లంతయ్యారు. అంతకుముందు సమీన తన కోడలుకు ఫోన్ చేసి 'పిల్లలు జాగ్రత్త.. మేం వరదల్లో కొట్టుకుపోతున్నాం..' అని సమాచారం ఇచ్చింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా సమీన ఫోన్ పనిచేయలేదు. సోమవారం రాత్రి వరకూ వారి ఆచూకీ లభించలేదు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

కామారెడ్డి జిల్లాలో చేపల వేటకు వెళ్లిన ఒకరు నీట మునిగి చనిపోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామ శివారులో చెరువు అలుగు వరదలో సోమవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన శివరాత్రి నవీన్ (25) గల్లంతైనట్లు గ్రామస్తులు తెలిపారు.

వర్షాలు, వరదలతో 96.5 కి.మీ మేర రోడ్లకు నష్టం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో భారీవర్షాలు, వరదల కారణంగా మొత్తం 96.55 కి.మీ మేర పంచాయతీరాజ్ రోడ్లకు నష్టం వాటిల్లినట్టు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనావేశారు. దీంతో పాటు కొన్ని చోట్ల పీఆర్ భవనాలకు నష్టం వాటిల్లినట్టు, కొన్ని శిథిలావస్థకు చేరుకున్నట్టుగా గుర్తించారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 35 శిథిలావస్థ భవనాల్లో 14 భవనాలు వాడుకలో ఉండగా మిగిలిన 21 భవనాలను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీచేశారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 11 జెడ్పీ క్వార్టర్ భవనాలు శిథిలావస్థలో ఉండగా వాటిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ అయ్యాయి. గ్రామీణ రోడ్లకు సంబంధించి మొత్తం 223 ప్రదేశాల్లో నష్టం వాటిల్లగా, రోడ్ల తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణకు రూ.148 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం రూ.6 కోట్లు కాగా, శాశ్వత పునరుద్ధరణ వ్యయం రూ.142 కోట్లుగా వారు పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అంచనా

వివిధ రోడ్ల వారీగా వాటిల్లిన నష్టం	
ఉపరితల రోడ్ల నష్టం మొత్తం: 75 ప్రాంతాలు, తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం: రూ.3.40 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ వ్యయం: రూ.49.40 కోట్లు	సీడీ వర్క్స్ మొత్తం: 88 ప్రదేశాలు తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం: 1.64 కోట్లు శాశ్వత పునరుద్ధరణ వ్యయం: రూ.87.74 కోట్లు
బ్రీచులు మొత్తం: 60 ప్రదేశాలు, తాత్కాలిక పునరుద్ధరణ వ్యయం:1.08 కోట్లు శాశ్వత పునరుద్ధరణ వ్యయం: రూ.5.57 కోట్లు	

ఈవీఎంలు రద్దు చేస్తా..

▶ మొదటి పేజీ తరువాయి

అనుసరిస్తున్న ఏకైక దేశం మనదే. భారీస్థాయిలో ఓట్ల అవకతవకలు వెలుగుచూడడంతో దాదాపు అన్ని దేశాలు ఈవీఎంలకు మంగళంపాడాయి. ఇకనైనా తప్పులను సరిదిద్దుకుందాం. తప్పుల సవరణను డెమొక్రాట్లు పూర్తిగా వ్యతిరేకిస్తారు. ఎందుకంటే వాళ్లు ఈ తప్పులను గతంలో ఎన్నడూలేనంతటి స్థాయిలో చేశారు. 2026 మధ్యంతర ఎన్నికలకు మరింత విశ్వసనీయతను ఆపాదించేందుకు సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వుపై త్వరలో సంతకం చేస్తా'' అని అన్నారు. ఈ మేరకు ఆయన తన సొంత సామాజికమాధ్యమ 'ట్రూత్ సోషల్' ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

రాష్ట్రాలది కేవలం ఏజెంట్ పాత్ర: 'ఎన్నికల్లో రాష్ట్రాల పాత్ర నామమాత్రం. ఫెడరల్ ప్రభుత్వం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఓట్లను టేబుల్‌పై ఉంచడం, లెక్కించడం వంటివి చేసే ఏజెంట్ పాత్ర మాత్రమే పోషించాలి. అమెరికా అధ్యక్షుడి ఆదేశానుసారం ఫెడరల్ ప్రభుత్వం సూచించే సూచనలను రాష్ట్రాలు తూ.చ. తప్పకుండా పాటిస్తే సరిపోతుంది. అంతేగానీ విప్లవ భావజాల విపక్ష పార్టీలు సరిహద్దులు తెరవాలని డిమాండ్లు చేయడం వంటివాటిని ప్రోత్సహించకూడదు. అసలు ఈ లోపభూయిష్ట మెయిల్–ఇన్ కుంభకోణం జరక్కపోతే డెమొక్రాట్లు గతంలో గద్దెనెక్కేవాళ్లే కాదు. మెయిన్–ఇన్ బ్యాలెట్/ఓటింగ్‌తో ఎన్నికలు ఎప్పటికీ విశ్వసనీయంగా జరగబోవు. అమెరికా ఎన్నికల ప్రక్రియకు విశ్వసనీయత, సమగ్రత తెచ్చేందుకు రిపబ్లికన్ నేతలతో కలిసి నేను ఎంతకైనా తెగించి పోరాడతా. మెయిల్–ఇన్ బ్యాలెట్ అనేది మోసపూరిత ప్రక్రియ. ఇక ఓటింగ్ మెషీన్లను వాడటమనేది ఎన్నికల ప్రక్రియను వినాశనం చేయడమే. ఇక వీటికి కచ్చితంగా ముగింపు పలకాల్సిందే' అని ట్రంప్ అన్నారు.

సరిహద్దుల్లో పేలనున్న మరో సిటీ తుపాకీ

మీడియం మెషీన్ గన్ తయారు చేస్తున్న లోకేశ్ మెషీన్స్

హైదరాబాద్ సంస్థకు ఆర్మీ నుంచి రూ. 17.7 కోట్ల విలువైన ఆర్డర్



సాక్షి, హైదరాబాద్: భారత సరిహద్దుల్లో పహారా కాసే జవాన్ల చేతికి మరో 'సిటీ తుపాకీ'అందనుంది. బాలానగర్ కేంద్రంగా పని చేసే లోకేశ్ మెషీన్స్ లిమిటెడ్ సంస్థ ఇప్పటికే 'అస్మి'పేరుతో ఓ సబ్ మెషీన్ గన్ (ఎస్‌ఎంజీ) రూపొందించి ఆర్మీకి అందించింది. తాజాగా మీడియం మెషీన్ గన్ (ఎంఎంజీ)ను తయారు చేస్తోంది. పుణెలోని రక్షణ అభివృద్ధి, పరిశోధక సంస్థ (డీఆర్డీఓ)లో అంతర్భాగమైన ఆర్మామెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ గన్‌ను డిజైన్ చేయగా... తయారీకి సంబంధించి ఆర్మీ నుంచి రూ.17.7 కోట్ల ఆర్డర్ లోకేశ్ మెషీన్స్‌కు దక్కింది. ఈ సంస్థ ఇజ్రాయెల్, జర్మనీ ఆయుధ కర్మాగారాలకు దీటుగా 'అస్మి'ని ప్రతిష్టాత్మకంగా తయారు చేసింది. ఈ తుపాకీని భద్రతా బలగాలతో పాటు కేంద్ర పోలీసు బలగాలూ వినియోగిస్తున్నాయి. ప్రముఖుల భద్రత కోసం వినియోగించడానికీ అస్మి అనువుగా ఉంది. తాజాగా 7.62 = 51 మి.మీ. క్యాలిబర్‌తో ఉండే ఈ ఎంఎంజీ కూడా నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) ప్రమాణాలకు లోబడి, దేశీయ పరిస్థితులకు అనుగుణంగా తయారవుతోంది. ఈ ఎంఎంజీలో క్విక్ ఛేంజ్ బ్యారెల్ సిస్టం, త్రీ–పొజిషన్ గ్యాస్ రెగ్యులేటర్ వంటి ఆధునిక హంగులున్నాయి. తుపాకీ సమర్థమంతంగా పని చేయడానికి ఇవి ఉపకరిస్తాయి. ప్రస్తుతం ఆర్మీ వినియోగిస్తున్న ఎంఎంజీల కంటే ఈ తుపాకీ 25 శాతం తక్కువ బరువు ఉంటుంది. 1800 మీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ఛేదించగలదు. 250 తూటాల బెల్ట్ కెపాసిటీతో పని చేస్తుంది. రెండు బెల్ట్‌లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. మైనస్ 40 డిగ్రీల నుంచి 55 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలోనూ నిరాఘంటంగా సేవలు అందిస్తుంది.

ప్రభుత్వ అసమర్థతతో తరలిపోతున్న పరిశ్రమలు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనలో తెలంగాణకు పెట్టుబడులతో వచ్చిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తాము ఎంతో శ్రమించి రాష్ట్రానికి తీసుకువచ్చిన 'కేన్స్ టెక్నాలజీ' సెమీకండక్టర్ల పరిశ్రమ గుజరాత్‌కు తరలిపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు. రూ.2,800 కోట్ల పెట్టుబడితో 2వేల మందికి ఉద్యోగాలను కల్పించే 'కేన్స్ టెక్నాలజీ' పరిశ్రమ గుజరాత్‌కు వెళ్లిపోవడం బాధాకరమని సోమవారం ఆయన ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. 'పెట్టుబడుల ప్రతిపాదనలతో రాష్ట్రానికి వచ్చిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్తున్నా, సీఎం రేవంత్‌రెడ్డి కనీసం స్పందించడం లేదు. గతంలో కర్ణాటకు వెళ్లాల్సిన కేన్స్ పరిశ్రమను తెలంగాణకు రప్పించి కేవలం పది రోజుల వ్యవధిలో కొంగరకలాన్‌లో భూములు కేటాయించాం. కాంగ్రెస్ అవినీతి, అసమర్థ పాలన కారణంగా కేన్స్ రాష్ట్రాన్ని విడిచిపెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విధ్వంసక మార్గంలో నడుస్తోంది. రాష్ట్రాభివృద్ధి, ఉద్యోగాల కల్పనను పూర్తిగా గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, విచ్చలవిడిగా తెలంగాణ సంపదను దోచుకుంటోంది. ఇప్పటికైనా రేవంత్ కళ్లు తెరిచి పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించక పోతే మరిన్ని కంపెనీలు రాష్ట్రం విడిచిపోయే ప్రమాదం ఉంది' అని కేటీఆర్ హెచ్చరించారు.

ఇదొక 'చెత్త' సర్కారు! : రాష్ట్రంలో మున్సిపల్, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో మురుగు నీరు, చెత్తకుప్పలతో హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలు కంపుకొడుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నా ప్రభుత్వం ఆర్ ఆర్ ట్యాక్స్ వసూళ్లలో తీరికలేకుండా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రామంతపూర్ గోఖలేనగర్‌లో శ్రీ కృష్ణాష్టమి ఊరేగింపులో జరిగిన దుర్ఘటన అత్యంత విషాదకరమని ఆయన అన్నారు.

పింఛన్ల పెంపునకు సెప్టెంబర్ 9 డెడ్‌లైన్

లక్షలాది మందితో ధర్నా చేస్తా: మంద కృష్ణ హెచ్చరిక



శంషాబాద్ (హైదరాబాద్): 'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపును చేపట్టాలి. అందుకు సెప్టెంబర్ 9 డెడ్‌లైన్.. సర్కారు స్పందించకపోతే పరేడ్ మైదానంలో లక్షలాది మందితో ధర్నా నిర్వహిస్తా' అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం రాత్రి పట్టణంలోని బేగం ఫంక్షన్ హాల్‌లో పింఛన్‌దారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళ్లు, చేతులు లేనోళ్ల పైసలు ఎగ్గొడుతున్న సర్కారుకు బుద్ధి చెప్పేందుకు సన్నద్ధం కావాలన్నారు. పేద వర్గాల పింఛన్లు పెంచని సర్కారుపై ప్రశ్నించని ప్రతిపక్షాలు రాష్ట్రంలో ఉన్నాయని విమర్శించారు. దగా చేస్తున్న సీఎం రేవంత్ సర్కార్‌కు కనువిప్పు కలిగేలా ధర్నా నిర్వహించాలన్నారు. వేలాది కోట్లతో అవసరం లేని పథకాలను కొనసాగిస్తున్న ప్రభుత్వానికి వికలాంగులు, వృద్ధుల ఖర్చు భారంగా మారుతోందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'కు క్లియరెన్స్

- రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ యాదవ్ ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు అత్యంత ప్రాధాన్యత గల సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రం స్పష్టతనిచ్చింది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, సీతారామసాగర్ మల్టీ పర్పస్ ప్రాజెక్టులకు టెక్నో–ఎకనామిక్ క్లియరెన్స్ లభించిందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తెలిపారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 24న జరిగిన నీటివనరుల సలహా కమిటీ 158వ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు. దీంతో గోదావరి నది నీటిని వినియోగించుకునే దిశగా తెలంగాణకు పెద్ద ఊరట లభించినట్టైంది.

'సమ్మక్కసాగర్'పై ఇంకా పరిశీలన..

తెలంగాణ ప్రభుత్వం సమ్మక్కసాగర్ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించిందని కేంద్రమంత్రి తెలిపారు. దానిపై కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలన జరిపి, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన స్పష్టీకరణలను ఈ ఏడాది ఏప్రిల్ 19న స్వీకరించిందన్నారు. అయితే, మరిన్ని సాంకేతిక అంశాలపై ఈ ఏడాది జూలై 24న సీడబ్ల్యూసీ మళ్లీ కొన్ని ప్రాథమిక అభ్యంతరాలను రాష్ట్రానికి తెలియజేసిందన్నారు. దీంతో సమ్మక్కసాగర్ ప్రాజెక్టు క్లియరెన్స్ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్టు కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

పార్లమెంట్‌లో తెలంగాణ, మరిన్ని రాష్ట్ర వార్తలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..


సొలాస్టాల్జియా..

ప్రకృతి విధ్వంసం.. మనిషికి ఉద్వేగం

'ఈ గాలీ.. ఈ నీరూ.. ఈ ఊరూ.. సెలయేరూ..' అంటూ పారవశ్యంతో పాడుకోవాలంటే అవన్నీ అంత స్వచ్ఛంగా ఉండాలి.. మనల్ని అంతలా ప్రేరేపించాలి. కానీ, మారుతున్న పర్యావరణ పరిస్థితులు అలా లేవట. అవి మనుషుల్ని కుంగదీస్తున్నాయట. అవి మన ఆలోచనలు, ప్రవర్తన, భావోద్వేగాలు.. అన్నింటినీ ప్రభావితం చేస్తున్నాయట. దీనికి శాస్త్రవేత్తలు పెట్టిన పేరు సొలాస్టాల్జియా. సొలేస్ (ఓదార్పు లేదా సాంత్వన), నోస్టాల్జియా (బాల్య లేదా పాత జ్ఞాపకాలు).. ఈ రెండు పదాలూ కలిపి ఈ కొత్త జీవనశైలి అనారోగ్యానికి పెట్టారు.

హిమగిరి సొగసులు..
కాశ్మీరు లోయలో.. కన్యాకుమారిలో..
ఆమనీ పాడవే హాయిగా..
పచ్చని చిలుకలు తోడుంటే
పాడే కోయిల వెంటుంటే..
ఎన్ని పాటలు వినలేదు. వినడమేంటి..
ప్రకృతి ఒడిలో ఇంతకంటే మధురమైన
అనుభూతులు పొందినవారు ఎందరో.
ప్రకృతి మనల్ని పరవశింపజేస్తుంది.
ఆటలు ఆడిస్తుంది. పాటలు పాడిస్తుంది.
వేదాలూ పురాణాలూ ఇదే చెప్పాయి. పరిశోధనలూ ఇదే నిజమని రుజువు చేశాయి.
కానీ, అదే ప్రకృతి మనకు అనుకూలంగా లేకపోతే.. అనిపించకపోతే?

- సాక్షి, స్పెషల్‌ డెస్క్‌



మదిలోంచి పోతే..

ఆగస్టు 14న కశ్మీర్‌లోని కిష్తవాడ్‌లోని గంటపాటు సంభవించిన క్లౌడ్‌ బరస్ట్‌.. మిగిల్చిన విషాదాన్ని ఒక్కసారి ఊహించుకోండి. కొండ చరియలు విరిగిపడి ఇళ్లు, దుకాణాలు ధ్వంసమైపోయాయి. ఎంతమంది చనిపోయారో తెలియదు.

అంతకు సరిగ్గా 9 రోజుల ముందు ఉత్తరాఖండ్‌ ధరాలీలో వరద బీభత్సం.. ఇళ్లు, రెస్టారెంట్లు భూస్థాపితం అయిపోయాయి. ఎంతోమంది మరణించారు.

ఈ రెండు సంఘటనల్లోనూ ఊళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. అంతవరకు తమ స్మృతిలో ఉన్న ఆ ఊరు, అక్కడి వాళ్లు ఇక లేరంటే.. చుట్టుపక్కల వారికి ఎలా ఉంటుంది? ప్రాణాలతో బతికినా జీవచ్ఛవాలైన మిగతా వారి పరిస్థితేంటి? ఆ ప్రదేశం సురక్షితం కాదనిపిస్తుంది. ఇది నిన్నటి వరకు నేను చూసిన ప్రదేశమేనా అనిపిస్తుంది.

ఇలాంటి ప్రకృతి విపత్తులు, మనిషి వల్ల జరిగే ఉత్పాతాలు మన మనసులపై తీవ్ర ప్రభావాలు చూపుతాయి అంటున్నారు ఈ 'సొలాస్టాల్జియా' అధ్యయనకర్తలు. ఇందులో వీరు అయా దేశాల్లో వరదలు, కార్చిచ్చులు, గనుల విస్తరణ వంటి వాటిని ప్రస్తావించారు.

ఒక్కో నష్టం.. ఒక్కో ఎమోషన్‌

పర్యావరణంతో ముడిపడి అనేక భావోద్వేగాలు మనిషికి ఉంటాయి. పచ్చని చెట్టును చూస్తే ఒకలా అనిపిస్తుంది.. అదే.. మోడును చూస్తే ఒకలాంటి అనుభూతి కలుగుతుంది. జలాజలా పారే జలపాతాన్ని చూస్తే ఆనందం.. ఎండిపోయిన చెరువు లేదా నదిని చూస్తే దుఃఖం.. ఇలా ప్రకృతిలోని ఒక్కో రకమైన సౌందర్యం.. పర్యావరణ నష్టం మనకు కలిగించే ఎమోషన్లు వేర్వేరుగా ఉంటాయి.

- నిన్నటివరకు ఉన్న ఊరు, ఇళ్లు మొత్తం వరదలు లేదా భూకంపం లేదా కార్చిచ్చు వంటి విపత్తుల్లో నాశనమైపోతే.. మన చేతుల్లో ఏమీ లేదన్న నైరాశ్యం ఆవహిస్తుంది.
- తరతరాలుగా ఉంటున్న ఇల్లు, మన సంస్కృతీ సాంప్రదాయాలకు ఆలవాలమైన ప్రార్థనామందిరాలు, ఇతర నిర్మాణాలు కూలిపోతే ఆ బాధ గుండెల్లో పేరుకుపోతుంది. ముఖ్యంగా రైతుల వంటివారు ఈ జాబితాలో ఉంటారట.
- కరువు ప్రాంతాల్లోనూ ప్రజల్లో చంచలమైన భావోద్వేగాలు, నైరాశ్యం వస్తాయి.

ఈ రకమైన ఒత్తిడి, ఆందోళన, శారీరక మానసిక అనారోగ్యాన్ని కొలిచేందుకు / అంచనా వేసేందుకు ఎన్విరాన్‌మెంటల్‌ డిస్ట్రెస్‌ స్కేల్‌, స్కేల్‌ ఆఫ్‌ సొలాస్టాల్జియా, బ్రీఫ్‌ సొలాస్టాల్జియా స్కేల్‌ వంటివి రూపొందించారట ఈ అధ్యయనకర్తలు.

ఏం చేయగలం?

ప్రకృతి విపత్తులను మనం ఆపలేం. కానీ, మనవల్ల పర్యావరణానికి హాని జరగకుండా చూడటం మన చేతుల్లోనే ఉంటుంది.

- మొక్కలు నాటకపోయినా ఫర్వాలేదు.. ఏపుగా పెరిగిన చెట్లను నరికేయకుండా కాపాడుకుంటే చాలు. ధైర్యం, స్థైర్యం ఉన్న మనిషిని 'చెట్టులాంటి మనిషి' అంటుంటారు. మనమంతా చెట్టులాంటి మనుషులమవుదాం.. భూమాతకు ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇద్దాం.
- నదులు, చెరువులను కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవాలి. వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్లే ఉత్తరాఖండ్‌ వంటి ప్రాంతాల్లో మనం ఎన్నో విపత్తులు చూస్తున్నాం.
- ప్లాస్టిక్‌ కాలుష్యంతో నదులు, సముద్రాలు నిండిపోతున్నాయి.
- పెట్రోల్‌, విద్యుత్‌ వంటివి పొదుపుగా వాడకపోవడం, విచ్చలవిడి వినియోగంతో భూతాపం పెరిగిపోతోంది. అనేక వాతావరణ సమస్యలకు ఇదే మూలం.

చివరిగా ఒక్కమాట...
ప్రకృతి మనం తెచ్చుకున్నది కాదు..
మనం సృష్టించినదీ కాదు..
ఉన్నది.. దాన్ని అలాగే ఉండనిద్దాం..
మనమూ ఆనందంగా ఉందాం.

ప్రకృతి.. గొప్ప వైద్యుడు

మనం ఒక గదిలో ఉన్నాం అనుకోండి. ఆ గదిలో గోడలకు, సీలింగుకు ఉన్న రంగు.. గదిలోని వస్తువులు.. ఇవన్నీ మన మూడ్‌ని డిసైడ్‌ చేస్తాయి. అలాంటిది మనం ఉండే భూమి మీద మన చుట్టూ ఉండే రంగులు, వస్తువులు మన మనసును, ఆరోగ్యాన్ని ఇంకెంత ప్రభావితం చేస్తాయి? అమెరికన్‌ సైకలాజికల్‌ అసోసియేషన్‌ అధ్యయనం ప్రకారం.. ప్రకృతిలో గడిపే సమయం మన మనసుకు సాంత్వన చేకూరుస్తుంది. భావోద్వేగాలను నియంత్రిస్తుంది. సుందర ప్రకృతి దృశ్యాలు మన మనసు అద్దంపై పేరుకుపోయిన బాధావర్ణ చిత్రాలను చెరిపేస్తాయి.

అధ్యయనాల సారాంశం.. సొలాస్టాల్జియా

అదే ప్రకృతి బాగాలేకపోతే.. మనం నిన్నటి వరకు చూసిన సుందర ప్రకృతి దృశ్యాలు మాయమైపోతే.. మనచుట్టూ వినిపించిన పక్షుల కిలకిలారావాలు మూగబోతే.. స్వచ్ఛమైన సెలయేటి నీరు కాలుష్యంతో నిండిపోతే.. అవి మనలో.. ఏ శారీరక, మానసిక వైద్యుడూ ఊహించలేని అనారోగ్యానికి కారణమవుతాయట. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, పెరూ వంటి అనేక దేశాల్లో నిర్వహించిన 19 అధ్యయనాల సారాంశమే.. సొలాస్టాల్జియా. 'మానసిక ఆరోగ్యంపై వాతావరణ మార్పు హానికరమైన ప్రభావాలను తెలుసుకునేందుకు 'సొలాస్టాల్జియా' దోహదపడుతుంది' అని అధ్యయనంలో పాల్గొన్న అలిసియా వెలా శాండ్‌క్విస్ట్‌ పేర్కొన్నారు.

ప్రకృతిలో ప్రతికూల మార్పులతో మనసుపై ప్రభావం

వరదలూ, భూకంపాలతో మనిషిలో ఒత్తిడి, ఆందోళన

నేచర్‌ని కాపాడుకుంటేనే మనసుకు సాంత్వన, ఓదార్పు

ప్రకృతి ఒడిలో ఉంటే కొందరికి ఓదార్పుగా, సాంత్వనగా ఉంటుంది. అలా నిన్నటి వరకూ తాను చూసిన ప్రకృతిలో విధ్వంసం.. అది ప్రకృతి విపత్తుల వల్లయినా, మనిషి కారణంగా జరిగినా.. మనసుకు శాంతి, మానసిక ఉల్లాసమూ దూరమవుతాయి. ఇంచుమించు ఈ పరిస్థితినే సొలాస్టాల్జియాగా చెబుతున్నారు.

- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌ షాతో మహబూబ్‌నగర్‌ బీజేపీ ఎంపీ డీకే అరుణ భేటీ అయ్యారు. సోమవారం పార్లమెంట్‌లో అమిత్‌షాను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయాలు, పలు ఇతర అంశాలపై చర్చించినట్లు అరుణ తెలిపారు.

సత్వర అనుమతులకు సింగిల్‌ విండో



- ప్రెస్‌ రిజిస్ట్రార్‌ జనరల్‌ ఆఫ్‌ ఇండియా యోగేశ్‌ బవేజా

సాక్షి, హైదరాబాద్‌: ప్రెస్‌ సేవా పోర్టల్‌ను సింగిల్‌ విండో సొల్యూషన్‌గా ప్రవేశపెట్టామని ప్రెస్‌ రిజిస్ట్రార్‌ జనరల్‌ ఆఫ్‌ ఇండియా (పీఆర్‌జీఐ) యోగేశ్‌ బవేజా తెలిపారు. సోమవారం సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని పీఐబీ-హైదరాబాద్‌ ఆధ్వర్యంలో ప్రచురణకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై 'వార్తలాప్‌' పేరుతో వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగేశ్‌ బవేజా మాట్లాడుతూ.. ఈ పోర్టల్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ సులభతరం అవుతుందని, పారదర్శకత పెరుగుతుందని, అనుమతులు వేగవంతం అవుతాయని చెప్పారు. పీఐబీ-హైదరాబాద్‌ అదనపు డైరెక్టర్‌ జనరల్‌ శ్రుతి పాటిల్‌ మాట్లాడుతూ, తెలంగాణలో తొలిసారి ఇలాంటి చర్చా కార్యక్రమం నిర్వహించామని, ఇది ప్రచురణకర్తలు తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రచురణకర్తల కోసం త్వరలో హెల్ప్‌లైన్‌ ఏర్పాటు చేస్తామన్నారు. డిప్యూటీ ప్రెస్‌ రిజిస్ట్రార్‌ అశుతోష్‌ మొహ్లే కొత్త చట్టంపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రేషన్‌ ఆన్‌లైన్‌లో జరుగుతోందని, 60 రోజుల్లోగా స్పందన రాకపోతే దరఖాస్తులు ఆమోదం పొందినట్లేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ ప్రచురణకర్తలతోపాటు ఎన్‌ఐసీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ గౌరవ్‌ శర్మ, పీఐబీ అధికారులు డాక్టర్‌ మానస్‌ కృష్ణకాంత్‌, డిప్యూటీ డైరెక్టర్‌, మీడియా అండ్‌ కమ్యూనికేషన్‌ ఆఫీసర్లు గాయత్రి, శివచరణ్‌ రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా సాక్షి సీనియర్‌ ఫొటో జర్నలిస్ట్‌ కంది బజరంగ్‌ ప్రసాద్‌ ఉత్తమ ఫొటోగ్రఫీకి గాను గోల్డ్‌మెడల్‌ అందుకున్నారు. ప్రపంచ గిరిజన ఉత్సవాలు-2025లో భాగంగా జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం విజయవాడలో అవార్డులను అందించారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ నూక స్వామి బాలాజీ, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్‌ ఇండియా ఉపాధ్యక్షుడు కొంపెల్లి సుందర్‌ల చేతుల మీదుగా బజరంగ్‌ ప్రసాద్‌ గోల్డ్‌మెడల్‌ అందుకున్నారు.

- నల్లగొండ

తక్షణమే స్పందించి.. వీల్‌చైర్‌ తెప్పించి..

- ట్రైసైకిల్‌ కోసం ప్రజావాణిలో దివ్యాంగురాలు తిరుపతమ్మ అర్జీ
- రూ.1.2 లక్షల వీల్‌చైర్‌ ఇప్పించిన పెద్దపల్లి కలెక్టర్‌ శ్రీహర్ష



దివ్యాంగురాలు తిరుపతమ్మకు ఎలక్ట్రికల్‌ బ్యాటరీ వీల్‌చైర్‌ అందించిన కలెక్టర్‌ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్‌: 'సార్‌.. నేను నడవలేని స్థితిలో ఉన్న. టెన్త్‌ పాసయ్యా. కాలేజీకి వెళ్లేందుకు, ఇతర అవసరాల కోసం వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. ఎలక్ట్రికల్‌ బ్యాటరీ వీల్‌చైర్‌ ఇప్పించండి' అని పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌ మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలు మౌటం తిరుపతమ్మ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా కలెక్టర్‌ శ్రీహర్షకు విన్నవించింది. సత్వరమే స్పందించిన కలెక్టర్‌ కోయ శ్రీహర్ష.. బ్యాటరీ ట్రైసైకిల్‌ తెప్పించాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. ఆ వెంటనే రూ.1.20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి తీసుకొచ్చిన బ్యాటరీ వీల్‌చైర్‌ను తిరుపతమ్మకు ఎఫ్‌ఆర్‌వో స్వర్ణలతతో కలిసి కలెక్టర్‌ అందజేశారు. సమస్యకు వెంటనే పరిష్కారం చూపినందుకు కలెక్టర్‌కు తిరుపతమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

20 నుంచి 'మిడ్‌మానేరు' ఎత్తిపోతలు

- నీటిపారుదల శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: మిడ్‌మానేరు జలాశయంలో నీటిమట్టం కనీసం 311.14 మీటర్లు, నిల్వలు 13.13 టీఎంసీలకు చేరితేనే ప్రాజెక్టు నుంచి నీళ్లను అన్నపూర్ణ పంప్‌హౌస్‌లోని ఒక పంప్‌ ద్వారా అనంతగిరి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేందుకు వీలుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జలాశయం ప్రస్తుత నీటిమట్టం 310.92 మీటర్లు, నిల్వలు 12.78 టీఎంసీలుండగా, ఈ నెల 20 నాటికి నీటిమట్టం 311.14 మీటర్లకు, నిల్వలు 13.13 టీఎంసీలకు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆ వెంటనే మిడ్‌మానేరు నుంచి నీటి పంపింగ్‌ ప్రారంభిస్తామని వెల్లడించింది. రెండు పంప్‌ల ద్వారా నీళ్లను ఎత్తిపోసేందుకు నీటిమట్టం 312.2 మీటర్లు, నిల్వలు 14.94 టీఎంసీలకు, మూడు పంప్‌ల ద్వారా నీళ్లను ఎత్తిపోసేందుకు నీటిమట్టం 313.19 మీటర్లు, నిల్వలు 16.76 టీఎంసీలు, 4 పంప్‌ల ద్వారా నీళ్లను ఎత్తిపోసేందుకు నీటిమట్టం 317.31 మీటర్లు, నిల్వలు 25.77 టీఎంసీలకు చేరాల్సి ఉంటుందని తెలిపింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్‌మానేరుకు ఇప్పటి వరకు మొత్తం 4.12 టీఎంసీల నీళ్లను తరలించినట్టు వెల్లడించింది.

రెండేళ్ల పాలసీనే?

- వైన్‌ షాపుల కాలపరిమితి మూడేళ్లకు పెంచే ఆలోచనకు బ్రేక్‌
- దరఖాస్తు ఫీజు మాత్రం రూ.3 లక్షల వరకు పెంచే యోచన



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని వైన్‌షాపుల కాలపరిమితిని రెండేళ్ల నుంచి మూడేళ్లకు పెంచాలన్న ప్రతిపాదనను ఎక్సైజ్‌ శాఖ పక్కకు పెట్టినట్టు తెలుస్తోంది. మరో రెండు నెలల్లో పాత పాలసీ గడువు ముగియనున్న నేపథ్యంలో కొత్త ఎక్సైజ్‌ పాలసీ విషయంలో ఆచితూచి ముందుకెళ్లాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆ సూచనలకు అనుగుణంగా కొత్తగా తెచ్చిన మూడేళ్ల ప్రతిపాదనను పక్కన పెట్టి పాత పాలసీ ప్రకారం రెండేళ్ల కాలపరిమితితోనే నోటిఫికేషన్‌ ఇవ్వాలని ఆ శాఖ యోచిస్తోంది. కాలపరిమితి విషయంలో కొంతమేర స్పష్టత వచ్చినా దరఖాస్తు ఫీజు విషయంలో మాత్రం ఇంకా స్పష్టత లేదనే చర్చ ఆ శాఖ వర్గాల్లో జరుగుతోంది.

సీఎం వద్దన్నారా...?

వాస్తవానికి, 2023-25 సంవత్సరాలకుగాను ఎక్సైజ్‌ పాలసీ ఈ ఏడాది నవంబర్‌తో ముగియనుంది. రాష్ట్రంలోని 2,620 ఏ4 (వైన్‌) షాపులకు ఈ గడువులోపు కొత్తగా టెండర్లు పిలిచి లైసెన్సుదారులను నిర్ణయించాల్సి ఉంది. ఇందుకోసం ఆదాయ పెంపు కోణంలో కూడా ఆలోచించిన ఎక్సైజ్‌ శాఖ వైన్‌ షాపుల కాలపరిమితిని మూడేళ్లకు పెంచేలా కసరత్తు చేసింది. అదేవిధంగా దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలనే ప్రతిపాదన కూడా పెట్టింది. అయితే, కాలపరిమితి పెంపునకు ప్రస్తుతమున్న చట్టాన్ని సవరించాల్సి ఉంటుందని, న్యాయపరమైన ఇబ్బందులు కూడా ఉంటాయని నిపుణులు చెప్పారు. అదీగాక ఆదాయార్జనే ధ్యేయంగా విధానాలు రూపొందించవద్దని, మద్యం ద్వారా ప్రభుత్వం డబ్బులు సమకూర్చుకుంటోందన్న అపప్రద రావొద్దని సీఎం అధికారులకు సూచించారని సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతానికి రెండేళ్ల గడువును మూడేళ్లకు పెంచే యోచనను శాఖ విరమించుకుందని అధికారులంటున్నారు. అయితే, దరఖాస్తు ఫీజు.. పాలసీ కిందకు రాదు కాబట్టి దాన్ని పెంచే అవకాశముందని, అది రూ.2.5 లక్షలు చేస్తారా? రూ.3 లక్షలకు పెంచుతారా అన్నదానిపై మాత్రం నిర్ణయం తీసుకోలేదని సమాచారం.



మనిషి సంతోషానికి ఉన్న రెండు శత్రువులు: బాధ, విసుగు.
– ఆర్థర్ షోపెన్‌హార్

సాక్షి
మంగళవారం, 19 ఆగస్టు 2025

జీఎస్‌టీ కొత్త రూపు

ఎనిమిదేళ్ల క్రితం అమల్లోకొచ్చిన సరుకులు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఎట్టకేలకు వచ్చే దీపావళి నాటికి కొత్త రూపాన్ని సంతరించుకోబోతోంది. మొన్న శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట బురుజుపై నుంచి చేసిన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ చల్లని కబురందించారు. 2016లో లోక్‌సభ 122వ రాజ్యాంగ సవరణను ఆమోదించి జీఎస్‌టీకి మార్గం సుగమం చేయటానికి ముందు పదిహేనేళ్లపాటు ఈ ఏకీకృత పన్నుల వ్యవస్థపై చర్చోపచర్చలు జరిగాయి. రాష్ట్రాలను ఒప్పించేందుకు అంతకు ముందున్న ఎన్డీయే సర్కారు, తర్వాత వచ్చిన యూపీఏ ప్రభుత్వం ఎడతెగని ప్రయత్నాలు చేశాయి. కానీ ఏకాభిప్రాయం కుదరలేదు. చివరకు 2017లో అమల్లోకి వచ్చినప్పుడు సైతం విపక్ష రాష్ట్రాలు రుసరుసలుపోయాయి. ఇంత పెద్ద సంస్కరణలో తన పాత్ర ఘనం అని చెప్పుకోవటానికైనా పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగే ఉత్సవానికి వెళ్లాలని కాంగ్రెస్ అనుకుంది. కానీ చివరకు ముఖం చాటేసింది. జీఎస్‌టీ విషయంలో వివిధ వర్గాల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోలేదని, చిన్న వ్యాపారులూ వర్తకులూ దీనివల్ల అగచాట్లు పడతారని కారణాలుగా చూపింది. వామపక్షాలు సరేసరి.

నిజాలు నిష్ఠూరంగానే ఉంటాయి. జీఎస్‌టీ రాకతో కేంద్రం విధిస్తున్న ఏడెనిమిది రకాల పన్నులు రద్దుకావటంతో పాటు రాష్ట్రాలు విధించే రకరకాల పన్నులకు స్వస్తి చెబుతామని, పన్ను వసూళ్లను హేతుబద్ధీకరిస్తామని అప్పట్లో ప్రకటించారు. ఇందువల్ల ఆదాయం కోల్పోతామన్న రాష్ట్రాల ఆందోళనను ఉపశమింపజేసేందుకు అయిదేళ్లపాటు ఆ లోటును పూడుస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. కానీ ఆచరణలో సమస్యలెలా వస్తాయో తెలియాలంటే ఇటీవల కర్ణాటకలో చిన్న వ్యాపారులు పడిన అగచాట్లను ప్రస్తావించుకోవాలి. వివిధ రకరకాల యాప్‌ల ద్వారా వినియోగదారుల నుంచి చెల్లింపులు స్వీకరిస్తున్న తోపుడు బండి వ్యాపారులనూ, వీధుల్లో చిన్నా చితకా దుకాణాలు నడుపుకునేవారినీ లక్ష్యంగా చేసుకుని జీఎస్‌టీ నిబంధనలు ఉల్లంఘించారంటూ అక్కడి వాణిజ్య పన్నుల విభాగం 13,000 నోటీసులు జారీచేసింది. వీటికి ఏం జవాబివ్వాలో, ఎవరిని ఆశ్రయించాలో కూడా తెలియక, అందుకయ్యే ఖర్చు భరించలేక చాలామంది నగదు చెల్లించాలని వినియోగదారుల్ని కోరటం మొదలుపెట్టారు. వాజపేయి హయాంలో నాటి ఆర్థిక మంత్రి జశ్వంత్‌సింగ్‌కు సలహాదారుగా వ్యవహరించిన విజయ్ కేల్కర్ ఈ జీఎస్‌టీ ఆలోచనకు ఆద్యుడు. ఆయన ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ పలు దేశాల పన్ను వ్యవస్థలను అధ్యయనం చేసి దీన్ని రూపొందించింది. మధ్యతరగతి, అట్టడుగువర్గాలవారు పన్నుపోటు నుంచి ఉపశమనం పొందుతారని చెప్పింది. కానీ జరిగిందంతా వేరు.

పరోక్ష పన్నులు చెల్లించేవారి నుంచి మరింత పిండుకోవడానికే జీఎస్‌టీ తీసుకొస్తున్నారని, ప్రత్యక్ష పన్నుల జోలికి వెళ్లాలన్న ఆలోచనే కేంద్రం చేయటం లేదని విమర్శలొచ్చాయి. 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ. 11.7 లక్షల కోట్ల జీఎస్‌టీ వసూళ్లుండగా ఇప్పుడది దాదాపు రెట్టింపయింది. సగటున ప్రతి నెలా రూ. 2 లక్షల కోట్ల ఆదాయం వస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ సాధారణ వర్గాల అవస్థలు అంతకంతా పెరిగాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలు, ఇంకా ఆ దిగువనుండేవారూ జీఎస్‌టీ కింద దాఖలు చేయాల్సిన రకరకాల పత్రాలు, వివాదాలు, ప్రభుత్వం నుంచి వెనక్కు రావలసిన సొమ్ము కోసం పడిగాపులు... వీటన్నిటితో విసిగిపోయారు. ఈ సంక్లిష్ట వ్యవస్థను సంతృప్తిపరిచే మార్గం దొరక్క అల్లాడిపోయారు. ఈ ప్రత్యక్ష పన్నుల వ్యవస్థ ద్వారా వసూళ్లు భారీగా పెరుగుతుంటే, ప్రత్యక్ష పన్నులు చెల్లించే కార్పొరేట్‌ల నుంచి రావాల్సిన ఆదాయం పడిపోవటం ఒక వైచిత్రి. 2023–24లో వివిధ రకాల ప్రోత్సాహాల కింద దాదాపు లక్ష కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇచ్చామని ఇటీవల పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది.

జీఎస్‌టీ సరికొత్త రూపంలో రాబోవటం అన్ని వర్గాలకూ శుభవార్త. ప్రస్తుతం 5, 12, 18, 28 శాతాలుగా ఉన్న నాలుగు స్లాబ్‌ల స్థానంలో ఇకపై రెండే... 5, 18 శాతాలు ఉంటాయని కేంద్రం చెబుతోంది. లగ్జరీ కార్ల వంటి విలాస వస్తువుల పైనా... పొగాకు, పాన్‌మసాలా, ఆన్‌లైన్ గేమింగ్ వంటి హానికారకాల పైనా మాత్రం 40 శాతం వరకూ ఉంటుంది. జీఎస్‌టీ వసూళ్లు స్థిరత్వంలో పడటం వల్ల సాధారణ ప్రజానీకాన్ని పన్నుపోటు నుంచి తప్పించాలని భావించినట్టు కనబడుతున్నా, ఇంతకాలమూ ఈ పరిధిలో లేని మద్యం, ఇంధనం వంటివాటిని చేర్చబోతున్నారని అంటున్నారు. సహజంగానే దీనిపై రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం లేకపోలేదు. ఏదేమైనా ప్రపంచమంతటా ఒకరకమైన మాంద్యం అలుముకున్న వర్తమానంలో జీఎస్‌టీ సంస్కరణలు మన ఆర్థికవ్యవస్థకు ఊతాన్నివ్వగలవనీ, ఈ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలూ చాలావరకూ తగ్గుతాయనీ ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి: బ.ఏకాదశి సా.4.09 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఆరుద్ర రా.2.33 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: ప.11.45 నుండి 1.16 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు, అమృత ఘడియలు: సా.5.10 నుండి 6.40 వరకు, సర్వ ఏకాదశి.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

కఠిన వాస్తవం



యూరోపియన్ నాయకులు సోకాల్డ్ వ్యూహాత్మక నిర్ణయాధికారం గురించి గట్టిగా మాట్లాడుతున్నారు. అంటే యూఎస్ నుంచి 'పూర్తి స్వాతంత్ర్యం' పొందాలని! కానీ ఇంధనం, టెక్నాలజీ, మార్కెట్లు, భద్రత, న్యూక్లియర్ అంబ్రెల్లా విషయంలో మునుపటి కంటే మరింత ఎక్కువగా అమెరికా మీద ఆధారపడుతున్నారు.

– వెలీనా త్చకరోవా, స్ట్రాటెజిస్ట్

జాములకు కారణం



రోడ్ల మీద మరీ ఎక్కువ కార్లు ఉండటం వల్ల ట్రాఫిక్ జాములు ఏర్పడటం లేదు. ట్రాఫిక్ నియమాలను గౌరవించని డ్రైవర్లు చాలామంది ఉండటమే దానికి కారణం!

– జావేద్ అఖ్తర్, సినీ కవి

మార్పు



ఆచరణలో పెట్టని ప్రణాళిక వట్టి కల మాత్రమే! ప్రణాళిక లేని ఆచరణ కాలయాపన మాత్రమే! ఆచరణ, ప్రణాళిక కలసినప్పుడే ప్రపంచాన్ని మార్చగలం.

– సుధామూర్తి, రాజ్యసభ ఎంపీ

ఉత్సుకత



చేస్తున్న పని పట్ల ఉత్సుకతతో ఉండండి. సవాళ్లను ధైర్యంగా స్వీకరించండి. నిరంతరం నేర్చుకుంటూ ఉండండి. నేర్చుకోకపోతే మీరు ఉపయోగకరమైన పనులు చేయటం మానేస్తారు.

– సత్య నాదెళ్ల, సీఈవో, మైక్రోసాఫ్ట్

వంతు



నిరాడంబరత, మంచితనం, సత్యగుణం లేని చోట గొప్పతనం ఉండదని లియో టాల్‌స్టాయ్ చెప్పిన మాట ఎవరికైనా ఆదర్శం. మనం నివసించి వెళ్లిన ప్రపంచానికి మన వంతుగా ఏదో ఒక గొప్పతనం చేకూరాలి.

– నోయెల్ టాటా, టాటా గ్రూప్

జాబితా



నేను ఎల్లప్పుడూ చేయాల్సిన పనుల జాబితాను తయారు చేసుకుంటాను. ఒక పనిని పూర్తి చేసిన అనుభూతి నాకు ఇష్టం. ఆ ఇష్టం, తర్వాతి పనిని తక్షణం మొదలు పెట్టటానికి నాకు ఉత్సాహాన్ని ఇస్తుంది.

– మేటే ఫ్రెడెరిక్సెన్, డెన్మార్క్ ప్రధాని

నాకెవరూ చెప్పని... ఐదు సంగతులు!

విశ్వ గురు



అమెరికాలోని 'నార్తర్న్ అరిజోనా యూనివర్సిటీ'కి చెందిన 'కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మ్యాటిక్స్ అండ్ అప్లైడ్ సైన్సెస్', 'కాలేజ్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్రీ అండ్ నాచురల్ సైన్సెస్' గ్రాడ్యుయేట్లను ఉద్దేశించి 'మైక్రోసాఫ్ట్' అధినేత బిల్ గేట్స్ ఆ మధ్య చేసిన ప్రసంగం సంక్షిప్త పాఠం.

శుభ మధ్యాహ్నం. ఇంతటి గౌరవాన్ని కల్పించినందుకు అరిజోనా విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులకు కృతజ్ఞతలు. గౌరవ డాక్టరేట్ అందుకున్నందుకు గర్వంగా ఉంది.

మిమ్మల్ని ఉద్దేశించి ప్రసంగించే అవకాశం లభించడాన్ని కూడా నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నేను ఎన్నడూ అందుకోని దానిని...అంటే నిజమైన కాలేజీ డిగ్రీని యూనివర్సిటీ మీకు అందిస్తోంది. నేను డిగ్రీ పూర్తి చెయ్యని సంగతి మీలో కొందరికి తెలిసి ఉండవచ్చు. మూడు సెమిస్టర్లు పూర్తి చేసిన తర్వాత, 'మైక్రోసాఫ్ట్'ను ప్రారంభించేందుకు నేను చదువుకు స్వస్తి చెప్పేశాను. ఆ సంగతులనే నేను మీతో పంచుకోదలచుకున్నా. నేను పూర్తి చేయని గ్రాడ్యుయేషన్‌లో నాకు ఐదు సంగతులు చెప్పివుంటే బాగుండుననిపించింది.

రెండవ వృత్తి తప్పు కాదు!

మొదటిది – మీ జీవితం ఏకాంకిక కాదు. మీరు చేపట్టబోయే వృత్తి జీవితం గురించి సరైన నిర్ణయాలు తీసుకోవాలనే ఒత్తిడిలో బహుశా మీరు ఉండి ఉంటారు. అవి శాశ్వతమైన నిర్ణయాలుగా మీకు తోచవచ్చు. కానీ, అవి శాశ్వతమైనవి కావు. రేపు చేసేవి లేదా తదుపరి పదేళ్లలో చేసేవి... మీరు జీవితాంతం చేస్తూ ఉండాల్సిన అవసరం లేదు. స్కూలు చదువును మధ్యలోనే ఆపేసినపుడు, ఇక జీవితమంతా మైక్రోసాఫ్ట్‌లోనే పనిచేస్తానని అనుకున్నాను. నేడు గమనిస్తే, సాఫ్ట్‌వేర్‌పై పనిచేయడాన్ని నేను ఇప్పటికీ ఇష్టపడతాను గానీ, వాతావరణ మార్పును నివారించే నవీకరణలను సృష్టించడం; ఆరోగ్యం, విద్యా రంగాలతో పాటు ఇతరత్రా అసమానతలను తగ్గించడంపైన పనిచేయడానికి నా సమయాన్ని వెచ్చిస్తున్నా. ఇది నేను నా 22 ఏళ్ళ వయసప్పుడు ఊహించింది కాదు. కనుక, అవసరమైతే భవిష్యత్తులో మీ మనసు మార్చుకోవడంలో లేదా రెండవ వృత్తి జీవితాన్ని ఎంచుకోవడంలో ఏమాత్రం తప్పు లేదు... నిజానికి, అది సరైన పని అనిపించుకుంటుంది.

> నేను సాధించిన వాటన్నింటికీ కారణం, ఆ యా అంశాల్లో నాకన్నా ఎక్కువ పరిజ్ఞానం కలిగిన వారి సలహాలు, సూచనలు తీసుకోవడమే! మనకు సహాయపడేందుకు ముందుకొచ్చేవారు ఎప్పుడూ ఉంటారు. కాకపోతే మనం నిస్సంకోచంగా వారిని ఆశ్రయించడం ముఖ్యం.

సలహా అడగడానికి వెనుకాడొద్దు!

రెండు – ఏ నిర్ణయం తీసుకుంటే మంచిదబ్బా అనుకుంటూ గందరగోళపడిపోనంత తెలివితేటలు మనకు ఎన్నడూ ఉండవు. కాలేజీ నుంచి బయటపడుతున్నప్పుడు, నాకు అవసరమైనవన్నీ నాకు తెలుసునని అనుకున్నా. కానీ, ఏదైనా నేర్చుకునేందుకు మొదటి అడుగు... మనకు తెలియని సంగతిని అక్కున చేర్చుకోవడంలోనే పడుతుంది. తెలిసున్నదానిపైనే దృష్టి కేంద్రీకరించే బదులు కొత్తవాటిని నేర్చుకునేందుకు ప్రయత్నించాలి.

ఒక్కరే స్వయంగా పరిష్కరించుకోలేని సమస్యను మనం మన వృత్తి జీవితంలో ఏదో ఒక దశలో ఎదుర్కొంటాం. అటువంటి సందర్భం ఎదురైనపుడు ప్రజ్ఞావంతులను వెతికిపట్టుకుని, వారి నుంచి పరిష్కార మార్గాలను గ్రహించండి. ఆ వ్యక్తి మీకన్నా ఎక్కువ అనుభవం ఉన్న సహోద్యోగి కూడా కావచ్చు. మీతో కలిసి చదువుకున్న విద్యార్థి అయినా కావచ్చు. ఆ వ్యక్తి సరైన దృక్పథం కలిగి, మిమ్మల్ని భిన్నంగా ఆలోచించేటట్లు చేయగలిగినవాడై ఉండాలి. ఆ వ్యక్తి మనకు అవసరమైన రంగంలోని నిపుణుడైతే మరీ మంచిది.

నేను సాధించిన వాటన్నింటికీ కారణం, ఆ యా అంశాల్లో నాకన్నా ఎక్కువ పరిజ్ఞానం కలిగిన వారి సలహాలు, సూచనలు తీసుకోవడమే. మనకు సహాయపడేందుకు ముందుకొచ్చేవారు ఎప్పుడూ ఉంటారు. కాకపోతే మనం నిస్సంకోచంగా వారిని ఆశ్రయించడం ముఖ్యం.

పరిష్కరించడంలోనే పరమార్థం!

మూడు – ఒక ముఖ్యమైన సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయండి. ప్రతి రోజూ కొత్త రకం పరిశ్రమలు, కంపెనీలు పుట్టుకొస్తున్నాయి. అవి మీకు జీవనోపాధి కల్పించడమే కాదు, కొత్త పుంతలు తొక్కేటట్లు ప్రోత్సహిస్తాయి. ఉదాహరణకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నుంచి ప్రజలందరికీ ప్రయోజనం ఒనగూడేటట్లు మీరు మీ ప్రతిభా సంపత్తులను వినియోగించవచ్చు.

ఒక పెద్ద సమస్యను పరిష్కరించే అంశంలో నిమగ్నమైనపుడు, ఉత్తమమైన ఫలితాలను సాధించే విధంగా అది మీకు ఉత్సాహ ప్రోత్సాహాలను కూడా ఇస్తుంది. అదే మిమ్మల్ని మరింత సృజనాత్మకతతో వ్యవహరించేటట్లు చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, మీ జీవితానికి ఒక పరమార్థాన్ని కల్పిస్తుంది.

స్నేహితులే మీ నెట్‌వర్క్!

నాలుగు – స్నేహ బంధంలోని శక్తిని తక్కువ అంచనా వేయవద్దు. స్కూలులో నాకొక మిత్రుడు ఉండేవాడు. సైన్స్ ఫిక్షన్ నవలలు, కంప్యూటర్ మ్యాగజైన్లు వంటి నాకు ఇష్టమైన వ్యాపకాలు చాలా వాటిని అతనూ పంచుకునేవాడు. ఆ స్నేహం ఎంత ముఖ్యమైనదిగా పరిణమిస్తుందో నేను అప్పట్లో ఊహించలేదు. నా స్నేహితుని పేరు పాల్ అలెన్. మేం ఇద్దరం కలసి 'మైక్రోసాఫ్ట్' ప్రారంభించాం. లెక్చరర్ పాఠం చెప్పేటపుడు తరగతి గదిలో పక్కన కూర్చున్నవాళ్ళు, ఆటపాటల్లో పాల్గొంటూ మీతో పోటీ పడేవాళ్ళు మీ తోటి విద్యార్థులు మాత్రమే కాదు, వారు మీ నెట్ వర్క్ అని గుర్తుంచుకోండి. వారు మీ భవిష్యత్ సహ-సంస్థాపకులు, సహోద్యోగులు. వారు మున్ముందు మీకు అండగా నిలిచి, సమాచారాన్ని, సలహాలను ఇచ్చే గొప్ప వనరుగా పరిణమించ వచ్చు. ఈ రోజు మీరు వేదిక కింద ఎవరితో కలసి నడుస్తున్నారో, వారితో రానున్న కాలంలో మీరు వేదికను పంచుకోవచ్చు.

విరామం ముఖ్యమే!


నా చివరి సలహా ఏమంటే... నిజానికి ఈ సలహాను నేను ఎక్కువ పాటించి ఉండాల్సిందికానీ, దాన్ని ఒంట బట్టించుకునేందుకు నాకు చాలా కాలం పట్టింది. మరేమీ లేదు... మీరు మధ్య మధ్యలో కొద్దిగా విరామం తీసుకున్నంత మాత్రాన బద్ధకస్తుడు ఏమీ అయిపోరు. నేను మీ వయసులో ఉన్నపుడు, కొన్నాళ్ళు సేద దీరడం మంచిదని నమ్మేవాడిని కాదు. నా చుట్టుపక్కల ఉన్నవాళ్ళు అందరినీ అదనంగా గంటలకొద్దీ కూర్చోబెట్టేవాడిని. మైక్రోసాఫ్ట్‌ను నెలకొల్పిన కొత్తల్లో, ఎవరు తొందరగా వెళ్ళిపోతున్నారు, ఎవరు పని గంటలు ముగిసినా చాలాసేపు ఉంటున్నారు అని గమనించేవాడిని. కానీ, కొంత వయసు మీద పడిన తర్వాత – ముఖ్యంగా నేను తండ్రినయ్యాక – జీవితమంటే పని ఒక్కటే కాదని, ఇంకా చాలా ఉందని గ్రహించాను.

> ఒక పెద్ద సమస్యను పరిష్కరించే అంశంలో నిమగ్నమైనపుడు, ఉత్తమమైన ఫలితాలను సాధించే విధంగా అది మీకు ఉత్సాహ ప్రోత్సాహాలను కూడా ఇస్తుంది. అదే మిమ్మల్ని మరింత సృజనాత్మకతతో వ్యవహరించేటట్లు చేస్తుంది.

ఈ పాఠం నేర్చుకునేందుకు మీరు నాలాగా చాలా కాలం వేచి ఉండకండి. సంబంధ బాంధవ్యాలను నిలబెట్టుకునేందుకు, విజయాలను వేడుక చేసుకునేందుకు, కష్టనష్టాల నుంచి తిరిగి శక్తిని కూడగట్టుకునేందుకు కొంత సమయాన్ని వెచ్చించండి. ◆

ఈ సవాళ్లు కొత్త దారులు తెరుస్తాయి!

అభిప్రాయం



ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

'భారత ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌ను శాసించాలి. అధిక నాణ్యత, తక్కువ ధరే మన బలం' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోటపై నుంచి పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై విధించిన ట్యారిఫ్‌లను దృష్టిలో పెట్టుకుని ప్రధాని ఈ పిలుపునిచ్చారని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఏ దేశమైనా వేరే దేశం నుంచి వస్తు సేవలను దిగుమతి చేసుకుంటుందంటే అర్థం అవి దానికి అవసరమనే కదా! అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏదో భారత్ తన మీద ఆధారపడి ఉందన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. భారతదేశ ఉత్పత్తుల్ని దయతలిచి దిగుమతి చేసుకుంటున్నట్లుగా సుంకాలను విధిస్తున్నారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేసే వస్తువులు, సేవల మొత్తం సుమారు 87 బిలియన్ డాలర్లు. ఇది భారత్ మొత్తం ఎగుమతులలో 18% వాటా. ఈ ఏడాది చివరి నాటికి సుమారు 90–100 బిలియన్ డాలర్ల విలువైన వస్తు సేవల ఎగుమతి ఉండవచ్చనేది విశ్లేషకుల అంచనా. సుంకాల వల్ల ఈ ఎగుమతులన్నీ ఆగిపోతాయా అంటే కాదనే చెప్పవచ్చు. భారత్ అతి తక్కువ ధరలకు, నాణ్యమైన వస్తువుల్ని సరఫరా చేస్తోంది. ఉదాహరణకు ఫార్మాస్యూటికల్ రంగం దాదాపు 8 బిలియన్ డాలర్ల విలువైన పేటెంట్ లేని ఔషధ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఫార్మా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి కాకపోతే అక్కడి ప్రజలే ఇబ్బంది పడతారు. అలాగని పూర్తిగా మనకు ఇబ్బంది ఉండదా అంటే... ట్యారిఫ్‌ల వల్ల అమెరికా ప్రజలు వస్తువులు కొనలేక వినియోగం తగ్గించుకుంటారు. ఆ ప్రభావం మన మీద పడుతుంది.

> ట్రంప్ సుంకాలు భారత్‌కు ఎగుమతులను మెరుగుపరచడానికీ, భౌగోళికంగా భిన్నమైన మార్కెట్లను అన్వేషించడానికీ అవకాశం ఇస్తాయని మార్కెట్ వర్గాలంటున్నాయి.

భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో పైపైకి ఎగబాకుతుండటాన్ని ప్రపంచం గుర్తిస్తోంది. ఇప్పటివరకూ ఇండో – పసిఫిక్ ప్రాంతంలో అమెరికా, దాని మిత్ర దేశాలు గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉన్నాయి. అయితే ప్రస్తుతం భారత్ తన చర్యల ద్వారా స్వీయ ముద్ర వేస్తోంది. తైవాన్‌తో వాణిజ్య ఒప్పందం, ఫిలిప్పీన్స్‌తో మిసైల్స్ సరఫరా ఒప్పందం, జపాన్‌తో టెక్నాలజీ సరఫరాకు సంబంధించిన ఒడంబడిక, వియత్నాంతో సైనిక సహకారం, ఇండోనేషియాతో సముద్ర భద్రత వంటి వాటిపై ఒప్పందాలు కుదుర్చుకుంది. అంతటితో ఆగడం లేదు. రష్యా ప్రతిపాదించిన రష్యా–ఇండియా–చైనా (ఆర్ఐసీ) ప్రతిపాదన మరోసారి తెరమీదికి వచ్చింది. ఇది సాకారమైతే ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ఆధిపత్యానికి పూర్తిగా గండికొట్టేయవచ్చు.

నిజానికి ట్రంప్ సుంకాలు విధించింది భారత్‌పై కాదు. అమెరికా ప్రజలపై! 2025లో అన్ని సుంకాల వల్ల సగటు అమెరికా కుటుంబానికి సంవత్సరానికి 3,800 డాలర్ల నష్టం ఏర్పడుతుందని అంటున్నారు. ట్రంప్ లాంటి వాళ్లు ట్యారిఫ్‌లు ఎంత ఎక్కువ వేసినా భారత్‌కు ఇబ్బంది తాత్కాలికమే అవుతుంది. కొత్త మార్కెట్లు భారతీయ వ్యాపారులకు అందుబాటులోకి వస్తాయి. ఈ సవాళ్లు భారతదేశానికి ఎగుమతులను మెరుగుపరచడానికీ, భౌగోళికంగా వైవిధ్యభరితమైన మార్కెట్లను అన్వేషించడానికీ అవకాశం ఇస్తాయని మార్కెట్ వర్గాలంటున్నాయి. ట్రంప్ ట్యారిఫ్‌లు స్వదేశీ ఉత్పత్తులపై దృష్టి పెట్టేందుకు భారతదేశానికి అవకాశం కల్పిస్తాయి.

వ్యాసకర్త ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు

మానవత్వమే దైవత్వం

ఇన్ బాక్స్

మానవ సేవే మాధవ సేవ అంటారు. నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసిన వారిని, ముఖ్యంగా ప్రకృతి విపత్తులు, యుద్ధాలు, అంటువ్యాధుల వంటి ప్రమాదకరమైన పరిస్థితులలో మానవ సేవలో ధన్యులయిన వారిని స్మరించుకోవడం కోసం 2009 నుండి ఆగస్టు 19 నాడు 'ప్రపంచ మానవత్వ దినోత్సవా'న్ని జరుపుకొంటున్నాం. ఈ కార్యక్రమానికి ఈ తేదీనే ఎంచుకోడానికి కారణం ... బ్రెజిల్ దేశానికి చెందిన సెర్గియోడిమెల్లో. ఆయన దాదాపు మూడున్నర దశాబ్దాల పాటూ ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ) మానవతావాద సహాయ కార్యక్రమాల్లో అంకితభావంతో పనిచేశారు. చాలా దేశాల్లో యుద్ధాల మధ్య యూఎన్ఓ సహాయ కార్యక్రమాలు చేపట్టిన ఆయన... 2003 ఆగస్టు 19న ఇరాక్‌లోని ఒక బాంబు పేలుడులో 21 మంది సహచరులతో సహా ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నుంచి యూఎన్ఓ ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.



ఈ ఏడాది 'ప్రపంచ ఐక్యతను బలోపేతం చేయడం, స్థానిక సమాజాలకు సాధికారత కల్పించడం' అనే ఇతివృత్తంతో ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఇజ్రాయెల్– పాలస్తీనా మధ్య జరుగుతున్న ఘర్షణలో వందలాది మంది చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల నిత్యం అనేకమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆఫ్రికా ఖండంలోని సోమాలియా వంటి దేశాల్లో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల వల్ల ఎందరో ఊపిరి వదులుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో మానవత్వంతో, సహనంతో వ్యవహరించాలి. దయనీయ స్థితిలో కూరుకుపోయిన వారికి సహాయం అందించి ఆదుకోవాలి. ఏ సమాజంలోనైనా భిన్న నమ్మకాలు, విభిన్న తాత్విక దృక్పథాలు ఉంటాయి. వాటిమధ్య సహజీవన సౌగంధాన్ని సాధించినప్పుడే శాంతి సౌభాగ్యాలు విలసిల్లుతాయి. సహనం సామాజిక శాంతికి కారణమవుతుంది. మనిషిలోని అసహనం సమాజంలోని అల్లకల్లోలాకు కారణమవుతుంది. శాంతియుత నైతిక జీవనం సంఘంలో ప్రభవించడానికి సహనం తప్పనిసరి.

– ఎం. రాం ప్రదీప్ । జన విజ్ఞాన వేదిక, తిరువూరు
(నేడు ప్రపంచ మానవత్వ దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

టెలికమ్ పరికరాలు నం.1



మనదేశ ఎగుమతులకు ప్రధాన మార్కెట్లలో అమెరికా ఒకటి. 2024-25లో అమెరికాకు మన దేశం చేసిన ఎగుమతుల్లో దాదాపు 35 శాతం... టెక్స్‌టైల్స్, వ్యవసాయం, రత్నాభరణాల వంటి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న రంగాల నుంచే జరిగాయి. విలువ పరంగా చూస్తే... ఎగుమతుల్లో టెలికమ్ పరికరాలు, దిగుమతుల్లో ముడి చమురు మొదటి స్థానాల్లో నిలిచాయి. (బిలియన్ డాలర్లలో)

2024-25లో విలువ పరంగా టాప్-5

ఎగుమతులు		దిగుమతులు	
టెలికమ్ పరికరాలు	10.9	ముడి చమురు	6.6
ఔషధ ఉత్పత్తుల తయారీకి అవసరమైన డ్రగ్ ఫార్ములేషన్స్, బయొలాజికల్స్	9.7	పెట్రోలియం ఉత్పత్తులు	3.7
ముత్యాలు, విలువైన రత్నాలు	5.7	బొగ్గు తదితర ఇంధన వనరులు	3.4
పెట్రోలియం ఉత్పత్తులు	4.0	ముత్యాలు, విలువైన రత్నాలు	2.7
బంగారం, ఇతర విలువైన లోహాభరణాలు	3.6	బంగారం	2.1



ఆధారం: యూఎన్‌సీటీఏడీ

సమయం ఆసన్నమైతే...

జ్యోతిర్మయం

'కమలజ ఘటనా సమయంబైన, నసంభావ్యములైనను సంభవించు' నన్నాడు 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యకర్త కొఱవి గోపరాజు. ఆదిదేవుడైన శ్రీహరి నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మదేవుడి తలపుల నుంచి ఉద్భవించినవే స్థావర జంగమాత్మకమైనట్టి ఈ సృష్టిలోని సకల చరాచర వస్తు సంచయమంతా! బ్రహ్మదేవుడు అనుకోవాలేగాని, ఇదెలా సాధ్యం అనిపించేవి కూడా జరుగుతాయి.

ప్రహ్లాదుడు హరిభక్తుడు. ప్రహ్లాదుడి తండ్రి హిరణ్యకశిపుడు హరిద్వేషి. హిరణ్యకశిపుడంటే ముల్లోకాల జనులకు భయమే. దేవతలచే, దేవతల సంతతిచే, దైత్యులచే, గ్రహములచే, తారకలచే, మునుల చేత, అగ్ని, వాయువు, యముడు, నరులు, గిరులు, తరులు, పశు పక్ష్య మృగ కీటకాదుల చేతిలో, ఏరకమైన ఆయుధముల వలన, అవని పైన, అంతరిక్షంలోను, పగటియందు, రాత్రియందు తనకు మరణం కలగకుండా బ్రహ్మ దేవుడి నుండి పొందిన వరంతో హిరణ్యకశిపుడి ఆగడాలకు అంతం లేకుండాపోయింది. అందరూ సుఖంగా ఉండాలంటే హిరణ్యకశిపుడి మరణం ఒక్కటే మార్గం కాగా, ఆ మరణం ఇలా సంభవమైందని ఈ కింది పద్యంలో చెప్పాడు కొఱవి గోపరాజు.

కం. ఇది మానిసి యిది సింగం / బిది దేవత యను వివేక మెడలగ బలసం
పద నుక్కుగంబమున హరి / యుదయింపడె దైత్యవరుని నుక్కడగింపన్.

'ఇది మనిషి, ఇది సింహము, ఇది దేవత అని గుర్తించి, విడదీసి చెప్పడానికి వీలు లేని విధంగా... అటు భూమి మీద గాని, ఇటు ఆకాశం గాని కాకుండా, మహోగ్ర రూపంలో ఉక్కు స్తంభం నుండి నృసింహావతారంలో హిరణ్యకశ్యపుడిని పరిమార్చడానికి ఉదయించాడు కదా శ్రీహరి' అని పై పద్యం భావం. కనుక బ్రహ్మదేవుడి వినూత్న సృష్టికి సమయం ఆసన్నమైతే సంభవం కాదనుకున్నది కూడా సంభవమై కనపడుతుంది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

వారంలో నిరుద్యోగులతో భేటీ

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, చనగాని దయాకర్‌లతో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్‌: వారం రోజుల్లో నిరుద్యోగులతో ప్రజాభవన్‌లో సమావేశమవుతానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌ రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యల గురించి భట్టికి వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నిరుద్యోగులకున్న సందేహాలు తీర్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని, త్వరలోనే వారితో సమావేశం నిర్వహిద్దామని భట్టి హామీ ఇచ్చినట్టు చనగాని దయాకర్‌ వెల్లడించారు.

వాటర్‌ సిరీస్‌ వెబ్‌నార్‌కు జనగామ కలెక్టర్‌ ఎంపిక

- దేశంలో ఇద్దరు కలెక్టర్లకు అవకాశం



రిజ్వాన్‌ బాషా

జనగామ: నీటి నిర్వహణలో ఉత్తమ పద్ధతులతోపాటు ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టి ఆదర్శంగా నిలిచిన జనగామ కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషాకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. నీటి నిర్వహణలో ఉత్తమ పద్ధతులపై 49వ ఎడిషన్‌ వాటర్‌ సిరీస్‌ వెబ్‌నార్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యేందుకు రాజస్తాన్‌కు చెందిన కలెక్టర్‌తోపాటు రిజ్వాన్‌బాషాకు కేంద్రం నుంచి ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. కరువుకు కేరాఫ్‌గా ఉన్న జనగామ జిల్లాలో భూగర్భ జలాలు పెంచాలనే సంకల్పంతో కలెక్టర్‌ 12 మండలాల పరిధిలో ఇంకుడు గుంతల కార్యక్రమం నిర్వహించి, 7,175 ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టారు. ఇవి భూగర్భజలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ–జాతీయ జల మిషన్‌ డైరెక్టర్‌ అర్చన వర్మ (ఐఏఎస్‌) పర్యవేక్షణలో జరిగే వాటర్‌ సిరీస్‌ వెబ్‌నార్‌లో కలెక్టర్‌ పాల్గొంటారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణంతో పాటు ఆయిల్‌పామ్‌ సాగు, దేవాదుల ద్వారా గోదావరి జలాల మళ్లింపునకు సంబంధించిన పనులపై కలెక్టర్‌ వివరించనున్నారు.

విద్యా శాఖలో ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్‌: ప్రాథమిక, ఉన్నత విద్యా శాఖల్లోని 412 ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగాల గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ ఏడాది ఏప్రి ల్‌ 1వ తేదీతో ఈ పోస్టుల గడువు ముగియగా, ఆయా పోస్టుల్లో పనిచేస్తున్న వారి సేవలను వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్‌ సుల్తానియా రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక విద్యా శాఖ పరిధిలోని గ్రంథాలయాల్లో 173 లైబ్రేరియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, లైబ్రరీ హెల్పర్లు, రికార్డు అసిస్టెంట్‌ పోస్టులను మరో ఏడాది పాటు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఉన్నత విద్యా శాఖ పరిధిలోని రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థలో ఔట్‌ సోర్సింగ్‌ ప్రాతిపదికన 28, గెస్టు ప్రాతిపదికన 211 పోస్టులను కూడా ఏడాది పాటు పొడిగించారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్, ఆఫీస్‌ సబార్డినేట్, సెక్యూరిటీ గార్డు, స్వీపర్‌లతో పాటు కరుక్యులర్, కో కరుక్యులర్‌ గెస్ట్‌ ఫ్యాకల్టీ పోస్టులున్నాయి.

కోట శ్రీనివాసరావు సతీమణి రుక్మిణి కన్నుమూత



బంజారాహిల్స్‌ (హైదరాబాద్‌): దివంగత సినీనటుడు కోట శ్రీనివాసరావు సతీమణి కోట రుక్మిణి(75) సోమవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో ఫిలింనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. జూలై 13న కోట శ్రీనివాసరావు మరణించిన విషయం తెలిసిందే. 2010లో వారి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుమారుడు మరణించినప్పటి నుంచి ఆమె తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గత నెల భర్త కూడా మృతిచెందడంతో మరింత కుంగుబాటుకు లోనయ్యారు. ఈ క్రమంలో గత వారం రోజుల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. పెద్దసంఖ్యలో సినీ ప్రముఖులు, బంధుమిత్రులు విచ్చేసి రుక్మిణి పార్థివదేహానికి నివాళులర్పించారు.

కృష్ణుడి శోభాయాత్ర విషాదాంతం

▶ మొదటి పేజీ తరువాయి

వీరిని తాకుతూ ఉన్నవారు విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో పింజర్ల కృష్ణయాదవ్‌ అలియాస్‌ డైమండ్‌ యాదవ్‌ (22), కాటేపల్లి శ్రీకాంత్‌రెడ్డి (35), ఓల్డ్‌ రామంతాపూర్‌ ప్రాంతానికి చెందిన మాజీవార్డు సభ్యుడు చెట్లబోయిన సురేశ్‌యాదవ్‌ (34), హబ్సిగూడకు చెందిన రుద్రవికాస్‌ (39), రాజేందర్‌రెడ్డి (45) అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. తీవ్రంగా గాయపడిన వారిలో శ్రీనివాస్, రవికుమార్‌తో పాటు మరో ఇద్దరు ఉన్నారు. మరో భక్తుడు మహేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గన్‌మన్‌ శ్రీనివాస్‌ కూడా ఉన్నారు. వీరిని సమీప ఆస్పత్రుల్లోకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటనాస్థలికి టీజీ ఎస్పీడీసీఎల్‌ సీఎండీ

టీజీ ఎస్పీడీసీఎల్‌ సీఎండీ ముషారఫ్‌ అలీ ఫారూఖీ విద్యుత్‌ అధికారులతో కలిసి సోమవారం ఘటనాస్థలికి వచ్చారు. విద్యుత్‌ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్‌ వైర్లను స్థానికులు ఆయనకు చూపించారు. దీంతో ఆ ప్రాంతంలోని కొన్ని కాలనీల్లో సీఎండీ తిరిగి స్తంభాలపై ఉన్న కేబుల్‌ వైర్లను పరిశీలించారు. 'కేబుల్‌లో ఉన్న కాపర్‌ వైరు ద్వారా విద్యుత్‌ ప్రసరణ జరిగింది'అని సీఎండీ చెప్పారు. ఇందులో విద్యుత్‌ ఇంజనీర్ల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ఘటన జరిగిన ప్రదేశంలో 11కేవీ లైను 20 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉందన్నారు. విద్యుత్‌ స్తంభాలకు వేలాడుతూ..తరచూ విద్యుత్‌ ప్రమాదాలకు కారణమవుతున్న స్టార్, ఇంటర్నెట్‌ కేబుళ్లను తక్షణమే తొలగించాల్సిందిగా ఆయా సెక్షన్ల పరిధిలోని ఇంజనీర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్‌ అధికారుల నిర్లక్ష్యంతోనే ఐదుగురి ప్రాణాలు పోయామంటూ సీఎండీని స్థానికులు ఘెరావ్‌ చేశారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడగా, పోలీసులు అదుపులోకి తెచ్చారు. సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించి మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని సీఎండీ హామీ ఇచ్చారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రూ.5 లక్షల నష్టపరిహారం: మంత్రి శ్రీధర్‌బాబు

జరిగిన సంఘటనపై మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ మిక్కిలినేని మనుచౌదరి నేతృత్వంలో సమగ్ర దర్యాప్తునకు ఆదేశించామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. గాంధీ ఆస్పత్రి వద్ద సోమవారం మధ్యాహ్నం బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని, క్షతగాత్రుల వైద్యఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కేబుల్‌ వైర్‌ ద్వారా విద్యుత్‌ సరఫరా జరిగి ప్రమాదం చోటుచేసుకున్నట్టు అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. గ్రేటర్‌ పరిధిలో విద్యుత్‌ స్తంభాలకు కేబుల్‌వైర్లు, కరెంట్‌ తీగల అంశంపై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశామని, రానున్న వినాయక ఉత్సవాల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు.

వైఎస్‌ జగన్‌ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: శ్రీకృష్ణాష్టమి ఊరేగింపులో జరిగిన దుర్ఘటన అత్యంత విషాదకరమని ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్యుదాఘాతానికి గురై యువకులు మృతిచెందడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. పండగ వేళ జరి గిన ఈ దుర్ఘటన చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఫ్లాష్‌.. ఫ్లాష్‌..

కృష్ణుడి శోభాయాత్రలో విషాదం జరిగి 24 గంటలు గడిచిగడవక ముందే.. హైదరాబాద్‌లో ఇలాంటిదే మరో దుర్ఘటన చోటుచేసుకుంది. బండ్లగూడలో వినాయక విగ్రహం తీసుకెళ్తుండగా.. విద్యుత్‌ తీగలు తగిలి కరెంటు షాకుతో ఇద్దరు యువకులు మరణించారు.

నేను కూడా పడిపోయాను



రథాన్ని లాగుతూ వెళుతున్నాం. అంతలోనే కరెంట్‌షాక్‌తో అందరం పడిపోయాం. కొద్ది సేపటి తర్వాత ఎవరో నన్ను లేపి ఇంటికి తీసుకెళ్లారు. అప్పటికే హాహాకారాలు వినిపించి భయాందోళనకు గురయ్యాను.

– జి.వెంకటరమణ, ప్రత్యక్ష సాక్షి

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకు మృతి

చిన్నకోడూరు (సిద్దిపేట): పెళ్లింట్లో విషాదం నెలకొంది. పంటల రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్‌ తీగలు తండ్రీకొడుకు ఉసురు తీశాయి. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం...గంగాపూర్‌ గ్రామానికి చెందిన మూర్తి గజేందర్‌రెడ్డి (50)కి చంద్లాపూర్‌ గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరగ్గా, ఇల్లరికం వచ్చాడు. వీరికి కుమారుడు రాజిరెడ్డి (27), కూతురు సంతోషి ఉన్నారు. చంద్లాపూర్‌లో రంగనాయకసాగర్‌ రిజర్వాయర్‌తో సాగు భూమి ముంపునకు గురికాగా, గంగాపూర్‌ శివారులో గజేందర్‌రెడ్డి ఎకరం భూమి కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 14న కూతురు సంతోషి పెళ్లి ఘనంగా జరిపించారు. పెళ్లి పనులు పూర్తి కావడంతో సోమవారం తండ్రీకొడుకు అడవి పందుల బెడద నుంచి మొక్కజొన్న పంటను రక్షించేందుకు వైరు చుడుతున్నారు. ఈ క్రమంలోనే విద్యుదాఘాతంతో తండ్రీకొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. పొలం వద్దకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో భార్య పద్మ గజేందర్‌రెడ్డికి ఫోన్‌ చేయగా, ఏ సమాధానం రాలేదు. దీంతో ఆమె సమీప రైతులకు ఫోన్‌ చేయగా, వారు అక్కడకు వెళ్లి చూడగా ఇద్దరూ వైర్లు పట్టుకొని మృతి చెంది పడిఉన్నారు. ఈ ఘటనపై మాజీమంత్రి హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు. తక్షణ సాయం కింద రూ.10 వేలు బీఆర్‌ఎస్‌ నాయకుల ద్వారా అందజేశారు.

పల్లెల్లో మరోసారి 'పనుల జాతర'

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు
- ఈ వారంలోనే చేపట్టేందుకు అధికారుల ప్రణాళికలు



సాక్షి, హైదరాబాద్‌: పల్లెల్లో మరోసారి 'పనుల జాతర'ను చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో మళ్లీ ఈ ఏడాది కూడా చేపట్టనుంది. ప్రజల ఉపాధి, పల్లె ప్రగతికి పనుల జాతర కీలకమని, ఈ ఏడాది మళ్లీ చేపట్టాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులతో మంత్రి ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ దఫా పనుల జాతరలో ఇందిరా మహిళా శక్తి మహిళలకు ఉపాధి కల్పన పనులు, పొలాలకు బాటల నిర్మాణం, ఫల వనాలు, జల నిధి కింద నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంచే పనులు చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, జీపీ, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యం నివ్వాలన్నారు. పల్లెల్లో ఉపాధి కల్పనతో పాటు, గ్రామీణ అభివృద్ధి పునాది బలపడేలా పనుల జాతర ఉపయోగపడుతుందని సీతక్క పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టాక ఈ వారంలోనే పనుల జాతర ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతంలో నవంబర్‌ 26న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పనులు, గ్రామీణ రహదారుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వంటివి చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యేల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్ష్యాలకు అనుగుణంగా నిధుల వినియోగం జరిగింది. గతేడాది పనుల జాతరలో భాగంగా చేపట్టిన ఉపాధి హామీ పనుల ద్వారా మొత్తం 12.23 కోట్ల పనిదినాలు కల్పించారు. అభివృద్ధి పనుల కోసం రూ.4,529 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో వేతనాలు రూ.2,614 కోట్లు, మెటీరియల్‌ వ్యయం రూ.1,685 కోట్లు, అడ్మినిస్ట్రేటివ్‌ వ్యయం కింద రూ.229 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

గురుకులాల్లో డైట్‌ పంపిణీపై నిఘా పెంచాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌



సాక్షి, హైదరాబాద్‌: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహారంపైన నిఘా కట్టుదిట్టం చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ కుమార్‌ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సీఎస్‌ రామకృష్ణారావుతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గురుకుల విద్యా సంస్థల్లో డైట్‌ పంపిణీపై చర్చించారు. ఇటీవల పలు స్కూళ్లలో ఫుడ్‌ పాయిజన్‌ ఘటనలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని, ఇకపై పునరావృతం కాకుండా మరింత నిఘా పెంచాలని ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులను కలుస్తానన్నారు.

స్థానికతను కాపాడే పార్టీకే మద్దతివ్వాలి

- ప్రొఫెసర్‌ హరగోపాల్‌



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ హరగోపాల్‌

వంజగుట్ట (హైదరాబాద్‌): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికతను కాపాడతామని ఏ పార్టీ తన మేనిఫెస్టోలో పెడుతుందో ఆ పార్టీకే మద్దతు పలుకుదామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలను అవమానిస్తూ మాట్లాడిన గుజరాతీ, మార్వాడీ సమాజ్‌ నాయకులు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్‌ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మార్వాడీ సమస్య–పరిష్కారాలు అనే అంశంపై కవులు, రచయితలు, మేధావులతో రౌండ్‌టేబుల్‌ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్‌ హరగోపాల్‌ మాట్లాడుతూ.. అమెజాన్‌ లాంటివి వచ్చాక కొనుగోలు మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని, పెట్టుబడిదారులు వ్యాపారంలోకి వచ్చాక చిన్న దుకాణాలు మూతపడుతున్నాయని అన్నారు. మార్వాడీలు కూడా మన భారతీయులే కదా వారు ఎక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చు అని కొంతమంది అంటున్నారని, దేశం ఒక్కటే అయినా తెలంగాణ కోసం పోరాటం ఎందుకు జరిగిందని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికుల ప్రయోజనాలు కాపాడతామని ఏ పార్టీ హామీ ఇస్తుందో ఆ పార్టీకి మద్దతు ఇద్దామని కవి, రచయిత నందిని సిధారెడ్డి తెలిపారు. తెలంగాణ క్రాంతిదళ్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ పృథ్వీరాజ్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్‌ రాఘవాచారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్‌ పాల్గొన్నారు.

కదిలించిన 'అనాథగా అమ్మ 'కథనం

- సుమోటోగా కేసు నమోదు చేసిన మానవ హక్కుల కమిషన్‌

సాక్షి ఎఫెక్ట్‌

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/ హైదరాబాద్‌ సిటీకోర్టులు: 'అనాథగా అమ్మ' శీర్షికన ఈ నెల 18న 'సాక్షి' మెయిన్‌ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనంపై జస్టిస్‌ షమీమ్‌ అక్తర్‌ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ సుమోటో కేసు నమోదు చేసింది. కామారెడ్డి రైల్వే స్టేషన్‌ సమీపంలో ఉన్న వృద్ధురాలు శకుంతల దుస్థితిని 'సాక్షి'కథనం చాటిందని మానవ హక్కుల కమిషన్‌ పేర్కొంది. ఆమె సంరక్షణ, సంక్షేమ ప్రయోజనాలు, ఆమె కొడుకు, కోడలిపై తీసుకున్న చర్యలపై వచ్చే నెల 22 నాటికి నివేదిక ఇవ్వాలని కమిషన్‌ కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

ఆస్పత్రికి తరలించిన పోలీసులు

వృద్ధురాలి దీనస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి స్పందించి వెంటనే పట్టణ సీఐ నరహరిని శకుంతల వద్దకు పంపించారు. వైద్యం కోసం ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఓల్డేజ్‌ హోంలో బస ఏర్పాటు చేశారు. ఆమె కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నామని ఏఎస్పీ చైతన్యరెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

కీలక కమిషనరేట్‌లో ఖతర్నాక్‌ ఖాకీ!

డీసీపీ అయిన ఆ యువ ఐపీఎస్‌ స్టైలే వేరు

- క్షేత్రస్థాయి అధికారులతో ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి సెటిల్‌మెంట్లు
- సివిల్‌ వివాదాల్లో తలదూర్చుతూ అక్రమ సంపాదన
- డీసీపీకి రూ.3 కోట్లకు పైగా టోపీ పెట్టి విదేశాలకు పరారైన బినామీ
- అన్ని అంశాలపై ఆరా తీస్తున్న నిఘా వర్గాలు



సాక్షి, హైదరాబాద్‌: కీలక కమిషనరేట్‌ పరిధిలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో పనిచేస్తున్న ఓ డీసీపీ వ్యవహారం పోలీస్‌ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఆ యువ ఐపీఎస్‌ అధికారి సివిల్‌ వివాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేస్తూ అక్రమార్జనకు తెరతీసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమార్జనను మరింత పెంచుకునేందుకు సదరు డీసీపీ ఓ బినామీని ఆశ్రయించగా..ఆ బినామీ ఆయనకు ఏకంగా రూ.3 కోట్లకు పైగా టోపీ పెట్టి విదేశాలకు చెక్కేయడం ఇప్పుడు ఆ కమిషనరేట్‌ పరిధిలో హాట్‌ టాపిక్‌ అయ్యింది. ఆ జోన్‌ పరిధిలో పనిచేసే కింది స్థాయి పోలీస్‌ అధికారులతో కలిసి సదరు డీసీపీ చేస్తున్న సెటిల్‌మెంట్లపై ఇప్పటికే ఇంటెలిజెన్స్‌ వర్గాలు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

ఓ ఎమ్మెల్సీ కుటుంబంతో కలిసి అపార్ట్‌మెంట్‌ కబ్జాకు యత్నం

ఐటీ కార్యాలయాలు, ఆకాశ హర్మ్యాలు, అత్యంత ఖరీదైన భూములున్న ప్రాంతంలో పని చేస్తున్న సదరు యూనిట్‌ ఆఫీసర్‌..స్థానికంగా కీలక ప్రాంతాల్లో ఉండే కొందరు క్షేత్రస్థాయి అధికారులతో ప్రత్యేకంగా ఒక టీమ్‌ ఏర్పాటు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. అధికార పార్టీపై నిత్యం విమర్శలు చేసే ఓ ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులతో జత కలిసిన సదరు అధికారి.. తన బృందంతో కలిసి అప్పుడే నిర్మాణం పూర్తయిన నాలుగు అంతస్తుల అపార్ట్‌మెంట్‌ను కబ్జాకు యత్నించారు. అయితే ఈ వ్యవహారం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో..పెద్ద మొత్తంలో జరగాల్సిన సెటిల్‌మెంట్‌లో భారీ వాటా కోల్పోయామంటూ సదరు అధికారుల బృందం ఉసూరుమంది. కాగా వారాంతాల్లో సేద తీరేందుకు స్థానికంగా ఉండే పబ్బులు, ఖరీదైన రెస్టారెంట్లకు వెళ్లే సదరు డీసీపీ.. తన స్థాయికి తగ్గట్టుగా ఎంజాయ్‌ చేసి లక్షల రూపాయల బిల్లులు ఎగ్గొట్టిన ఉదంతాలు ఉన్నాయని స్థానిక పోలీసుల్లో ప్రచారం ఉంది.

మచ్చుకు కొన్ని...

- టీజీఐసీసీ ఆధ్వర్యంలో 2020లో దాదాపు 600కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ కెమెరాల నిర్వహణ ఉచితంగా చేసి పెడతామంటూ అప్పటి కమిషనర్‌ను ఒప్పించి రంగంలోకి వచ్చిన ఓ కాంట్రాక్టు సంస్థ క్రమంగా ఈ కెమెరాల నిర్వహణకు నిధులు వసూలు చేయడం మొదలు పెట్టింది. 2020 నుంచి 2025 ఆగస్టు వరకు ఏఎంసీ పేరిట ఇటీవల ఒప్పందం కుదుర్చుకుని టీజీఐసీసీ నుంచి దాదాపు రూ.6 కోట్ల వరకు నిధులు మంజూరు చేయించుకున్నారు. ఇందులో సదరు కాంట్రాక్టర్‌కు సహకరించిన అధికారులకు వాటాలు అందినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక మొత్తం కెమెరాల్లో సగం పని చేయడం లేదని.. కొన్ని కెమెరాలు అసలు లేనే లేవని తెలుస్తోంది.
- దీకొండ హోమ్స్‌లో 75 ఏళ్ల వయస్సు ఉన్న ఓ డాక్టర్‌ తన స్థలం డెవలప్‌మెంట్‌ కోసం ఒక డెవలపర్‌కు ఇచ్చాడు. నిర్మాణం పూర్తయిన తర్వాత తన వాటా కింద రావాల్సిన ఐదు ఫ్లాట్ల కోసం ఆ డాక్టర్‌ ప్రశ్నించగా డెవలపర్‌ పట్టించుకోలేదు. పైగా ఆయన వాటాగా వచ్చిన ఐదు ఫ్లాట్లను డెవలపర్‌కే చౌకకు అమ్మేయాలంటూ స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఫోన్‌ చేసి బెదిరించడం చర్చనీయాంశమైంది. రెండేళ్లుగా ఆ డాక్టర్‌ తన సొంత అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడానికి అనుమతి లేకుండా పోయిందని తెలిసింది.
- మాదాపూర్‌ పరిధిలో ఒక నాయకుడు 1,000 చదరపు గజాలను ఆక్రమించగా..ఇందుకు పోలీసుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
- గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ ఆర్మీ మేజర్‌ పేరిట ఉన్న భూమి కోసం ఆయన భార్య, కుమార్తెలపై సంధ్య కన్వెన్షన్‌ యజమాని శ్రీధర్‌రావు మనుషులు దాడి చేసిన ఘటనలోనూ బాధితులకు అండగా ఉండాల్సిన స్థానిక పోలీసులు శ్రీధర్‌రావు నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని బాధితులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కోటి మందికి ఏఐ ఆధారిత పౌర సేవలు

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- 2027 నాటికి అందించేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కోటి మంది ప్రజలకు 2027 నాటికి ఏఐ ఆధారిత పౌర సేవలు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ శాఖ అనుబంధ విభాగం ఎమర్జింగ్‌ టెక్నాలజీస్‌ వింగ్‌ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమది ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రభుత్వమని పేర్కొ న్నారు. ప్రజలు అడగకుండానే వారి ముంగిటకు ఏఐ సాంకేతిక సహకారంతో పౌర సేవలను చేర్చడం ద్వారా సరికొత్త తెలంగాణను నిర్మించడం తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 'అంతర్జాతీయంగా తెలంగాణను ఏఐ సాంకేతికతకు రాజధాని గా తీర్చిదిద్దేందుకు అత్యుత్తమ ప్రమాణాలతో ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్‌ హబ్‌ను అందుబాటులోకి తెస్తాం. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్‌ను ప్రారంభించి, ఇతర రాష్ట్రాలకు రోల్‌ మోడ ల్‌గా నిలిచాం. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవల ను ఏఐ ఆధారిత ప్లాట్‌ ఫాంపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీని కోసం సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి ఏఐ సాంకేతికత వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం'అని మంత్రి వివరించారు. ఈ అధికారులకు మూడు నెలల పాటు ఏఐ నిపుణులు శిక్షణ ఇస్తారని చెప్పారు.

23న మహాధర్నా

- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ



విలేకరులతో మాట్లాడుతున్న చావా రవి

సాక్షి, హైదరాబాద్‌: ఉపాధ్యాయ సమస్యలపై ఇక ఉపేక్షించేది లేదని..ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్పష్టం చేసింది. దశల వారీగా నిరసనలు వ్యక్తం చేసినా, ప్రభుత్వం స్పందించలేదని తెలిపింది. దీంతో తాము ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లో మహా ధర్నా చేపడుతున్నట్టు వెల్లడించింది. యూఎస్‌పీసీ స్టీరింగ్‌ కమిటీ కన్వీనర్‌ చావా రవి నేతృత్వంలో టీఎస్‌యూటీఎఫ్‌ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమా వేశం జరిగింది. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను కమిటీ నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా చావా రవి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని దుయ్యబట్టారు. దీనిని తెలియజేసేందుకు రెండుదశల ఆందోళనలు చేపట్టామన్నారు. తొలిదశలో తహసీల్దార్‌ కార్యాల యాల్లో వినతిపత్రాలు ఇచ్చామని, రెండోదశలో జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేశామని తెలిపారు. స్పందించకపోవడంతో మహాధర్నా చేపడుతున్నామన్నారు. ఆందోళనల సందర్భంగా గతంలో ఉపాధ్యాయ నేతలను అరెస్టు చేశారని, ఇలాంటి వాటికి భయపడేదేలేదని తెలిపారు. విద్యాశాఖకు మంత్రే లేరని, సమస్యలు చెబుతామంటే ముఖ్యమంత్రి అందుబాటులో ఉండటం లేదని టి.లింగారెడ్డి అన్నారు. సర్కార్‌ ఏర్పడి 20 నెలలు దాటినా ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీల డిప్యూటేషన్లను రద్దు చేయాలని వెంకట్‌ డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌.తిరుపతి (టీపీటీఎఫ్‌), ఎం.సోమయ్య (డీటీఎఫ్‌), కొమ్ము రమేష్‌ (బీటీఎఫ్‌), ఎస్‌.హరికిషన్‌ (టీటీఏ), వై విజయకుమార్‌ (ఎస్సీఎస్టీయూఎస్‌), పి.మాణిక్‌రెడ్డి, ఏ.సింహాచలం (టీఎస్‌యూటీఎఫ్‌) తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌ 1న సీపీఎస్‌ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

- టీజీసీపీఎస్‌ఈయూ అధ్యక్షుడు దర్శన్‌గౌడ్‌

సాక్షి, హైదరాబాద్‌: కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ విధానాన్ని రద్దు చేసేవరకు ఉద్యమిస్తామని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీమ్‌ ఉద్యోగుల సంఘం (టీజీసీపీఎస్‌ఈయూ) అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్‌గౌడ్‌ తెలిపారు. సోమవారం యూనియన్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులు పదవీవిరమణ అనంతరం ఆత్మగౌరవంతో జీవించాలని కోరుతూ సెప్టెంబర్‌ 1న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎస్‌ ఉద్యోగుల ఆత్మ గౌరవసభ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్‌ మాట్లాడుతూ పాత పెన్షన్‌ ప్రకటన కోసం 2 లక్షలకు పైబడి ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు.

పీఎస్‌హెచ్‌ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా మురళీధర్‌గౌడ్‌



మురళీధర్‌ గౌడ్, రచ్చ మురళి

సాక్షి, హైదరాబాద్‌: కొత్తగా ఏర్పడ్డ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం–టీజీ (పీఎస్‌హెచ్‌ఎంఏ–టీజీ) సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షుడిగా మురళీధర్‌ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రచ్చ మురళి, ఆర్థిక కార్యదర్శులుగా గాలయ్య, కె.శ్రవణ్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా నరేందర్‌ రెడ్డి ఎన్నికైనట్టు సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. సర్వసభ్య సమావేశానికి కె.ప్రభాకర్‌ రెడ్డి అధ్యక్షత వహించారు. అసోసియేట్‌ అధ్యక్షులుగా అంకం నరేశ్, కొడపర్తి సోమయ్య, బత్తుల సదానందం, బి.రాజ్‌కుమార్‌ను నియమించారు.

భారతీయులందరికీ స్ఫూర్తి

వెన్ను తట్టి అభినందించిన మోదీ



శుభాంశు భుజంపై చేయివేసి తీసుకెళ్తున్న మోదీ

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనలకు పెద్దపీట వేసే ప్రధాని మోదీ దేశ గగన్‌యాన్ కలలను సాకారంచేసే భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను కలిసిన వేళ ఆనందంలో మునిగిపోయారు. రష్యా, అమెరికా మొదలు ఇస్రో, నాసా దాకా అన్ని రకాల వ్యోమగామి శిక్షణా వ్యయాలను భరించిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రధాని మోదీని కలిసిన వేళ శుభాంశు శుక్లా సైతం ఒకింత ఉద్విగ్నానికి లోనయ్యారు. అంతరిక్షకేంద్రంలో తాను అనుభవించి, గడించిన అద్వితీయ అనుభూతిని, అనుభవాన్ని చిన్న పిల్లాడిలా ఎంతో ఉత్సాహంతో ప్రధాని మోదీకి పూసగుచ్చినట్లు వివరించారు. ఈ అపురూప ఘట్టానికి ఢిల్లీలోని లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని అధికార నివాసం వేదికైంది. జూన్ 25 నుంచి జూలై 15వ తేదీదాకా యాగ్జియం–4 మిషన్ తరఫున అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో గడిపిన భారత మొట్టమొదటి వ్యోమగామిగా చరిత్ర లిఖించాక తొలిసారిగా శుభాంశు శుక్లా ప్రధాని మోదీని సోమవారం కలిసి తన అనుభవాలను పంచుకున్నారు. ''వ్యోమగామిగా మాత్రమే కాదు అవనికి ఆవల సైతం భారతీయులు తమ కలలను నెరవేర్చుకోగలరని నువ్వు నిరూపించావు. వాళ్లకు స్ఫూర్తిగా నిలిచావు''అని శుక్లాను మోదీ పొగిడారు.

శుక్లా చెప్పిన ప్రతి విషయాన్ని మోదీ ఎంతో శ్రద్ధగా ఆలకించారు. భారత త్రివర్ణ పతాకాన్ని ఐఎస్ఎస్‌లో రెపరెపలాడించినందుకు శుభాంశును మోదీ మనసారా అభినందించారు. వ్యోమగామి ప్రత్యేక జాకెట్ ధరించి వచ్చిన శుభాంశు కలవగానే కరచాలనం చేసి మోదీ ఆయనను ఆత్మీయంగా హత్తుకున్నారు. శెభాష్ అంటూ భుజం తట్టారు. కొద్దిసేపు హాల్‌లో నడుస్తూ మాట్లాడారు. తర్వాత కూర్చుని శుక్లా సవివరంగా తన అంతరిక్ష యాత్ర వివరాలను మోదీకి తెలియజేశారు. ట్యాబ్‌లో పలు అంశాలను సోదాహరణంగా వివరించారు. ఆ తర్వాత మోదీకి రెండు బహుమతులను బహూకరించారు. ఐఎస్ఎస్‌కు వెళ్లినప్పుడు తన వెంట తీసుకెళ్లి తిరుగుపయనం వేళ మళ్లీ వెంట తీసుకొచ్చిన త్రివర్ణ పతాకాన్ని మోదీకి శుభాంశు బహూకరించారు. తర్వాత శుక్లాతో భేటీ వివరాలను ప్రధాని తన సామాజికమాధ్యమం 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారు. ''శుభాంశు శుక్లాతో భేటీ అద్భుతంగా సాగింది. అంతరిక్షంలో ఉన్నప్పుడు ఆయన చేసిన ప్రయోగాలు మొదలు అక్కడి సహచరుల తోడ్పాటు, అక్కడి ప్రయోగాల సత్ఫలితాలు, శాస్త్ర, సాంకేతికతల పురోభివృద్ధి, భారత ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్ట్ వివరాలపై ఎన్నో విషయాలు నాతో పంచుకున్నారు. ఐఎస్ఎస్‌లో గడిపి, ఆయన చేసిన ప్రయోగాలతో శుక్లాను చూసి భారత్ గర్వపడుతోంది''అని మోదీ వ్యాఖ్యానించారు. శుక్లా ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు జూన్ 29వ తేదీన మోదీతో వర్చువల్‌గా మాట్లాడారు. ''ఐఎస్ఎస్‌లో గడిపిన ప్రతి క్షణాన్ని గుర్తుంచుకో. అక్కడి వాతావరణం, ప్రయోగశాల స్థితిగతులు, ప్రయోగాలు చేసే విధానం.. ఇలా ప్రతీది తర్వాత దేశీయంగా భారత్ చేపట్టే సొంత అంతరిక్ష ప్రయోగాలకు అక్కరకొస్తుంది''అని శుక్లాకు మోదీ సూచించడం తెల్సిందే. ఇదే విషయాన్ని శుక్లా రెండు వారాల క్రితం గుర్తుచేసుకున్నారు. ''ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు మోదీ నాకు ఇచ్చిన హోమ్‌వర్క్ నాకు బాగా గుర్తుంది. ఆ హోమ్‌వర్క్‌ను చాలా బాగా పూర్తిచేశా. ఐఎస్ఎస్‌లో నేను చేసిందంతా మళ్లీ ప్రధానికి చెప్పేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నా. ఐఎస్ఎస్‌లో నేను గడించిన అనుభవం మన గగన్‌యాన్ మిషన్‌కు ఎంత కీలకమో నాకు బాగా తెలుసు''అని శుక్లా గతంలో చెప్పారు.



శుభాంశు ఐఎస్ఎస్ నుంచి తెచ్చిన ఫొటోలను తిలకిస్తూ..

తరువాయి.. త్రైపాక్షిక చర్చలు

పుతిన్, జెలెన్‌స్కీలతో కలిసి యుద్ధాన్ని సమాప్తం చేస్తా

- శ్వేతసౌధంలో ఈయూ కూటమి అగ్రనేతలతో సంయుక్త సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటన
- అమెరికా రాజధానిలో కీలక పరిణామం



వైట్‌హౌస్‌లో జెలెన్‌స్కీ, ట్రంప్



వైట్‌హౌస్‌లో యూరోపియన్ నేతలతో జెలెన్‌స్కీ, ట్రంప్ గ్రూప్ ఫొటో

వాషింగ్టన్: ఉక్రెయిన్ యుద్ధానికి వీలైనంత త్వరగా ముగింపు పలికేందుకు కంకణం కట్టుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, యురోపియన్ యూనియన్ కీలక సభ్య దేశాల అగ్రనేతలు యుద్ధ పరిసమాప్తి కృషిపర్వంలో కీలక పురోగతి సాధించారు. ఇందుకు అమెరికా రాజధాని నగరం వేదికైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లతో కలిసి తాను త్రైపాక్షిక సమావేశం నిర్వహించబోతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లోని ఈస్ట్‌రూమ్‌లో ఐరోపా సమాఖ్య కీలక సభ్యదేశాల అగ్రనేతలతో ట్రంప్ సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో యుద్ధ విరమణ కోసం పుతిన్, జెలెన్‌స్కీ, ట్రంప్ త్రైపాక్షిక సమావేశం జరిపేందుకు ఈయూ నేతలు ఏకగ్రీవంగా అంగీకరించారు. అయితే ఈ త్రైపాక్షిక భేటీ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనేది ఇంకా నిర్ణయించలేదు. సెక్యూరిటీ గ్యారెంటీలో ఉండే ప్రధానాంశాలు సైతం ఇంకా ఖరారుకాలేదు. 'నాటో' కూటమిలో చేరకపోయినా సరే అదే తరహాలో 'రక్షణ హామీ'ని ఉక్రెయిన్‌కు అమెరికా ఇచ్చినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పుతిన్ పేర్కొన్న అంశం ఈ సంయుక్త సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సంయుక్త సమావేశంల నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రూటే, యురోపియన్ కమిషన్ మహిళా అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డీర్ లేయిన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమావేశమయ్యారు. అయితే ఈ త్రైపాక్షిక సమావేశంలో ఈయూ తరఫున సైతం ఒక ప్రతినిధి పాల్గొంటే మంచిదని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ అభిప్రాయపడ్డారు. నాటోయేతర రక్షణహామీకి ట్రంప్ ముందుకు రావడం ఈ మొత్తం ప్రక్రియలో కీలక పరిణామమని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూటే అన్నారు. తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తే బాగుంటుందని జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. యుద్ధకాల్పుల మోత మెల్లగా తగ్గుముఖం పట్టనుందని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వ్యాఖ్యానించారు. అంతకుముందు నేతలంతా ఒక గ్రూప్ ఫొటో దిగారు.

జెలెన్‌స్కీని మెచ్చుకున్న ట్రంప్

ఈయూ నేతలతో భేటీకి ముందు తొలుత జెలెన్‌స్కీతో ట్రంప్ విడిగా సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. గత భేటీలో టీ–షర్ట్ వేసుకొచ్చిన జెలెన్‌స్కీని అమెరికా మీడియా తప్పుబట్టిన నేపథ్యంలో ఈసారి నలుపు రంగు సూట్ ధరించారు. సూట్ డిజైన్‌ను ట్రంప్ మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌కు జెలెన్‌స్కీ ఒక లేఖ అందించారు. '' ఇది మీ భార్య కోసం. అయితే ఇది నేను రాసింది కాదు. నా భార్య రాసింది'' అనడంతో అందరూ ఫక్కున నవ్వేశారు. తర్వాత ట్రంప్ మాట్లాడారు. '' యుద్ధంలో యావత్ ప్రపంచమే అలసిపోయింది. మనం దీనిని ఇక ముగింపునకు తీసుకొద్దాం. ఈరోజంతా మంచే జరగబోతోంది. పుతిన్, జెలెన్‌స్కీతో కలిసి త్రైపాక్షిక భేటీ ఆమోదయోగ్యమైన రీతిలో జరిగే అవకాశముంది. ఈ యుద్ధం ముగియబోతోంది. ముగింపు అనేది అంతా కాకపోయినా కొంతైనా మిస్టర్ జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉంది'' అని ట్రంప్ అన్నారు. సెక్యూరిటీ గ్యారెంటీ హామీలో భాగంగా ఉక్రెయిన్‌కు భవిష్యత్తులో అమెరికా బలగాలు మొహరిస్తారా అన్న ప్రశ్నకు ట్రంప్ సూటిగా సమాధానం చెప్పలేదు.

ప్రధానికి పుతిన్ ఫోన్

అలస్కాలో ట్రంప్‌తో భేటీ వివరాలను వెల్లడించిన రష్యా అధ్యక్షుడు

- ఉక్రెయిన్ వివాదాన్ని శాంతిమార్గంలో పరిష్కరించుకోవాలని మోదీ పునరుద్ఘాటన



న్యూఢిల్లీ: చిరకాల మిత్రదేశమైన భారత్‌తో తాజా ఉక్రెయిన్ శాంతిఒప్పంద పరిణామాలను పంచుకునేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ముందుకొచ్చారు. సోమవారం భారత ప్రధాని మోదీకి పుతిన్ స్వయంగా ఫోన్‌చేశారు. అలస్కాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తన భేటీ వివరాలను మోదీకి పుతిన్ విశదీకరించారు. ఇరువురు నేతలు సుదీర్ఘంగా మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ అంశాన్ని శాంతియుతంమార్గంలోనే పరిష్కరించుకోవాలని మొదట్నుంచీ చెబుతున్నామని పుతిన్‌తో మోదీ మరోమారు స్పష్టంచేశారు. మూడు గంటలపాటు ట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన శిఖరాగ్ర భేటీ ఎలాంటి శాంతి ఒప్పంద తుది నిర్ణయాలు వెలువర్చకుండానే ముగిసిన విషయం తెల్సిందే. ''అలస్కాలో ట్రంప్‌తో భేటీ విశేషాలు నాతో పంచుకునేందుకు ముందుకొచ్చిన రష్యా అధ్యక్షుడు, స్నేహితుడు పుతిన్‌కు ధన్యవాదాలు. ఇక మీదట సైతం పరస్పర అభిప్రాయాలు పంచుకునేందుకు సదా సిద్ధంగా ఉన్నా. ఉక్రెయిన్ సంక్షోభం సమసిపోవాలంటే శాంతి మంత్రం జపించాల్సిందే. దౌత్యం, చర్చల మార్గం ద్వారానే శాంతిస్థాపన సాధ్యం. ఈ ప్రక్రియలో భారత్ తన శక్తిమేరకు సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంది''అని మోదీ అన్నారు. పుతిన్, మోదీ ఫోన్ సంభాషణలో ఉక్రెయిన్ అంశంతోపాటు పలు కీలక ద్వైపాక్షిక అంశాలు సైతం ప్రస్తావనకు వచ్చాయని తర్వాత ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ''ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరుదేశాధినేతలు కూలంకషంగా చర్చించారని ఆ ప్రకటన తెలిపింది. అలస్కాలో ట్రంప్, పుతిన్ భేటీని భారత విదేశాంగ శాఖ వెంటనే స్వాగతిస్తూ ఒక ప్రకటన వెలువర్చడం తెల్సిందే. రణక్షేత్రాల్లో రాజీ సాధ్యం కాదని, అయినా ఇది యుద్ధాల యుగం కాదని గతంలోనే పుతిన్‌కు మోదీ హితవు పలికిన విషయం విదితమే. గత ఏడాది జూలైలో రష్యాలో పర్యటన సందర్భంగా పుతిన్‌తో మోదీ భేటీ అయి ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన కోసం తన వంతు కృషిచేశారు. ఆ వెనువెంటనే ఉక్రెయిన్ రాజధాని కీవ్‌సిటీకి చేరుకుని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీకి సైతం యుద్ధాన్ని విరమించాలని మోదీ కోరారు. యుద్ధంలో మునిగిపోయిన పక్షాల వైపు భారత్ లేదని, శాంతి వైపు మాత్రమే తాము నిలిచామని మోదీ గతంలోనే సుస్పష్టం చేశారు.



ప్రధాని మోదీతో రాధాకృష్ణన్ భేటీ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర గవర్నర్, ఎన్‌డీయే పక్షం ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుసుకున్నారు. ఉపరాష్ట్రపతి పదవికి సీపీ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం ఆదివారం ఖరారు కావడం తెల్సిందే. అంతకుముందు, ఢిల్లీకి వచ్చిన రాధాకృష్ణన్‌కు కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, ప్రహ్లాద్ జోషి, కిరెన్ రిజిజు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్‌డీయే పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే నెల 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రచారంలో భాగంగా రాధాకృష్ణన్ వివిధ పార్టీల నేతలతో సమావేశమవుతారని భావిస్తున్నారు. ఈ నెల 20న ఆయన నామినేషన్ వేస్తారని సమాచారం. ప్రధాని మోదీ, ఆయన కేబినెట్ సహచరులతోపాటు బీజేపీ, బీజేపీ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు కూడా నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఎన్‌డీయే పక్షం ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు శుభాభినందనలు.. అంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

గంటలపాటు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నా టోల్ చెల్లించాలా?: సుప్రీం

న్యూఢిల్లీ: ట్రాఫిక్‌లో గంటలపాటు ఇరుక్కుపోయినా టోల్ ఫీజు కట్టాలంటూ వాహనదారులను ఒత్తిడి చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. కేరళలోని త్రిస్సూర్ జాతీయ రహదారిపై 65 కిలోమీటర్ల ప్రయాణానికి 12 గంటల సమయం తీసుకుంటున్నందున టోల్‌ఫీజు రూ.150ను మరమ్మతులు పూర్తయ్యేదాకా 4 వారాలపాటు వసూలు చేయొద్దంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ), గురువాయూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 'రోడ్డు ఒక చివరి నుంచి మరో చివరికి చేరుకునేందుకు 12 గంటల సమయం తీసుకున్నా రూ.150 ఎందుకు చెల్లించాలి? సాధారణ ప్రయాణ సమయం గంట మాత్రమే కాగా, అదనంగా 11 గంటలు పట్టింది. అయినా టోల్ రుసుము కట్టాలంటున్నారు'అని ధర్మాసనం పేర్కొంది. వారాంతాల్లో ఆ రహదారిపై కనీసం 12 గంటలపాటు ట్రాఫిక్ జామ్ అవుతోందని కక్షిదారులు ధర్మాసనానికి నివేదించారు. నంబర్ 544 జాతీయ రహదారిపై ఎడప్పల్లి–మన్నుతి మధ్య కొనసాగుతున్న పనుల కారణంగా వాహనాలు నిలిచిపోతున్నందున పలియెక్కర ప్లాజాలో టోల్ వసూలును ఆపాలంటూ కేరళ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, రహదారిపై లారీ ఒకటి అడ్డంగా నిలిచిపోవడం వల్లే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందంటూ ఎన్‌హెచ్ఏఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. అయితే, అదేమీ దైవ నిర్ణయం కాదని, రోడ్డుపై భారీ గుంత పడినందునే లారీ నిలిచిపోయిందంటూ ధర్మాసనం అడ్డు తగిలింది. రోడ్డు పనుల బాధ్యతలను ఇతరులు తీసుకున్నందున, టోల్ ఆదాయాన్ని తాము కోల్పోవాలనడం పూర్తి అన్యాయంగా ఉందని గురువాయూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ వాదించింది. కేవలం 10 రోజుల్లోనే తమకు ఐదారుకోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపింది. రహదారిని వాహనాల రాకపోకలకు అనువుగా ఉంచాల్సిన బాధ్యత ఎన్‌హెచ్ఏఐపైనే ఉందని హైకోర్టులో పిటిషనర్ల తరఫున వాదించిన జయంత్ ముత్తురాజ్ తెలపగా కలిగిన నష్టాన్ని ఎన్‌హెచ్ఏఐ నుంచి రాబట్టుకోవాలని గురువాయూర్ కంపెనీకి ధర్మాసనం స్పష్టం చేసింది. తీవ్రంగా ఉన్న ఈ సమస్యకు టోల్ రుసుము తగ్గింపు సైతం తగిన పరిష్కారం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంపై తీర్పును రిజర్వులో ఉంచుతున్నట్లు ప్రకటించింది.

మేం అధికారంలోకి వస్తే ఈసీ పనిపడతాం

ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్ హెచ్చరిక



గయాజీ: ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శల వాడిని మరింత తీవ్రతరం చేశారు. ప్రతిపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్నికల కమిషన్(ఈసీ)లో ఇద్దరు కమిషనర్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)ల భరతం పడతామంటూ హెచ్చరికలు చేశారు. ఆదివారం సాసారం నుంచి రాహుల్ ఓటర్ అధికార్ యాత్రను ప్రారంభించడం తెల్సిందే. యాత్ర సోమవారం గయాజీకి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి రాహుల్ మాట్లాడారు. ఓట్ల చోరీ వాస్తవమని తేలిన తర్వాత కూడా తనను అఫిడవిట్ వేయాలని ఈసీ హెచ్చరించడాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. 'మాకు కొంత సమయం ఇవ్వండి. ప్రతి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మీరు చేసే దొంగతనాన్ని బయటపెడతాం. అప్పుడు దేశం ప్రజలే మిమ్మల్ని అఫిడవిట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తారు'అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తరచూ చెప్పే స్పెషల్ ప్యాకేజీ మాదిరిగానే ఈసీ సైతం బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)'పేరుతో ఓటరు సవరణ తీసుకువచ్చింది. ఇదో కొత్త రకం ఓట్ల చోరీ'అని రాహుల్ ధ్వజమెత్తారు. 'ముగ్గురు ఎన్నికల కమిషనర్లు బీజేపీ సభ్యత్వం తీసుకుని పనిచేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి.. ఏదో ఒక రోజు ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అప్పుడిక మీ ముగ్గురిపైనా చర్యలు తప్పవు'అని హెచ్చరించారు. రాహుల్ వెంట ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ నేత ముకేశ్ సహానీ, సీపీఐ ఎంఎల్ నేత దీపాంకర్ భట్టాచార్య ఉన్నారు. యాత్ర సోమవారం సాయంత్రం కుటుంబ నుంచి గయాజీకి చేరుకుంది.

ఓట్ల చోరీకి కొత్త ఆయుధం ఎస్ఐఆర్

బిహార్‌లో ఓట్ల చోరీకి ఈసీ అమలు చేస్తున్న కొత్త ఆయుధం ఎస్ఐఆర్ అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోమవారం ఆయన వాట్సాప్ చానెల్‌లో గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి, తాజాగా బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌లో పేరులేని కొందరితో మాట్లాడిన వీడియోను పోస్ట్ చేశారు. వీరు ఆదివారం సాసారంలో మొదలైన ఓటర్ అధికార్ యాత్రలో పాలుపంచుకున్నారని ఆయన వివరించారు. ప్రస్తుతం వీరు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ నుంచే వీరి గుర్తింపు రద్దయిందని వ్యాఖ్యానించారు. ఇటువంటి పరిస్థితిని తాము పునరావృతం కానివ్వబోమని స్పష్టం చేశారు. అనంతరం ఔరంగాబాద్‌లోనూ ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన వారితో మాట్లాడి, అందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు.

ఎల్ఏసీ వెంట ఉద్రిక్తతలు సడలటమే కీలకం

చైనా విదేశాంగ మంత్రికి జై శంకర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి ఉద్రిక్తతల సమయం ముగిసినందున నిర్మాణాత్మక వైఖరితో భారత్–చైనాలు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, పరస్పర విశ్వాసం, పరస్పర సున్నితత్వం, పరస్పర ప్రయోజనం అనే మూడు సూత్రాలే ఇందుకు ప్రాతిపదిక కావాలని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ కుండబద్దలు కొట్టారు. విభేదాలు వివాదాలుగా, ఘర్షణాత్మక పోటీగా మారకూడదన్నారు. సోమవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీకి ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. తూర్పు లద్దాఖ్‌లోని ఎల్ఏసీ వెంట ఉద్రిక్తతలను రూపుమాపే ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. సుమారు నాలుగేళ్ల పాటు సరిహద్దుల్లోని సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో రెండు దేశాల సైన్యాలు ముఖాముఖి మోహరింపులు కొనసాగుతుండటం తెల్సిందే. రెండు రోజుల పర్యటనకుగాను ఢిల్లీ చేరుకున్న వాంగ్ యీ సోమవారం జై శంకర్‌తో సమావేశమయ్యారు. త్వరలో చైనాలో జరిగే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర భేటీకి ప్రధాని మోదీ హాజరుకానున్న నేపథ్యంలో వాంగ్ యీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెలలో చైనా సందర్శన సమయంలో తాను ప్రస్తావించిన మరో ప్రధాన అంశం ఉగ్రవాదంపై పోరు, ఇతర ప్రత్యేక అంశాలను కూడా తాజా భేటీలో జై శంకర్ ప్రస్తావించారు.

సంస్కరణలపై ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశం

న్యూఢిల్లీ: రాబోయే కాలంలో చేపట్టాల్సిన సంస్కరణలపై చర్చించేందుకు ప్రధాని మోదీ సోమవారం పలువురు కేంద్ర మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, ఆర్థిక వేత్తలతో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా చేసిన పలు కీలక ప్రకటనల్లో సంస్కరణలు కూడా ఉన్నాయి. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయెల్, లాలన్ సింగ్ ఉన్నారు. తర్వాతి తరం సంస్కరణలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, జీఎస్‌టీ చట్టాల సవరణ వంటివి ప్రధాని ఆగస్ట్ 15 ప్రసంగంలో ఉన్నాయి.

ఎస్ఐఆర్‌పై స్తంభించిన సభ

న్యూఢిల్లీ: ఐదురోజుల విరామం తర్వాత మొదలైన పార్లమెంట్ ఉభయసభలు సోమవారం సైతం అదే బిహార్ ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశం (ఎస్ఐఆర్)తో వేడెక్కాయి. ఈ అంశంపై చర్చకు విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో పెద్దగా ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు మొదలుకాగానే కాంగ్రెస్‌సహా పలు విపక్ష పార్టీల ఎంపీలు తమ తమ స్థానాల్లో నిల్చుని ప్లకార్డులు పట్టుకుని ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలని నినాదాలు చేశారు. అయినాసరే ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించినా అది సాధ్యపడలేదు. సభలో మైకులు, సీటింగ్‌సహా ఎలాంటి ఆస్తులు పాక్షికంగా ధ్వంసమైనా కఠిన చర్యలు తీసుకుంటానని స్పీకర్ హెచ్చరించారు. తర్వాత సభను 12 గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలుకాగానే ఓటు చోరీ చేసిన వాళ్లు గద్దె దిగాలి అని విపక్షసభ్యులు నినాదాలు మొదలెట్టారు. అయినాసరే జన్‌విశ్వాస్(సవరణ) బిల్లును సెలక్ట్ కమిటీకి సిఫార్సుచేస్తూ సభాధ్యక్షస్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ సంధ్యారాయ్ నిర్ణయంతీసుకున్నారు. నినాదాలు పెరగడంతో సభలను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలయ్యాక శుభాంశు శుక్లాను అభినందిస్తూ ప్రత్యేక చర్చను లోక్‌సభలో ప్రారంభించినా విపక్ష సభ్యుల ఆందోళనలు ఆగలేదు. ఘన విజయంసాధించిన శుక్లాను అభినందించాల్సింది పోయి విపక్షసభ్యులు గొడవ చేయడం విచారకరమని కేంద్ర శాస్త్ర,సాంకేతిక, భూవిజ్ఞాన మంత్రి జితేంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కొద్దిసేపు అధికార సభ్యులు శుక్లాను పొగిడిన తర్వాత లోక్‌సభ మంగళవారానికి వాయిదాపడింది.

రాజ్యసభలోనూ..

రాజ్యసభలోనూ విపక్ష సభ్యులు ఎస్ఐఆర్ అంశాన్నే ఎత్తుకుని సభాకార్యకలాపాల ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు సభ మొదలైనప్పుడు రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే నిల్చుని ఎస్ఐఆర్‌పై చర్చించాలని డిమాండ్‌చేశారు. ప్రతిసారీ ఇలా సభను అడ్డుకోవడం తగదని రాజ్యసభ నేత జేపీ నడ్డా ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో నిరసనగా విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్‌చేశారు.

పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాల నిరసన

ఎస్ఐఆర్ అంశంపై ఇరుసభల్లో తమ నిరసన తెలిపిన విపక్షపార్టీలు బయటికొచ్చాక పార్లమెంట్ ప్రాంగణంలోనూ తమ నిరసనను కొనసాగించాయి. రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే సారథ్యంలో విపక్ష పార్టీల సభ్యులు 'ఓటు చోరీ చేసిన వాళ్లు గద్దె దిగాలి', 'ఓటు చోరీని ఆపేయాలి'అంటూ నినాదాలు చేశారు. ''ఓటు చోరీని ఆపండి', 'ఎస్ఐఆర్‌ను ఆపాల్సిందే'అని పెద్ద బ్యానర్‌ను పట్టుకుని పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ముందుకు నడిచారు. కాంగ్రెస్, డీఎంకే, వామపక్ష పార్టీలు, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీల ఎంపీలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ మకరద్వారం కుడి వైపున పెద్ద పోస్టర్లు, బ్యానర్లు ఎంపీలు ప్రదర్శించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరుల ఓట్లను ఈసీ ఉద్దేశపూర్వకంగా తొలగించిందంటూ ఎస్పీ చీఫ్ అఖిలేశ్ ఈసీకిచ్చిన అఫిడవిట్ ప్రతులను ఆ పార్టీ ఎంపీలు తోటి ఎంపీలకు పంచారు.

లోక్‌సభలో జన్‌విశ్వాస్ బిల్లు

వేర్వేరు చట్టాల అత్యల్ప నేరాలను పేర్కొనే 288 నిబంధనలను తొలగిస్తూ ఆయా నేరాలను నేరరహితంగా మార్చేస్తూ తీసుకొచ్చిన జనవిశ్వాస్ 2.0 బిల్లును ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. రెండేళ్ల క్రితం సైతం ప్రభుత్వం ఇదే తరహా బిల్లును తెచ్చింది. 19 వేర్వేరు కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలకు సంబంధించిన 42 చట్టాల్లోని 183 నిబంధనల కింద చిన్నపాటి నేరాలుగా పేర్కొనే వాటిని 2023 ఏడాదిలో నేరరహితంగా మార్చేస్తూ బిల్లు తెచ్చారు. సోమవారం తెచ్చిన బిల్లును పరిశీలన కోసం సెలక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు.

ఆ 65 లక్షల ఓటర్ల జాబితా వెల్లడించిన ఈసీ

పట్నా: బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితా వివరాలు, పేర్లను అందరికీ అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. బిహార్ రాష్ట్ర ఎన్నికల అధికారి, బిహార్ అన్ని జిల్లాల ఎన్నికల అధికారుల అధికారిక వెబ్‌సైట్లలో ఈ జాబితా అందుబాటులో ఉందని బిహార్ ప్రధాన ఎన్నికలఅధికారి వినోద్ సింగ్ గుంజియాల్ చెప్పారు. ''2025 ఏడాది ఓటర్ల జాబితాలో ఈ 65 లక్షల ఓటర్ల పేర్లు ఉన్నాయి. కానీ ఎస్ఐఆర్ మొదలయ్యాక మరణాలు, శాశ్వత వలసలు, జాడ లేకపోవడం, రెండు చోట్ల ఓటు కల్గిఉండటం వంటి కారణాలతో ఈ 65 లక్షల పేర్లను ముసాయిదాజాబితా నుంచి తొలగించాం. అయితే తాజాగా సుప్రీంకోర్టు ఆగస్ట్ 14న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులకు లోబడి ఆ 65 లక్షల ఓటర్ల జాబితాను ఇప్పుడు వెబ్‌సైట్లలో ఉంచాం. ముసాయిదా జాబితాలో పేర్లు గల్లంతైన వాళ్లు ఈ 65 లక్షల డేటాలో తమ పేర్లు వెతికి, తొలగింపునకు గల కారణాలను తెల్సుకోవచ్చు. ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఎపిక్) నంబర్ సాయంతో ఈ జాబితాలోని పేర్లను వెతికి తెల్సుకోవచ్చు. ఎపిక్ నంబర్ లేకుంటే నియోజకవర్గాల వారీగా బూత్‌ల వారీగా సైతం వెతుక్కోవచ్చు'' అని వినోద్ చెప్పారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం। 19। ఆగస్టు। 2025



సర్వ హంగులు.. సదుపాయాలు..
గ్రేటర్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌–రిజిస్ట్రార్ ఆఫీసుల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రిజిస్ట్రార్ ఆఫీసులు ఇక కార్పొరేట్ స్థాయిలో ఉంటాయి. -8లో



కబూతర్.. ఖానా కహానీ..
ప్రేమ చిహ్నాలుగా వర్ధిల్లిన పావురాలే పలు రకాల వైరస్ వ్యాప్తికి కారకాలుగా మారుతున్నాయి. దీంతో వాటికి ఆహారాన్ని అందించడాన్ని ముంబై, పుణె వంటి నగరాలు నిషేధించాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
27.0/21.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 27, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

గొంతు కోసి.. కడుపులో పొడిచి..


సహస్రిని (ఫైల్)

కూకట్‌పల్లిలో 11 ఏళ్ల బాలిక దారుణ హత్య


రోదిస్తున్న బాలిక తల్లి రేణుక, బంధువులు

- తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఘటన
- ఎవరు..ఎందుకు చంపారో తెలియక అయోమయం
- తల్లడిల్లిన తల్లిదండ్రులు, బంధువులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో సోమవారం దారుణం చోటుచేసుకుంది. అభం శుభం తెలియని 11 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా గొంతుకోసి..కడుపులో కత్తితో పొడిచి చంపేశారు. ఇలా ఎందుకు..ఎవరు ఇంత కసిగా హత్య చేశారో తెలియరాలేదు. కూకట్‌పల్లి పోలీసులు తెల్పిన మేరకు..సంగారెడ్డి జిల్లా, మునిపల్లి మండలం, ముక్త క్యాసారం గ్రామానికి చెందిన కృష్ణ, రేణుక దంపతులు దయార్‌గూడలో ఓ పెంట్ హౌస్‌లో నివాసం ఉంటున్నారు. కృష్ణ సనత్‌నగర్‌లోని బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండగా తల్లి రేణుక ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నది. వీరికి కుమార్తె సహస్రిని (11), కుమారుడు సాద్విన్(9) ఉన్నారు. సహస్రిని బోయిన్‌పల్లిలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 6వ తరగతి చదువుతుంది. సోమవారం ఉదయం 9 గంటలకు తల్లిదండ్రులు ఉద్యోగాల నిమిత్తం బయటకు వెళ్లిపోయారు. సాద్విన్ పాఠశాలకు వెళ్లాడు. సహస్రినికి పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ ఉండటంతో గత నాలుగు రోజుల నుంచి ఇంటి వద్దే ఉంటున్నది. కాగా మధ్యాహ్నం 12 గంటలకు సాద్విన్ చదువుతున్న పాఠశాల నుంచి బాబుకు లంచ్ బాక్స్ తేలేదని తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. దీంతో తల్లి రేణుక వేరే వారికి ఫోన్ చేసి లంచ్‌బాక్స్ రెడీ చేసి స్కూల్‌కు పంపాలని కుమార్తెకు చెప్పడానికి పంపించింది. అయితే ఇంటి తలుపు మూసి ఉందని, ఎవరూ లేరని తల్లికి చెప్పటంతో ఆమె కృష్ణకు ఫోన్ చేసి ఇంటికి వెళ్లి లంచ్ బాక్స్ ఇచ్చి రమ్మని చెప్పింది. కృష్ణ ఇంటికి వెళ్లి చూడగా కుమార్తె సహస్రిని మంచంపై రక్తపు మడుగులో పడి ఉంది. దీంతో భార్యకు, పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌తో వచ్చి పరిసరాలను క్షుణ్ణం పరిశీలించి, ఆధారాలు సేకరించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే సహస్రిని ఎవరితో గొడవలు పెట్టుకోదని, అందరితో కలివిడిగా ఉంటుందని, పాఠశాల దూరంగా ఉండటంతో దగ్గరలో స్నేహితులు కూడా ఎవరూ లేరని తల్లి రేణుక తెలిపింది. నా బిడ్డను ఎందుకు చంపారో.. ఏమో అంటూ ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. ఎవరికి ఏ అపకారం, అన్యాయం చేయని మాకు ఈ కడుపుకోత ఎందుకు అంటూ కన్నీటి పర్యంతమైంది. పాప స్కూల్‌కు వెళ్లినా బతికుండేది కదా అంటూ విలపించింది. సహస్రిని కడుపులో మూడు కత్తి గాట్లు, గొంతు కోసినట్లు గాయాలు కనిపిస్తున్నాయని పోలీసులు తెలిపారు. దొంగతనం కోసం కానీ, మరే కారణంతో కానీ బాలికను చంపి ఉండవచ్చనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎందుకోసం, ఎవరు పాపను చంపారన్న వివరాలు దొరకలేదని, సీసీ కెమెరాలు కూడ సరిగ్గా లేవని, దర్యాప్తు తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

తెలిసిన వారి పనే?

కాగా కృష్ణ దంపతులు నివసిస్తున్న భవనంలో రెండు అంతస్తులు, ఓ పెంట్ హౌస్ ఉంది. పెంట్‌హౌస్‌లో వీరు నివసిస్తున్నారు. శని, ఆదివారాల్లో సెలవులు కావటంతో సోమవారం పాప ఒక్కతే ఉందన్న విషయం ఎవరికి తెలిసి ఉంటుందోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. బాలిక ఒంటరిగా ఉందనే విషయం తెలిసిన వ్యక్తే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని భావిస్తున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంఘటనా స్థలానికి వెళ్లి చిన్నారి తల్లిని పరామర్శించి, ఓదార్చారు. పోలీసులు నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, పాప తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు.

రెండో దశపై ముందడుగు

ఎల్ అండ్‌టీతో 'ఎయిర్‌పోర్టు మెట్రో' అవగాహన ఒప్పందం

- మొదటి, రెండో దశ మార్గాలపై సమన్వయానికి కసరత్తు
- టికెట్ చార్జీలు, విద్యుత్ వినియోగం, సాంకేతిక సహకారం
- త్వరలో నియమ నిబంధనలు ఖరారు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండోదశపై కేంద్రం ప్రస్తావించిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యల పరిష్కారం దిశగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ (హెచ్ఏఎంఆర్ఎల్) చర్యలు చేపట్టింది. రెండో దశ అనుమతులపైన లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేసేందుకు ఒక వైపు కేంద్రంతో సంప్రదింపులు జరపడంతో పాటు మరోవైపు మెట్రో మొదటి దశ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీతో అవగాహన ఒప్పందం ఏర్పాటు చేసుకునేందుకు కసరత్తును ప్రారంభించింది. రెండోదశలో మొత్తం 'ఏ' 'బి' విభాగాలుగా మొత్తం 8 మార్గాల్లో మెట్రో విస్తరణకు హెచ్ఏఎంఆర్ఎల్ డీపీఆర్‌లను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో 10 నెలల క్రితమే కేంద్రం అనుమతి కోసం ఈ డీపీఆర్‌లను అందజేశారు. కానీ ఇప్పటి వరకు కేంద్రం నుంచి అనుమతులు లభించలేదు. అదే సమయంలో పీపీపీ పద్ధతిలో నిర్మించి మెట్రో మొదటి దశ మార్గాలకు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టుగా నిర్మించనున్న రెండోదశ మార్గాలకు మధ్య సమన్వయంపైన పలు అంశాలను ప్రధానంగా ప్రస్తావించింది. మొదటి, రెండో దశల మధ్య సాంకేతిక సమన్వయం, టికెట్ చార్జీల పంపకాలు, విద్యుత్ వినియోగం, మౌలిక సదుపాయాలు ముఖ్యమైనవి. ఈ సమస్యల పరిష్కారానికి అనుసరించనున్న విధివిధానాలపైన హెచ్ఏఎంఆర్ఎల్ అధికారులు ఇప్పటికే కేంద్రప్రభుత్వ ఉన్నతాధికారులకు సమగ్రమైన వివరాలను అందజేశారు. మరోవైపు ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అదే సమయంలో ఎల్అండ్‌టీతో కూడా సంప్రదింపులను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సంప్రదింపులపైన స్పష్టత వచ్చిన వెంటనే ఎల్అండ్‌టీ, హెచ్ఏఎంఆర్ఎల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంది. త్వరలోనే ఈ దిశగా కార్యాచరణ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఖర్చులు, పంపకాలే కీలకం....

- ప్రస్తుతం ఎల్బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గం, జేబీఎస్–ఎంజీబీఎస్ 3 మార్గాల్లో 69 కి.మీ.మేర మెట్రో రైలు అందుబాటులో ఉంది. రెండో దశలో ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్–ఎయిర్‌పోర్ట్, రాయదుర్గం–అమెరికన్ కాన్సులేట్, ఎల్బీనగర్–హయత్‌నగర్, సికింద్రాబాద్–మేడ్చల్, సికింద్రాబాద్–శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్–భారత్ ఫ్యూచర్‌సిటీ, తదితర 8 మార్గాల్లో సుమారు 116 కి.మీ.లకు పైగా నిర్మించనున్నారు. ఈ క్రమంలో మొదటి దశ లైన్లు, రెండోదశ లైన్ల నిర్వహణపైన నిబంధనలు రూపొందించుకోవలసి ఉంది.
- అలాగే టిక్కెట్ చార్జీల పంపకాలు ఎలా ఉండాలనేది కూడా మరో ముఖ్యమైన అంశం. మొదటిదశలో కేవలం 69 కి.మీ.లే రైళ్లు తిరుగుతున్నాయి. రెండోదశలో 116 కిలోమీటర్లకు పైగా అందుబాటులోకి రానుంది.ఈ క్రమంలో అటు ఎల్అండ్‌టీకి, ఇటు ప్రభుత్వానికి మధ్య చార్జీల పంపకాలు కీలకం కానున్నాయి.
- రైళ్లను నడిపేందుకు అయ్యే ఖర్చులను ఎల్అండ్‌టీ, ప్రభుత్వాలు ఏ పద్ధతి ప్రకారం భరిస్తాయనేది మరో ముఖ్యమైన అంశం.

ఒప్పందం కుదిరితేనే అనుమతులు....

కేంద్రం లేవనెత్తిన వివిధ అంశాలపైన సమగ్రమైన ఒప్పందం కుదిరిన తరువాత మాత్రమే కేంద్రం నుంచి అనుమతులు లభించే అవకాశం ఉంది. బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రోలను చేపట్టిన దృష్ట్యా రెండో, మూడో దశ అనుమతులపైన సాంకేతికంగా ఎలాంటి ఆటంకాలు తలెత్తలేదు, కానీ హైదరాబాద్ మెట్రో మొదటి దశ పీపీపీ పద్ధతిలో చేపట్టారు. ఇప్పుడు రెండో దశను రెండు ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా నిర్మించనున్నారు. ఈ క్రమంలోనే ఎల్అండ్‌టీతో అవగాహన తప్పనిసరైంది.









సర్దార్ పాపన్నకు సాంస్కృతిక నివాళి

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు సోమవారం రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సంప్రదాయ నృత్యాలు, దప్పు కళాకారుల విన్యాసాలు అబ్బురపరిచాయి.
- సాక్షి, సిటీబ్యూరో

మృత్యుపాశాలు!

నెత్తిన వేలాడుతున్న విద్యుత్ వైర్లు

స్తంభాలకు ఉరితాళ్లుగా మారిన కేబుళ్లు

- లైన్ల పునరుద్ధరణ కోసం ఏటా రూ.వంద కోట్లకుపైనే ఖర్చు
- అయినా మెరుగుపడని పంపిణీ వ్యవస్థ..తరచూ తెగిపడుతున్న వైర్లు
- రెండు నెలల క్రితం ఎల్బీనగర్‌లో లైన్లు తెగిపడి ఇద్దరు యాచకులు సజీవ దహనం
- తాజాగా రామంతాపూర్ ఘటనలో ఐదుగురు మృతి..అయినా బాధ్యులపై చర్యలు శూన్యం

- జూన్ 15న సరూర్‌నగర్ డివిజన్ చింతల్‌కుంట ఫీడర్‌కు సంబంధించిన 11 కేవీ పోల్‌పై పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని మెటల్ రాడ్డు విరిగి, హైటెన్షన్ విద్యుత్ కేబుల్ తెగిపడటంతో సాగర్‌రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ దేవాలయం ఫుట్‌పాత్‌పై నిద్రపోతున్న ఇద్దరు యాచకులు (మహిళ, పురుషుడు) సహా ఓ శునకం విద్యుత్‌ఘాతంతో సజీవ దహనమయ్యారు.
- ఈ ఘటనను మర్చిపోక ముందే తాజాగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రామంతపూర్‌లో శ్రీకృష్ణ శోభాయాత్ర వేడుకల్లో ఐదుగురు మృత్యువాతపడటం ఆందోళన కలిగిస్తోంది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే గ్రేటర్ పరిధిలో ఎనిమిది మంది విద్యుత్‌షాక్‌తో మృతి చెందడాన్ని పరిశీలిస్తే...డిస్ట్రిబ్యూషన్ లైన్లు, సరఫరా వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సాక్షి, సిటీబ్యూరో

వినియోగదారుల ఇళ్లలో వెలుగులు నింపాల్సిన విద్యుత్ లైన్లు..సిటిజన్ల జీవితాల్లో చీకట్లను మిగుల్చుతున్నాయి. నెత్తిన మృత్యుపాశాల్లా వేలాడుతున్న వైర్లు ఎప్పుడు..ఎవరిపై తెగిపడతాయో తెలియని దుస్థితి. ఎలాంటి ఈదురు గాలులు, వర్షాలు లేకపోయినప్పటికీ..వైర్లు తెగి పడుతుండటాన్ని పరిశీలిస్తే..డిస్ట్రిబ్యూషన్ లైన్ల వ్యవస్థ ఎంత వీక్‌గా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం డిస్కం ఏటా రూ.వంద కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. అయినా ప్రమాదాలు తగ్గకపోగా మరింత పెరుగుతుండటం, అమాయకులు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతుండటాన్ని పరిశీలిస్తే..గ్రేటర్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో ఇట్టే తెలిసి పోతోంది. అయితే విద్యుత్ ఇంజనీర్లు మాత్రం తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు భిన్న వాదనలను ముందుకు తెస్తున్నారు. గుర్తు తెలియని ఓ వాహనం స్తంభాన్ని ఢీ కొట్టడం వల్లే సాగర్‌రోడ్డులో వైర్లు తెగిపడినట్లు గతం లో చెప్పగా, తాజాగా 11 కేవీ వైర్ల మీది నుంచి కిందికి వేలాడుతున్న వినియోగంలో లేని ఓ టీవీ కేబులే ఈ ప్రమాదానికి కారణమని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఏటా రూ.వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నా..

నగరంలోని పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ వైర్లు తెగిపడు తుండటంతో పాటు స్తంభాలను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, లూజు లైన్లు సరిచేయడం, దెబ్బతిన్న పిన్ ఇన్సులేటర్లను మార్చడం, పాడైన ఫ్యూజ్ బాక్సులను మార్చ డం, డీటీఆర్‌ల వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. కంపెనీ కేటాయించిన నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయో కానీ..సరఫరా వ్యవస్థ మాత్రం ఏమాత్రం మెరుగుపడటం లేదు. విద్యుత్ ప్రమాదాలు ఆగడం లేదు. గత ఏడాది జులై నుంచి అక్టోబర్ వరకు సెక్షన్ల వారీగా టీజీ గెయిన్స్(జీఐఎస్ అసెట్ ఇన్స్‌పెక్షన్ అండ్ మేనేజ్మెంట్) పేరుతో సర్వే చేయించారు. దెబ్బతిని వంగిన స్తంభాలు, కిందికి వేలాడుతున్న వైర్లు, లూజ్ కాంటాక్ట్‌లు, ఎలాంటి రక్షణ లేని డీటీఆర్‌లు, ఫ్యూజ్‌బాక్స్‌లు, రింగ్ మెయిన్ యూనిట్లు, ఏబీ స్విచ్‌లు, హెచ్‌జీ ఫ్యూజ్ బాక్స్‌లు 4.50 లక్షల వరకు ఉన్నట్లు గుర్తించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కొన్ని పనులు చేపట్టినట్లు చెప్పుతున్నా..క్షేత్రస్థాయిలో ప్రమాదాల సంఖ్య మాత్రం తగ్గలేదు. మెట్రోజోన్ పరిధిలోని పలు బస్తీల్లోని ఇరుకు గల్లీల్లో ప్రమాదకరంగా మారిన కండక్టర్‌ల స్థానంలో ఎయిర్ బంచ్డ్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు 550 కిలోమీటర్లు గుర్తించి, ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభించలేదు.

ఉరి తాళ్లుగా మారిన కేబుళ్లు

ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కండక్టర్లు, స్తంభాలు తెగి పడుతుంటే..మరో వైపు వాటి మెడకు టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు ఉరితాళ్లుగా మారుతున్నాయి. ఏ స్తంభాన్ని పరిశీలించినా..పెద్ద మొత్తంలో వైర్లు వేలాడుతూ కన్పిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా స్తంభాలకు జంక్షన్ బాక్సులను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి ఇల్లీగల్‌గా కరెంట్ వాడుతున్నారు. ఇదిలా ఉంటే భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతుండటం, అటు ఇటుగా ఉన్న స్తంభాలు విరిగిపడుతున్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నేలకూలుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తు విద్యుత్ అంతరాయాలకు కారణమవుతున్నా..ఆపరేటర్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.


ఖైరతాబాద్‌లోని మారుతినగర్‌లో విద్యుత్ స్తంభాల పరిస్థితి ఇదీ..

భూగర్భ విద్యుత్ లైన్లు ఎప్పుడో?

నగరంలో ప్రతిపాదనలకే పరిమితమైన వైనం..

- రూ.15 వేల కోట్లు అవసరం ఉన్నట్లు అంచనా
- నిధుల లేమితో వెనుకడుగు.. ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- తరచూ తెగిపడుతున్న ఓవర్‌హెడ్ లైన్లు.. మృత్యువాతపడుతున్న సిటిజన్లు


సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రధాన రహదారులు, వీధుల్లో వేలాడుతున్న ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను తొలగించి, వాటి స్థానంలో భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. ఆ మేరకు సెక్షన్ల వారీగా ఫీడర్ల వివరాలను సేకరించింది. ఒక్కో సెక్షన్‌కు రూ.వంద కోట్ల చొప్పున గ్రేటర్ వ్యాప్తంగా ఇందుకు రూ.15 వేల కోట్లకుపైగా అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసింది. మెట్రోజోన్ పరిధిలోని హైదరాబాద్ సెంట్రల్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో డిస్ట్రిబ్యూషన్ లైన్లు మినహా 33/11 కేవీ లైన్ల పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఇక మేడ్చల్ (హబ్సిగూడ, మేడ్చల్ సర్కిల్), రంగారెడ్డి (సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్) జోన్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇప్పటికీ ఓహెచ్ (ఓవర్ హెడ్ లైన్లే) కన్పిస్తున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి తరచూ తెగిపడుతూ..అటుగా వచ్చి వెళ్లేవారిపై పడి అమాయక ప్రజల మృత్యువాతకు కారణమవుతున్నాయి. ప్రమాదాలను నియంత్రించడంతో పాటు వేలాడే కరెంట్ తీగలు కన్పించని నగరంగా తీర్చిదిద్దాలని భావించి..ఆ మేరకు నగరమంతా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇటీవలే ఉపముఖ్య మంత్రి భట్టి నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం బెంగళూరులో పర్యటించి, ఆ మేరకు భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను పరిశీలించింది. సెక్షన్ల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడంతో ప్రాజెక్ట్ విభాగం సమగ్ర నివేదికను సిద్ధం చేసింది.

ప్రతిపాదన దశలోనే ఆ పనులు..

గ్రేటర్‌లో ప్రస్తుతం 63 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం రోజు గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 65 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి ఈదురుగాలితో కూడిన వర్షానికే తెగిపడుతున్నాయి. విద్యుత్ అంతరాయాలకే కాకుండా అనేక మంది మృత్యువాతకు కారణమవుతున్నాయి. లైన్ల కింద అనేక చోట్ల భారీ భవంతులు వెలిశాయి. ఇంటిపై దుస్తులను ఆరవేసేందుకు వెళ్లిన మహిళలు, పతంగులను ఎగరేసేందుకు వెళ్లిన పిల్లలు ఓవర్ హెడ్ లైన్‌కు ఆనుకుని విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్న విషయం తెలిసిందే. ఓవర్‌హెడ్‌లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చొచ్చని డిస్కం భావించినప్పటికీ..ఇందుకు సంస్థ వద్ద సరిపడు నిధులు లేకపోవడం పనులకు విఘాతంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఏదైనా స్కీం ప్రకటించి నిధులు కేటాయిస్తే మినహా..ఇప్పట్లో ఈ పనులు మొదలయ్యే పరిస్థితి లేదు.

గ్రేటర్‌లో డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ ఇలా..

33/11 కేవీ సబ్‌స్టేషన్లు	498
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,022
33 కేవీ యూజీ కేబుల్స్	1,280 కిలోమీటర్లు
33 కేవీ ఓవర్ హెడ్‌లైన్స్	3,725 కిలోమీటర్లు
11 కేవీ ఓవర్ హెడ్‌లైన్స్	21,643 కిలోమీటర్లు
11 కేవీ యూజీ కేబుల్	957 కిలోమీటర్లు
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,50,992
ఇంటర్మీడియట్ స్తంభాలు	5,08,271



మైత్రీవనం వద్ద వరద ఉధృతిని ఆపేదెలా!

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్


నాలాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

బంజారాహిల్స్: అమీర్‌పేట మెట్రోస్టేషన్, మైత్రీవనం వద్ద వరద ఉధృతిని ఆపేదెలా అనే అంశంపై హైడ్రా దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా ట్రంక్‌లైన్ ఏర్పాటుచేయడంతో పాటు తాత్కాలిక ఉపశమనానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై హైడ్రా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం అమీర్‌పేట మైత్రీవనం పరిసరాల్లో వరద కాలువలకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. అనంతరం కృష్ణకాంత్ పార్కులోని చెరువును, వరద కాలువలను తనిఖీ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10, వెంకటగిరి, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ ప్రాంతాల నుంచి కృష్ణకాంత్ పార్కు మీదుగా పారే వరద కాలువలను పరిశీలించారు. కృష్ణకాంత్ పార్కులో ఉన్న చెరువును కూడా తనిఖీ చేశారు. పైనుంచి భారీ ఎత్తున వస్తున్న వరదను కృష్ణకాంత్ పార్కులోని చెరువుకు మళ్లిస్తే చాలావరకు వరద ఉధృతిని కట్టడి చేయవచ్చనే అభిప్రాయానికి హైడ్రా కమిషనర్ వచ్చారు.

రాచకాలువను పునరుద్ధరిస్తాం

ఎల్‌బీనగర్: రాచకాలువను ఆక్రమించిన వారిని ఉపేక్షించేదిలేదని, కాలువను పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బృందావన్ మెడోస్‌కాలనీలో కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీ, 36 ఫీట్ల రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని, పనులను రెండు మూడు రోజుల్లో ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం జక్కిడి రామస్వామికాలనీని పరిశీలించి వరదకాలువ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

సర్వ హంగులు.. సకల సదుపాయాలు...

గ్రేటర్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులు	కార్పొరేట్ స్థాయిలో భవన సముదాయాలు	11 సమీకృత భవనాల్లో 39 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు	20న గచ్చిబౌలిలో సీఎం చేతులు మీదుగా శంకుస్థాపన

సాక్షి,సిటీబ్యూరో : స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ఏర్పాటుకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ చర్యలకు ఉపక్రమించింది. గ్రేటర్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించి సమీకృత భవన సముదాయాలు నిర్మించాలని నిర్ణయించింది.

11 సమీకృత భవన సముదాయాలు..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకొచ్చేందుకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేట్టింది. తొలివిడతలో రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ భవన సముదాయాన్ని నిర్మించనుంది. అందులో రంగారెడ్డి ఆర్వో ఆఫీస్, గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ కార్యాలయాల



కార్యాకలాపాలు నిర్వహించే విధంగా ఏర్పాటు చేస్తోంది. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల భవన సముదాయానికి ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగే విధంగా రంగం సిద్ధం చేసింది.

ఇంకా ఎక్కడెక్కడ నిర్మిస్తారంటే..

- నగర శివారులోని కోహెడలో అబ్దుల్లాపూర్, పెద్ద అంబర్ పేట్, హయత్‌నగర్, వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని నిర్మించనున్నారు.
- మంకాల్‌లో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల కోసం..
- బోడుప్పల్ లో ఆర్వో మేడ్చల్, కుత్బుల్లాపూర్, కీసర, శామీర్‌పేట్ కార్యాలయాల కోసం
- కండ్లకోయలో ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరికి..
- బంజారాహిల్స్‌లో బంజారాహిల్స్, ఎస్.ఆర్. నగర్, గొల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల కోసం..
- మలక్‌పేటలో ఆజంపూరా, చార్మినార్, దూద్‌బౌలి సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాలను నిర్మించాలని నిర్ణయించింది.
- మరో పదమూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం నాలుగు చోట్ల ఇంటిగ్రేటెడ్ భవనాల కోసం స్థలాలను గుర్తింపు కోసం రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు జిల్లా కలెక్టర్లకు లేఖ రాసినట్లు తెలుస్తోంది.

విద్యార్థుల ప్రతిభకు ప్రశంసాపత్రాలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, సిటీ బ్యూరో: ప్రభుత్వ పాఠశాలలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం తో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులను జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అందజేశారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు, ఇంటర్మీడియట్‌లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులు కింద పదివేలు చొప్పున జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవాన్ పలని, జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి పాల్గొన్నారు.

కిటికీకి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు

- రిహాబిలిటేషన్ కేంద్రంలో దారుణం..
- దెబ్బలకు తాళలేక వ్యక్తి మృతి


కృష్ణాగౌడ్ (ఫైల్)

కీసర: రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్సకు చేరిన ఓ వ్యక్తిని అక్కడ పనిచేసే ఉద్యోగి దారుణంగా కొట్టడంతో మృతి చెందాడు. ఈ దారుణం నాగారంలో చోటు చేసుకుంది. కీసర సీఐ ఆంజనేయులు తెలిపిన మేరకు.. మల్కాజిగిరి వినాయక్ నగర్‌కు చెందిన కృష్ణగౌడ్(50)ను కుటుంబ సభ్యులు నాగారంలోని జ్యోతి పునరావస కేంద్రంలో చేర్పించారు. ఆదివారం రాత్రి కేంద్రంలోని రాజశేఖర్‌తో కృష్ణగౌడ్‌కు వాగ్వివాదం జరిగింది. దీంతో రెండో అంతస్తు ఇన్‌చార్జీ ఖయ్యూమ్ కృష్ణగౌడ్‌ను మూడో అంతస్తుకు తీసుకెళ్లి కిటికీకి కట్టేసి చాతిపై తీవ్రంగా కొట్టాడు. స్వామి అనే వ్యక్తి ఇందుకు సహకరించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని మంచంపై పడుకోబెట్టారు. సోమవారం తెల్లవారు జామున వెళ్లి చూసే సరికి కృష్ణగౌడ్ మృతి చెందాడు.దీంతో ఖయ్యూమ్ వెంటనే పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మద్యం మాన్పించాలని కేంద్రంలో చేర్పిస్తే తన భర్తను దారుణంగా కొట్టి చంపారని, తన భర్త హత్యకు కారకులైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని మృతుడి భార్య వాపోయింది. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ముగ్గురి బలవన్మరణం

వేర్వేరు చోట్ల ఘటనలు: తమకు కష్టమొచ్చిందని వారు బాధపడ్డారు..ఎవరూ తీర్చడం లేదని రోదించారు.. అందుకే ఈ లోకంలో ఉండకూడదని నిర్ణయించుకున్నారు.. బలవంతంగా ప్రాణం తీసుకున్నారు. వివిధ పోలీస స్టేషన్ల పరిధిలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ..

లాలాపేట: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు తెలిపిన మేరకు.. హబ్సిగూడలో ఎంపీడీఓ వెంకయ్య గౌడ్, భార్య ఉషా(37), ఇద్దరు ఆడపిల్లలతో నివాసం ఉంటున్నారు. ఆదివారం భర్త వెంకయ్య గౌడ్ ఓ వివాహానికి వెళ్లాడు. పిల్లలు అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. కుటుంబగొడవల కారణంగా మనస్తాపం చెందిన ఉషా ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్‌కు ఉరివేసుకొని వ్యక్తి..

పోచారం: సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.పోచారం ఐటీ కారిడార్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన మేరకు.. అంబర్‌పేట్‌లోని మల్లికార్జున నగర్‌కు చెందిన పగడాల నవీన్‌కుమార్ కుటుంబంతో కలిసి చౌదరి గూడలోని మక్తలో నివసిస్తున్నారు. సోమవారం ఉదయం నవీన్ భార్య సరిత బోడుప్పల్‌లోని టెస్లా హాస్పిటల్‌కు ఆమె తల్లిని తీసుకెళ్లారు. ఇంట్లో నవీన్ తన తల్లిదండ్రులతో పాటే ఉన్నాడు. మధ్యాహ్నం హాస్పిటల్ నుండి సరిత ఇంటికి రాగా నవీన్ తల్లిదండ్రులు మాస్టర్ బెడ్‌రూమ్‌లో ఉండగా బయటి నుండి గడియ పెట్టి ఉండటం చూసింది. మరో బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకుని భర్త నవీన్ వేలాడుతూ ఉన్నాడు. రక్షించుకోవాలనే తొందరలో చాకుతో లుంగీని కట్ చేస్తుండగా దురదృష్టవశాత్తు నవీన్ కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి మృతి చెందాడు.

వరకట్న వేధింపులు తాళలేక గృహిణి..

చందానగర్: వరకట్న వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. శేరిలింగంపల్లి గోపన్‌పల్లికి చెందిన రాజుకు కావ్య (29)తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. రాజు సెక్యూరిటీ గార్డుగా, కావ్య ఇండ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లి జరిగినప్పటికి నుంచి కావ్యను భర్త రాజు వరకట్నం కోసం హింసించేవాడు. భర్త కుటుంబసభ్యులు కూడా వేధించేవారు. దీంతో కావ్య 17న ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి బంధువులు సోమవారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. వరకట్న వేధింపులవల్లే కావ్య ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు.

మూసీలో దూకిన డేటా ఎంట్రీ ఆపరేటర్

కాచిగూడ: భార్య చనిపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన డేటా ఎంట్రీ ఆపరేటర్ మూసీలో దూకాడు. కాచిగూడ పోలీస్ స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపిన మేరకు.. చాదర్‌ఘాట్‌కు చెందిన కిరణ్ గౌడ్ (47) అబిడ్స్‌లోని పే అండ్ అకౌంట్స్ లో డేటా ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం భార్య చనిపోయింది. అప్పటి నుంచి కిరణ్ గౌడ్ మానసిక ప్రవర్తన సరిగా ఉండటం లేదు. సోమవారం సాయంత్రం చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద మూసీలోకి దూకాడు. వరద ఉధ్రుతంగా ఉండడంతో నీటిలో కొట్టుకుపోయాడు.

డబ్బులివ్వలేదని కిడ్నాప్ చేశారు!

- బండ్లగూడలో దారుణం
- కుటుంబసభ్యులకు వీడియోకాల్ చేసి బెదిరింపులు


కిడ్నాప్‌కు గురైన షేక్ షా వలీ

చాంద్రాయణగుట్ట: హిజ్రాలతో జత కట్టిన రౌడీషీటర్లు ఓ వ్యక్తిని బండ్లగూడలో కిడ్నాప్ చేసి జల్‌పల్లిలో నిర్బంధించారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు...శ్రీరాం కాలనీ శివాజీ విగ్రహ సమీపంలోని ఓ ఇంటిని కొన్నాళ్లుగా హిజ్రాలు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. వీరికి చాంద్రాయణగుట్టకు చెందిన ఆటోడ్రైవర్ సమీర్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే రౌడీషీటర్లైన ఆమేర్, ఉమర్‌లు కూడా వీరితో కలిసి తరచూ పార్టీలు జరుపుకుంటుంటారు. ఆదివారం అర్ధరాత్రి కొంతమంది మైనర్లతో కలిసి వీరు బండ్లగూడ నూరీనగర్ మీదుగా వెళుతున్న షేక్ షా వలీ అనే యువకుడిని డబ్బు డిమాండ్ చేశారు. తన వద్ద లేవని అతడు వెల్లడించడంతో కిడ్నాప్ చేసి కాటేదాన్ పరిసరాలలో తిప్పుతూ శ్రీరాం కాలనీలోని హిజ్రాల నివాసానికి తీసుకెళ్లి నిర్బంధించారు. రౌడీషీటర్ బాధితుడి కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి తీవ్రంగా బెదిరించాడు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు ఉదయాన్నే శ్రీరాం కాలనీకి వెళ్లి బాధితుడిని విడిపించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్న నిందితులు అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసుల పైకి ఎదురు తిరుగడంతో శ్రీరాం కాలనీ వాసులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనపై మంగళవారం పోలీసులు మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

ఆస్పత్రి అంటే అవయవాల వ్యాపారమా?

గ్రేటర్ పరిధిలో ప్రైవేట్ ఆసుపత్రులపై పర్యవేక్షణ కరవు

- మూడు జిల్లాల డీఎంహెచ్‌ఓలు ఎవరిదారి వారిదే
- అనుమతులు లేకున్నా దర్జాగా ఆసుపత్రుల నిర్వహణ
- కిందిస్థాయి సిబ్బంది వసూళ్లు, పెద్దలకు ముడుపులు
- మెడికల్ కౌన్సిల్‌కు సహకరించని ఆరోగ్యశాఖ అధికారులు

- సరూర్‌నగర్, సైదాబాద్‌లోని నాలుగు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా కిడ్నీ దందా జరుగుతున్న క్రమంలో ఓ వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించారు. అక్రమ వ్యవహారం గుట్టురట్టయ్యింది.
- సృష్టి సరోగసి సెంటర్‌ను మూసివేయాలని ఆదేశాలు ఉన్నప్పటికి సుమారు నాలుగేళ్ల పాటు అనధికారికంగా ఆసుపత్రిని నడిపించారు. ఏటా తనిఖీలకు వెళ్లిన వైద్యాధికారులు మూసి ఉందని తప్పడు నివేదికలు అందించడం వెనుక ఆంతర్యం ఏంటనే ప్రశ్నలు మొదలవుతున్నాయి.
- 'సృష్టి' అకృత్యాలు మరవకముందే పేట్‌బషీరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మరో అక్రమ సరోగసి బాగోతం బయటపడింది. ఇలా వచ్చిన ఫిర్యాదుల్లో పోలీసు విచారణలో బండారం బయటపడుతోందే తప్ప ఆరోగ్యశాఖ తనిఖీలు, చర్యలు శూన్యంగానే కనిపిస్తున్నాయి.



సాక్షి సిటీబ్యూరో: నగరంలోని పలు ఆసుపత్రులు అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. అమ్మతనం నుంచి అవయవాల వరకు అన్ని రకాలుగా అమ్ముకుంటున్నారు. ఇదే వారి ప్రధాన వ్యాపారంగా చేసుకుంటున్నారు.ఈ క్రమంలో మధ్యవర్తులు, ఆసుపత్రి నిర్వాహకులు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. దొరికితే దొంగ లేకుంటే దొర అన్నట్లు సమాజంలో చెలామణి అవుతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్య శాఖ అధికారులకు మాత్రం కనిపించడం లేదంటే వారిలో విధుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆసుపత్రులపై తనిఖీలు చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జిల్లాలు ఉన్నాయి. ముగ్గురు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు(డీఎంహెచ్‌ఓ), మూడు వ్యవస్థలు పనిచేస్తున్నాయి. విధి నిర్వహణలో ఒకరికికొకరు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా డీఎంహెచ్‌ఓల పరిధిలో సుమారు 4 వేల వరకు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి.వాటిని తనిఖీ చేయాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తిపడుతున్నారు. వైద్యారోగ్య శాఖలోని కొంత మంది సిబ్బంది ఉన్నతాధికారులకు అక్రమార్కులకు మధ్య మధ్యవర్తులుగా మారిపోయారు. కలెక్షన్లు చేయడం, పంపిణీ చేసుకోవడానికే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శాఖాపరంగా వచ్చే ఫిర్యాదులన సొమ్ముచేసుకుంటున్నారు. దీంతో విజిలెన్స్ విభాగం పూర్తిగా నిస్తేజంగా మారిపోయింది. పోలీసులు రంగప్రవేశం చేస్తే డొంకలాగుతున్నారు తప్ప శాఖాపరమైన చర్యలు గగనమనే చెప్పాలి.

పేదలే లక్ష్యంగా..

గ్రామీణ నేపథ్యం, పేదలే లక్ష్యంగా నగర ఆసుపత్రులకు చెందిన ఏజెంట్లు పావులు కదుపుతున్నారు. ఆర్థిక అవసరాలకు ఎంతో కొంత సాయం చేస్తామని, దీనికి అవయవాలు అమ్ముతారా, అమ్మతనాన్ని అమ్ముతారా అంటూ బేరాలాడుతున్నారు. సుమారు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు బేరం కుదుర్చుకుని, నగరంలోని అవసరమున్న వారికి రూ.లక్షల్లో అమ్ముకుంటున్నారు. అనతికాలంలోనే ఏంజెంట్లు, ఆసుపత్రి నిర్వాహకులు రూ.కోట్ల దోచుకుంటున్నారు. అక్రమ సరోగసి వ్యవహారంలో సుమారు వంద మంది ఏజెంట్లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎందుకు అంతర్గతంగా సహకరించడంలేదు?

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అనధికారిక ఆసుపత్రులు, అర్హత లేని వ్యక్తులు వైద్యం చేయడం, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై విశ్వసనీయ వర్గాల ఫిర్యాదులతో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. వీటిపై తదుపరి చర్యలు తీసుకోవడానికి అధికారులకు తీరికలేకుండా పోతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 150కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇందులో రంగారెడ్డి డీఎంహెచ్‌ఓ పరిధిలోనే అధిక సంఖ్యలో ఉండగా, ఆ జిల్లా అధికారుల నుంచి కనీస సహకారం అందడం లేదని తెలుస్తోంది. దీంతో అక్రమార్కులు శాఖాపరమైన చర్యల నుంచి తప్పించుకుని దర్జాగా తిరుగుతున్నారు.

అడ్డుగా ఉన్నాడని భర్తను అంతం చేసింది

- ప్రియుడితో కలిసి హత్యచేసిన భార్య
- నిందితుల అరెస్ట్


నిందితులు మహమ్మద్ తాఫిక్

మోతీనగర్: ప్రియుడుతో కలిసి భర్తను హత్య చేసిన సంఘటనలో భార్యా, ప్రియుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి, ఎస్ఐ మహ్మద్ మజీద్ ఆలీలు తెలిపిన మేరకు.. రాజీవ్‌గాంధీ నగర్‌లో మహమ్మద్ షాదుల్, భార్య తబస్సుమ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కూతురు. నాలుగు సంవత్సరాల క్రితం తబస్సుమ్‌కు మొహమ్మద్ తాఫిక్ అనే వ్యక్తితో అయిన పరిచయం వివాహేతరసంబంధానికి దారితీసింది. ఈ విషయం భర్తకు తెలిసి మందలించాడు. దీంతో భర్త షాదుల్ అడ్డువస్తున్నాడని భావించిన భార్య.. ప్రియుడు మొహమ్మద్ తాఫిక్‌తో కలిసి షాదుల్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం తబస్సుమ్ ప్రియుడితో కలిసి ఆగస్టు 15న ఉదయం షాదుల్ పడుకున్న సమయంలో ఇద్దరూ కలిసి కొట్టి, దిండుతో ముక్కు, నోరు మూసి చంపారు. ఈ సంఘటపై స్థానికుల సమాచారం మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులైన తబస్సుం, ప్రియుడు మొహమ్మద్ తాఫిక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సినీహీరో ధర్మమహేష్‌పై వేధింపుల కేసు నమోదు

రాయదుర్గం: ఓ సినిమా హీరోపై భార్య ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. సింధూరం, డ్రింకర్ సాయి సినిమాలలో హీరోగా నటించిన ధర్మామహేష్ అలియాస్ కాకాని ధర్మసత్య సాయిశ్రీనివాస మహేష్(30) మాదాపూర్ ఫార్చ్యూన్ టవర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ చిరుమామిళ్ల గౌతమి(31)ని 2019లో వివాహం చేసుకున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను భార్యను వేధింపులకు గురిచేయసాగాడు. అదనపు కట్నం కావాలంటూ అతని కుటుంబ సభ్యులు వేధించారు. వేధింపులకు విసిగిపోయిన భార్య గౌతమి పోలీసులను ఆశ్రయించింది. దీంతో గచ్చిబౌలి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ధర్మామహేష్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చోరీ కేసును రెండు గంటల్లోనే ఛేదించిన పోలీసులు

సనత్‌నగర్: పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన వ్యక్తిని బేగంపేట పోలీసులు రెండు గంటల్లోనే అరెస్టు చేశారు. డీఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. బేగంపేట పైగా కాలనీలో నివాసం ఉంటున్న సాలిక్‌ఖాన్ ఈ నెల 13న కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం కనిపించింది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తలుపులు బలవంతంగా తెరిచినట్టున్నాయి. బీరువాలో దాచిన రూ.2 లక్షల నగదు కనిపించలేదు. దీంతో సాలిక్‌ఖాన్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సాలిక్‌ఖాన్ ఇంట్లో పనిచేస్తున్న వికారాబాద్‌కు చెందిన రమేష్ (32) ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఓ సారి ఇంట్లో చోరీకి పాల్పడి రమేష్ జైలుకు వెళ్లి వచ్చాడు. అయితే మళ్లీ అతనినే యజమానులు తమకు చెందిన ఫాంహౌస్‌లో పనికి పెట్టుకున్నారు. యజమానులు ఇంట్లో లేని సమయంలో రమేష్ మరోసారి చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన నగదుతో ముంబాయికి పారిపోతుండగా సీసీ ఫుటేజీ, సెల్‌సిగ్నల్స్ ఆధారంగా రమేష్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వరద నీటి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: దుర్గానగర్ చౌరస్తాలో వరద నీటి కాలువలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభించింది. ఈ ఘటన సోమవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపిన మేరకు.. దుర్గానగర్ చౌరస్తా వద్ద వరద నీటి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకోని పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి మృతదేహాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చరీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

ఇబ్రహీంపట్నం: చెక్ బౌన్స్ కేసులో నిందితుడైన భాస్కర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఇబ్రహీంపట్నం ఎంఎం కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువర్చారు. న్యాయవాది రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు దయానంద్‌కు రూ.24,87,500 చెల్లించాలని, అలాగే భాస్కర్ ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారన్నారు.

మహనీయుల త్యాగాలను మరవొద్దు

లిబర్టీ: మహనీయుల త్యాగాలను మరవొద్దని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పీవీ రాజేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. బ్రిటీష్ సామ్రాజ్య వాదాన్ని ఎదురించిన యోధుడు సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను దేశం నుంచి తరిమికొట్టేందుకు సాగిన ఉద్యమంలో సుభాష్‌చంద్రబోస్ నిర్వహించిన భూమికను నేటికి ప్రజలు మర్చిపోలేరన్నారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ శ్రీనివాసరావు, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.11,20,539



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ అర్జున్‌యాదవ్

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. ఐదు నెలల హుండీ ఆదాయం రూ.11,20,539 వచ్చింది. హుండీ లెక్కింపును ఆలయ చైర్మన్ అర్జున్‌యాదవ్‌తో పాటు కమిటీ మెంబర్లు పరిశీలించారు. సికింద్రాబాద్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది.

పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



హేమావతినగర్‌లో నివాళులర్పిస్తున్న ఎర్రగడ్డ కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను సోమవారం హేమావతినగర్‌లో ఎర్రగడ్డ డివిజన్ గౌడ సంఘం నేత, కాంగ్రెస్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు రమేష్‌నాయక్, సురేష్‌గౌడ్, హనుమంతరావు, ఇమ్రాన్, వెంకటేష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గణేష్ మండపానికి కర్రపూజ



కర్రపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బండపల్లి భవానీశంకర్ నేత నేతృత్వంలో మండప కర్రపూజను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, మునుస్వామి, అరుణ్‌గౌడ్, నటరాజ్‌యాదవ్, రాజేందర్ గుప్తా, సాయి, దేవేందర్, పూజారి విద్యాధర్ పాల్గొన్నారు.

సలీం బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనల్లో బీఆర్ఎస్ నాయకుడు మాగంటీ వజ్రనాథ్

రహమత్‌నగర్: హెచ్‌ఎఫ్‌నగర్‌లోని హజ్రత్ పీర్ సయ్యద్ సలీం షా ఖాద్రీ చిస్తి దర్గా ఉత్సవాలు సోమవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలతో ముగిసాయి. దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతిమణి సునీత, గోపీనాథ్ సోదరుడు, బీఆర్ఎస్ నాయకుడు వజ్రినాథ్, హెచ్‌వైసీ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్మాన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించారు. ఈ ఉత్సవాల్లో నగరం నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి స్పెషల్ డ్రైవ్.!

- కరెంటు స్తంభాలకు కేబుల్ వైర్లు తొలగించాల్సిందే
- ఈ నెల 26 లోపు పూర్తి చేయాలని ఆదేశం
- బంజారాహిల్స్ డివిజనల్ పరిధిలో ప్రత్యేక బృందాలు



కరెంటు స్తంభానికి చుట్టుకున్న కేబుల్ వైర్ల కట్టలు

బంజారాహిల్స్: రామంతాపూర్‌లోని గోకుల్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతి చెందిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజనల్ కిందికి వచ్చే 24 సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంటు స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం అన్ని సబ్‌స్టేషన్ల ఏడీఈలు, ఏఈలు, లైన్‌మెన్లతో సమావేశమైన అధికారులు తగిన ఆదేశాలు జారీ చేశారు.

- టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజనల్ పరిధిలోకి ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అయ్యప్పసొసైటీ, బోరబండ, కళ్యాణ్‌నగర్, శ్రీకృష్ణానగర్, ఎల్వీప్రసాద్, మాదాపూర్, మైత్రీవనం, ఎమ్మెల్యేకాలనీ, నిమ్స్, ప్రశాసన్‌నగర్, రహేజా, రవీందర్‌నగర్, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2, రోడ్డునెంబర్–12, రోడ్డునెంబర్–13, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–22, శ్రీనగర్‌కాలనీ, టోలిచౌకి, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ తదితర 24 సబ్‌స్టేషన్లు వస్తాయి.
- ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో 195 ఫీడర్లు ఉండగా, 7250 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. 1,83,000 మంది వినియోగదారులు ఉన్నారు.
- వీటి పరిధిలో 15,299 స్తంభాలు ఉండగా, వీటికి స్టార్ కేబుల్ వైర్లు, ఇంటర్నెట్ కేబుల్స్ తగిలించి ఉన్నట్లుగా గుర్తించారు.
- 584 కిలోమీటర్ల మేర కరెంటు వైర్లు విస్తరించి ఉన్నాయి. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు అన్ని కరెంటు స్తంభాలకు తగిలించి ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ఆదేశించారు.
- మంగళవారం ఉదయం 8 గంటల నుంచి అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగనున్నది.
- తొలగించిన తర్వాత కేబుల్ వైర్లను కుప్పగా వేసి ఫోటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది.
- రామంతాపూర్ ఘటన నేపథ్యంలో బంజారాహిల్స్ పరిధిలో క్రిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనాలని సూచించారు.
- ప్రతి కరెంటు స్తంభాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఒక్క కేబుల్ వైర్ కూడా లేకుండా తొలగించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు.
- భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఈరోజు ఉదయం నుంచి ప్రారంభం

మా పరిధిలో ఉన్న 24 సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంటు స్తంభాలకు చుట్టి ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ఆదేశించాం. ఈ మేరకు ఏఈలు, ఇతర సిబ్బంది కలిపి 134 మంది మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటారు. మేము కూడా అన్ని ప్రాంతాలను పరిశీలిస్తాం. ఈనెల 26 లోపు మొత్తం కేబుల్ వైర్లను తొలగించాలని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశాం. రామంతాపూర్ ఘటన మమ్మల్ని కలచివేసింది. ఈ సంఘటన దురదృష్టకరం. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే చర్యలు తీసుకోకతప్పదు. అందుకే ఈ విషయంలో పట్టుదలగా ఉన్నాం. ప్రజలు కూడా సహకరించాలి. – పి.హనుమంతరెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ, బంజారాహిల్స్

బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలి



ఆమ్ ఆద్మీ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పంజగుట్ట: స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టాలనే డిమాండ్‌తో ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు రాజ్‌భవన్ స్కూల్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి రాజ్‌భవన్ ముట్టడికి వెళ్లారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

- ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల బిల్లు తెలంగాణ ప్రభుత్వం ఆమోదించి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపినా అటు కేంద్రం, రాష్ట్రపతి స్పందించకపోవడం దారుణమన్నారు. 100 మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడకపోవడం దారుణమన్నారు. రిజర్వేషన్లు ఆర్డినెన్స్ ఆమోదించే అధికారం గవర్నర్‌కు ఉన్నప్పటికీ అది చేయకుండా రాష్ట్రపతికి పంపడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీజేపీ కపట నాటకంలో భాగమే ఇది అని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని సరైన సమయంలో బీజేపీకి బుద్ధి చెబుతారని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కలిపిస్తూ 9వ షెడ్యూల్డ్‌లో చేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో భూకంపం సృష్టిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ మాజీద్, డాక్టర్ అన్సారీ, అబ్దుల్ మక్తదీర్, జావేద్‌షరీఫ్, సుధారాణి, రమ్యగౌడ్, నాగరాజ్, రాకేష్ సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

లిబర్టీ: మొగులై సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరుసల్పిన ధీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని ప్రజా చైతన్య సమితి తెలంగాణ శాఖ అధ్యక్షుడు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. ప్రజా చైతన్య సమితి కార్యాలయంలో సర్దార్ పాపన్నగౌడ్ జయంతి వేడులు జరిగాయి. చంద్రమోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. మొగులాయిల పాలనకు చరమగీతం పాడేందుకు పోరు సాగించి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన మహనీయుడు పాపన్న అని పేర్కొన్నారు. ఢిల్లీలో పీఠాన్ని గడగడలాడించిన మహనీయుడని కొనియాడారు. కుల, మత ప్రాంతం వివక్ష లేకుండా పేద ప్రజల పక్షాన పోరాడి 30 సంవత్సరాలు పరిపాలించి 20 కోటలు కట్టి ఏడున్నర సంవత్సరాలు గోల్కొండ చక్రవర్తిగా పరిపాలించిన సర్వాయి పాపన్న చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ పతాకం సర్దార్ పాపన్న అని గుర్తు చేశారు. బహుజనుల ఆత్మగౌరవం కోసం ఎంతగానో తెగించి పోరాటం సాగించాడని మొగులాయిలు చుట్టుముట్టినప్పటికీ వారి చేతిలో ఆత్మబలిదానం కాకుండా తనకు తానే ఆత్మబలిదానం అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి నీత్‌గౌడ్, పట్టుకుల రాజు, నంద్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి



సైట్2లో నివాళులర్పిస్తున్న హబీబా సుల్తానా

చవితి ఉత్సవాలు సాఫీగా జరిగేలా..

- మహాగణపతి అడ్‌హక్ కమిటీతో సమావేశమైన అధికారులు
- హాజరైన పోలీసు, ఆర్అండ్‌బీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికాలు




ఖైరతాబాద్ మహాగణపతి వద్ద ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు

ఖైరతాబాద్: వినాయక చవితి ఉత్సవాలను సాఫీగా నిర్వహించాలని సోమవారం ఖైరతాబాద్ మహాగణపతి అడ్‌హక్ కమిటీ సభ్యులతో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రిసిటీ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం ఉత్సవాల్లో ఎదురైన ఇబ్బందులు, వాటిని ఎలా అధిగమించాలి.? భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే విషయాలపై చర్చించారు.

- ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ నుంచి భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారీ కేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు కోరారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం మింట్ కాంపౌండ్, రేస్ కోర్స్ ట్రాక్, ఐమాక్స్ హెచ్ఎండీఏ మైదానం ప్రాంతాలు కేటాయించాలన్నారు. ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అంబులెన్స్, మంచి నీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- అనంతరం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, సభ్యులు పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఎ.రాములు, సైఫాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, డీఐ సైదులు, ఎస్సై నాగరాజుతో పాటు అడ్‌హక్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, మహేష్‌యాదవ్, చందు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో గత తప్పిదాలు పునరావృతం కావొద్దు



నార్త్,వెస్ట్‌జోన్ల పరిధిలోని ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సమావేశమైన నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే సోమవారం తన కార్యాలయంలో నార్త్, వెస్ట్‌జోన్ల పరిధిలోని ట్రాఫిక్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో సమావేశమై సూచనలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయమై పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.గత అనుభావాలను దృష్టిలో ఉంచుకుని ఉత్సవాలను విజయవంతమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఉన్నతాధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో దళితుల్లో చిచ్చు

లిబర్టీ: వర్గీకరణ పేరుతో దళితుల్లో చిచ్చుపెట్టిన ఘనత చంద్రబాబు నాయుడికి దక్కుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రొఫెసర్ వీఎల్‌రాజు ఆరోపించారు. దళితులు ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తూ హక్కుల కోసం ఉద్యమిస్తున్న నేపథ్యంలో వర్గీకరణ పేరుతో మంటలు రేపి దళితుల్లో విభజన విధానానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన కోసం వర్గీకరణ రద్దు కోసం తిరుగుబాటు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని 341ఆర్టికల్ ప్రకారం వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టుకు తీర్పుకు భిన్నంగా వర్గీకరణ ఎలా చేస్తారని సూటిగా ప్రశ్నించారు. దళితుల ఐక్యత కోసం కృషి చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబునాయుడు విభజించే అంశంపైనే ఎక్కువ దృష్టి సారించి దళితుల్లో ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. రాజేంద్ర, సుబ్బారావు పాల్గొన్నారు.

నా కొడుకు మృతికి కారణం వైద్యుల నిర్లక్ష్యమే..

రోడ్ నం.2లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై బాలుడి తండ్రి ఫిర్యాదు

బంజారాహిల్స్:వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తన కొడుకు మృతి చెందాడని, సంబంధిత ఆస్పత్రి యాజమాన్యంపై, చికిత్స నిర్వహించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత తండ్రి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన చైతన్య తన 16రోజుల వయస్సున్న కొడుకు వాంతులు చేసుకుంటుండంతో ఈ నెల 13వ తేదీన తెల్లవారుజామున 2.30గంటలకు బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చాడు.మధ్యలో రెండుసార్లు వైద్యులు బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నాడని చెప్పారన్నారు. అయితే సాయంత్రం 4.30 గంటలకు మృతి చెందాడంటూ తనకు తెలియజేశారని తెలిపారు.కోలుకుంటున్న బాలుడు మృతి చెందాడన్న విషయం తెలిసి తాము ఎంతో కుమిలిపోయామని,ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత మెడికల్ రిపోర్ట్‌లను కూడా జత చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఈ ఘటనపై నివేదిక ఇవ్వాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాశారు.

డబ్బింగ్ ఆర్టిస్ట్ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు

బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా డబ్బింగ్ ఆర్టిస్ట్ యూనియన్ నూతన కార్యవర్గం సోమవారం బంజారాహిల్స్ రోడ్ నం.2లోని ఇందిరానగర్‌లో ఉన్న యూనియన్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేసింది. యూనియన్ అధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్‌వర్మ, ఉపాధ్యక్షురాలిగా లలితారాజ్, జనరల్ సెక్రటరీగా నాగేంద్రగౌతమ్, ట్రెజరర్‌గా వినోద్‌కుమార్‌రాజు, జాయింట్ సెక్రటరీగా సాహితీ గుళ్లపల్లి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చిల్లా శ్యాంసుందర్‌రెడ్డి, ఈసీ మెంబర్లుగా సమరసింహారెడ్డి, అనిల్‌కుమార్, మాడ సునీల్‌రెడ్డి, అనురాధ, సాయిప్రసాద్ తదితరుల ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. యూనియన్ ఫౌండర్ ప్రెసిడెంట్, గౌరవాధ్యక్షుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఆడంబరంగా నిర్వహించారు. అనంతరం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

'ట్రెండ్ మారుతున్నట్లే ఆభరణాలు మార్చేస్తున్నారు'



బంజారాహిల్స్: ప్రస్తుతం ట్రెండ్‌కు తగినట్లు మహిళలు తమ ఆభరణాలను మారుస్తున్నారని దీంతో మార్కెట్లో విభిన్న రకాల డిజైన్లు అందుబాటులోకి వస్తున్నాయని సినీ దర్శకుడు కేవీ అనుదీప్ అన్నారు. సోమవారం ఫిలింనగర్‌లో సినీ హీరో విశ్వక్ సేన్ సోదరి వన్మయి వావన్ పేరుతో ఏర్పాటు చేసిన జ్యువెలరీ స్టోర్‌ను కేవీ అనుదీప్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. జ్యూవెలరీ డిజైనర్, వావన్ జ్యూవెలరీ నిర్వాహకులు వన్మయి మాట్లాడుతూ... ప్రతి ఆభరణం అత్యంత శ్రద్ధ, నైపుణ్యంతో రూపొందిస్తున్నామని ఆకర్షణీయమైన డిజైనరీ ఆభరణాలు సరికొత్తగా ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు ఆమె తెలిపారు.



బంజారాహిల్స్‌రోడ్ నెం 9లో ప్రమాదకరంగా చెట్టు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 9లో ఓ చెట్టు పూర్తిగా ఎండిపోయి ఓ వైపు ఒరిగి ప్రమాదకరంగా కనిపిస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఈ చెట్టు ఎవరి నెత్తిన కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రమాదకరంగా ఉన్న చెట్టు గురించి చెబితే పట్టించుకోవడం లేదని స్థానిక కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ చెట్టును ఇక్కడి నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సందడిగా శ్రీకృష్ణ జన్మాష్టమి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యా భవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నికృష్ణులు, రాధల వేషధారణలో చిన్నారులు ముచ్చటగొల్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముకుందా..ముకుందా..అంటూ సాగిన గేయాలాపనలకు లయబద్ధంగా చేసిన నృత్యాలు కట్టిపడేశాయి. అలాగే ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.



భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో చిన్నారులు..





వ్యాసపూజ పుస్తకావిష్కరణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నం.12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయ ఆవరణలో వ్యాసపూజ–2025 పుస్తకాన్ని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆయనతో పాటు హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభూజీ ఉన్నారు.



చోటా భీమ్.. మిర్చి ఫన్ ఫెయిర్..

నగరంలో చోటా భీమ్ ఎడిషన్ సందడి

తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ప్రదర్శన



సాక్షి, సిటీ బ్యూరో: నగర వేదికగా పిల్లల కోసం రూపొందించిన సరదా, సృజనాత్మకత, ఉత్సాహభరితమైన 'మిర్చి ఫన్ ఫెయిర్– చోటా భీమ్ ఎడిషన్' నిర్వహించనున్నారు. నగరంలోని అశోక వన్ మాల్ వేదికగా ఈ నెల 30, 31 తేదీల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ వినోదాత్మక కార్యక్రమంలో ఉత్కంఠభరితమైన ఆటలు, ఇంటరాక్టివ్ సెషన్లు, రంగురంగుల క్రాఫ్ట్ కార్నర్లు మొదలు కళాత్మక వినోదం వరకు సందడి చేయనున్నాయి. ఈ కార్యక్రమం ప్రత్యేకంగా చిన్నారులకు చిరునవ్వుతో పాటు ఆశ్చర్యాలను అందించే వేదికగా హామీ ఇస్తుంది. ఈ వేడుకల్లో పిల్లలు ఫొటో బూత్‌లో ఫోజులివ్వవచ్చు, పార్టీ సర్‌ప్రైజ్ ఆస్వాదించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. చోటా భీమ్ థీమ్ గా ఉండటంతో చిన్నారులకు, పెద్దలకు ఇదొక అదనపు ఆకర్షణగా నిలుస్తుంది. ప్రతిరోజు 8 గంటల పాటు కొనసాగే ఈ వేడుకల్లో మూడు సంవత్సరాలు దాటిన చిన్నారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఔత్సాహిక చిన్నారులు బుక్ మై షో లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి సూచించారు.

కబూతర్.. ఖానా కహానీ..

అనారోగ్యానికి కారణమవుతున్న పావురాలు



ప్రేమ చిహ్నాలుగా వర్ధిల్లిన పావురాలే పలు రకాల వైరస్ వ్యాప్తికి కారకాలుగా మారుతున్నాయి. నగరాల్లోనూ వీటి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నేపథ్యంలో అనారోగ్య సమస్యలూ, ఊపిరితిత్తుల సమస్యలు అధికమవుతున్నాయి. దీంతో వాటికి ఆహారాన్ని అందించడాన్ని ఇటీవలే ముంబయి, పుణె వంటి నగరాలు నిషేధించాయి. నగరంలో కూడా పావురాల సంఖ్య, వాటికి ఆహారం అందించే అలవాటు పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో పావురాల ఫీడింగ్ అంశం చర్చనీయాంశంగా మారింది.

– సాక్షి, సిటీబ్యూరో

పలు నగరాల్లో పీజియన్ ఫీడింగ్‌పై నిషేధం	ఢిల్లీ, పుణె, ముంబయి వంటి నగరాల్లో అమలు	సిటీలో పరిస్థితిపై చర్చలు, వాదోపవాదాలు
వాటికి ఆహారం అలవాటుగా మారిన వైనం	ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన	

గతంలో ముంబైలోని ఒక అపార్టుమెంట్‌లో చోటు చేసుకున్న పావురాల సమస్య రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. అనంతరం ఆ సమస్య ఏకంగా కోర్టు గడప కూడా తొక్కింది. అయితే ఆ స్థాయికి చేరకున్నా.. మన నగరంలోనూ నిత్యం ఇదే అంశంపై నగరవాసుల్లో వాదోపవాదాలు నడుస్తూనే ఉన్నాయి. పావురాల వల్ల మనుషులకు కలిగే అనారోగ్యాలపై అవగాహన పెరగడమే దీనికి కారణం.

నగరంలో అలవాటుగా..

హాబీగా పావురాలకు ఆహారం వేసేవారితో పాటు మతపరమైన లేదా మరే ఇతర కారణాల వల్ల కూడా నగరంలో పావురాల ఫీడింగ్ సర్వసాధారణంగా మారింది. బహిరంగ ప్రదేశాల్లో వందలాది పావురాలు గుంపులుగా వస్తాయి. ప్రతి రోజూ ఉదయం వేళల్లో ప్రజలు ఈ పావురాలకు ఆహారం ఇవ్వడం సర్వసాధారణం. ట్యాంక్ బండ్, నాంపల్లి, సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్.. ఇలా పలు చోట్ల పావురాల ఫీడింగ్ నిత్యం కనిపించే అంశాలు. ఇలా ఫీడింగ్ చేసేవారి కోసం గింజలు, ఇతర ఆహార ఉత్పత్తులు విక్రయించే వారు కూడా పుట్టుకొచ్చారంటే అర్థం చేసుకోవచ్చు ఫీడింగ్ ఏ విధంగా జరుగుతుందో.



అవగాహన పెరగాలి..

'పావురాల విసర్జన ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందనే విషయం తెలియక చాలా మంది పక్షులకు ఆహారం ఇస్తారు' అని నగరానికి చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సబా క్వాద్రి అంటున్నారు. అంతేకాదు పావురాలు, ఇతర పక్షులకు కూడా ఇది శాపంగా మారుతోంది. 'ఇతర పక్షులను ఆకర్షించడానికి కొన్ని గింజలను బయట పెడుతాం. కానీ పావురాలు ఆ ప్రాంతాలను హైజాక్ చేసి ఇతర పక్షులకు ఉద్దేశించిన ఆహారాన్ని దక్కించుకుంటాయి' అని సబా వెల్లడించారు. ముంబై వంటి నగరాల్లో చేసినట్లుగానే, పావురాలకు ఇష్టారాజ్యంగా ఆహారం అందించడాన్ని నివారించేందుకు జరిమానా విధించడమే మంచిదని ఆమె సూచిస్తున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వంటి ప్రాంతాల్లో గణనీయమైన సంఖ్యలో పావురాలు ఉంటున్నాయి. 'విశ్వవిద్యాలయ వీధులను శుభ్రం చేసే స్వీపర్ల నుంచి భవనాల్లో నివసించే విద్యార్థుల వరకు, చాలా మంది పావురాల బిందువుల ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది' అని వర్సిటీ ఉద్యోగి ఒకరు చెప్పారు. ఉదయం వేళల్లో పావురాలకు ఆహారం ఇవ్వొద్దని చెప్పేందుకే ఓయు ప్రత్యేకంగా ఒక భద్రతా అధికారిని నియమించిందని సదరు ఉద్యోగి వివరించారు. అంతేకాక వర్సిటీ భవనాల వెలుపల పావురాలకు ఆహారం ఇవ్వడం వల్ల కలిగే ప్రమాదాల గురించి తెలియజేసే బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

విసర్జన.. విషమౌతోంది..

పావురాల ప్రభావానికి ముఖ్యంగా విసర్జనకు ఎక్కువ కాలం గురికావడం వల్ల వివిధ రకాల హానికరమైన శిలీంధ్రాలు, బ్యాక్టీరియా పరాన్నజీవులు ఉత్పత్తి అవుతాయని, ఫలితంగా ఇన్ఫెక్షన్లు, పలు రకాల వైరస్‌లు వ్యాప్తి చెందుతాయని వైద్యులు చెబుతున్నారు. విసర్జనాలు ఎండిపోయినప్పుడు, అవి దుమ్ము రూపంలో గాలిలోకి ఎగిరి, ఊపిరి తీసుకునే సమయంలో గాలి ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులను చేరతాయి. ఈ క్రమంలోనే హైపర్‌సెన్సిటివిటీ న్యుమోనైటిస్‌కు కారణమవుతోంది. ఇది కొన్ని పరిస్థితుల్లో ప్రాణాంతకం కావచ్చు. ఈ ఇన్ఫెక్షన్లు పెంపుడు కుక్కలు, పిల్లుల వెంట్రుకల ద్వారా వచ్చే అలెర్జీల కంటే కూడా ప్రమాదకరంగా ఉంటాయి. పావురాల విసర్జన ఊపిరితిత్తుల వాపుకు కారణమవుతాయి. ఒక్కోసారి అవయవాలకు శాశ్వత నష్టాన్ని కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు.



ఇన్ఫెక్షన్.. ఎలా గుర్తించాలి?

పావురాల విసర్జన వల్ల సోకే ఇన్ఫెక్షన్ తీవ్రత అధికంగా ఉంటుంది. ప్రారంభ దశలో నిరంతరం పొడి దగ్గు వస్తుంది. దీనికి యాంటీబయాటిక్స్, బ్రోంకోడైలేటర్లను ఉపయోగించినా ఉపశమనం దొరకదు. దగ్గు రెండు నుంచి మూడు వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగిన క్రమంలో తదుపరి పరీక్షల కోసం పల్మనాలజిస్ట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.



పలు దేశాల్లోనూ..

వెనిస్ నగరంలోని చారిత్రాత్మక చతురస్రాల్లో పావురాలకు ఆహారం నిషేధించారు. ఈ ఫీడింగ్‌కు సింగపూర్ భారీ జరిమానాలు విధిస్తోంది. అలాగే న్యూయార్క్, లండన్ కూడా దాణా ప్రదేశాలను నియంత్రించాయి. మన దేశంలో ముంబై, థానె, పుణెలో కేసులు నమోదు చేస్తున్నారు. ఢిల్లీలో కూడా పావురాల ఫీడింగ్‌ను నియంత్రించే దిశగా చర్యలు తీసుకోనుందని తెలుస్తున్న నేపథ్యంలో మన నగర పరిస్థితి ఏమిటని పలువురు నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.



హెచ్‌సీయూలో వరల్డ్ ఫొటోగ్రఫీ డే

నేటి నుంచి 23 వరకూ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహణ



రాయదుర్గం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం –2025ను పురస్కరించుకుని గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లోని ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ భవనంలో ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ప్రత్యేక అతిథిగా ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేకే.సెంథిల్‌కుమార్ పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌రావు, ప్రొఫెసర్ ఎంఎస్ శివరాజు, ప్రొఫెసర్ సత్యప్రకాశ్, రామ్‌వెంకట్ శ్రీకర్ తోపాటు పలువురు హాజరుకానున్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్‌లో..

హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ భవనంలో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. దీన్ని ఎగ్జిబిషన్ హాల్–1 గ్రౌండ్‌ఫ్లోర్‌లో, ఎగ్జిబిషన్ హాల్–2 ఫస్ట్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేస్తారు. మంగళవారం నుంచి 23వ తేదీ వరకూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ ఈ ఫొటో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

ఏఐ ట్రెండ్స్..

అందుబాటులోకి కొత్త వెబ్ అప్లికేషన్స్

టెక్నాలజీతో సరికొత్త ప్రయోగాలు	భావోద్వేగాలను పండిస్తున్న రీల్స్	కృత్రిమ మేధస్సుతో వినూత్నంగా కథలు, వార్తలు	ప్రచారంలో టైమ్ కృష్ణ వంటి తెలుగు వేదికలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ట్రెండ్స్ వేగంగా మారిపోతున్నాయి. ప్రజల జీవనశైలితో పాటు ఆలోచనా విధానం, సమాచారాన్ని స్వీకరించే పద్ధతుల్లో సైతం కొత్త పోకడలు కనిపిస్తున్నాయి. రీల్స్ మాదిరిగా వార్తలు కూడా వినోదంగా మారుతున్నాయి. తాజా ఉదాహరణగా కొన్ని వినూత్న తెలుగు వెబ్ అప్లికేషన్స్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ఇది సాధారణ న్యూస్ పోర్టల్‌లా కాకుండా పూర్తిగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత తెలుగు వెబ్‌సైట్, వార్తలను కథలుగా మార్చే విశేష వేదికలుగా నిలుస్తున్నాయి. సాధారణంగా వార్తలు మనకు పాఠ్యరూపంలో, ఫొటోలు లేదా వీడియోలతో వస్తాయి. కానీ ఈ కొత్త అప్లికేషన్‌లో రీల్స్ (వీటినే కొందరు ట్రీల్స్ అని అంటున్నారు) రూపంలో అందుతాయి. నిజమైన సంఘటనలు, నిజంగా ఆ బాధను అనుభవించినవారి స్వరంలోనే, చిన్న భావోద్వేగ కథలుగా అందిస్తున్నారు. ఇవి ఒక వైపు సినిమా ట్రైలర్స్‌ని తలపిస్తున్నాయి. మరోవైపు ఓటీటీ ప్లాట్‌ఫారమ్, సోషల్ మీడియా స్క్రోల్ అనుభూతినీ అందిస్తున్నాయి.



భావాలను పంచేలా..

ఒక రీల్‌లో ఒక ప్రభుత్వ అధికారి తానే కథానాయకుడవుతాడు. ఎప్పుడో అనుమతి లభించిన ప్రాజెక్ట్ కాగితం మీదే మిగిలిపోతుంది. అలా ఎందుకు జరిగిందో తన అనుభవాన్ని మనముందు ప్రదర్శిస్తాడు. మరో రీల్‌లో మహిళ తన బాధను మాటల్లో కాకుండా ముఖ కవళికలతో తన నిస్సహాయను తెలియజేస్తుంది. అనేక అనేక రంగాలు, అనేక సంఘటనలను రీల్స్, వార్తలు, సమాచారం, కథల రూపంలో ఏఐ ద్వారా తెలియజెప్పడం ప్రస్తుతం ట్రెండ్. ఇవన్నీ 24 గంటల్లోపే ఏఐ సాయంతో సిద్ధం చేయడం ఇందులోని ప్రత్యేకత. రీల్స్, షార్ట్స్, పాడ్‌కాస్ట్ వంటివి కొత్త అలవాట్లుగా మారాయి. ఇలాంటి సమయంలో ఈ కొత్త ఫార్మాట్ స్థానిక భాషలో ప్రజలకు చేరుతోంది.



తెలుగులోనూ వినూత్నంగా..

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వివిధ రకాల వేదికలు రూపుదాల్చుతున్నాయి. ఇలాంటి వేదికలు నగరంలో వేళ్లూనుకుంటున్నాయి. ప్రపంచంలో తొలి పూర్తిస్థాయి యాంత్రిక మేధస్సుతో (కృత్రిమ మేధస్సు) పని చేసే తెలుగు వెబ్ అప్లికేషన్లు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఈ మధ్య కాలంలో టైమ్ కృష్ణ అనే వెబ్‌సైట్లో కొత్త వేదిక మెల్లిగా వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ చానళ్లలో చక్కర్లు కొడుతోంది. ఇది వార్తలా కాకుండా సినిమాను తలపిస్తుంది. మొబైల్‌లో స్క్రోల్ చేసే సామాజిక మాధ్యమాల అనుభూతి ఇస్తుంది. సాధారణ వార్తా సైట్‌లా కాకుండా భావోద్వేగాలతో నిండిన చిట్టి కథలుగా 'సత్య రీల్స్'గా మారుతున్నాయి. ఇలాంటి తెలుగు వేదికలు దేశమంతటా ప్రజలే స్వయంగా తమ కథలను పది భారతీయ భాషల్లో రూపొందించుకునే అవకాశం కల్పించబోతోంది.



డిజిటల్ డ్యామేజ్..

- నగరంలో విస్తరిస్తున్న మయోపియా
- వ్యాధిబారిన 50 శాతం మంది చిన్నారులు
- స్క్రీన్ టైమ్ తగ్గించడం అత్యవసరం అంటున్న వైద్యులు

ప్రస్తుత స్క్రీన్ వినియోగ ధోరణులు ఇలాగే కొనసాగితే 2050 నాటికి దాదాపు 50% మంది పిల్లలు మయోపియాకు ప్రభావితమవుతారని ఆప్తాల్మిక్ – ఫిజియోలాజికల్ ఆప్టిక్స్ అంచనా. వినోదం నుంచి విద్య వరకూ డిజిటల్ స్క్రీన్‌లు వినియోగించడం అనేది నగర రోజువారీ జీవితంలో భాగమవుతోంది. దీంతో చిన్నారుల్లో కంటి సంబంధిత మయోపియా నుంచి డిజిటల్ కంటి ఒత్తిడి, నిద్రలోపాలు, ప్రవర్తనా మార్పుల వరకూ పలు అనారోగ్య సమస్యలు భారీగా పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



క్యూరియస్ జర్నల్ పరిశోధన ఫలితాలను ఉటంకిస్తూ ఇటీవల ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో 50% కంటే ఎక్కువ మంది డిజిటల్ కంటి ఒత్తిడి లక్షణాలను కలిగి ఉన్నారు. వీటిలో అలసట, తలనొప్పి, నిద్ర ఆటంకాలు, మానసిక పరమైన ప్రవర్తనా సమస్యలు ఉన్నాయి. ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించిన ఆందోళనలు పెంచుతున్నాయి.

4 శాతం నుంచి 21 శాతానికి...

టైమ్స్ ట్రెండ్ నివేదిక ప్రకారం.. 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల చిన్నారుల్లో 1999 నాటికి 4% నుంచి 2019 వచ్చేసరికి 21% నికి మయోపియా పెరిగింది. ఈ పెరుగుదల ఇలాగే కొనసాగితే, విద్య, ఏకాగ్రత ఇతర భావోద్వేగ స్థితిగతులను కూడా ప్రభావితం చేసేలా పెరుగుదల ఉంటుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. రాజ్‌కోట్‌లో, సౌరాష్ట్ర విశ్వవిద్యాలయంలోని సైకాలజీ విభాగం నిర్వహించిన సర్వేలో, 10 ఏళ్లలోపు పిల్లల్లో 81% మంది భోజన సమయంలో క్రమం తప్పకుండా స్క్రీన్‌లను ఉపయోగిస్తున్నారని, ఎక్కువగా కార్టూన్ చూడటానికి ఉపయోగిస్తున్నారని తేలింది. తినడం, నేర్చుకోవడం, నిద్రపోవడం వంటి దినచర్యలో డిజిటల్ పరికరాలు ఎలా చొచ్చుకుపోయాయో ఈ అధ్యయనం వెల్లడిస్తోంది.

కఠిన పరిమితులు అవసరం..



'ప్రారంభంలోనే ఆరోగ్యకరమైన స్క్రీన్ అలవాట్లను పెంపొందించడం పిల్లల కంటి ఆరోగ్యాన్ని కాపాడటానికి కీలకం' అని వైద్యులు చెబుతున్నారు. 'కఠినమైన స్క్రీన్ సమయ పరిమితిని నిర్ణయించడం అనే అంశానికి తల్లిదండ్రులు కూడా మద్దతు ఇవ్వగలగడం ఆరోగ్యకరమైన మార్పుకు ఒక మార్గం. విద్యావేత్తలకు స్క్రీన్‌లు అవసరమైనప్పుడు, 20–20–20 నియమాన్ని అనుసరించండి. ప్రతి ఇరవై నిమిషాలకు, ఇరవై సెకన్ల విరామం తీసుకోండి. డిజిటల్ కంటి ఒత్తిడిని తగ్గించడానికి 20 అడుగుల దూరంలో ఉన్న దేనినైనా చూడండి. బ్లూ లైట్ ఫిల్టర్ మోడ్ ఉపయోగించడం కూడా కంటి ఆరోగ్యానికి సహాయపడుతుంది' అంటూ సూచిస్తున్నారు.

స్క్రీన్ టైం ప్రభావం..


'ఎక్కువసేపు స్క్రీన్ వాడటం వల్ల పాఠశాల వయసు పిల్లలకు మయోపియా లేదా సమీప దృష్టి లోపం కలుగుతోంది. ఈ మయోపియా వేగంగా అభివృద్ధి చెందడం వల్ల మెల్లకన్ను, పొడి కంటి వ్యాధి, కంటి డిజిటల్ ఒత్తిడి ప్రమాదం ఎక్కువవుతుంది' అని కంటి వైద్య నిపుణులు అంటున్నారు. 'స్క్రీన్ నుంచి వెలువడే నీలి కాంతి విభిన్న రకాల ముప్పును కలిగిస్తుంది. ఫ్రీ రాడికల్స్ కారణంగా రెటీనాకు నష్టం కలిగించడం, మెలటోనిన్‌ను అణచివేయడం వల్ల నిద్రకు భంగం కలుగుతుంది. తద్వారా మొత్తం ఆరోగ్యం ప్రభావితం అవుతుందని వివరిస్తున్నారు.



క్లుప్తంగా...

వాదనకు దిగితే కేసు పెడతారా?

పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: వాదనకు దిగినంత మాత్రాన తప్పుడు అభియోగాలు మోపడం అధికార దుర్వినియోగమే అవుతుందంటూ పోలీసుల తీరును హైకోర్టు తప్పుబట్టింది. ప్రజలు ఏదైనా విషయంపై వాదిస్తే ప్రభుత్వ ఉద్యోగులు తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించడంలో ఆటంకం కలిగించారనే అభియోగంగా పరిగణించలేమని చెప్పింది. దీనిని ఐపీసీ సెక్షన్ 353 పరిధిలోకి తీసుకొచ్చి కేసు నమోదు చేయడాన్ని సమర్థించలేమని తేల్చి చెప్పింది. ఇలా ఎవరైనా చేస్తే.. అది చట్టపరమైన నిబంధనలను దుర్వినియోగం చేసినట్లే అవుతుందని నొక్కిచెప్పింది. అక్కినేని రాజ శేఖర్, అతని పొరుగువారి మధ్య భూ ఆక్రమణ అంశంపై జరిగిన వివాదాన్ని ఆపడానికి కానిస్టేబుల్ ప్రయత్నించినప్పుడు, కానిస్టేబుల్‌తో వాదనకు దిగినందుకు రాజశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై అతను హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి విచారణ చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగి విధులను నిర్వర్తించకుండా అతనిపై దాడి చేసినప్పుడు మాత్రమే సెక్షన్ 353 ప్రయోగించడం సాధ్యమవుతుందని చెబుతూ.. కేసును కొట్టివేశారు.

భట్టి, ఉత్తమ్‌కు ఊరట

క్రిమినల్ కేసును రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి 2021లో నమోదైన ఓ క్రిమినల్ కేసు నుంచి హైకోర్టులో ఊరట లభించింది. పలు సెక్షన్ల కింద నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దుచేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు వారిద్దరూ దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ 2021, జనవరి 19న కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో భట్టి, ఉత్తమ్, ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. అయితే, ర్యాలీ నిర్వహించడానికి ముందస్తు అనుమతి తీసుకోనందుకు వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ర్యాలీ కారణంగా తెలుగు తల్లి జంక్షన్ వద్ద వీరు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే ఎలాంటి ఆధారాలు లేకుండా నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఉత్తమ్, భట్టి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి సోమవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్లు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారనడానికి ఎలాంటి ఆధారాలు లేవంటూ కేసు రద్దు చేశారు.



భారతీయ సినిమా నిర్మాణ కేంద్రంగా హైదరాబాద్

జాతీయ ఫిల్మ్ అవార్డు గ్రహీతలను సన్మానించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సినిమా రంగాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన చేయూతనందిస్తామని ఆయన తెలిపారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల్లో వివిధ విభాగాలకు ఎంపికైన సినీ ప్రముఖులు సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు సీఎం దృష్టికి తెచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి.. అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి, హనుమాన్ సినిమా డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్టులకు పనిచేసిన వెంకట్, శ్రీనివాస్, టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్, సింగర్ రోహిత్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు సంస్థ - పిటిషనర్ల మధ్య బేరం కుదిరినట్లుంది..

మాతోనే బేరసారాలా?

మద్యం కేసులో ప్రాసిక్యూషన్ తీరుపై ఏసీబీ ప్రత్యేక కోర్టు తీవ్ర ఆక్షేపణ

సాక్షి, అమరావతి: మద్యం విధానంపై అక్రమ కేసు విచారణ సందర్భంగా ఏసీబీ న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో దర్యాప్తు సంస్థ వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఆక్షేపించింది. ప్రాసిక్యూషన్ 'పిక్ అండ్ చూజ్' (ఇష్టం వచ్చినట్లు ఎంచుకోవడం) విధానాన్ని అనుసరించడంపై విస్మయం వ్యక్తం చేసింది. ప్రధాన నిందితుడిని అప్రూవర్‌గా మార్చడానికి యత్నిస్తోందని, ఈ చర్య మొత్తం కేసుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని తప్పుబట్టింది. పిటిషనర్లకు, దర్యాప్తు సంస్థ మధ్య బేరం కుదిరిందన్న విషయాన్ని చాలా స్పష్టంగా ప్రస్ఫుటం చేస్తోందని వ్యాఖ్యానించింది. ఈమేరకు మద్యం విధానం కేసులో నిందితులుగా ఉన్న ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) పూర్వ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ శాఖ మాజీ స్పెషల్ ఆఫీసర్ దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ పిటిషన్లు పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, అరెస్ట్, అభియోగాల నుంచి తప్పించుకోవడానికే దొడ్డిదారిన దాఖలు చేశారని పేర్కొంది. అప్రూవర్‌కి ముందస్తు బెయిల్ ఇవ్వడానికి వీల్లేదని, ట్రయల్ పూర్తయ్యే వరకు వారిని కస్టడీలోనే ఉంచి తీరాలని స్పష్టం చేసింది. అప్రూవర్‌గా మారతామన్న ప్రతిపాదనలకు చట్ట ఆమోద యోగ్యత లేదని తేల్చి చెప్పింది. ముందస్తు బెయిల్ కోసం వారిద్దరూ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు సోమవారం తీర్పు వెలువరించారు. తీర్పు సారాంశం ఇదీ...

అప్రూవర్‌గా మారుతామన్న వాగ్దానంపై బెయిల్ ఇవ్వడానికి వీల్లేదు...

'చట్ట ప్రకారం అప్రూవర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి వీల్లేదు. అప్రూవర్‌కు క్షమాభిక్ష ప్రసాదించిన తరువాత అతన్ని బెయిల్‌పై విడుదల చేయడానికి వీల్లేదు. ట్రయల్ పూర్తయ్యేంత వరకు కస్టడీలోనే ఉంచి తీరాలి. సీఆర్‌పీసీలోని సెక్షన్ 306(4) (బీ) అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమన్న వాగ్దానంపై బెయిల్ మంజూరు చేయడాన్ని నిషేధిస్తోంది. బెయిల్‌తో సంబంధం లేకుండా అప్రూవర్ సాక్ష్యం నమ్మదగినదిగా, మరకలు లేనిదిగా ఉండాలన్నదే ఈ నిషేధం వెనుక ఉన్న తర్కం. అప్రూవర్ భవిష్యత్తులో బెయిల్ పొందే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని ఇతరులను కేసులో ఇరికించవచ్చు లేదా సాక్ష్యాన్ని మార్చవచ్చు. అందువల్ల అప్రూవర్‌గా మారుతానన్న వాగ్దానాల లాంటి వాటిపై బెయిల్ ఇవ్వడం న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను తక్కువ చేయడమే. బెయిల్ పిటిషన్లను ఆయా కేసుల్లోని పూర్వాపరాల ఆధారంగా తేల్చాల్సి ఉంటుందే గానీ, అప్రూవర్‌గా మారుతానన్న వాగ్దానాల ఆధారంగా కాదు...' అని ప్రత్యేక కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

ప్రభుత్వం పిటిషనర్లను అప్రూవర్‌గా మార్చడానికి చూస్తోంది!

'పిటిషనర్లు దర్యాప్తునకు కొంత మేర సహకరించారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పెషల్ పీపీ చెప్పారు. అయితే ఇది ఎంత మాత్రం సరిపోదు. ఈ మొత్తం కేసులో తన పాత్ర గురించి, ఇతర నిందితుల పాత్ర గురించి పూర్తి వాస్తవాలను తెలియచేయాల్సి ఉంటుంది. పిటిషనర్లకు ముందస్తు బెయిల్ ఇస్తే పలు షరతులు విధించాలని స్పెషల్ పీపీ చెబుతున్నారు. ట్రయల్ పూర్తయ్యేంత వరకు నిందితులను కస్టడీలో ఉంచకుండా బెయిల్‌పై విడుదల చేస్తే వారు కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటారన్న గ్యారెంటీ ఏమీ లేదు. శక్తివంతులైన సహ నిందితులు గతంలో తమకున్న సాన్నిహిత్యంతో పిటిషనర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, భయపెట్టడం చేయవచ్చు. అందుకే అప్రూవర్‌ను ట్రయల్ పూర్తయ్యే వరకు కస్టడీలోనే ఉంచాలని చట్టం చెబుతోంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ 'పిక్ అండ్ చూజ్' (ఇష్టం వచ్చినట్లు ఎంచుకోవడం) విధానాన్ని అనుసరిస్తోంది. ప్రత్యేకించి ఈ కేసులో ప్రధాన నిందితుడిని అప్రూవర్‌గా మార్చడానికి చూస్తోంది. ఈ చర్య మొత్తం కేసుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది..' అని న్యాయస్థానం తన తీర్పులో ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రధాన నిందితులను అప్రూవర్‌గా మార్చడం ఓ నిష్ఫలయత్నం..

'లిక్కర్ స్కాంలో పిటిషనర్ల పాత్ర చాలా కీలకమైంది. శరీరానికి తల ఎంత ముఖ్యమో వీరు కూడా అంతే ముఖ్యం. తల తొలగిస్తే మొత్తం శరీరం కుప్పకూలిపోతుంది. అందువల్ల ప్రధాన నిందితులను ప్రాసిక్యూషన్ అప్రూవర్‌గా తీసుకోలేదు. రహస్యంగా చేసిన హత్య కేసుల్లో సాక్షి ఎవరూ లేనప్పుడు నిందితుల్లో ఒకరిని అప్రూవర్‌గా తీసుకోవడం జరుగుతుంది. కానీ వాస్తవాలను బయట పెట్టే రాతపూర్వక, శాస్త్రీయ ఆధారాలు ఉన్నప్పుడు ఇలాంటి ఆర్థిక నేరాల్లో ప్రధాన నిందితులను అప్రూవర్లుగా మార్చలేరు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ దర్యాప్తు పూర్తి చేసింది. కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిపై చార్జిషీట్ కూడా దాఖలు చేసింది. అలాగే నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలపై అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. 282 మంది సాక్షులను విచారించడంతో పాటు ట్రంకుపెట్టెల్లో పెద్ద సంఖ్యలో డాక్యుమెంట్లను దర్యాప్తు సంస్థ సేకరించింది. అందువల్ల పిటిషనర్లను అప్రూవర్లుగా తీసుకోవాల్సిన అవసరం ఏదీ లేదు. వాస్తవానికి ఇదో నిష్ఫల యత్నం...' అని ఏసీబీ కోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది.

కోర్టుతోనే బేరసారాలు..

న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను తక్కువ చేయడమే!

'ఈ కేసులో తాము అప్రూవర్‌గా మారతామని, ఇందులో భాగంగా తమకు క్షమాభిక్ష ప్రసాదించాలని వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ వేర్వేరుగా సీఆర్‌పీసీ సెక్షన్ 306 కింద పిటిషన్లు దాఖలు చేశారు. అవి లోపభూయిష్టంగా ఉండటంతో ఈ కోర్టు కొన్ని అభ్యంతరాలు తెలిపింది. తదనుగుణంగా వాటిని రిటర్న్ చేసింది. అయితే కోర్టు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పిటిషనర్లు సవరించలేదు. సవరణలతో మళ్లీ పిటిషన్లు దాఖలు చేయలేదు. అప్రూవర్‌లుగా మారే విషయంలో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లకు సదుద్దేశం లేదన్న విషయాన్ని ఇది స్పష్టం చేస్తోంది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే గానీ అప్రూవర్‌లుగా మారే ప్రసక్తే లేదన్నట్లుగా పిటిషనర్ల తీరు. ముందస్తు బెయిల్ ఇస్తేనే అప్రూవర్‌లుగా మారతామనడం కోర్టుతో బేరసారాలు చేయడమే అవుతుంది. ఇది న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను తక్కువ చేయడమే. అంతేకాక ఇది పిటిషనర్లకు, దర్యాప్తు సంస్థ మధ్య బేరం కుదిరిందన్న విషయాన్ని చాలా స్పష్టంగా ప్రస్ఫుటం చేస్తోంది. ఈ తీరు సీఆర్‌పీసీ సెక్షన్ 306 (4) (బీ) కింద నిర్దేశించిన విధానానికి పూర్తి విరుద్ధం. ఈ పిటిషన్లు పూర్తిగా తప్పుదోవ పట్టించేవి. కాబట్టి పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేసే విషయంలో ఈ కోర్టు తనకున్న విచక్షణాధికారాన్ని ఉపయోగించడం లేదు..' అని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

ముందస్తు బెయిల్ కోసం దొడ్డిదారిన పిటిషన్లు...

'లిక్కర్ స్కాంలో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ నిందితులుగా ఉన్నారు. ఈ వ్యవహారంలో వారు క్రియాశీలకంగా వ్యవహరించారు. వీరిపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవి. అయితే అరెస్ట్ నుంచి తప్పించుకోవటానికి, అభియోగాల నుంచి విముక్తి పొందేందుకు దొడ్డిదారిన వీరు ఈ ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. అప్రూవర్‌గా మారేందుకు ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న ప్రతిపాదనతో ఈ వ్యాజ్యాలు వేశారు. అయితే ఇలాంటి పద్ధతులకు చట్ట అమోద యోగ్యత లేదు...' అని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

ఉపరాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవానికి వైఎస్సార్‌సీపీ మద్దతు కోరిన కేంద్రం

వైఎస్ జగన్‌తో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సంప్రదింపులు



సాక్షి, న్యూఢిల్లీ : ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ ఏకగ్రీవ ఎన్నికకు మద్దతు ఇవ్వాలని ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కోరారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ తమ అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయనను ఏకగ్రీవంగా గెలిపించేందుకు రాజ్‌నాథ్‌సింగ్ స్వయంగా వైఎస్ జగన్‌ను ఫోన్‌లో సంప్రదించారు. వైఎస్సార్‌సీపీకి ప్రస్తుతం లోక్‌సభలో నలుగురు, రాజ్యసభలో ఏడుగురు ఎంపీలు ఉన్నారు. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇచ్చే అంశంపై పార్టీలో అంతర్గతంగా చర్చించిన తర్వాత తమ నిర్ణయం తెలియచేస్తామని వైఎస్ జగన్ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌కు తెలియజేసినట్టు సమాచారం.

ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక దృష్టి సారించండి

- సీఐఎస్ సమీక్షలో కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: మహిళలు, చిన్నారులు లక్ష్యంగా సాగే ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. సైబర్ మోసాలపై స్థానిక భాషల్లో విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని తన కార్యా లయంలో సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ (సీఐఎస్) కార్య కలాపాలను కేంద్ర మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4ఇ) ప్రాధాన్యతను అధికారులకు వివరించారు. సైబర్ నేరాలపై పోరాటంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వ యం కల్పించే ప్రధాన కేంద్రంగా ఐ4సీ పని చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నియంత్రణలో భాగంగా తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రికి సంబంధిత శాఖ అధికారులు వివరించారు.

కొత్తగా 46 ఏటీసీలు మంజూరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 46 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 46 సెగ్మెంట్లో వీటిని ఏర్పాటు చేస్తూ కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్తగా ఏర్పాటయ్యే ఏటీసీలను టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో నిర్మించనున్నారు. ఒక్కో ఏటీసీని రూ.45.15 కోట్లతో నిర్మిస్తారు. వీటికోసం రూ.2,076.90 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మొత్తంలో టాటా టెక్నాల జీస్ లిమిటెడ్ వాటా రూ.1,426.46 కోట్లు కాగా... ప్రభుత్వం రూ.650.44 కోట్లు ఖర్చు చేయనుంది. కొత్త ఏటీసీల్లో ఉద్యోగాలు, ఇతర పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ త్వరలో విడుదల చేయనుంది.

నగర వార్తలు

నిండుకుండలా గండిపేట చెరువు



మణికొండ: ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు జలకళ వచ్చింది. గండిపేట(ఉస్మాన్‌సాగర్) చెరువు నిండుకుండలా మారింది. ఇప్పటికే హిమాయత్ సాగర్ చెరువు నిండటంతో పాటు పలుమార్లు గేట్లను తెరిచి నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. గండిపేట చెరువు పరీవాహకమైన శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్, వికారాబాద్ మండలాల్లో కురిసిన వర్షాలకు నీటి మట్టం 1,783 అడుగుల నుంచి 1,788 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం(1,790) మరో రెండు అడుగుల దూరంలో ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదడుగుల మేర కొత్తనీరు చేరింది. సోమవారం 1,500 క్యూసెక్కుల వరద వచ్చిందని, మరో భారీ వర్షం కురిస్తే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశం ఉందని గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి మట్టానికి చేరుకోగానే గేట్లు తెరిచేందుకు జలమండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు మరింత స్మార్ట్‌గా..

- అందుబాటులోకి స్మార్ట్ కియోస్క్, డిజిటల్ మ్యాపులు



శంషాబాద్: జీఎంఆర్ శంషాబాద్ విమానాశ్రయం డిజిటల్ దిశగా మరో అడుగువేసింది. తాజాగా వర్చుల్ ఇన్ఫర్మేషన్ కియోస్క్, ఇంటరాక్టివ్ టెర్మినల్ మ్యాపులను ప్రారంభించింది. ప్రధాన చెక్-ఇన్ హాల్స్, బోర్డింగ్ గేట్లు, అరైవల్స్, బ్యాగేజీ క్లెయిమ్స్ ప్రాంతాల్లో 10 కియోస్కులు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రయాణికులకు రియల్ టైమ్ ఫ్లైట్స్ అప్‌డేట్ 3డీ నావిగేషన్, అత్యవసర సహాయానికి సంబంధించిన సమాచారం, అంతర్జాతీయ ప్రయాణికులకు వైఫై యాక్సెస్‌తోపాటు త్వరితగతిన ఫీడ్‌బ్యాక్ సమాచారాలు అందుతాయి. కియోస్క్‌తో కూడిన ఈ విస్తృత వ్యవస్థలో గెయిల్ అధికార వెబ్‌సైట్ ఇంటరాక్టివ్ టెర్మినల్ మ్యాపులను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారా ప్రయాణికులు రిటైల్ దుకాణాలు, భోజన కేంద్రాలు, ఇతర ముఖ్యవసతులకు సంబంధించిన సమాచారాన్ని పొందుతారు. ఈ సందర్భంగా గెయిల్ సీఈఓ ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విమాన హబ్‌గా మార్చేందుకు విమానాశ్రయంలో ఎప్పటికప్పుడు ప్రయాణికులకు సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

నీటి పరీక్షల తర్వాతే సరఫరా

- వర్షాల నేపథ్యంలో అధికారులను ఆదేశించిన జలమండలి ఎండీ
- రెట్టింపు సంఖ్యలో శాంపిళ్ల సేకరణ

సాక్షి, సిటీబ్యూరో: వర్షాల వేళ జలమండలి అప్రమత్తమైంది. నగరవాసులకు అందించే తాగునీటి నాణ్యతపై దృష్టి సారించింది. నీటి శాంపిళ్లను పరీక్షించిన తర్వాతే సరఫరా చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో అధికారులతో భేటీ అయ్యారు. నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న కృష్ణా, గోదావరి, మంజీరాలతోపాటు ఇతర తాగునీటి ప్రాజెక్టులపై ఓఅండ్ఎం, ట్రాన్స్‌మిషన్, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మంచినీరు కలుషితం కాకుండా ఓఅండ్ఎం, ట్రాన్స్‌మిషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండి నాణ్యతా ప్రమాణాలను కాపాడాలన్నారు. ట్రాన్స్‌మిషన్, ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, వాటర్ క్వాలిటీ, క్లోరినేషన్ వివరాలపై ఆయన ఆరా తీశారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం అన్ని సెక్షన్లలో మంచినీటి నమూనాలను సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. రెట్టింపు సంఖ్యలో శాంపిళ్లు సేకరించాలని సూచించారు. బస్తీల్లో కలుషిత తాగునీరు సరఫరా కాకుండా ఎలాంటి జాగ్రత్తలు చేపట్టారు? ఒకవేళ కలుషితమైతే ఆ సమస్యను ఎలా పరిష్కరిస్తారని అధికారులను అడిగి తెలుసుకున్నారు.



తాగునీటి నాణ్యతపై సమీక్షిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సమష్టిగా నాణ్యతపై నజర్

అన్ని విభాగాల అధికారులు సమష్టిగా మంచినీటి నాణ్యత మీద దృష్టి సారించాలని అశోక్‌రెడ్డి సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా, మురికివాడల్లో క్లోరిన్ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పంపుహౌస్‌ల మోటార్లు పంపు చేసే నీటి పరిమాణాలకు సంబంధించిన లాగ్‌బుక్‌లు, పంపుల రిపేర్లు, నిర్వహణ వివరాల రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పంపుహౌస్‌లలో స్టాండ్ బై మోటార్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, ట్రాన్స్‌మిషన్ సీజీఎం బ్రిజేష్, జీఎంలు, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సృజన భారతి ఆధ్వర్యంలో డాక్టర్ సుందర సాయి రచించిన 'మౌన సాక్ష్యాలు'పుస్తకావిష్కరణ రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'ది గోలిమార్ ఎడిషన్'పేరిట హై లైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

రాజ్‌భవన్‌లో ఉచిత వైద్యశిబిరం



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ఉచిత మెగా సర్జికల్ కరెక్షన్ అండ్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ నాయకత్వంలో వికలాంగుల ట్రస్ట్, బద్రి విశాల్ పన్నాలాల్ పిట్టీ ట్రస్ట్, అగర్వాల్ సేవాదళ్, మహావీర్ వికలాంగ సహాయత సమితి, డ్వార్ నారి చారిటబుల్ ట్రస్ట్, రామ్‌దేవ్‌రావు హాస్పిటల్, జన జాగృతి ట్రస్ట్‌ల సహకారంతో ఈ క్యాంప్ నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. దీనికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన హాజరయ్యారు. గవర్నర్ చేతుల మీదుగా పలువురు దివ్యాంగులకు ఎలక్ట్రిక్ వాహనాలు, క్రచెస్, కాలిపర్లు, కృత్రిమ అవయవాలు, వాకర్లు, వీల్‌చైర్లు పంపిణీ చేశారు. శిబిరానికి సుమారు 900 మంది దివ్యాంగులు హాజరుకాగా, 71 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. దివ్యాంగుల పునరావాసం, వినోదం, క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలని గవర్నర్ అన్నారు. కార్యక్రమంలో డిజేబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరయ్య, రెడ్ క్రాస్ రాష్ట్ర సీఈఓ సీఈఓ శ్రీరాములు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ భీంరెడ్డి, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ నారి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కీర్తన యాదవ్, ఎఫ్ఈడీ సంస్థ గంగారామ్, వికలాంగుల నెట్‌వర్క్ శ్రీనివాస్, నామా నాగేశ్వర్, కిరణ్ గుటికొండ, రెడ్‌క్రాస్ బృందం విజయ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9 నుంచి ప్రిజన్ డ్యూటీ మీట్

చంచల్‌గూడ: ఈ ఏడాది నిర్వహించనున్న 7వ ఆలిండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. తెలంగాణ జైళ్ల శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు స్టేట్ పోలీస్ అకాడమీలో నిర్వహించనున్నాయి. ఈ మేరకు సోమవారం చంచల్‌గూడలోని సీకా కార్యాలయంలో రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యా మిశ్రా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డ్యూటీ మీట్-2025 అధికారిక వెబ్‌సైట్, లోగోను ఆమె ఆవిష్కరించారు. ఈ డ్యూటీ మీట్‌లో పాల్గొననున్నట్లు ఇప్పటికే 22 రాష్ట్రాలు ధ్రువీకరించాయని అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి 1,200 మందికి పైగా పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో జైళ్ల శాఖ ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, ఎం.సంపత్ పాల్గొన్నారు.

హైడ్రా కార్యాలయంలో సర్వాయి పాపన్న జయంతి



సాక్షి, సిటీబ్యూరో: సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 375వ జయంతిని హైడ్రా ఘనంగా నిర్వహించింది. బుద్ధభవన్‌లోని ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎస్పీలు అశోక్, సుదర్శన్, అదనపు సంచాలకుడు పాపయ్యతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఓపెన్ స్కూల్స్‌తో మరో అవకాశం

సాక్షి,సిటీ బ్యూరో: చిన్న వయసులోనే చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్స్ వరం లాంటిదని, మరోసారి చదివే అవకాశం కలుగుతుందని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సోమవారం టాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ క్రాంతిరెడ్డితో ఆమె సమావేశమయ్యారు. చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్స్‌పై అవగాహన కల్పించే బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. బంజారా వాడల్లో ఓపెన్ స్కూల్స్ ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సిబ్బంది కూడా తమ పదోన్నతుల కోసం ఓపెన్ స్కూల్స్ ద్వారా విద్యార్హతలు పొందవచ్చని, ఈ దిశగా ఉన్నతాధికారులు వారిని ప్రోత్సహించాలన్నారు.


వరద ముప్పు తప్పించండి!

హైడ్రాకు విన్నవించుకున్న కాలనీల ప్రజలు



సాక్షి, సిటీబ్యూరో: వర్షాల వేళ ముంపు ముప్పు తప్పించాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. కాలనీలు, రహదారులు మునిగిపోవడానికి కారణమవుతున్న కబ్జాలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 39 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికం నాలాలు, కాల్వల కబ్జాలకు సంబంధించినవే. ఐఎస్ సదన్ ప్రాంతాన్ని వరద నీరు ముంచెత్తుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్, టోలీచౌక్ వంతెన పరిసరాల్లో వర్షం వస్తే ఇబ్బందిగా మారుతోందని ఆ ప్రాంతవాసులు పేర్కొన్నారు. సోమాజిగూడ యశోద ఆసుపత్రి పరిసరాల్లో నీరు నిలిచిపోవడంతో ఎగువ కాలనీ వాసుల నుంచి ఫిర్యాదు వచ్చింది. జూబ్లీహిల్స్ నుంచి జర్నలిస్టు కాలనీ వైపు వచ్చే మార్గంలో నిలిచే నీటిని కేబీఆర్ పార్కులోకి మళ్లించాలని జర్నలిస్టు కాలనీవాసులు కోరారు. నాచారం పారిశ్రామికవాడలోని సింగం చెరువు నాలాను కబ్జా చేయడంతో ఆ వరద తమ నివాసాలను ముంచెత్తుతోందని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పర్వతాపూర్ సాలార్‌జంగ్ కంచ్‌లోని వివిధ సర్వే నంబర్లలో కబ్జాలపాలవుతున్న 38 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను కాపాడాలని స్థానికులు కోరారు. ఈసీఐఎల్ క్రాస్ రోడ్స్ వంపుగూడలోని గోపాల్‌రెడ్డి నగర్ లే ఔట్‌లోని పార్కులు, ప్రజావసరాలు, రహదారుల స్థలాలను కొందరు ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారని గోపాల్ రెడ్డి నగర్ వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు చేసింది. జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన రెండున్నర ఎకరాల భూమిని స్థానిక నాయకురాలు కబ్జా చేసిందంటూ ఫిర్యాదు అందింది.

హైదరాబాద్ డీఆర్ఎంగా సంతోష్‌కుమార్‌వర్మ



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సంతోష్ కుమార్ వర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ స్టోర్స్ (ఐఆర్ఎస్ఎస్) 1995 బ్యాచ్‌కు చెందినవారు. ఈ పదవీ బాధ్యతలు చేపట్టడానికి ముందు న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. మదన్ మోహన్ మాలవ్య యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎంఎంయూటీ) నుంచి బీఈ (మెకానికల్), ఐఐటీ కాన్పూర్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. ఆయన సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో సీనియర్ డీఎంఎంగా బాధ్యతలు చేపట్టారు. ప్రయాగ్‌రాజ్‌లోని సెంట్రల్ ఆర్గనైజేషన్ ఫర్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్‌లో డిప్యూటీ సీఎంఎంగా పనిచేశారు. హుబ్లీ డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టారు.

యూరియా కోసం ధర్నాలు, రాస్తారోకోలు



మహబూబాబాద్ పీఏసీఎస్ ప్రధాన ద్వారం ఎప్పుడు తీస్తారో తెలియక అక్కడే పడిగాపులు పడుతున్న రైతులు

వరంగల్ నెట్‌వర్క్/తల్లాడ/సుజాతనగర్: యూరియా కొరత రైతులను పరుగులు పెట్టిస్తోంది. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల రైతులు ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. మహబూబాబాద్ సొసైటీ కార్యాలయం వద్ద సుమారు 1,000 నుంచి 1,200 మంది రైతులు తెల్లవారుజామునుంచే ఎదురుచూశారు. ఆధార్ కార్డుల ఆధారంగా ఒక్కొక్కరికి ఒక బస్తా చొప్పున 444 మందికి యూరియా బస్తాలను అందజేశారు. మిగిలిన రైతులు ఆగ్రహంతో మహబూబాబాద్ పీఏసీఎస్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నెల్లికుదురు సొసైటీ కార్యాలయం ఎదుట, మహబూబా బాద్ ప్రధాన రహదారిపై, గూడూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మహబూబాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం 888 బస్తాల యూరియా రాగా, సుమారు 1,500 మందికి పైగా రైతులు వర్షంలోనే బారులుదీరారు. కాగా, పూర్తిస్థాయిలో యూరియా అందించాలంటూ ఎల్కతుర్తిలోని హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకోకు దిగారు.



ఖమ్మం జిల్లా తల్లాడలో యూరియా కోసం సొసైటీ కార్యాలయం ఎదుట వేచిచూస్తున్న రైతులు

ఎటుచూసినా రైతుల నిరీక్షణే..

ఖమ్మం జిల్లా తల్లాడ పీఏసీఎస్‌కు 911 బస్తాల యూరియా వచ్చిందని సమాచారం తెలియగానే సుమారు 1000 మంది రైతులు వర్షంలోనే సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే చేరుకున్నారు. కొందరికి కూపన్లు అందగా, అవి అందని వారు వాగ్వాదానికి దిగారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌లోనూ సోమవారం పెద్దఎత్తున సహకార కార్యాలయం వద్దకు చేరుకుని యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు.



హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో యూరియా కోసం బారులుదీరిన రైతులు

క్లుప్తంగా...

పదవులు రాలేదని నిరాశ చెందొద్దు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తమకు పదవులు రాలేదని పార్టీలోని మహిళా నేతలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, కష్టపడి పనిచేసే వారందరికీ కాంగ్రెస్ పార్టీ గుర్తింపునిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. మహిళా కాంగ్రెస్ నేతలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సునీతారావు అధ్యక్షతన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర పరిశీలకురాలు కమలాక్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలన గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యతను మహిళా కాంగ్రెస్ తీసుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

బడుగుల కోసం పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాడారని, పేద ప్రజలకు అండగా నిలిచారని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచంద్రరావు పేర్కొన్నారు. ఆ కాలంలోనే పెత్తందారీ వ్యవస్థను ఎదిరించారని, తెలంగాణలో పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడి అమరులయ్యారన్నారు. అన్యాయం జరిగితే దానికి పోరాటమే మార్గమని, ఆ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని, పాపన్న గౌడ్ నుంచి మనం నేర్చుకోవాల్సింది ఇదేనని ఆయన తెలిపారు. మహిళలపై అత్యాచారాలు, అన్యాయాలపై పోరాటానికి పాపన్న గౌడ్ ఒక వీరుడిగా అవతరించారని చెప్పారు. పాపన్న జయంతి సందర్భంగా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ ఓబీసీ మోర్చా నిర్ణయించిందని రాంచంద్రరావు తెలిపారు. సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా, గీతా సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి రాంచందర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న

- మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్ని కులాల కోసం పోరాడిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బహుజన రాజ్య స్థాపన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సోమవారం చిక్కడపల్లిలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీనివాస్‌గౌడ్.. పాపన్న విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

చంద్రబోస్, సర్వాయి పాపన్నలకు కాంగ్రెస్ నివాళి

సాక్షి, హైదరాబాద్: నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ సర్వాయి పాపన్నలకు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులర్పించారు. బోస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ తదితరులు నివాళులర్పించారు. అంతకుముందు గాంధీభవన్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా టీపీసీసీ కల్లుగీత విభాగం ఆధ్వర్యంలో కూడా ఘన నివాళులర్పించారు.

అడ్డుకుంటున్నది వారే

▶ మొదటి పేజీ తరువాయి

చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రవీంద్రభారతిలో సభికులనుద్దేశించి మాట్లాడారు.

పర్యాటక ప్రాంతంగా ఖిలా షాపూర్ అభివృద్ధి

'బహుజనుల సామ్రాజ్య స్థాపన కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. అలాంటి వ్యక్తి నిర్మించిన ఖిలా షాపూర్ కోటను బీఆర్ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో కాలగర్భంలో కలిపేందుకు కుట్ర చేసింది. మేం ఆనాడు కోట పైకి వెళ్లి చూసి.. దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చెప్పాం. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై దృష్టి పెట్టాం..' అని సీఎం తెలిపారు.

బీజేపీకి ఆ ధైర్యం ఉందా?

'రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, శాస్త్రీయంగా కుల సర్వే చేపట్టి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ కులాల గణాంకాలను తేల్చింది. రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో విద్య, ఉద్యోగాలు, ఉపాధితో పాటు రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో రెండు వేర్వేరు చట్టాలు చేసి కేంద్రానికి పంపించాం. ఐదు నెలలు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో బిల్లులు ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ధర్నా చేశాం. ఈ ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ దూరంగా ఉన్నాయి. బీసీలంటే బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లులకు బీజేపీ మతం రంగు పులిమింది. మోదీ, కిషన్‌రెడ్డి వీటిని అడ్డుకుంటున్నారు. అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్‌లో ముస్లింలు బీసీ జాబితా ద్వారానే రిజర్వేషన్లు పొందుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో ముస్లింలను బీసీ జాబితా నుంచి తొలగించే ధైర్యం బీజేపీకి ఉందా? రాహుల్ గాంధీపై కోపం ఉంటే ఆయనపై చూపాలి కానీ ఆయన సిద్ధాంతాలపై చూపొద్దు..' అని రేవంత్ అన్నారు.



రవీంద్రభారతిలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణలోనూ ఓట్లు చోరీ చేసే కుట్ర..

'దేశంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దొంగ ఓట్ల కుట్రను రాహుల్‌గాంధీ బట్టబయలు చేశారు. మహారాష్ట్రలో ఎన్నికల కమిషన్ కేవలం నాలుగు నెలల్లో కోటి ఓట్లు నమోదు చేసింది. అంబేడ్కర్ పుట్టిన గడ్డ మీద రాజ్యాంగాన్ని అపహాస్యం చేసింది. దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు దేశం నలుమూలలా ఓట్ల చోరీ జరుగుతోంది. ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలని రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్నారు. త్వరలో డిప్యూటీ సీఎంతో కలిసి ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలియజేస్తా. ఇక్కడ కూడా ఓట్ల చోరీ చేసే కుట్ర జరుగుతోంది. అందరం కలిసికట్టుగా ఓట్ల చోరీకి పాల్పడేవారి భరతం పడదాం..' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

బహుజనుల పిల్లలు రాజ్యాధికారం సాధించాలి

'బహుజనుల పిల్లలంతా ఉన్నత చదువులు చదివి రాజ్యాధికారం సాధించాలి. బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుంది. విగ్రహాలు.. వర్ధంతులు, జయంతుల కోసం కాదు. ప్రతి ఒక్కరిలో వారి స్ఫూర్తిని రగిలించేందుకే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నాం..' అని రేవంత్ అన్నారు.

తెలంగాణ నిర్ణయాలు దేశానికే ఆదర్శం: భట్టి విక్రమార్క

రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సామాజిక విప్లవానికి కూడా తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేసిన కుల సర్వేను కేంద్రం నమూనాగా తీసుకుని కులగణనకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని, కానీ కొన్ని రాజకీయ పార్టీలు రకరకాలుగా ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కోసం స్థలాన్ని ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల తరపున భట్టి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సర్వాయిపేట కోటను రూ.4.5 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సర్వాయి పాపన్న గౌడ్ ఒంటరిగా పోరాటం చేయలేదని, బహుజనులందరితో కలిసి ఉద్యమించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో!

- సచివాలయంలో 'మన ఊరు – మన బడి' కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా
- ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కార్యాలయం ఎదుట ఆందోళన



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

సాక్షి, హైదరాబాద్: తమ బిల్లులు తక్షణమే చెల్లించాలని 'మన ఊరు– మన బడి' కాంట్రాక్టర్లు సచివాలయంలో సోమవారం మెరుపు ధర్నా చేశారు. 33 జిల్లాల నుంచి దాదాపు వందమంది కాంట్రాక్టర్లు సచివాలయానికి చేరుకొని సందర్శకుల మాదిరిగా పాస్‌లు తీసుకున్నారు. అయితే సచివాలయ సెక్యూరిటీగా ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) పోలీసులు అందర్నీ లోపలికి వదలకుండా ఆపేశారు. దీనితో దాదాపు 50 మందికిపైగా కాంట్రాక్టర్లు సచివాలయంలోకి మధ్యాహ్నం 3 గంటల తర్వాత వెళ్లారు. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఒక్కసారిగా అవాక్కైన సచివాలయ భద్రతా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఎస్‌పీఎఫ్ అక్కడకు క్షణాల్లో చేరుకుంది. ధర్నా నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని సంబంధింత శాఖకు తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో నెమ్మదించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యను విన్నవించారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని భట్టి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు అభిలాశ్ (నల్లగొండ), చంద్రారెడ్డి(రంగారెడ్డి) తదితరులు సచివాలయ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని అనేకమంది అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించాలని తిరగని ఆఫీసు, కలవని మంత్రులు లేరన్నారు.

అదే ఫ్లోర్‌లో.. రెండోసారి


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కార్యాలయం ఎదుట చిన్నచిన్న నిర్వహణ, మరమ్మతుల పనులు చేసిన కాంట్రాక్టర్లు మూడు నెలల కిందట మెరుపు ధర్నా నిర్వహించారు. మళ్లీ అదే 'ఫ్లోర్'లో 'మన ఊరు– మన బడి' కాంట్రాక్టర్లు ధర్నా చేయడంతో నిఘావర్గాలు, సచివాలయ భద్రత చూసే అధికారుల పనితీరు సరిగ్గా లేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఒక్కసారిగా ఇలా ఇంతమంది ఎలా వచ్చారు..ఏపీ పాస్‌లు తీసుకున్నారు, అక్కడి పోలీసులు ఏం చేస్తున్నారని విమర్శలొస్తున్నాయి. సీసీ కెమెరాలు, ఇంటెలిజెన్స్, బయట ఉన్న పోలీసులు, గేటు లోపలికి పంపేటప్పుడు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఇప్పుడు చర్చకు దారితీసింది. రోజువారీగా దాదాపు సచివాలయానికి వేయి నుంచి రెండు వేల మంది అర్జీదారులు, ప్రజలు వస్తుంటారని, ఇలాంటి మెరుపు ధర్నాలతో నిజమైన అర్జీదారులు సచివాలయంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పవని, సమస్యలను అధికారుల ఎదుట విన్నవించాలని, సచివాలయంలో ధర్నా చేయడం మంచిదికాదని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

బకాయిలు చెల్లించకపోతే కాంట్రాక్టర్లతో కలిసి కార్యాచరణ : కేటీఆర్

రెండేళ్ల పాలనలో.. రెండుసార్లు ధర్నా: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్ : చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోతే బాధిత కాంట్రాక్టర్లతో కలిసి బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నా సీఎం రేవంత్ అవినీతి పాలనకు నిలువెత్తు ఉదాహరణ అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 నెలల పాలనలోనే రూ. 2.20 లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం, 420 ఎన్నికల హామీల్లో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఇన్ని లక్షల కోట్ల రూపాయలను ఏం చేశారన్న అంశంపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిపాలనకు కేంద్రంగా నిలవాల్సిన సచివాలయం, నేడు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. చిన్న కాంట్రాక్టర్లు పలుమార్లు ఆరోపించిన 20 శాతం కమీషన్ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరారు.



- కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో తమ సమస్యలను పరిష్కరించాలని సచివాలయంలో కాంట్రాక్టర్లు రెండుసార్లు ధర్నా చేశారని, ఇది దేశంలో మొదటిది కావొచ్చునని మాజీమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తీరు ఇలాగే కొనసాగితే ప్రజలంతా ఏకమై ఎక్కడికక్కడ నిలదీస్తారని ఒక ప్రకటనలో హెచ్చరించారు. కమీషన్లు ఇవ్వకపోతే బిల్లులు క్లియర్ చేయడం లేదని సచివాలయంలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ముందు కాంట్రాక్టర్లు మెరుపు ధర్నా చేశారని హరీశ్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేదా స్కాంగ్రెస్ ప్రభుత్వమా? అని మండిపడ్డారు.

విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలన్న సోయి లేదు

సాక్షి, హైదరాబాద్: 'గురుకులాల్లో విష జ్వరాలు ప్రబలుతుంటే అడ్డుకునే ఆలోచన లేదు.. పిల్లలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని' మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం చేస్తానంటూ స్పీచులు దంచే రేవంత్ రెడ్డి గారూ.. సంగారెడ్డి జిల్లా సింగూరు గురుకుల పాఠశాల విద్యార్థుల అవస్థలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

21న సీఎం చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

- బెండాలపాడులో కార్యక్రమం.. దామరచర్లలో బహిరంగసభ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చంద్రుగొండ: రాష్ట్రంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, తొలి విడతగా 4.5 లక్షల మందికి కేటాయించామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఈనెల 21న సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనుండగా, దామరచర్లలో బహిరంగసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సోమవారం దామరచర్లలో సభాస్థలిని పరిశీలించిన మంత్రి పొంగులేటి అక్కడే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన ఇళ్లలో 50 శాతం నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలాంటి పథకం అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంతమంది పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చారో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. చంద్రుగొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఆ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నామని వెల్లడించారు. పథకం ప్రారంభోత్సవానికి రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలను సూచించగా, ఆదివాసీ, గిరిజనులు ఉన్న మారుమూల ప్రాంతమైన బెండాలపాడును సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఎంపిక చేశారని చెప్పారు. అనంతరం ఆయన ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, అశ్వారావుపేట, పినపాక, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, రాందాస్‌నాయక్, డాక్టర్ మట్టా రాగమయి తదితరులు పాల్గొన్నారు.



దామరచర్లలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి.


టీ-ఫైబర్‌పై సమగ్ర నివేదిక ఇవ్వండి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: టీ-ఫైబర్ పనులు జరిగిన తీరు, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్‌లో చేపట్టనున్న పనులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. టీ-ఫైబర్‌పై తన నివాసంలో సోమవారం రాత్రి ఆయన పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలసి సమీక్ష నిర్వహించారు. టీ-ఫైబర్ పనులు చేసిన కాంట్రాక్ట్ సంస్థలకు నోటీసులు ఇచ్చి పనులు చేసిన తీరుపై నివేదిక కోరాలని సీఎం ఆదేశించారు. ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమైనందున దీనిపై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. టీ-ఫైబర్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రణాళిక ఉండాలని ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా, టీ -ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పాపం కేంద్రానిదే!

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల



జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరతకు కారణం కేంద్ర ప్రభుత్వమేనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి ఈ వానాకాలం సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన యూరియాకు.. సరఫరా చేసిన యూరియాకు మధ్య 2.98 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఉందని, ఆ కారణంగానే పంటలకు సరిపడా యూరియాను అందించలేకపోతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న యూరియా పరిస్థితులపై మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో యూరియా సరఫరా పరిస్థితులను అధికారులు మంత్రికి తెలియజేయగా, రైతులు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ప్రతి నెలా యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం కోత విధించినట్టు చెప్పారు. యూరియాను రైతులకు ఇచ్చే విషయంలో అధికార యంత్రాంగం సంయమనంతో వ్యవహరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. యూరియా సరఫరాలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, పెద్ద రైతుల అవసరాలకు విడతల వారీగా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే యూరియా బస్తాల పంపిణీకి రైతుల పట్టాదార్ పాసుపుస్తకాలను అనుసంధానం చేయాలన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి గందరగోళం లేకుండా యూరియా సరఫరా చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించాలి

చేనేత ఉత్పత్తులపై విధించిన 5 శాతం జీఎస్టీని వెంటనే తొలగించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. తెలంగాణ హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన 5 శాతం జీఎస్టీ వల్ల ఆ రంగం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర చేనేత శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌లకు లేఖ రాశారు. ఖాదీ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై కొనసాగించడం అన్యాయమని పేర్కొన్నారు.

పార్లమెంట్‌ను తాకిన యూరియా సమస్య

- నిరసన తెలిపిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు
- చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చిన ఎంపీ చామల

సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణలో తీవ్రంగా ఉన్న యూరియా కొరత సమస్య పార్లమెంట్‌ను కదిలించింది. 'రైతుల పంటలు రక్షించాలి – యూరియాను తక్షణమే సరఫరా చేయాలి' అంటూ ఉభయ సభల్లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. సోమవారం పార్లమెంట్ ప్రారంభం కంటే ముందు కూడా కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, గడ్డం వంశీకృష్ణతో పాటు తెలంగాణకు చెందిన ఇతర కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. ఉభయ సభల్లో ఎస్ఐఆర్‌పై విపక్ష సభ్యులు నిరసన తెలుపుతుంటే, తెలంగాణ ఎంపీలు మాత్రం యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి.. యూరియా కొరతపై చర్చ జరపాలని వాయిదా తీర్మానం కూడా ఇచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినప్పటికీ, ఆగస్టు 13 వరకు 6.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని, కానీ ఇప్పటి వరకు కేవలం 4.50 లక్షల మెట్రిక్ టన్నులే వచ్చాయని ఆయన తెలిపారు. ఈ సారి వర్షాలు తొందరగా రావడంతో రైతులు ముందుగానే పంటల సాగు ప్రారంభించారని, కానీ యూరియా అందక పంటలు నష్టపోతున్నారని చామల వివరించారు.

తక్షణమే యూరియా విడుదల చేయండి

కేంద్రమంత్రి నడ్డాకు కాంగ్రెస్ ఎంపీల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు రావాల్సిన యూరియాను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఎంపీలు మల్లు రవి, రేణుకాచౌదరి, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్, సురేశ్‌షెట్కార్‌లు కేంద్ర రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఎంపీలు కేంద్ర మంత్రికి వివరించారు. అనంతరం తెలంగాణకు కేటాయించిన యూరియా కోటాను వెంటనే విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో ప్లకార్డులు, బ్యానర్లతో నిరసన తెలిపారు. ఆ తర్వాత తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మల్లురవి తెలిపారు.



అమ్మమ్మ తన చిట్టి మనవరాలిని బుజ్జగిస్తూ ... 'చిట్టి చిలకమ్మా / అమ్మ కొట్టిందా..!'
అని చెబుతుంటే మనవరాలు కళ్లు విప్పార్చి వింటున్న
అందమైన దృశ్యం మన కళ్ల ముందు నిలుస్తుంది.
అమ్మ తన కూతురితో 'పండు తెచ్చావా.. గూట్లో పెట్టావా.. గుటుక్కున మింగావా..'
అనగానే చిన్నారి కూతురు కిల కిల నవ్వే నవ్వులు తలపునకు వస్తాయి.
చిలకమ్మ వచ్చేసింది.. పండు తెచ్చింది అని
చిన్నారులంతా సంబరపడిపోయి పాడుకునే ఆ పాట
అరవై ఏళ్లుగా తెలుగు ముంగిళ్లలో పిల్లలున్న ప్రతి ఇంట్లో వినపడుతూనే ఉంది.
ఈ గేయం ఎనిమిది పదుల బల్ల సరస్వతి నోట పుట్టింది అనగానే
ఆశ్చర్యంగా అందరి చూపులూ ఆమె వైపుకు మరలకుండా ఉండవు.
ఎనిమిది పదుల వయసున్న బల్ల సరస్వతి స్వస్థలం జనగాం జిల్లా, బచ్చన్నపేట్ మండలం,
కట్కూరు గ్రామం. ఈ పాట ఆమె నోట ఎలా పుట్టింది?! ఇదే విషయం అడిగితే ...
ఆమె తన ఏడుతరాల ముచ్చటను మన ముందుంచారు.

బల్ల సరస్వతి

చిట్టి చిలకమ్మ ఈ అమ్మ తోటలోదే

"ఏడు తరాల ముచ్చట్లు చెప్పాలంటే ఒక్కజాములో అయ్యేది కాదు. నెక్కొండ బ్లాక్‌లో గురజాల అనే గ్రామం కింద గుంటూరుపల్లె అని ఒక చిన్న పల్లెటూరు ఉండేది. ఆ పల్లెటూరుకు ప్రైమరీ స్కూల్‌కి సింగిల్ టీచర్‌గా 1962లో వెళ్లాను. ఆ స్కూల్ ఒక గుడిసె. అందులోకి 50 మంది పిల్లలు వచ్చేవారు. ఆ పిల్లలకు చదువు చెప్పడానికి ఏ పుస్తకాలూ లేవు. అక్షరాలు దిద్దించడం, అంకెలు చెప్పడం.. ఎంతసేపూ ఇవే చెబితే పిల్లలు వినరు. రోజంతా వారిని ఎంగేజ్ చేయాలంటే ఎట్లా అని ఆలోచించేదాన్ని. నా చిన్ననాటి నుంచి విన్న పాటలు, కథలు చెప్పాలనుకున్నా. మా అమ్మ నా చిన్నతనంలో చెప్పిన గేయాలు, పద్యాలు, కథలు మాత్రమే కాదు అప్పటికప్పుడు నేనే స్వయంగా పాటలు అల్లి పిల్లలకు చెబుతుండేదాన్ని. అన్నీ పిల్లల మెదళ్లకు చేరేవి కావు. ఇంకా వాళ్లకు అర్థమయ్యేలా చెప్పాలనుకున్నా. ఆ ప్రాంతమంతా చుట్టూ చెట్లు, చేమలు. నేను ఇలా చటుక్కున చెబితే పిల్లలు లటుక్కున అందుకునేలా ఉండాలి. చిన్నారులు తాము రోజూ చూసేవాటి మీద పాట గట్టి చెప్పాలి. అలా అప్పటికప్పుడు చిలుకల మీద అల్లిన పాటే ఇది...

చిట్టి చిలకమ్మా / చిన్ని చిలకమ్మా
అమ్మ కొట్టిందా / తోట్లో కెళ్లావా
పండు తెచ్చావా / పాపాయి కిచ్చావా
గూట్లో పెట్టావా / గుటుకున మింగావా
బల్ల సరస్వతి

(రచయిత్రి 1962లో తన విద్యార్థుల కోసం అల్లిన పాట... ఆమె చేతివ్రాతతో..)

అని చెబితే.. పిల్లలు ఆ పదాలను సులువుగా పట్టేసుకున్నారు. ఆ పాట ఆ నోటా ఈ నోటా.. అలా అలా ఎగురుతూ చాలాకాలం కిందటే ఎల్లలు దాటి అమెరికా దాకా పోయింది. ఇప్పటికీ ఎగురుతూనే ఉంది. సముద్రాలు, పర్వతాల గురించి చెబితే వారికి అర్థమయ్యేది కాదు. సరైన దృష్టి పెట్టేవారు కాదు. అందుకని ఏది చెప్పినా గేయాల రూపంలోనే. టీచర్‌గా రావడానికి ముందు మాకు బేసిక్ ట్రైనింగ్ ఇచ్చారు. అది కూడా నాకు ఉపయోగపడింది. వినోదంగా, అర్థమయ్యే విధంగా, ఆసక్తి కలిగే ప్రయత్నాలు అన్నీ చేసేదాన్ని.

ఊరూరూ ప్రయాణం..

1957లో అప్పటి 7వ తరగతి పాసయ్యాను. 14 ఏళ్ల వయసులో పెళ్లయ్యింది. మా వారు పీయూసీ చదివారు.



కుటుంబ సభ్యులతో బల్ల సరస్వతి

ఇద్దరం బేసిక్ టీచర్ ట్రైనింగ్ చేశాం. మా ఇద్దరికీ నెల రోజుల తేడాతో టీచర్ ఉద్యోగాలు వచ్చాయి. నాకు, మావారికి పక్క పక్క ఊళ్లకు పోస్టింగులు. మూడేళ్ల చేశాక మా సొంత ఊరు కట్కూరుకి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఇక్కడ ఐదేళ్ల చేశాక, ఆలిన్‌పూర్‌లో రెండేళ్లు, ఆ తర్వాత మా పుట్టిన ఊరు లద్దునూరుకు ఇద్దరికీ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అక్కడ 17 సంవత్సరాలు పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ కట్కూరుకు.. ఇలా మొత్తం 37 ఏళ్లపాటు టీచర్‌గా చేసి, హెచ్.ఎం.గా రిటైరయ్యాను.

ఏడుతరాల తలపోత...

ఎనిమిది పదుల జీవితంలో ఎన్నో అనుభవాలు. ఏడుతరాలు చూసిన అనుభవం. నేత కార్మికుల ఇంట పుట్టి పెరిగాను. పెద్ద కుటుంబం. ఐదుగురు అక్కచెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములు. మా వారి తోడబుట్టినవాళ్లు ఏడుగురు. పెళ్లికి ముందు మా అక్కాబావ హైదరాబాద్‌లో ఉంటే కొన్నాళ్లు అక్కడే ఉండి, హిందీ నేర్చుకున్నా. మా బంధువు, మామ సుద్దాల హన్మంతు. పెళ్లి తర్వాతే డిగ్రీ చేశాను. నాకు ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఎంతోమంది జీవితాలు అతి దగ్గరగా ఉండి చూసిన, ఎన్నో వెతలు విన్నా. ఏ కష్టమైనా, ఆనందమైనా అంతా ఒకే కుటుంబంగా కలిసి పంచుకున్నాం.

అవన్నీ కలిపి 'కలెనేత' అని ఏడుతరాల తలపోతగా ఆత్మకథ రాస్తే.. పిల్లలు దానిని పుస్తకంగా తీసుకు వచ్చారు.

శిశిర ధ్వని

పుట్టిల్లు, అత్తిల్లు.. పిల్లల పనులు, స్కూల్ పనులు.. ఎక్కడా తీరిక ఉండేది కాదు. సమావేశం అయినా, సంబరం అయినా అప్పటికప్పుడు ఓ గేయం రాయడం, పాడటం, వదిలేయడం.. అలా రోజులు వెళ్లిపోయాయి. ఆ గేయాలను భద్రపరుచుకోవాలి అనే ఆలోచన అప్పట్లో లేదు. 2001లో మా వారు చనిపోయారు. ఊళ్లో ఒంటరిగా ఉండలేక పిల్లల దగ్గరకు హైదరాబాద్‌కు వచ్చిన. మలిదశ తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు అవన్నీ వింటూ.. చూస్తూ చలించిపోయి, నాకు కలిగిన ఆవేశాన్ని, భావాలను రాసుకుంటూ ఉండేదాన్ని.

'ఒట్టు పెట్టి చెపుతున్నా ఒస్తది మన తెలంగాణ..
అదరకురా తమ్ముడా తెలంగాణ మనదేరా..' అని
తెలంగాణ గురించి..

'రంగు రంగులు నింపి ఇంద్రధనుస్సును మైమరపిస్తవు / అచ్చులతికి అతికి అతికి, నేత నేసి నేసి, పడగు పేకల కలయిక నీవు, కష్ట సుఖాల వారధి నీవు...' అని నేతన్నల కష్టాల గురించి..

'అవిశ్రాంతంగా పోరు బాటలో పయనిస్తూ, జీవన సమరాన్నీ ఛేదిస్తూ సాగిపోతాను ముందుకు, మున్ముందుకు... ' అంటూ విశ్రాంత ఉపాధ్యాయుల కోసం.. రాశాను. ఇలాంటివి దాదాపు ఓ యాభై కవితలను కలిపి 'శిశిరధ్వని' పుస్తక రూపంగా మీ ముందుకు తీసుకు వచ్చాం" అంటూ తన గురించి ఎన్నో విషయాలను పంచుకున్నారు ఈ అనుభవాల విజ్ఞానగని.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



మనిషి మూడో కన్ను కెమెరా. రెండు కళ్లు చూడలేని దృశ్యాలను కెమెరా కన్ను చూస్తుంది. ఛాయాచిత్ర ప్రపంచంలో మహిళా ఫొటోగ్రాఫర్‌లు తమదైన ముద్ర వేసారు. ప్రకృతి అందాలు మాత్రమే కాదు సామాన్యుల జీవితాలు, అణగారిన వర్గాల పోరాటాలు, భిన్నమైన సాంస్కృతిక అంశాలను ఫొటోగ్రఫీలోకి తీసుకువస్తున్నారు.

సై'లెన్స్' సాహసం

ఆ కెమెరా... అణగారిన వర్గాల గొంతుక



భూమిక సరస్వతి

ప్రకృతి అందాలు మాత్రమే కాదు సామాన్యుల జీవితాలను, అణగారిన వర్గాల ఉద్యమాలను, దళిత, ఆదివాసీ జీవితాలను తన కెమెరా కంటితో చిత్రిస్తోంది భూమిక సరస్వతి. పర్యావరణ సంరక్షణపై దళిత, ఆదివాసీలు చేస్తున్న పోరాటాన్ని 'అన్ ఈక్వల్ హీట్' టైటిల్‌తో ఫొటో డాక్యుమెంటేషన్ చేసింది. భూమిక తన ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫొటోలను ఎక్కువగా చత్తీస్‌ఘడ్, ఉత్తర్‌ప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో తీసింది. 'అన్ ఈక్వల్ హీట్' ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనుల్లో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంది. అదే పనిగా ప్రయాణాలు చేయడం వల్ల అనారోగ్యానికి గురైన రోజులు ఉన్నాయి. అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతాల్లో కెమెరాతో వెళ్లడం అంటే ప్రమాదమే. వాటిని లెక్క చేయకుండా ముందుకు వెళ్లింది.

అదర్ సైడ్



కీర్తన కున్నాత్

కేరళలోని కోజికోడ్‌కు చెందిన కీర్తన కున్నాత్ లండన్‌లో స్థిరపడింది. జెండర్ నుంచి మెంటల్ హెల్త్ వరకు ఎన్నో అంశాలపై ఫొటోసిరీస్ చేస్తుంటుంది కీర్తన. ఆమె తాజా ఫొటోసిరీస్... నాట్ వాట్ యూ సా. దక్షిణ భారత మహిళా బాడీబిల్డర్‌లపై చేసిన ఫొటోసిరీస్ ఇది. ఈ సిరీస్‌కు 'అండర్ 30' విభాగంలో ది రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్స్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ అవార్డ్ గెలుచుకుంది. 'ఆత్మవిశ్వాసం మూర్తీభవించేలా ఈ మహిళలను చూపాలనుకున్నాను' అని తన ఫొటో ప్రాజెక్ట్ గురించి చెబుతుంది కీర్తన. 'నాట్ వాట్ యూ సా' ఫొటో ప్రాజెక్ట్ కోసం అనలాగ్ మీడియం ఫార్మట్ కెమెరా మమియ 67 ఉపయోగించి కేరళ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలలో ఫొటో షూట్ చేసింది.

డాటర్ ఆఫ్ రఘు రాయ్



అవనీ రాయ్

చిన్నప్పుడు గిఫ్ట్‌గా కెమెరా అందుకున్న అవనీ రాయ్ అప్పటి నుంచి కెమెరాతో సుదీర్ఘ స్నేహం చేస్తూనే ఉంది. ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్ రఘు రాయ్ కుమార్తెగా ఆమె 'ఫొటోగ్రఫీ' అనే ప్రపంచంలో పెరిగింది. ఎంతో మంది ఛాయాచిత్రకారుల నుంచి ఎన్నో విషయాలు తెలుసుకుంది. 'తండ్రి స్టైల్లోనే' అని అనిపించుకోవాలని అవనికి ఉండేది కాదు. అందుకే తనదైన దృశ్యభాషను రూపొందించుకుంది. కశ్మీర్ సమస్య నుంచి చెన్నై ప్రజల తాగునీటి కష్టాల వరకు ఎన్నో సామాజిక సమస్యలను డాక్యుమెంట్ చేసింది. కశ్మీర్‌కు సంబంధించి సబ్జెక్ట్, ఎమోషన్‌లను 'ఉమెన్ ఆఫ్ కశ్మీర్' ఫొటోసిరీస్‌లో హైలెట్ చేయడానికి బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రఫీని ఉపయోగించుకుంది.

బులియన్
బంగారం 10 గ్రా.: వెండి కిలో
ఆగస్ట్ 18న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,110	1,02,920	1,01,180	1,02,920	1,00,700	1,01,180
బంగారం (22 క్యారెట్లు)	94,467	92,750	92,750	95,530	92.640	92,750
వెండి	1,17,600	1,17,800	1,27,000	1,17,800	1,17,000	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
మఖ కార్తె: ఆగస్టు 30 వరకు

6 నెలల్లోనే 'నేచురల్' ధ్రువీకరణ!

ఇప్పుడున్న ఎన్‌పీఓపీ, పీజీఎస్ సర్టిఫికేషన్లకు అదనంగా.. దేశీ మార్కెట్ల కోసం 'నేచురల్' ధ్రువీకరణ వ్యవస్థ సిద్ధం

రిజిస్టర్ చేసుకున్న 6 నెలల్లోనే ప్రకృతి వ్యవసాయదారులకు సర్టిఫికేషన్ సదుపాయం



ప్రకృతి వ్యవసాయ ఆహారోత్పత్తులపై వినియోగదారులకు నమ్మకం కలిగించటం ద్వారా ఆ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మార్కెట్ అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో కేంద్ర వ్యవసాయ-రైతుల సంక్షేమ శాఖ ప్రత్యేక 'నేచురల్ ఫార్మింగ్ సర్టిఫికేషన్ సిస్టమ్' (ఎన్‌ఎఫ్‌సీఎస్)ను ఏర్పాటు చేస్తోంది. 'ఆర్గానిక్' ధ్రువీకరణ కోసం ఇప్పుడున్న 'ఎన్‌పీఓపీ', 'పీజీఎస్ ఇండియా' సర్టిఫికేషన్ వ్యవస్థలకు అదనంగా.. దేశీ మార్కెట్ల కోసం 'నేచురల్' ధ్రువీకరణ వ్యవస్థ ప్రారంభమవుతోంది. సేంద్రియ ధ్రువీకరణ కోసం ఎన్‌పీఓపీ లేదా పీజీఎస్ సర్టిఫికేషన్ పొందడానికి అవసరమయ్యే పరివర్తన కాలం 3 ఏళ్లు. అయితే, ప్రకృతి వ్యవసాయదారులకు రిజిస్టర్ చేసుకున్న 6 నెలల్లోనే 'నేచురల్' సర్టిఫికేషన్ ఇవ్వనున్నారు. వెబ్‌పోర్టల్ లేదా మొబైల్ అప్లికేషన్ ద్వారా ఒంటరి రైతు లేదా కనీసం ఐదుగురు రైతులు కలిసి బృందంగా నమోదు చేసుకోవచ్చు..

మన దేశంలో 'సేంద్రియ ఆహారోత్పత్తుల' ధ్రువీకరణకు ఇప్పటికే రెండు (ఎన్‌పీఓపీ, పీజీఎస్ ఇండియా) ధ్రువీకరణ వ్యవస్థలు పనిచేస్తుండగా.. ఈ పరిధిలోకి రాని 'ప్రకృతి వ్యవసాయోత్పత్తుల' ధ్రువీకరణ కోసం మూడో ధ్రువీకరణ పద్ధతిని కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తోంది.

ఆహార భద్రత మరియు ప్రమాణాలు (సేంద్రీయ ఆహారాలు) నిబంధనలు, 2017 ప్రకారం చట్టబద్ధంగా గుర్తింపు కలిగిన రెండు రకాలు ఉన్నాయి.. దేశ విదేశాల్లో తమ ఆర్గానిక్ ఉత్పత్తులను అమ్మాలనుకునే రైతుల కోసం నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీఓపీ) మొదటిది. దీన్ని 'థర్డ్ పార్టీ సర్టిఫికేషన్' అని కూడా అంటారు. ఇది అధిక ఖర్చుతో కూడి ఉంటుంది.

రెండోది: తక్కువ ఖర్చుతో ధ్రువీకరణను రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి 2011లో పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టమ్ (పీజీఎస్)-ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ వ్యవస్థ ఏర్పాటైంది.

కొత్తది మూడోది: 'నేచురల్ ఫార్మింగ్ సర్టిఫికేషన్ సిస్టమ్'(ఎన్‌ఎఫ్‌సీఎస్) పేరిట కేంద్ర వ్యవసాయ- రైతుల సంక్షేమ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తోంది. ఇది దేశీ మార్కెట్లలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల అమ్మకానికి రైతులకు ఉపయోగపడుతుంది. గత కొన్ని నెలలుగా సంబంధిత వర్గాల వారిని సంప్రదించి, సలహాలు సూచనలు తీసుకొని మార్గదర్శకాలను రూపొందించారు.

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు రసాయనిక వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయానికి మారే పరివర్తన కాలం కేవలం 6 నెలలే కావటం విశేషం.

'నేచురల్' ధ్రువీకరణలో ముఖ్యాంశాలు:



1 'నేచురల్ ఫార్మింగ్' ధ్రువీకరణ పొందాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి. ఈ పద్ధతుల్లో పంటలు పండించటం.. వ్యవసాయోత్పత్తులను పొలంలో గాని లేదా మరోచోటకు తీసుకెళ్లి గాని వ్యక్తిగత రైతులు/ రైతుల బృందాలు ప్రాథమిక స్థాయిలో శుద్ధి చేయటం.. విలువను జోడించటం.. ఈ మూడింటికీ 'నేచురల్' ధ్రువీకరణ ఇస్తారు.

2 నేచురల్ ఉత్పత్తులను ప్యాకెట్లలో నింపి, సీల్ చేసి.. ట్రేసబిలిటీ వివరాలతో కూడిన సమాచారాన్ని, లోగోను కవర్‌పై ముద్రించి అమ్మాలి. దీని లోగో పీజీఎస్ ఇండియా లోగోకు దగ్గరిగానే 'పీజీఎస్-ఇండియా నేచురల్' అని ఉంటుంది. తాజా పాలు, పెరుగు, మజ్జిగ వంటివి లూజుగా కూడా అమ్ముకోవచ్చు.

3 ప్రకృతి వ్యవసాయం పశువులతో (ప్రధానంగా స్థానిక పశుజాతులతో) అనుసంధానమై ఉంటుంది. బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం లేదా ఏదైనా ఇతర సాంప్రదాయ లేదా వినూత్న రసాయన రహిత ఉత్పాదకాలను మాత్రమే ఉపయోగించాలి.

4 ఒకటి కన్నా ఎక్కువ పంటలు కలిపి పండించటం, వర్షాకాలం ముందే పొడి మట్టిలోనే మట్టి పొరతో లేపనం చేసిన విత్తనాలను విత్తటం, పంట వ్యర్థాలతో ఆచ్ఛాదన, సాంప్రదాయ రకాల విత్తనాలు (జన్యుమార్పిడి విత్తనాలకు అనుమతి లేదు) వాడటం, పక్క పొలానికి ప్రకృతి సేద్య పొలానికి మధ్య కొన్ని ఎత్తయిన చెట్లను పెంచటం ద్వారా రసాయన పురుగుమందుల తుంపర్లు ఈ పొలంలోని పంటలపై పడకుండా అడ్డుకోవటానికి బఫర్ జోన్లలో చెట్లు పెంచటం.. మొదలైనవి.

5 ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నేల నిర్మాణాన్ని, పోషకాల స్థాయిని మెరుగుపరుస్తాయి. మట్టిలో సేంద్రియ కర్బనాన్ని మెరుగుపరుస్తాయి. తేమ నిలుపుదల, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతాయి. పంటల వైవిధ్యతను ప్రోత్సహిస్తాయి. స్థానిక రైతుల విజ్ఞానానికి, స్థానికంగా అమల్లో ఉన్న నిర్దిష్ట సాంకేతికతల్లోని స్థానిక వ్యవసాయ-పర్యావరణ సూత్రాలను ప్రకృతి వ్యవసాయం తనలో ఇముడ్చుకుంది.

6 ఖరీఫ్, రబీ పంటల మధ్య విరామ కాలంలో కూడా పొలాన్ని ఖాళీగా ఉంచకూడదు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో 12–25 రకాల స్థానిక విత్తనాలతో నవధాన్య పంటలు సాగు చెయ్యటం ముఖ్య విషయం.

7 పొలంలో పంటలకు ముందు పలు జాతుల పచ్చి ఎరువు పంటలను పెంచటం, సాధ్యమైనంత వరకు పొలంలోనే తయారు చేసుకున్న ఎరువులు వాడటం ముఖ్యం.

8 ప్రకృతి వ్యవసాయ ధ్రువీకరణ వ్యవస్థను ఎన్‌ఎఫ్‌సిఎస్ సర్టిఫికేషన్ కమ్ ట్రేసబిలిటీ పోర్టల్ ద్వారా నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్‌సీఓఎన్‌ఎఫ్) నిర్వహిస్తుంది. ఎన్‌సీఓఎన్‌ఎఫ్ కేంద్ర కార్యాలయం ఘజియాబాద్‌లో ఉండగా, ప్రాంతీయ కార్యాలయం నాగపూర్‌లో ఉంది. దీని పరిధిలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి.

9 'నేచురల్' ధ్రువీకరణ ఇచ్చే క్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ ప్రమాణాల అమలు, పారదర్శకత, ఏ ఉత్పత్తిని ఏ రైతు పండించారు? ఎవరు శుద్ధి చేసి ప్యాకెట్లు తయారు చేశారు? అనే విషయాలను కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమశాఖ పర్యవేక్షణలో ఎన్‌సీఓఎన్‌ఎఫ్ నిర్వహిస్తుంది, నియంత్రిస్తుంది. ధ్రువీకరణ సేవల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తనిఖీలను రీజినల్ కౌన్సిళ్ల (ఆర్‌సీల) ద్వారా నిర్వహిస్తుంది.

11 పీజీఎస్ ఇండియా సర్టిఫికేషన్ కోసం దేశవ్యాప్తంగా 76 రీజినల్ కౌన్సెల్స్ (ఆర్‌సీలు) పనిచేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, స్థానిక బృందాలు, కేవీకేలు, యూనివర్సిటీలు, గుర్తింపు పొందిన ప్రకృతి వ్యవసాయ సంస్థలు ఆర్‌సీలుగా వ్యవహరిస్తున్నాయి. వీటి ద్వారానే నేచురల్ సర్టిఫికేషన్ సంబంధిత పోర్టల్, యాప్‌లు రైతులు, బృందాలకు అందుబాటులోకి వస్తాయి. డాక్యుమెంటేషన్, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తనిఖీలు కూడా వీటి ఆధ్వర్యంలోనే జరుగుతాయి.

12 నేచురల్ సర్టిఫికేషన్ క్షేత్ర స్థాయిలో తనిఖీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీ/ గ్రామస్థాయిలో కనీసం 5గురితో 'లోకల్ గ్రూప్'లను ఏర్పాటు చెయ్యాలి. వారిలో ఒకర్ని నాయకుడిగా నియమించాలి.

13 వ్యవసాయం చేస్తున్న పొలం మొత్తంలో కొంత భాగంలో మాత్రమే ప్రకృతి వ్యవసాయం చేస్తుంటే.. ఉత్పాదకాలు, పంట దిగుబడులు కలిసిపోకుండా గోదాములను రసాయనిక వ్యవసాయానికి, ప్రకృతి వ్యవసాయానికి వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవాలి. యంత్ర పరికరాలను శుభ్రం చేసి వాడాలి.

14 నేచురల్ సర్టిఫికేషన్ కోసం పోర్టల్/మొబైల్ ద్వారా తమ పేరు నమోదు చేసుకునేటప్పుడు రైతు స్వీయధ్రువీకరణ సమర్పించాలి. రసాయనాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా వాడబోనని ప్రమాణం చెయ్యాలి. పశువులు వున్నాయా? అవి స్థానిక జాతులవా కాదా? జీవామృతం వంటి తానే పొలంలో తయారు చేసుకుంటున్నారా లేదా? దేశీ విత్తనాలే వాడుతున్నారా? ఎంతకాలం నుంచి అనుసరిస్తున్నారు? ఏ పంటలు పండిస్తున్నారు? వంటి విషయాలు పేర్కొనాలి. ద్రావణాలు, కషాయాలు 90% సొంతంగా తయారు చేసుకునే రైతుకు వెరీ గుడ్ రేటింగ్ ఇస్తారు. కౌలు రైతులు కౌలు ఒప్పంద పత్రాన్ని సమర్పించాలి.

'నేచురల్' యాప్, పోర్టల్‌లు ఖరీఫ్ ఆఖరి నాటికి సిద్ధం

- 'సాక్షి సాగుబడి'తో ఎన్‌సీఓఎన్‌ఎఫ్ డైరెక్టర్ డా. గగనేశ్ శర్మ



ప్రకృతి వ్యవసాయోత్పత్తుల నాణ్యతా ధ్రువీకరణ కోసం 'పీజీఎస్-ఇండియా నేచురల్' పేరిట ప్రత్యేక సర్టిఫికేషన్ వ్యవస్థను త్వరలో ప్రారంభిస్తున్నామని నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్‌సీఓఎన్‌ఎఫ్) డైరెక్టర్ డా. గగనేశ్ శర్మ తెలిపారు. ప్రకృతి వ్యవసాయదారులు పేర్లు నమోదు చేసుకున్న 6 నెలల్లో సర్టిఫికేషన్ ఇస్తామని, సీనియర్ రైతులకు వెంటనే ధ్రువీకరణ ఇస్తామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట కాలం చివరి నాటికి ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. డా. గగనేశ్ శర్మ 'సాక్షి సాగుబడి'తో టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ కేంద్రంగా ఎన్‌సీఓఎన్‌ఎఫ్ దేశంలోని సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ వ్యాప్తికి కృషి చేస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర దక్షిణాది రాష్ట్రాలు దీని నాగపూర్ ప్రాంతీయ కేంద్రం పరిధిలోకి వస్తాయి.

సీనియర్ రైతులకు వెంటనే ధ్రువీకరణ

డా. గగనేశ్ శర్మ ఇంకా ఏమన్నారంటే: 'వినియోగదారులకు సౌలభ్యకరంగా ఉండేవిధంగా నేచురల్ ఫార్మింగ్ పోర్టల్, మొబైల్ యాప్‌లను రూపొందిస్తున్నాం. ఈ ఖరీఫ్ పంట కాలం ముగిసే నాటికి ఇవి అందుబాటులోకి తేవటానికి ప్రయత్నిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయదారులు సులువుగా నేరుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహానికి ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయమని రాష్ట్రప్రభుత్వాలను ఇప్పటికే కోరాం. ప్రస్తుతానికి ఆఫ్‌లైన్‌లో రైతుల పేర్ల నమోదు జరుగుతోంది. ఇప్పటికి 1,15,000 మంది రైతులు రిజిస్టర్ చేసుకున్నారు. సేంద్రియ వ్యవసాయ ధ్రువీకరణ 'పీజీఎస్ ఇండియా'కు ఉన్న నిబంధనలే దీనికీ వర్తిస్తాయి. అయితే, దీని ప్రమాణాలు వేరుగా ఉంటాయి. ఒక ఏడాది నుంచి ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తమ పేరు రిజిస్టర్ చేసుకున్న తర్వాత 6 నెలల్లో నేచురల్ ధ్రువీకరణ ఇస్తాం. అయితే, 4 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఈ 6 నెలల పరిమితిని సడలిస్తాం. వారు ఎన్నేళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తున్నారు? పశువులు ఏమి ఉన్నాయి? ఎరువులు కషాయాలు వారే తయారు చేసుకుంటున్నారా? పంటల జీవ వైవిధ్యాన్ని ఎంత మేరకు పాటిస్తున్నారు? వంటి విషయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వారికి గ్రేడింగ్ ఇస్తాం. అన్నీ సంతృప్తికరంగా ఉంటే వెంటనే ధ్రువీకరణ ఇస్తాం..'

నేచురల్ ఉత్పత్తులను ఎన్‌సీఓఎల్ కొంటుంది

'దేశంలో 80% మంది రైతులు చిన్న కమతాలలో ప్రకృతి వ్యవసాయం చేసేవారే. వీరు పండించే పంటలో వారే చాలా వరకు వారి కుటుంబమే తింటారు. 20–30% పంటను అమ్ముతారు. ఈ మిగులు ఉత్పత్తులను కేంద్ర సహకార శాఖ ఏర్పాటు చేసిన జాతీయ సహకార సేంద్రియ లిమిటెడ్ (ఎన్‌సీఓఎల్) కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి, దేశ ప్రజలకు విక్రయిస్తుంది. అమూల్ పాల ఉత్పత్తులను విక్రయించిన పద్ధతిలో ఇది జరుగుతుంది. మేం ఇచ్చే పీజీఎస్ నేచురల్ సర్టిఫికేషన్ ప్రాసెస్ సర్టిఫికేషన్ మాత్రమే. ప్రకృతి రైతుల ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించేందుకు బ్యాచ్‌ల వారీగా ఎన్‌సీఓఎల్ పరీక్షలు చేస్తుంది' అని వివరించారు డా. గగనేశ్ శర్మ.

సేంద్రియ Vs ప్రకృతి సేద్యం

సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రెండూ రసాయనేతర వ్యవసాయ పద్ధతులే. ఈ రెండిటి మధ్య సారూప్యాలు ఉన్నప్పటికీ వ్యత్యాసాలు కూడా ఉన్నాయి.

సారూప్యాలు: ఎక్కువ రకాల పంటలు సాగు చేయటం, పొలంలో పంట వ్యర్థాలను తిరిగి భూమిలో కలిపే పనులు చెయ్యటం, ప్రకృతి సహజమైన పోషక చక్రాన్ని పునరుజ్జీవింపజేయటం, పంటల మార్పిడి, బహుళ పంటల సాగు, సమర్థవంతంగా వనరుల పునర్వినియోగం.

వ్యత్యాసాలు: సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో బయటి వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి తెచ్చిన సేంద్రియ, జీవసంబంధమైన ఎరువులు, ద్రావణాలు, ఖనిజాలు ఉత్పాదకాలను వాడతారు. వర్మీకంపోస్టు, దిబ్బ ఎరువు, జీవన ఎరువులు, పురుగుమందులు వంటివి వాడతారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాధ్యమైనంత వరకు పొలంలోనే తయారు చేసుకుంటారు. సాధ్యమైనంత వరకు స్థానిక జాతుల పశువుల (ముఖ్యంగా దేశీ ఆవుల) పేడ, మూత్రంతో స్వయంగా తయారు చేసుకున్న ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కషాయాలు, ద్రావణాలు వాడతారు. మరీ అవసరమైతే గ్రామంలోని బయో రిసోర్స్ సెంటర్(బీఆర్సీ) నుంచి వీటిని కొనుగోలు చేస్తారు. ఏడాది పొడవునా భూమిని వత్తుగా విత్తిన పంటలతో లేదా పంట వ్యర్థాల ఆచ్ఛాదనతో కప్పి ఉంచుతారు. ఖరీఫ్, రబీ, వేసవి పంటలు పూర్తయ్యాక కూడా భూమిని ఎండబెట్టకుండా నవధాన్య పంటలు విధిగా సాగు చేస్తూ నేలకు నిరంతరం సజీవ ఆచ్ఛాదన (లైవ్ మల్చింగ్) కల్పిస్తారు. తద్వారా భూమిలోని పోషక చక్రాన్ని పునరుద్ధరిస్తారు.



డబుల్స్ రన్నరప్ రిత్విక్-బాలాజీ జోడీ

సమ్‌టెర్ (సౌత్ కరోలినా): సర్వ్ ఫస్ట్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ రన్నరప్‌గా నిలిచాడు. అమెరికాలోని సౌత్ కరోలినాలో జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో రెండో సీడ్ రిత్విక్ చౌదరీ-శ్రీరామ్ బాలాజీ (భారత్) ద్వయం 4-6, 6-7 (3/7)తో నాలుగో సీడ్ రియాన్ సెగర్‌మన్-ప్యాట్రిక్ ట్రహాక్ (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బాలాజీ మూడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థుల సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు వచ్చిన ఆరు అవకాశాలను వృథా చేసుకున్న రిత్విక్-బాలాజీ తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయారు. రన్నరప్‌గా నిలిచిన రిత్విక్-బాలాజీలకు 5,760 డాలర్ల (రూ. 5 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడ్డ రిత్విక్ ఈనెల 24 నుంచి మొదలయ్యే యూఎస్ ఓపెన్‌లోనూ బరిలోకి దిగనున్నాడు.

మనికపై శ్రీజ పైచేయి


శ్రీజ

మాల్మో (స్వీడన్): యూరోప్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీలో తెలంగాణ అమ్మాయి, భారత నంబర్‌వన్ ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ శ్రీజ 5-11, 11-9, 15-13, 10-12, 11-8తో భారత్‌కే చెందిన ప్రపంచ 52వ ర్యాంకర్ మనిక బత్రాపై విజయం సాధించింది. 44 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరూ ప్రతి పాయింట్ కోసం నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. చివరకు కీలకదశలో పాయింట్లు నెగ్గిన శ్రీజను విజయం వరించింది. శ్రీజ మొత్తం 52 పాయింట్లు సాధించగా... అందులో తన సర్వీస్‌లో 27 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 25 పాయింట్లు సంపాదించింది. మనిక బత్రా మొత్తం 53 పాయింట్లు గెలవగా... అందులో తన సర్వీస్‌లో 28, ప్రత్యర్థి సర్వీస్‌లో 25 పాయింట్లు సాధించింది. భారత్‌కే చెందిన ప్రపంచ 77వ ర్యాంకర్ యశస్విని తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. యశస్విని 6-11, 2-11, 1-11తో ఐదో ర్యాంకర్ వాంగ్ యిది (చైనా) చేతిలో ఓడిపోయింది.



మనిక

మానవ్ సంచలనం

ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్, ప్రపంచ 43వ ర్యాంకర్ మానవ్ ఠక్కర్ సంచలన విజయంతో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో మానవ్ 12-10, 11-5, 5-11, 11-9తో ప్రపంచ 23వ ర్యాంకర్ హిరోటో షినోజుకా (జపాన్)ను బోల్తా కొట్టించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు.

ఫైనల్లో సుమిత్

సమోకోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత రెజ్లర్ సుమిత్ మలిక్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన సెమీఫైనల్లో సుమిత్ 11-3 పాయింట్ల తేడాతో ఇయోన్ బుల్గారు (మాల్డోవా)పై ఘన విజయం సాధించాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో సుమిత్ 7-2తో రివెరా (ప్యూర్టో రికో)పై, 10-10తో సాకామోటో (జపాన్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-2తో బఖిరోవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. సుమిత్, సాకామోటో 10 పాయింట్ల చొప్పున స్కోరు చేసినా, చివరి పాయింట్ సుమిత్ సాధించడంతో అతడిని విజేతగా ప్రకటించారు. 79 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అమిత్ కాంస్యం కోసం పోటీపడతాడు. సెమీఫైనల్లో అమిత్ 4-5తో హెన్కెల్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. మరోవైపు 97 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో విశాల్ (భారత్) 0-6తో సమీర్ దుర్సునోవ్ (కజకిస్తాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు.



రజతంతో భారత్ బోణీ

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ తొలి రోజే భారత్ పతకాల బోణీ కొట్టింది. సోమవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అన్‌మోల్ జైన్, ఆదిత్య మల్రా, సౌరభ్‌లతో కూడిన భారత జట్టు రజత పతకాన్ని సొంతం చేసుకుంది. భారత బృందం 1735 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో అన్‌మోల్ 580 పాయింట్లు, ఆదిత్య 579 పాయింట్లు, సౌరభ్ 576 పాయింట్లు సాధించారు. హు కాయ్, యు చాంగ్జీ, యిఫాన్ జాంగ్‌లతో కూడిన చైనా జట్టు (1744 పాయింట్లు) స్వర్ణం... అమీర్, వహీద్, జవాద్‌లతో కూడిన ఇరాన్ జట్టు (1733 పాయింట్లు) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మాత్రం భారత్‌కు నిరాశ ఎదురైంది. ఫైనల్లో భారత షూటర్ అన్‌మోల్ 155.1 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచాడు. హు కాయ్ (చైనా; 241.6 పాయింట్లు), సుహైన్ హాంగ్ (కొరియా; 239 పాయింట్లు), అమీర్ (ఇరాన్; 216.8 పాయింట్లు) తొలి మూడు స్థానాల్లో నిలిచి వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలను గెల్చుకున్నారు.

గిల్‌కు చోటు దక్కేనా!

రేసులో జైస్వాల్, శ్రేయస్ • ప్రసిధ్, సిరాజ్ సందేహమే • ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీకి నేడు భారత జట్టు ఎంపిక

భారత జట్టు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో ఆడిన గత 20 టి20ల్లో 17 గెలిచి జోరు మీదుంది. ఈ అన్ని మ్యాచ్‌లకు వేర్వేరు కారణాలతో శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ దూరమయ్యారు. మరోవైపు ఈ ఏడాది జట్టు 5 టి20లు మాత్రమే ఆడింది. నిజానికి వీటిలో ప్రదర్శనను బట్టి చూస్తే భారత జట్టులో పెద్దగా మార్పులకు ఆస్కారం లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. టెస్టు కెప్టెన్‌గా రాణించి అన్ని ఫార్మాట్‌లకు నాయకుడిగా పరిగణనలోకి తీసుకుంటున్న గిల్‌తో పాటు ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్ కూడా టి20 రేసులోకి వచ్చారు. దీనికి తోడు ఐపీఎల్‌లో ఆటను గుర్తిస్తే శ్రేయస్ అయ్యర్‌కు కూడా అవకాశం ఉంది. ఇలాంటి స్థితిలో ఆసియా కప్ కోసం సెలక్టర్లు ఎలాంటి జట్టును ప్రకటిస్తారనేది ఆసక్తికరం.



గిల్ సిరాజ్ యశస్వి జైస్వాల్

న్యూఢిల్లీ: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ నేడు ప్రకటించనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే స్వదేశంలో టి20 వరల్డ్ కప్ కూడా ఉన్న నేపథ్యంలో ఇదే జట్టును అప్పటి వరకు సన్నద్ధం చేసే ఆలోచనతో సెలక్టర్లు ఉన్నారు. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఆసియా కప్ జరుగుతుంది. 15 మంది సభ్యులతో టీమ్‌ను ఎంపిక చేయాల్సి ఉండగా... ఇటీవల యువ ఆటగాళ్లు తమకు లభించిన అన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకోవడంతో జట్టులో చోటుపై గట్టి పోటీ నెలకొంది.

తిలక్ వర్మకు పోటీ!

ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు సామ్సన్ తమ ఆటతో స్థానాలు సుస్థిరం చేసుకున్నారు. ఇంగ్లండ్‌తో భారత్ ఆడిన చివరి టి20 సిరీస్‌లో అభిషేక్ 219.68 స్ట్రయిక్‌రేట్‌తో 279 పరుగులు చేసి టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఈ సిరీస్‌లో సామ్సన్ కాస్త తడబడినా... అంతకుముందు దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లపై చెలరేగి ఐదు ఇన్నింగ్స్‌లలో మూడు సెంచరీలు సాధించాడు. ఈ స్థితిలో గిల్, జైస్వాల్‌ను తీసుకొచ్చి కూర్చునబెడగొడతారా అనేది సందేహమే. రిజర్వ్ ఓపెనర్‌గా జైస్వాల్‌ను గానీ, గిల్‌ను కానీ తీసుకోస్తే సామ్సన్‌ను పక్కన పెట్టక తప్పదు. మూడో స్థానంలో హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ దక్షిణాఫ్రికాపై రెండు సెంచరీలు సహా 280 పరుగులు చేసి కుదురుకున్నాడు. అయితే ఐపీఎల్‌లో అతను ఆకట్టుకోలేకపోగా, ఇక్కడే శ్రేయస్ అయ్యర్ నుంచి పోటీ ఎదురవుతోంది. ఈ సీజన్‌లో 600కు పైగా పరుగులు చేసిన శ్రేయస్ సవాల్ విసురుతున్నాడు. నాలుగులో సూర్యకుమార్ ఖాయం కాగా, వరల్డ్ కప్ విజయం సహా గత రెండేళ్లుగా ఐదో స్థానాన్ని శివమ్ దూబే సొంతం చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా స్థానానికి ఢోకా లేకపోగా, ఏడో స్థానం కోసం రింకూ సింగ్ పోటీ పడుతున్నాడు. చివర్లో దూకుడుగా ఆడే ప్రయత్నంలోనే అయినా గత కొన్ని మ్యాచ్‌లలో రింకూ నుంచి ఆశించిన ప్రదర్శన రాలేదు. కొత్తగా ఒక అదనపు ఆల్‌రౌండర్ ఉంటే మేలని భావిస్తే ముందుగా రింకూ స్థానమే ప్రశ్నార్థకంగా మారనుంది.

బుమ్రా ఖాయం...

స్పిన్నర్లుగా అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి ఖాయం. ఆల్‌రౌండర్‌గా అక్షర్ ఎంతో విలువైన ఆటగాడు కాగా, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో 14 వికెట్లతో వరుణ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. గాయంతో వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత ఈ ఫార్మాట్‌లో ఆడని కుల్దీప్ కోలుకొని చాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటాడు. అతను టి20 టీమ్‌లోకి రావడం లాంఛనమే. మరో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అనుకుంటే వాషింగ్టన్ సుందర్ అందరికంటే ముందున్నాడు. అతని తాజా ఫామ్ కూడా అనుకూలం కానుంది. మూడో పేసర్‌గా హార్దిక్ ఉన్నాడు కాబట్టి రెగ్యులర్ పేసర్లుగా బుమ్రా, అర్‌‌ష్‌దీప్‌ల స్థానాలకు ఢోకా లేదు. మరో పేసర్‌గా ప్రసిధ్ కృష్ణ, మొహమ్మద్ సిరాజ్ అందుబాటులో ఉన్నా... వీరి ఎంపిక సందేహమే. కొంత విశ్రాంతి తీసుకొని టెస్టు క్రికెట్‌పైనే పూర్తిగా దృష్టి పెట్టాలని వీరిద్దరికి సెలక్టర్లు సూచించే అవకాశాలే ఎక్కువ. ఇంగ్లండ్‌తో ఆడిన తర్వాత ఐపీఎల్‌లో ఘోరంగా విఫలమైన మొహమ్మద్ షమీ అంతర్జాతీయ టి20 కెరీర్ ఇక ముగిసినట్లుగానే భావించవచ్చు. గాయం వల్ల నితీశ్ కుమార్ రెడ్డి అందుబాటులో లేడు. రెండో వికెట్ కీపర్‌గా ఐపీఎల్‌లో ఆకట్టుకున్న జితేశ్ శర్మను సెలక్టర్లు ఎంపిక చేయవచ్చు.

జట్టులోకి ఎంపికయ్యే అవకాశం ఉన్న 15 మంది సభ్యులు (అంచనా): సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సామ్సన్, జైస్వాల్, తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్‌ష్‌దీప్ సింగ్, జితేశ్ శర్మ.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



హైదరాబాద్ వేదికగా 24వ సంతోషం సౌత్ ఇండియన్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఇటీవల సంతోషం అధినేత సురేశ్ కొండేటి నిర్వహించారు. ఈ వేడుకలో దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాతలు అశ్వనీదత్, మురళీ మోహన్, కాట్రగడ్డ ప్రసాద్, నటీనటులు మాలాశ్రీ, బాబు మోహన్ వంటి పలువురు పాల్గొన్నారు. ఈ వేదికపై మంచు మోహన్ బాబు, మంచు విష్ణు, మంచు అవ్రామ్‌తో సహా పలువురు అవార్డులు అందుకున్నారు.

నిర్మాతలు, మేమూ బాగుండాలి

- వల్లభనేని అనిల్

తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు 30శాతం పెంచాలంటూ 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి షూటింగ్స్ బంద్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా హీరో చిరంజీవితో ఫెడరేషన్ సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. అనంతరం 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' అధ్యక్షుడు అనిల్ వల్లభనేని మాట్లాడుతూ– ''చిరంజీవిగారు 24 క్రాఫ్ట్స్ నుంచి హాజరైన 72 మందితో మాట్లాడారు. నిర్మాతలు పెట్టిన రెండు షరతులకు ఒప్పుకుంటే మేము ఏం నష్టపోతామో చిరంజీవిగారికి వివరించాం. నేడు మా జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేశాం. అలాగే ఫిల్మ్ ఛాంబర్‌తో కూడా సమావేశం కానున్నాం. మేమూ బాగుండాలి, అలాగే నిర్మాతలూ బాగుండాలని కోరుకుంటున్నాం'' అన్నారు. ఇదిలా ఉంటే... మరోవైపు నిర్మాతలు కూడా ఫిలిం ఛాంబర్‌లో సమావేశమై కార్మికుల వేతనాల పెంపు డిమాండ్లపై చర్చించారు. అనంతరం సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''వేతనాల పెంపు సమస్య పరిష్కార బాధ్యతను నిర్మాతలందరూ ఫిల్మ్ ఛాంబర్‌కే అప్పగించారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది'' అన్నారు. కాగా నిర్మాతలు, ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు నేడు చిరంజీవితో మరోసారి భేటీ కానున్నారు.

ఆ ఫోటోలు నాకు మంచి జ్ఞాపకాలు

- శ్రీదేవి విజయ్‌కుమార్



''సుందరకాండ' మంచి వినోదాత్మక చిత్రం. కథ వినగానే షాక్ అయ్యాను. ఈ చిత్రంలో నేను చాలా మంచి బలమైన పాత్ర చేశాను. అందరూ థియేటర్స్‌కి వెళ్లిచూడొచ్చు'' అని హీరోయిన్ శ్రీదేవి విజయ్‌కుమార్ తెలిపారు. నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'సుందరకాండ'. శ్రీదేవి విజయ్ కుమార్, వృతి వాఘాని హీరోయిన్లుగా నటించారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీదేవి విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ–''కొంత గ్యాప్ తర్వాత మళ్లీ వెండితెరపై నన్ను నేను చూసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నేను హీరోయిన్‌గా చేస్తున్న రోజుల్లోనే పెళ్లి చేసుకుని, ఓ పాపకి జన్మనిచ్చాను. ఆ తర్వాత కొన్ని టీవీ ప్రోగ్రామ్స్ చేశాను. ఇప్పుడు నా కుమార్తె స్కూల్‌కు వెళుతోంది. సో.. నేను మళ్లీ సినిమాలతో బిజీ అవ్వాలనుకుంటున్నాను. ఈ సినిమాలో నేను స్కూల్ డ్రెస్‌లో కనిపించే సన్నివేశం ఉంది. ఈ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. డైట్ ఫాలో అయ్యాను. నా కుమార్తె, నేను స్కూల్ డ్రెస్‌లో ఉన్న ఫోటోలు నా దగ్గర ఉన్నాయి.. ఇవి నాకు మంచి జ్ఞాపకాలుగా ఉండిపోతాయి. ప్రభాస్‌గారి తొలి సినిమా 'ఈశ్వర్'లో నేను హీరోయిన్‌గా చేశాను.. తను పెద్ద స్టార్ అవుతాడని మేం అప్పుడే ఊహించాం.. మేం ఊహించినదాని కన్నా పెద్ద స్టార్ అయ్యారు'' అని చెప్పారు.

దీపావళికి థామా


రష్మిక

'థామా'లో తడ్కా పాత్రలో తన తడాఖా చూపిస్తానంటున్నారు రష్మికా మందన్నా. ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న హారర్, మిస్టరీ అండ్ లవ్‌స్టోరీ మూవీ 'థామా'. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ 'థామా' ఈ దీపావళికి రిలీజ్ కానుంది. కాగా అతీంద్రియ శక్తులతో కూడిన ఈ హారర్ రొమాంటిక్ చిత్రంలోని ప్రధాన పాత్రధారుల ఫస్ట్‌లుక్స్‌తో పాటుగా, ఈ సినిమాలోని వారి పాత్రల పేర్లను మేకర్స్ రిలీజ్ చేశారు. అలోక్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా, తడ్కా పాత్రలో రష్మికా మందన్నా, యాక్షసాన్‌గా నవాజుద్దీన్, రామ్ బజాజ్ గోయెల్‌గా పరేశ్ రావల్ నటిస్తున్నట్లుగా మేకర్స్ తెలిపారు. కాగా 'థామా'కి చెందిన తాజా వీడియో 'థామా వరల్డ్' పేరుతో నేడు విడుదలవుతోంది.

నా కెరీర్‌లోనే ఉత్తమ చిత్రం పరదా

- అనుపమా పరమేశ్వరన్


దర్శన, అనుపమ

''నా కెరీర్‌లోనే ఉత్తమ చిత్రం 'పరదా'. ఈ నెల 22న సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అదే మాట చెబుతారనే నమ్మకం ఉంది. అందరూ మా చిత్రం చూడండి.. మీకు నచ్చితే స్నేహితులకు చెప్పండి'' అని అనుపమా పరమేశ్వరన్ తెలిపారు. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో అనుపమా పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ నటించిన చిత్రం 'పరదా'. శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించారు. ఈ నెల 22న విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ–''ప్రవీణ్‌గారు చాలా ప్యాషన్‌తో ఈ సినిమా తీశారు. నిర్మాతలు విజయ్, శ్రీధర్‌గార్లు ఎన్ని అడ్డంకులు వచ్చినా కథని బలంగా నమ్మి ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు'' అని చెప్పారు. ''పరదా' చాలా ప్రత్యేకమైన సినిమా. ప్రేక్షకులకు గొప్ప అనుభూతినిస్తుంది'' అన్నారు దర్శన రాజేంద్రన్. ''మన తెలుగు సినిమా అయిన 'పరదా' మలయాళంలోనూ బ్లాక్ బస్టర్ అవ్వాలనేది నా ఆకాంక్ష'' అని ప్రవీణ్ కాండ్రేగుల చెప్పారు. ''మా చిత్ర కథ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు విజయ్ డొంకాడ. ''రెండేళ్ల ప్రయాణం ఈ చిత్రం.. ఎవర్నీ నిరుత్సాహ పరచదు'' అని శ్రీధర్ పేర్కొన్నారు. నటుడు రాగ్ మయూర్ మాట్లాడారు.

మురళీ నాయక్ పాత్ర చేయడం నా అదృష్టం

- గౌతమ్ కృష్ణ

''వీర జవాన్ మురళీ నాయక్ దేశానికి గర్వకారణం. తెలుగు సైనికుడి మీద వస్తున్న తొలి బయోపిక్ మాదే. ఆయన పాత్ర చేయనుండటం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో చిత్రీకరిస్తున్నాం.. ఇది దేశం గర్వపడే సినిమా అవుతుంది'' అని హీరో గౌతమ్ కృష్ణ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ బయోపిక్‌గా ఓ చిత్రం రూపొందనుంది. గౌతమ్ కృష్ణ టైటిల్ రోల్‌లో, విషాన్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై కె. సురేష్ బాబు నిర్మించనున్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఈ సినిమాని ప్రకటించారు మేకర్స్. కె. సురేష్ బాబు మాట్లాడుతూ–''మురళీ నాయక్ జీవితం అందరికీ స్ఫూర్తి. ఆయన దేశం కోసం ప్రాణాలు అర్పించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మించనున్నాం'' అని చెప్పారు. మురళీ నాయక్ తల్లితండ్రులు జ్యోతి, శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.



గౌతమ్, శ్రీరాం, జ్యోతి, సురేష్ బాబు

హే భగవాన్‌తో హిట్ కొడతాం

- సుహాస్


శివాని, సుహాస్

సుహాస్, శివాని నగరం జోడీగా నటిస్తున్న తాజా చిత్రం 'హే భగవాన్!'. 'రైటర్ పద్మభూషణ్' ఫేమ్ షణ్ముక ప్రశాంత్ కథతో, గోపీ అచ్చర ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్‌పై బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. నేడు (మంగళవారం) సుహాస్ బర్త్ డే. ఈ సందర్భంగా సోమవారం 'హే భగవాన్!' టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. సుహాస్ మాట్లాడుతూ–''ఈ సినిమాలో నేను, సుదర్శన్ కలిసి చేసే సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయి. ప్రొడ్యూసర్ నరేంద్రగారికి థ్యాంక్స్. ఆయన ప్రొడక్షన్‌లోనే మరో సినిమా చేస్తున్నా. 'హే భగవాన్!'తో హిట్ కొడతాం''అని తెలిపారు. ''హే భగవాన్!' అని టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూసి తెలుసుకోవాలి'' అన్నారు నటుడు వీకే నరేష్. ''ఈ సినిమాలోని తండ్రీ కొడుకుల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు గోపీ అచ్చర. ''ఇకపై సుహాస్ 2.ఓ' ని చూస్తారు'' అన్నారు నిర్మాత వంశీ నంది పాటి. శివానీ నగరం మాట్లాడారు.

పల్లెటూరి ప్రేమకథ

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ జంటగా నటించిన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్‌వీఎస్ స్టూడియోస్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల నిర్మించారు. ఈ సినిమాను అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''శశివదనే' ఓ దృశ్యకావ్యంలా ఉంటుంది. ప్రేమకథ, విజువల్స్, మ్యూజిక్.. ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శరవణ వాసుదేవన్, నేపథ్య సంగీతం: అనుదీప్ దేవ్.



కోమలి, రక్షిత్

మంచి సినిమా చేశాం!


విపిన్, ఉమాదేవి

నరేష్ అగస్త్య, రబియా ఖతూన్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. విపిన్ దర్శకత్వంలో సునేత్ర ఎంటర్‌టైన్మెంట్స్‌పై ఉమాదేవి కోట నిర్మించారు. ఈ నెల 22న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఉమాదేవి కోట విలేకరులతో మాట్లాడుతూ–''నిర్మాతగా నా తొలి చిత్రమిది. మేకింగ్ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. కానీ, రిలీజ్ కోసం సవాళ్లను ఎదుర్కొనాల్సి వచ్చింది. మా సినిమా ఓటీటీ రైట్స్ అమ్ముడు పోలేదు.. కానీ, ఓ మంచి సినిమా చేశామనే ధైర్యం ఉంది'' అన్నారు. ''మ్యూజికల్‌గా ప్రూవ్ చేసుకోవాలనుకునే క్యారెక్టర్ హీరోది. నాన్నమ్మ(రాధిక) కలను నిజం చేయాలని తాపత్రయపడుతుంటాడు. ఈ చిత్రంలో రాధికగారు అద్భుతంగా నటించారు'' అన్నారు దర్శకుడు విపిన్.

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
676	246
81,274	24,877

విదేశీ సూచీలు

● నాస్‌డాక్	21,594	▽	31
● డోజోన్స్	44,939	▽	10
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,152	▲	13
● డాక్స్	24,309	▽	50
● షాంఘై	3,728	▲	31
● నికాయ్	43,714	▲	336

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.20	120.18
€	యూరో	ఎస్‌బీఐ	101.10	103.87
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.28	58.53
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.77	69.43
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.41	23.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.89	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.29	13.11

ఇక ఏసీలు, టీవీలు చౌక!

- ఒక్కో ఏసీపై రూ.2,500 తగ్గుదల
- వినియోగం మరింత పెరుగుతుంది
- పెద్ద సైజు టీవీలపైనా ఉపశమనం
- పరిశ్రమ వర్గాల అంచనా

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్నులో శ్లాబుల తగ్గింపుతో ఏసీలు, టీవీల ధరలు చెప్పుకోతగ్గ స్థాయిలో దిగిరానున్నాయి. ముఖ్యంగా ఎయిర్ కండీషనర్లపై (ఏసీలు) 28 శాతంగా ఉన్న జీఎస్టీ 18 శాతానికి తగ్గనుంది. దీంతో మోడల్‌ను బట్టి ఒక్కో ఏసీ యూనిట్ ధర రూ.1,500–2,500 మేర చౌకగా మారనుంది. 32 అంగుళాలకు మించిన టీవీలపైనా జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గనున్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దీనికితోడు బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో ఆదాయపన్ను మినహాయింపులు కల్పించడం, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు ఏసీల కొనుగోళ్లను పెంచుతాయని పరిశ్రమ అంచనా వేస్తోంది.





పెద్ద ముందడుగు

రూమ్ ఏసీల కొనుగోళ్లు నిలిచిపోయినందున జీఎస్టీలో ప్రతిపాదిత సంస్కరణలను వేగంగా అమల్లోకి తీసుకురావాలని బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ కోరారు. ''ఆగస్ట్ నెలలో రూమ్ ఏసీలను ఎవరూ కొనరు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ 1 వరకు వేచి చూడొచ్చు. ఈ కాలంలో డీలర్లే కాదు, కస్టమర్లు కూడా కొనుగోళ్లు చేయరు''అంటూ అన్‌సీజన్‌ను ఆయన గుర్తు చేశారు. 10 శాతం వరకు ఏసీల ధరలు తగ్గొచ్చొని చెప్పారు. ఇంధన ఆదా చేసే ఏసీలపై తక్కువ జీఎస్టీని అంచనా వేస్తున్నామని.. ఇతర ఏసీల ధరలు 18% రేటు పరిధిలో ఉండొచ్చని ప్యానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా చైర్మన్ మనీష్ శర్మ అభిప్రాయపడ్డారు. 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించినా కానీ ఉత్పత్తుల ధరలు 6–7 శాతం మేర (రూ.1,500–2,500) దిగిరావొచ్చని చెప్పారు. ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల తగ్గింపు వినియోగాన్ని పెంచుతుందని గోద్రేజ్ అప్లయెన్సెస్ సైతం అంచనా వేసింది. ''దేశంలో ఏసీల వినియోగం ఇప్పటికీ 9–10 శాతంగానే ఉంది. జీఎస్టీ రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తే మరింత మంది ప్రజలకు ఏసీల ధరలు అందుబాటులోకి వస్తాయి. దీంతో చాలా మంది భారతీయుల జీవన నాణ్యత మెరుగుపడుతుంది''అని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ అప్లయెన్సెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. ప్రస్తుతం రూమ్ ఏసీలపై 28% జీఎస్టీ అమల్లో ఉండగా, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లపై 18 శాతం రేటు అమలు అవుతున్నట్టు తెలిపారు.

ఏసీ, టీవీలకు అనుకూలం..

థామ్సన్, బ్లోపంక్ట్ తదితర బ్రాండ్లపై టీవీలను తయారు చేసి విక్రయించే సూపర్ ప్లాస్ట్రానిక్స్ సీఈవో అవనీత్ సింగ్ మార్వా సైతం ప్రభుత్వ చర్యతో పండుగల సీజన్‌లో వినియోగం పెరుగుతుందని అంచనా వేశారు. ఏసీ, స్మార్ట్ టీవీలు (32 అంగుళాల పైన) 28% జీఎస్టీ పరిధిలో ఉన్నాయంటూ.. రేట్లను తగ్గిస్తే అమ్మకాలు పెరుగుతాయని తెలిపారు. తాము 20% వృద్ధిని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ఇక 32 అంగుళాల టీవీలను 5% జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ సెగ్మెంట్‌లో 38 శాతం అసంఘటిత రంగం నుంచే వస్తున్నట్టు చెప్పారు. వేసవిలో ముందస్తు వర్షాలతో ఈ ఏడాది ఏసీ అమ్మకాలు తగ్గాయి.

జీఎస్టీ మంత్రుల బృందం భేటీ రేపే

ప్రభుత్వ కొత్త రేట్లపై చర్చ

- ఆర్థిక మంత్రి సీతారామన్ సైతం హాజరు



న్యూఢిల్లీ: జీఎస్టీలో శ్లాబుల తగ్గింపుపై రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన బృందం 20న చర్చించనుంది. ఈ బృందంలో భాగం కాకపోయినప్పటికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సైతం ఈ సమావేశానికి హాజరు కానుండడం గమనార్హం. 5 శాతం, 18 శాతం శ్లాబులతో కూడిన కొత్త నమూనాను కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే మంత్రుల బృందం ముందుంచింది. పొగాకు తదితర కొన్నింటిపై 40 శాతం పన్ను ప్రతిపాదించింది. దీనిపై ఢిల్లీలో ఈ నెల 20, 21 తేదీల్లో జీఎస్టీ మంత్రుల బృందం (జీవోఎం) చర్చించనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ''జీవోఎంలో కేంద్రం భాగం కానప్పటికీ.. ఆర్థిక మంత్రి పాల్గొనడం, ప్రసంగించడం అన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచన, ఉద్దేశ్యాలను మెరుగ్గా అర్థం చేసుకునేందుకు సాయపడుతుంది''అని ఆ వర్గాలు వెల్లడించాయి. విహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి ఆరుగురు సభ్యుల జీవోఎంకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.కొత్త రేట్లను దిపావళికి ముందే అమల్లోకి తేవాలన్నది కేంద్రం ఉద్దేశంగా ఉంది.

ఆదాయం పెరుగుతుంది..

జీఎస్టీ రేట్లలో మార్పుతో ఆదాయం తగ్గుతుందన్న ఆందోళనలను కేంద్రం తొలగించే ప్రయత్నం చేసింది. ఆదాయంలో రాష్ట్రాలతో పాటు కేంద్రానికి సమాన వాటా ఉంటుందన్న విషయాన్ని అధికార వర్గాలు గుర్తు చేశాయి. కొత్త ప్రతిపాదనలతో నిర్ణీత కాలంలో వినియోగం పెరిగి, అధిక ఆదాయానికి దారితీస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఇక ప్రతిపాదిత రెండంచెల పన్ను శ్లాబులతో కూడిన కొత్త జీఎస్టీ విధానంలో మెజారిటీ ఆదాయం 18 శాతం నుంచే ఉంటుందని తెలిపాయి. ప్రస్తుతం బంగారంపై 3శాతం, ఇతర వస్తు సేవలపై 5, 12, 18, 28 శాతం రేట్లు అమల్లో ఉన్నాయి. ఆహార వస్తువులు కొన్నింటిని పన్ను నుంచి మినహాయించగా, కొన్ని 5 శాతం రేటు పరిధిలో ఉన్నాయి. లగ్జరీ, సిన్ గూడ్స్ (హానికారక)పై 40 శాతం రేటు అమలవుతోంది.

గొప్ప సంస్కరణ



జీఎస్టీ పునర్‌నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న చర్య ఎంతో ముఖ్యమైన సంస్కరణ. దీని ద్వారా ప్రభుత్వం అద్భుతమైన పని చేస్తోంది. ఎందుకంటే ఇది ఆర్థిక వ్యవస్థను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఆటో పరిశ్రమపై పడే ప్రభావంపై వ్యాఖ్యానించేందుకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకునే వరకు వేచి చూడడం మంచిది.

– ఆర్‌సీ భార్గవ, మారుతి సుజుకీ ఇండియా చైర్మన్

పాలసీల పునరుద్ధరణకు ఎల్‌ఐసీ క్యాంపెయిన్

అక్టోబర్ 17 వరకు అందుబాటులో...

న్యూఢిల్లీ: ప్రీమియంలను చెల్లించకుండా నిలిపివేసిన (ల్యాప్స్‌డ్) పాలసీలను పునరుద్ధరించుకునేందుకు అవకాశం కల్పిస్తూ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. ఇది ఆగస్టు 18న ప్రారంభమై అక్టోబర్ 17 వరకు ఉంటుంది. దీని కింద ఆలస్య రుసుములపై మినహాయింపులు కూడా అందిస్తున్నట్టు కంపెనీ తెలిపింది. నాన్-లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై ఇది 30 శాతం వరకు ఉంటుంది. గరిష్టంగా రూ. 5,000 వరకు మినహాయింపు పొందవచ్చు. మైక్రో ఇన్సూరెన్స్ పాలసీలపై లేట్ ఫీజులపై 100 శాతం మినహాయింపు ఉంటుంది. స్పెషల్ రివైవల్ క్యాంపెయిన్ కింద తొలిసారిగా ప్రీమియంను నిలిపివేసిన తేదీ నుంచి అయిదేళ్ల లోపు వ్యవధి వరకు పాలసీలను, నిర్దిష్ట షరతులకు లోబడి పునరుద్ధరించుకోవచ్చు. పరిస్థితులు అనుకూలించక ప్రీమియంలను సకాలంలో చెల్లించలేకపోయిన వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మేకిన్ ఇండియాపై జాగ్రత్త: దువ్వూరి
టెలికం కంపెనీలకు లాభాల మోత!

జీఎస్టీ జోష్

- ఆటో, వినిమయ షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ 676 పాయింట్ల లాభం



ముంబై: జీఎస్టీ విధానంలో 'తదుపరి తరం సంస్కరణలు' (జీఎస్టీ 2.0) దీపావళి నాటికి అమలు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటనతో దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం దాదాపు 1% పెరిగింది. సెన్సెక్స్ 676 పాయింట్లు లాభపడి 81,274 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 246 పాయింట్లు బలపడి 24,877 వద్ద నిలిచింది. భారత సార్వభౌమ రేటింగ్‌ను ఎస్ అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ 'బీబీబీ' మైనస్ నుంచి 'బీబీబీ' స్టేబుల్ అవుట్‌లుక్ (స్థిరమైన దృక్పథం)కు అప్‌గ్రేడ్ చేయడం ఇన్వెస్టర్లకు విశ్వాసాన్నిచ్చింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేపట్టిన దౌత్యపరమైన చర్చలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 1,168 పాయింట్లు బలపడి 81,766 వద్ద, నిఫ్టీ 391 పాయింట్లు ఎగిసి 25,022 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. ఇన్వెస్టర్ల సంపద రూ.6.17 లక్షల కోట్లు పెరిగి రూ.451 లక్షల కోట్లకు చేరింది.

- జీఎస్టీ సంస్కరణల దన్నుతో ఆటో షేర్లు దూసుకెళ్లాయి. మారుతీ 9%, హ్యుందాయ్ 8.45%, అశోక్ లేలాండ్ 8%, అపోలో టైర్స్ 7.28% టీవీఎస్ మోటార్ 6.58% ర్యాలీ చేశాయి. హీరో మోటో 6%, బజాజ్ ఆటో 4.50 శాతం పెరిగాయి.
- కన్జూమర్ డ్యూరబుల్ షేర్లకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. అంబర్ ఎంటర్‌ప్రైజెస్ 8% బ్లూస్టార్ 7.5%, వోల్టాస్ 6%, హావెల్స్ ఇండియా, వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా 5%, సింఫనీ 4 శాతం లాభపడ్డాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 20 పైసలు బలపడి 87.39 వద్ద స్థిరపడింది.

ఎన్‌బీఎఫ్‌సీ బాహుబలి ఐపీవో!

- 17,200 కోట్ల సమీకరణకు టాటా క్యాపిటల్ రెడీ
- కంపెనీ విలువ రూ. లక్ష కోట్లు



న్యూఢిల్లీ: అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ.. టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ ద్వారా 2 బిలియన్ డాలర్లు(రూ. 17,200 కోట్లు) సమీకరించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీంతో కంపెనీ విలువ 11 బిలియన్ డాలర్లు(రూ. 94,600 కోట్లు)గా నమోదుకానున్నట్లు తాజాగా అంచనా వేశాయి. ఈ ఇష్యూ పూర్తయితే దేశంలో అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీ ఐపీఓగా రికార్డు సృష్టించనుంది. లిస్టింగ్‌కు వీలుగా టాటా గ్రూప్ దిగ్గజం ఇటీవలే క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోలో మొత్తం 26.58 కోట్ల షేర్లు విక్రయించనుంది. వీటిలో 21 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుండగా.. మరో 26.58 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. టాటా క్యాపిటల్ మాతృ సంస్థ టాటా సన్స్ 23 కోట్ల షేర్లు, ఐఎఫ్‌సీ 3.58 కోట్ల షేర్లు చొప్పున ఆఫర్ చేయనున్నాయి. ప్రస్తుతం కంపెనీలో టాటా సన్స్ వాటా 88.6 శాతంకాగా.. ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉంది. కంపెనీ లిస్టయితే దేశీ ఫైనాన్షియల్ రంగంలో అతిపెద్ద ఐపీవోగా నమోదుకానుంది. వెరసి టాటా గ్రూప్ నుంచి రెండేళ్లలో రెండు కంపెనీలు లిస్టింగ్‌ను పొందినట్లవుతుంది. ఇంతక్రితం ఐటీ సేవల సంస్థ టాటా టెక్నాలజీస్ 2023 నవంబర్‌లో ఐపీవో ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన సంగతి తెలిసిందే.

పటిష్ట పనితీరు: ఈ ఏడాది తొలి త్రైమాసికం (2025–26, క్యూ1)లో టాటా క్యాపిటల్ కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ.1,041 కోట్లకు చేరింది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ.472 కోట్లు ఆర్జించింది. ఆదాయం రూ. 6,557 కోట్ల నుంచి రూ.7,692 కోట్లకు ఎగసింది.

ఏఏఏఐ డైరెక్టరుగా 'శ్లోక' శ్రీనివాస్ ఎన్నిక



హైదరాబాద్: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) డైరెక్టర్ల బోర్డుకు శ్లోక అడ్వర్టైజింగ్‌కి చెందిన శ్రీనివాస్ మరోసారి ఎన్నికయ్యారు. భారతీయ అడ్వర్టైజింగ్ రంగంలో ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఏఏఏఐ బోర్డుకు తిరిగి ఎన్నిక కావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన ప్రెసిడెంట్ శ్రీనివాసన్ కె. స్వామితో పాటు దిగ్గజాలతో కలిసి పని చేయడంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. నైతికతకు ప్రాధాన్యతమిస్తూ పరిశ్రమ పురోగతికి దోహదపడే సానుకూల పరిస్థితుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. దేశీయంగా అడ్వర్టైజింగ్ ఏజెన్సీల సమాఖ్య అయిన ఏఏఏఐ ప్రధానంగా సభ్యుల ప్రయోజనాలను పరిరక్షించడం, అడ్వర్టైజింగ్ ప్రమాణాలను మెరుగుపర్చడం, ప్రొఫెషనలిజంను పెంపొందించడం మొదలైన అంశాలపై దృష్టి పెడుతుంది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-భారతదేశ చరిత్ర » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-పాలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్‌సీఎల్‌లో 167 ట్రేడ్ అప్రెంటిస్‌లు

బాలాఘాట్(మధ్యప్రదేశ్)లోని మలాజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్‌లో, హిందూస్తాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)లో ట్రేడ్ అప్రెంటిస్‌ల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 167.
» ట్రేడుల వారీగా ఖాళీలు: మేట్(మైన్స్)-1, బ్లాస్టర్(మైన్స్)-12, డీజిల్ మెకానిక్-10, ఫిట్టర్-16, టర్నర్/మెకానిస్ట్-16, వెల్డర్(గ్యాస్-ఎలక్ట్రిక్)-16, ఎలక్ట్రీషియన్-36, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్)-04, డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్)-03, కంప్యూటర్ ఆపరేటర్-ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీవోపీఏ)-14, సర్వేయర్-08, ఏసీ-రిఫ్రిజిరేషన్ మెషిన్-02, మేసన్(బిల్డింగ్ కన్‌స్ట్రక్టర్)-04, కార్పెంటర్-06, ప్లంబర్-05, హార్టికల్చర్ అసిస్టెంట్-04, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-04,సోలార్ టెక్నీషియన్(ఎలక్ట్రీషియన్)-06.
» అర్హత: సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: పదో తరగతి, ఐటీఐ విద్యా అర్హతలు,మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.08.2025
» వెబ్‌సైట్: www.hindustancopper.com

ఎన్‌ఐహెచ్, కోల్‌కతాలో 14 ఫ్యాకల్టీ పోస్టులు

కోల్‌కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి(ఎన్‌ఐహెచ్) ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 14.
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్-1/2-07, అసోసియేట్ ప్రొఫెసర్-1/2-07.
» అర్హత: సంబంధిత విభాగాల్లో పీజీ ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,00,000, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.75,000.
» వయసు: ప్రొఫెసర్ పోస్టులకు 55 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి, బ్లాక్ జీఈ, సెక్టార్-3, సాల్ట్ లేక్, కోల్‌కతా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా పంపించాలి.
» నోటిఫికేషన్ వెలువడిన తేది: 09.08.2025.
» వెబ్‌సైట్: https://www.nih.nic.in

సీపీఆర్‌ఐ, బెంగళూరులో డైరెక్టర్ పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్‌ఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్సీ/బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» పే స్కేల్: రూ.1,44,200 నుంచి రూ.2,18,200
» వయసు: 15.09.2025నాటికి 55ఏళ్లు ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ది చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ప్రొఫెసర్ సర్. సీవీ రామన్ రోడ్, పోస్ట్ బాక్స్ నెం .8066, సదాశివనగర్(పీవో), బెంగళూరు-560080 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 15.09.2025.
» వెబ్‌సైట్: https://cpri.res.in

ఆర్‌ఆర్‌యూ, గుజరాత్‌లో వివిధ ఉద్యోగాలు

గుజరాత్‌లోని రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ (ఆర్‌ఆర్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 02.
» పోస్టుల వివరాలు: సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్-01, కార్పొరేట్ సెక్యూరిటీ ఇన్‌స్ట్రక్టర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వేతనం: నెలకు సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్‌కు రూ.92,000, కార్పొరేట్ సెక్యూరిటీ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.70,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.



» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 24.08.2025.
» ఇంటర్వ్యూ తేది: 28.08.2025.
» వెబ్‌సైట్: https://rru.ac.in

ఎస్‌ఎస్‌సీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 21 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.40,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 21.08.2025.
» వెబ్‌సైట్: https://ssc.gov.in

ఐఐటీ బీహెచ్‌యూలో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బెనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(బయో కెమికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, బయో ఇంజనీరింగ్, బయోప్రాసెస్ ఇంజనీరింగ్/టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్/టెక్నాలజీ లేదా ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ)లో ఉత్తీర్ణతతో పాటు గేట్ నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» వయసు: 28 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.37,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: sanjaykr.bce@iitbhu.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 23.08.2025.
» వెబ్‌సైట్: https://iitbhu.ac.in

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో 750 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 750.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.08.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» స్టైపెండ్: నెలకు రూ.10,000 నుంచి 15,000.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్థానిక భాష పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.08.2025
» ఆన్‌లైన్ రాతపరీక్ష తేది: 24.08.2025.
» వెబ్‌సైట్: https://iob.in

ఎయిమ్స్ రిషికేశ్‌లో 77 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) రిషికేశ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 77.
» విభాగాలు: అనెస్తీషియాలజీ, అనాటమి, బయో కెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ హెమటాలజీ, మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, రేడియోథెరపీ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/డీఎం/ఎంసీహెచ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 45 ఏళ్లు ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.09.2025
» వెబ్‌సైట్: https://aiimsrishikesh.edu.in

అవుతారా..
అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మొత్తం 42 ఏపీపీ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే ఆకర్షణీయ వేతనంతోపాటు సుస్థిర కొలువు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఏపీలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 42 ఏపీపీ పోస్టుల భర్తీకి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతోపాటు లా కోర్సు ఉత్తీర్ణులు పోటీపడొచ్చు



- పోస్టుల వివరాలు:అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్.
- పోస్టుల సంఖ్య:42(జోన్1(విశాఖపట్నం రేంజ్)-13, జోన్ 2 (ఏలూర్ రేంజ్)-12, జోన్ 3(గుంటూర్ రేంజ్)-12, జోన్ 4(కర్నూల్ రేంజ్)-4).
- విభాగం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రాసిక్యూషన్ డిపార్ట్‌మెంట్.

అర్హతలు

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీతోపాటు లా డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్మీడియెట్ తర్వాత ఐదేళ్ల లా కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా అర్హులే. దీంతోపాటు 04.08.2025 నాటికి రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో న్యాయవాదిగా కనీసం మూడేళ్ల ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉండాలి.

వయసు

01.07.2025 నాటికి వయసు 42ఏళ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

రాత పరీక్ష(పేపర్1, పేపర్ 2), ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

రాత పరీక్ష

- రాత పరీక్షలో రెండు పేపర్లు పేపర్1, పేపర్ 2 ఉంటాయి. పేపర్ 1 ఆబ్జెక్టివ్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. ఇందులో 200 ప్రశ్నలు ఉంటాయి.
- పేపర్ 2 డిస్క్రిప్టివ్ పద్ధతిలో 200 మార్కులకు నిర్వహిస్తారు. రెండు పేపర్ల ప్రశ్న పత్రాలు ఇంగ్లిష్‌లోనే ఉంటాయి. ప్రతి పేపర్ పరీక్ష వ్యవధి మూడు గంటలు. డిస్క్రిప్టివ్ పేపర్‌ను కొశ్చన్-కమ్-ఆన్సర్ బుక్‌లెట్‌పై బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నుతో రాయాల్సి ఉంటుంది. రాత పరీక్షలో అర్హత సాధించేందుకు ప్రతి పేపర్‌లో ఓసీలు కనీసం 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీలు కనీసం 30 శాతం మార్కులు సాధించాలి.

25 మార్కులకు ఇంటర్వ్యూ

రాత పరీక్షలోని రెండు పేపర్లు కలిపి మొత్తం 400 మార్కులకు అభ్యర్థులు సాధించిన స్కోర్ ఆధారంగా 1: 2 నిష్పత్తి(పోస్టుల సంఖ్యకు రెట్టింపు)లో ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. ఇంటర్వ్యూకు 25 మార్కులు కేటాయించారు. రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు.

రాత పరీక్ష సిలబస్ అంశాలు

రాత పరీక్ష పేపర్1, పేపర్ 2లో ఒకే విధమైన సిలబస్ అంశాలు ఉన్నాయి. ఇండియన్ కాన్‌స్టిట్యూషన్, ద బీఎన్ఎస్ఎస్, 2023 అండ్ క్రిమినల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్ అండ్ సర్క్యులర్ ఆర్డర్స్, 1990; బీఎస్ఏ, 2023; బీఎన్ఎస్, 2023; మైనర్ యాక్ట్స్, స్పెషల్ యాక్ట్స్.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 11.08.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 07.09.2025
- వెబ్‌సైట్: www.slprb.ap.gov.in

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



SBI card
మీరు ఫిట్‌గా మారేందుకు సమయం ఆసన్నమైంది!
ఎస్‌బిఐ కార్డ్ పల్స్‌తో రూ. 7,999 విలువైన స్మార్ట్ వాచీని పొందండి
SBI card
PULSE
KAVYA MALHOTRA
noise
కెమిస్ట్, ఫార్మసీ, స్పోర్ట్స్, మూవీస్ మరియు డైనింగ్ పై 5X రివార్డ్ పాయింట్‌లు*
ఫిట్ పాస్ ప్రో మరియు నెట్ మెడ్స్ ఫస్ట్‌కు కాంప్లిమెంటరీ మెంబర్‌షిప్‌లు*
ప్రతి సంవత్సరం 8 డొమెస్టిక్ ఎయిర్ పోర్ట్ లాంజ్ సందర్శనలు*
భాగస్వాములు
FITPASS®
netmeds.com India Ki Pharmacy
NOISE
VISA
*నియమనిబంధనలు వర్తిస్తాయి. జాయినింగ్ ఫీజు చెల్లించినప్పుడు కాంప్లిమెంటరీ స్మార్ట్‌వాచీ వర్తిస్తుంది
దరఖాస్తు చేయడానికి
లేదా సందర్శించడానికి స్కాన్ చేయండి:
sbicard.com/pulse

సాక్షి ప్లస్
మంగళవారం : 19-8-2025


కూసుమంచి మండలంలో వెదజల్లే పద్ధతిని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు


ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో వెదజల్లే పద్ధతిలో వరి పైరు

వెదజల్లుడుతోనే మేలు..!

- వరి సాగులో వెదజల్లే పద్ధతికి మొగ్గు చూపుతున్న అన్నదాతలు
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ కావడంతో మేలంటున్న రైతులు
- ఏటా గణనీయంగా పెరుగుతున్న ఈ పద్ధతిలో సాగు విధానం



ఖమ్మం వ్యవసాయం: పంటల సాగులో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు నూతన సాంకేతిక విధానాలు అందుబాటులోకి వస్తుండగా, మరో వైపు తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని పొందే విధానాలు ముందుకు వస్తున్నాయి. కాల క్రమం లో యంత్రాల సహకారంతో ట్రాన్స్‌ప్లాంటేషన్, డ్రమ్ సీడర్‌తో వరి సాగు వంటి పద్ధతులు వచ్చాయి. వీటితో పాటు వెదజల్లే విధానం కూడా ఆచరణలోకి వచ్చింది. సాగు నీటి వనరులు పెరుగుతున్న క్రమంలో వరి సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరుగుతోంది. పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు అధికం అవుతుండగా వెదజల్లే పద్ధతి రూపుదిద్దుకుంది. ఖమ్మం జిల్లా వేం సూరు మండలంలో ఈ పద్ధతిని రాష్ట్రంలో తొలిసారిగా రైతులు చేపట్టి ఉత్తమ ఫలితాలను సాధించారు. వర్షాకాలం ఆరంభంలోనే పొడి దుక్కుల్లోనే కొందరు విత్తనాలు చల్లి ఫలితాలను సాధించగా, మరికొందరు పొలాలను నీటిలో దమ్ము చేసి విత్తనాలను చల్లి ఫలితాలను పొందారు. ఈ విధానాన్ని వ్యవసాయ విశ్వ విద్యాలయం అధ్యయనం చేసి వివిధ కోణాల్లో పరిశీలించి ఆచరణీయమైన పద్ధతిగా గుర్తింపునిచ్చింది. అంతేగాక ఈ సాగులో ప్రయోజనాలను, పెట్టుబడులను, దిగుబడులపై కూడా ప్రయోగాత్మకంగా అధ్యయనం చేశారు. వీటి ఫలితాల ఆధారంగా వెదజల్లే పద్ధతిని వ్యవసాయ విభాగం సిఫారసు చేస్తుండటంతో ఏటా ఈ విధానంతో సాగు పెరుగుతోంది.

రైతుల మొగ్గు..

వరి వెదజల్లే పద్ధతికి అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. వరినార్లు పోయటం, పెంచటం, నీటి తడులు ఇవ్వటం, పశువుల నుంచి రక్షించటం, నాటు వేయడం వంటి పనులు లేక పోవటంతో రైతులు ఈ విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. పొలం దుక్కి చేసి ఎరువులు వేసుకుని రకాన్ని బట్టి 8–10 కిలోల విత్తనాలను ఎకరాకు చల్లుకుంటున్నారు. ఎకరాకు 8 నుంచి 10 మంది కూలీలతో అయ్యే పనిని 10 ఎకరాలకు ఒక కూలీతో నేరుగా వరి విత్తనాలను వెదజల్లి పని పూర్తి చేస్తున్నారు. వరి సాగులో ఎంతో సులభ పద్ధతి కావటంతో రైతులు ఈ విధానానికి మొగ్గు చూపుతున్నారు.

పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ

వరి సాగు వెదజల్లే పద్ధతిలో కూలీల అవసరం లేకపోవటంతో ఖర్చు రూ.6 నుంచి రూ.10 వేల వరకు తగ్గుతుంది. ఇక దిగుబడులు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. ఎకరాకు నాటు పద్ధతితో పోలిస్తే రూ.6 నుంచి రూ.8 వేల వరకు అదనంగా ఆదాయం వస్తుంది. మొత్తంగా రూ.12 నుంచి రూ.15 వేల వరకు ఆదాయం పెరుగుతుంది.

ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో వెదజల్లే పద్ధతిలో వరిసాగు ఐదారేళ్లకు పైగా కొనసాగుతోంది. క్రమంగా ఈ విధానానికి ఆదరణ పెరుగుతోంది. తొలుత పదుల ఎకరాల్లో సాగై.. నేడు వేలాది ఎకరాలకు చేరింది. ఖమ్మం జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 2.85 లక్షలు కాగా, గతేడాది 35 వేల ఎకరాల్లో ఈ పద్ధతిలో సాగు చేయగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఈ సాగు విస్తీర్ణం 65 వేల ఎకరాలకు చేరింది. ఈ విస్తీర్ణం మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ చెబుతోంది.

ప్రయోజనాలిలా..

- వరి నేరుగా విత్తడం ద్వారా నారుమళ్లు పెంచటం, వరి నారు వేయడం వంటి పనులు అవసరం ఉండవు. దీనివల్ల కూలీల ఖర్చు తగ్గుతుంది. రైతులకు శ్రమ కూడా తగ్గుతుంది.
- నర్సరీ దశ లేకుండా, నేరుగా విత్తనాలు వేయటం వలన మొత్తం కాలంలో సుమారు 7–10 రోజులు తగ్గుతుంది. తద్వారా పంట త్వరగా కోతకు రావడం వలన తరువాత పంటలు వేసుకోవడానికి మంచి అవకాశం.
- సాధారణంగా నాటే విధానంతో పోలిస్తే వెదజల్లే పద్ధతిలో 15–25 శాతం వరకు తక్కువ నీటి అవసరం ఉంటుంది. నర్సరీకి, పొలాలకు అనేక సార్లు నీరు ఇచ్చే విధానాన్ని నివారిస్తుంది.
- పొలాలను నిరంతరం నీటితో నింపడం లేకపోవటం వలన మీథేన్ వంటి హరిత వాయువులు తక్కువగా విడుదల అవుతాయి.
- నేరుగా వెదజల్లే పద్ధతిలో మొక్క ఏర్పడి అదే స్థానంలో ఉండటంతో వర్లు బలంగా ఏర్పడి పోషకాలు అధికంగా తీసుకొని పంట దిగుబడి పెరుగుతుంది. బలమైన కాండం ఎక్కువగా దుబ్బులు రావటం వలన దిగుబడి పెరిగే అవకాశం ఉంది.
- వానలు ఆలస్యం అయినా పంట వేయడం సాధ్యమవుతుంది. దీంతో పంట నాశనం అవకుండా, సురక్షితంగా ఎదుగుతుంది.
- పంట సాగులో కూలీలు, నీరు వంటి ఖర్చు తగ్గడం వలన రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది.

మేలైన పద్ధతి



వరి సాగులో వెదజల్లే పద్ధతి ఎంతో మేలైనది. 10 ఎకరాల్లో వరిసాగు చేస్తా. ఈ మొత్తం సాగు కూడా వెదజల్లే విధానాన్నే పాటిస్తా. నాలుగేళ్లుగా ఈ విధానాన్ని అనుసరిస్తూ ప్రయోజనాలను పొందుతున్నా. వరినాటు పద్ధతితో పోలిస్తే వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు అధిక దిగుబడులు సాధిస్తున్నాం. పెట్టుబడిలో కూలీల ఖర్చు తగ్గుతుంది. ఈ విధానం ద్వారా రెండవ పంట వేసుకోవడానికి బాగా అనుకూలం.

– కొప్పుల శ్రీనివాసరెడ్డి, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

అనుకూలమైన పద్ధతి



వెదజల్లే పద్ధతి రైతులకు అన్నిరకాలుగా అనుకూలమైనది. ఈ పద్ధతిలో అనేక రకాల ప్రయోజనాలున్నాయి. కూలీల ఖర్చు తగ్గుతుంది. కాలం కలిసి వస్తుంది. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయి. నీటి వనరులు ఉంటే రెండవ పంటకు అవకాశాలు అనుకూలం. జిల్లాలో వెదజల్లే పద్ధతికి రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.

– ధనసరి పుల్లయ్య, ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి

సోమవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	129.72	122.8	70,000	1,25,000
నారాయణపూర్	37.64	35.76	1,20,000	1,16,000
ఉజ్జయిని	117.64	117.24	6275	960
జూరాల	9.66	8.51	1,95,000	2,38,752
తుంగభద్ర	105.79	76.65	73,176	98,504
శ్రీశైలం	215.81	197.46	2,74,697	3,38,371
నాగార్జునసాగర్	312.05	299.74	3,05,553	2,67,587
పులిచింతల	45.77	37.95	2,47,951	3,10,700

యూరియా కొరతకు బీజేపీదే బాధ్యత

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్, భూపతిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు బీజేపీనే బాధ్యత వహించాలని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ కుట్రతోనే రైతాంగానికి ఇబ్బందులు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేలు సీహెచ్.విజయరమణారావు (పెద్దపల్లి), మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ (రామగుండం), భూపతిరెడ్డి (నిజామాబాద్ రూరల్)లు విలేకరులతో మాట్లాడారు.

- తెలంగాణకు యూరియా సరఫరాలో కేంద్రం విఫలమైందని విజయరమణారావు చెప్పారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తే, ఇప్పటివరకు కేవలం 5.32 లక్షల టన్నులు మాత్రమే ఇచ్చారని, ఇంకా 2.69లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉందని చెప్పారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా యూరియా తీసుకురాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ తెలంగాణలో ఉన్నందున.. ఇక్కడ తయారయ్యే యూరియాలో 50 శాతం ఈ రాష్ట్రానికే ఇవ్వాలని, గత ఏడాది 40 శాతం ఇచ్చిన కేంద్రం ఈసారి మాత్రం 15 శాతం మాత్రమే ఇచ్చిందని చెప్పారు.
- భూపతిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబాన్ని మెంటలాస్పత్రిలో చేర్పించాలని వ్యాఖ్యానించారు. మాజీమంత్రి హరీశ్‌రావు బుద్ధి తెచ్చుకొని అబద్ధాలు ఆడడం మానేయాలని హితవు పలికారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు.

యూరియా కొరతను తీర్చాలి

- మంత్రి తుమ్మలకు తెలంగాణ రైతు ఐక్య వేదిక వినతి

సాక్షి, హైదరాబాద్: యూరియా కొరతను తీర్చాలని, వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియాను కేటాయించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తెలంగాణ రైతు ఐక్య వేదిక కోరింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మంత్రి తుమ్మలను తెలంగాణ రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తెలంగాణకు ఎరువుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. వ్యవసాయ పంటలకు సరైన సమయంలో యూరియా వేయకపోతే పంటల దిగుబడి తగ్గి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

ఎస్సీ-ఎస్టీ డిక్లరేషన్ అమలు పత్తా లేదు

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ-ఎస్టీ డిక్లరేషన్ పేరిట అనేక హామీలు గుప్పించిందే తప్ప ఏవీ అమలు చేయలేదని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. దళితబంధు, అంబేడ్కర్ అభయహస్తం వంటి పథకాలేవీ అమలు కావడం లేదన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకిచ్చిన వాగ్దానాలు కాగితాలకే పరిమితం అయ్యాయని, బడ్జెట్లో కేటాయింపులు చేసినట్టు చూపినా వాటిని ఖర్చు చేసే విషయంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ క్లియర్ చేస్తామని హామీఇచ్చినా రూ. 7 వేల నుంచి రూ. 8 వేల కోట్లు కాలేజీలకు బకాయిలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే దిశలో చర్యలు తీసుకోవాలని కుమార్ డిమాండ్ చేశారు.

లోక్‌సభలో తెలంగాణ ఎంపీల ప్రశ్నోత్తరాలు

ఎస్సీ విద్యార్థులకు రుణ సౌకర్యం

- తెలంగాణలో నలుగురికి రూ.7.91 లక్షలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య కోసం కేంద్ర ప్రభుత్వం రుణ సౌకర్యాలు కల్పిస్తోందని, ఈ మేరకు బ్యాంకులు మోడల్ ఎడ్యుకేషన్ లోన్ స్కీమ్-2022ను అమలు చేస్తున్నాయని కేంద్ర ఆర్థికశాఖ స్పష్టం చేసింది. తెలంగాణలో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల ద్వారా ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు ఇప్పటివరకు రూ.247.60 కోట్ల రుణం మంజూరైనట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. అలాగే నేషనల్ షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక విద్యా రుణ పథకం కింద తెలంగాణలో నలుగురు విద్యార్థులకు ఇప్పటివరకు రూ.7.91 లక్షలు విడుదల చేసినట్లు ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఈ పథకం కింద రూ.40 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, చెల్లింపు గడువు గరిష్టంగా 12 నుంచి 15 సంవత్సరాలు ఉంటుందని కేంద్రమంత్రి తెలిపారు. ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, హాస్టల్ ఖర్చులు వంటి అంశాలు రుణంలో కవర్ అవుతాయని వెల్లడించారు.

ఈఏపీల్లో ఏపీ తరఫున ఎక్కువ చెల్లింపులు

- తెలంగాణపై రూ.2,547 కోట్లు సర్దుబాటు

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య అప్పులు, విదేశీ సహాయ ప్రాజెక్టుల (ఈఏపీ) బకాయిల విషయంలో కేంద్రం స్పష్టతనిచ్చింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 54 (1) ప్రకారం అప్పులు, విదేశీ సహాయ ప్రాజెక్టుల బాధ్యతలను తాత్కాలికంగా విభజించారు. ఈ అంశాన్ని 2024-25లో సమీక్షించినపుడు, గత కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్, రెండు రాష్ట్రాల తరఫున చెల్లించాల్సిన అప్పుల్లో రూ.2,547.07 కోట్లు ఎక్కువగా చెల్లించినట్టు తేలిందని మంత్రి వెల్లడించారు. అందువల్ల ఆ మొత్తం సర్దుబాటు అయిందన్నారు. ప్రస్తుతం ఈ నిర్ణయాన్ని పునర్విచారణ చేసే యోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్రమంత్రి లోక్‌సభకు తెలిపారు.

వృద్ధాప్య భద్రతపై కేంద్రం దృష్టి

- లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నకు కేంద్రం సమాధానం

దేశంలో వృద్ధాప్య ఆధారిత నిష్పత్తి 2050 నాటికి 30 శాతం చేరనున్నందున వృద్ధాప్య పేదరికం నివారణ కీలకం అని కేంద్రం స్పష్టం చేసింది. అసంఘటిత రంగ కార్మికుల కోసం 'ప్రధాన్ మంత్రి శ్రామ్ యోగి మాన్‌ధన్ (పీఎం-ఎస్‌వైఎం)' పథకం అమలులో ఉందని కేంద్ర కార్మిక శాఖ సహాయమంత్రి శోభా కరంద్లాజే లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. 60 ఏళ్ల పూర్తయ్యాక నెలకు రూ.3,000 పింఛన్ అందించే ఈ పథకంలో కార్మికులు వయసును బట్టి నెలకు రూ.55 నుంచి రూ.200 చందా చెల్లించాల్సి ఉండగా... కేంద్రం కూడా సమానంగా అంతే చందా చెల్లిస్తుంది. రాష్ట్రాలు వృద్ధాప్య, వితంతు, వికలాంగుల వంటి పింఛన్ పథకాలను అమలు చేస్తున్నాయని కేంద్రమంత్రి తెలిపారు.

తెలంగాణలో ఐదేళ్లలో రూ.3,857 కోట్లకు పైగా సీఎస్ఆర్ ఖర్చు

- అత్యధికంగా విద్యా రంగంలో సీఎస్ఆర్ కింద రూ.1,337 కోట్ల వ్యయం
- లోక్‌సభలో బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

తెలంగాణలో నమోదైన కంపెనీలు గత ఐదేళ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద మొత్తం రూ.3,857 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ వెల్లడించింది. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన వంటి విభాగాల్లో ఎక్కువగా సీఎస్ఆర్ నిధులు వినియోగించారు. సోమవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయమంత్రి హరీశ్ మల్హోత్రా వివరాలు వెల్లడించారు. కంపెనీలు తమ సీఎస్ఆర్ వివరాలను ఎంసీఏ 21 రిజిస్ట్రీలో ప్రతి సంవత్సరం నమోదు చేయాల్సి ఉంటుందని, ఆ డేటా పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రంగాల వారీగా ఖర్చులు:
తెలంగాణలో గత ఐదేళ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విద్యా రంగంలోనే అత్యధికంగా రూ.1,337 కోట్లు, ఆరోగ్య సేవలకు రూ.872 కోట్లు, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టుల్లో రూ.345 కోట్లు, పేదరిక నిర్మూలన, ఆకలి నివారణకు రూ.248 కోట్లు, పర్యావరణ సుస్థిరతకు రూ.166 కోట్లు, మహిళా సాధికారత, లింగ సమానత్వంకు రూ.54 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

రామప్ప, భద్రాచలం, అనంతగిరిలో టూరిజం అభివృద్ధి

ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం ప్రాజెక్టులకు రూ.310 కోట్ల కేటాయింపు

తెలంగాణలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రాజెక్టులు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. రామప్ప ప్రాంత సస్టెయినబుల్ టూరిజం సర్క్యూట్‌కు రూ.73.74 కోట్లు, సోమశిల వెల్‌నెస్-స్పిరిచువల్ రిట్రీట్‌కు రూ.68.10 కోట్లు వంటి రెండు ప్రధాన ఆధ్యాత్మిక ప్రాజెక్టులను ఆమోదించినట్టు చెప్పారు. అలాగే జోగులాంబ ఆలయం (అలంపూర్), రామప్ప దేవాలయం (ములుగు), భద్రాచలం, బల్కంపేట్ రేణుక ఎల్లమ్మ ఆలయాలు, బుద్ధవనం (నల్గొండ)లో డిజిటల్ సెంటర్ వంటి ప్రాజెక్టులకు రూ.171.34 కోట్లు కేటాయించగా, ఇందులో ఇప్పటికే రూ.76.71 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టుల్లో మహబూబ్‌నగర్, అనంతగిరి, నిజాం సాగర్ అభివృద్ధికి మరో రూ.139.59 కోట్లు కేటాయించగా రూ.96.04 కోట్లు ఖర్చు చేశారు. అంతేగాక పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి రాష్ట్రాల ప్రతిపాదనలు పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. మొత్తం మీద, ఎకో టూరిజం-టెంపుల్ టూరిజం ప్రాజెక్టులకు తెలంగాణకు రూ.310 కోట్లకు పైగా కేటాయింపులు జరిగాయి.

పోర్టుల బిల్లుతో రాష్ట్రానికి ఎంతో మేలు

రాజ్యసభలో మద్దతు తెలిపిన బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: భారత పోర్టుల బిల్లులో సవరణలతో తెలంగాణకు ఎంతో మేలు చేకూరుతుందని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. సరుకు రవాణా సాఫీగా సాగేందుకు ఈ బిల్లు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. భారత సముద్ర రంగాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లాలనే దూరదృష్టితో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సోమవారం రాజ్యసభలో భారత పోర్టుల బిల్లు-2025పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. చిన్న పోర్టులను రాష్ట్రాలు స్వతంత్రంగా అభివృద్ధి చేసుకునేందుకు ఈ బిల్లు ద్వారా వీలు కలుగుతుందన్నారు. ప్రధానంగా హైదరాబాద్-విశాఖపట్నం, హైదరాబాద్-ముంబై రైలు కారిడార్లు మెరుగుపడితే తెలంగాణ లాజిస్టిక్స్‌కు హబ్‌గా మారుతుందని వద్దిరాజు తెలిపారు. భవిష్యత్తులో గోదావరి నది ద్వారా కూడా సరుకు రవాణా, రాష్ట్రంలోని సరిహద్దుల్లో డ్రైపోర్టులు, ఐసీడీఎస్‌లు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

బహుజన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేయాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను నిలబెట్టుకోవాలంటే బహుజన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని వాగ్దానం చేసి 20 నెలలుగా మోసం చేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కమిటీల మీద కమిటీ వేస్తూ రిజర్వేషన్లపై బీసీ ఆకాంక్షలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు మసి పూసి మారేడుకాయ చేస్తూ మోసం చేస్తున్నారని దాసోజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు రోడ్లపై ధర్నాలు చేస్తూ అవమానాలు ఎదుర్కొంటున్నారన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కూడా అమలు చేయకపోవడం బహుజన యువతను నిరాశలోకి నెడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

కుంగిపోయే బరాజ్‌ల్లో నీళ్లు నింపమంటారా?

- హరీశ్‌రావును చూస్తే జాలేస్తోంది: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సాక్షి, హైదరాబాద్: నీళ్లు నిల్వ చేసేందుకు కూడా పనికిరాని గాలి మేడలు, కుంగిపోయే బ్యారేజీలు కట్టి వాటిలో నీళ్లు నింపమంటే ఎలా అని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. ఎల్లంపల్లి నుంచి గేట్లు ఎత్తితే నీళ్లు సముద్రంలోకి ఎందుకు వెళుతున్నాయో, కాళేశ్వరం పేరుతో కట్టిన బ్యారేజీలు ఏమైపోయాయో ఆలోచించాలని కోరారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ కాంగ్రెస్ నేత బొమ్మా శ్రీరాంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష కోట్ల ప్రజాధనాన్ని ముంచినట్టు బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఎల్లంపల్లి నుంచి నీళ్లు వదిలితే సుందిళ్ల, అన్నారం, ఆ తర్వాత మేడిగడ్డ బ్యారేజీకి నీళ్లు వెళ్లడం లేదని, వాటిని పనికిరాకుండా కట్టింది తామేనని, అందుకే ఎల్లంపల్లిలో వదిలిన నీరు సముద్రంలోకి వెళుతున్నాయని హరీశ్‌రావు నిజం ఒప్పుకున్నారని, చేసిన తప్పును ఒప్పుకున్న హరీశ్‌రావును చూస్తే జాలేస్తోందని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు చెపుతున్నట్టు క్రిమినల్ నెగ్లిజెన్సీ తాము చేయలేదని, లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడం క్రిమినల్ పని అని, ఆ పనిచేసిన చరిత్ర కేసీఆర్, హరీశ్‌రావులదని సత్యం విమర్శించారు.

ఆవిష్కరణల ప్రోత్సాహంతోనే స్థిరమైన వృద్ధి

- ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ శాంతికుమారి


సాక్షి, హైదరాబాద్: వ్యవస్థాపకత అంటే వ్యాపారాలను సృష్టించడం మాత్రమే కాదని, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి కల్పన, స్థిరమైన వృద్ధికి దోహదపడుతుందని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ (ఎఫ్ఏసీ) శాంతికుమారి అన్నారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ఆధ్వర్యంలో ప్రభుత్వం- విజయవంతమైన స్టార్టప్‌లను సృష్టించడం అనే రెండు వారాల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా భారత సాంకేతిక, ఆర్థిక సహకారం (ఐటీఈసీ)తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న శాంతికుమారి మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా ఆవిర్భవించిందని, యువ వ్యవస్థాపకులు వైవిధ్యభరితమైన రంగాలను పునర్నిర్మించారని చెప్పారు. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కీలకమైన ప్రభుత్వ కార్యక్రమాలను ఆమె ప్రస్తావించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు 'స్థానికంగా ఆలోచించండి.. ప్రపంచవ్యాప్త చర్య తీసుకోండి' అనే మంత్రంతో పనిచేయాలని గుర్తు చేశారు. కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రావులపతి ఈ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు.

కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పార్ట్‌టైమ్ సభ్యులను, సిబ్బందిని తొలగించి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలంటూ దాఖలైన పిటిషన్‌లో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తూ, ఆలోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్.. జాతీయ క్రీడాభివృద్ధి నియమావళి-2011ని పాటించడం లేదంటూ పదవీ విరమణ పొందిన కబడ్డీ కోచ్ సి.పవన్‌కుమార్ యాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మోహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ పార్ట్‌టైమ్ సభ్యులను, కోచ్‌లను తొలగించి పూర్తిస్థాయి కోచ్‌లను, ప్రముఖ క్రీడాకారులను నియమించాలన్నారు. అసోసియేషన్ ఆర్థిక నిర్వహణ, కార్యకలాపాలపై దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. క్రీడా సంఘాల కార్యకలాపాల్లో ప్రభుత్వం పాత్ర చాలా స్వల్పమని, ఈ పిటిషన్‌ను పిల్‌గా విచారణ చేపట్టవద్దని కోరారు. ఇందులో ప్రజాప్రయోజనం లేదని, ప్రైవేట్ ప్రయోజనం కోసం కోచ్ పిటిషన్ వేశారన్నారు. పిటిషనర్ న్యాయవాది జోక్యం చేసుకుని.. గతంలో ఇలాంటి కేసులను గుజరాత్, ఢిల్లీ హైకోర్టులు పిల్‌గా విచారణకు స్వీకరించాయన్నారు.


మందుపాతర పేలి జవాన్ మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


దినేశ్‌నాగ్ (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో జవాన్లు చేపట్టిన కూంబింగ్‌లో అపశ్రుతి చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా భూపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ బలగాలు ఆదివారం సాయంత్రం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం మందుపాతర పేలగా దినేశ్‌నాగ్ (26) అనే జవాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు కాగా, వారిని బీజాపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే మావోయిస్టులు మందుపాతరను కమాండ్ కంట్రోల్ పద్ధతిలో పేల్చారా? లేదా పేలింది ప్రెజర్ బాంబా? అనేది ఇంకా నిర్ధారించలేదు. ఆ ప్రాంతానికి బాంబు డిస్పోజబుల్ టీంలతో పాటు మందుపాతరలను గుర్తించేందుకు నిపుణులైన జవాన్లను తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను పోలీసులు సోమవారం గుర్తించారు. గోబ్రా సమీపంలోని గుట్టల్లో మావోయిస్టుల డంప్‌ను గుర్తించిన బలగాలు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా, వారి సూచనల మేరకు వెలికితీశారు. అందులో రూ.16.50 లక్షల నగదుతో పాటు తుపాకులు, బీజీఎల్ లాంచర్లు, గ్రెనేడ్లు, మందుపాతరలను స్వాధీనం చేసుకున్నారు.

పశ్చిమాన అందాల కోన


వర్షాలకు పచ్చబడిన ముంజులూరు అటవీ ప్రాంతం

బుట్టాయగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ప్రకృతి అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. అరకు అందాలకు ఏ మాత్రం తీసిపోకుండా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చెట్ల లేలేత పచ్చదనం.. పక్షుల కిలకిలరావాలు ఇక్కడ నిత్యం వసంతాన్ని తలపిస్తాయి. కొండ వాగుల నీటి ప్రవాహాలు, ప్రకృతి వడిలో జలపాతాల హొయలు ప్రకృతి ప్రేమికుల హృదయాల్లో చిరు సవ్వడి చేస్తాయి. బుట్టాయగూడెం మండంలోని పులి రామన్నగూడెం నుంచి గోగుమిల్లి, గిన్నెపల్లి, గడ్డపల్లి, దారావాడ, చిలకలూరు మారుమూల అటవీ ప్రాంతంలో గల గ్రామాలు, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణంలో ప్రకృతి అందాలు ఎంతో కనువిందు చేస్తాయి. ప్రస్తుతం ఈ గ్రామాలకు సరైన రహదారి లేదు. ద్విచక్రవాహనాలు మాత్రం ప్రయాణించే సమయంలో రోడ్డుకు ఇరువైపులా పొడవైన పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు మైమరపింపజేస్తాయి. దట్టమైన అటవీప్రాంతంలో సెలయేర్లు, కనువిందు చేసే వాగులు, ఆహ్లాదాన్ని పంచే జలపాతాలు అణువణువు అందం తొణికిసలాడుతుంది. అలాగే గుబ్బల మంగమ్మ గుడి దర్శనం కూడా ఎంతో అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే అరకు అందాలకు ఏ మాత్రం తీసిపోదు.


ముంజులూరు సమీపంలో ఏనుగుతోగు జలపాతం


చూపరులను కనువిందు చేస్తున్న ఎత్తయిన కొండలు


ఉప్పరిల్ల వద్ద ప్రవహిస్తున్న వాగు


గోగుమిల్లి సమీపంలో కొండవాగు

క్లుప్తంగా...

21న అంగన్‌వాడీల నిరసనలు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీలకు **వేతనాలు** పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని **డిమాండ్** చేస్తూ ఆగస్టు 21న రాష్ట్రంలోని **ఐసీడీఎస్** ప్రాజెక్టులు, మండల కేంద్రాల్లో **నిరసనలు** చేపట్టాలని మూడు యూనియన్లు **పిలుపునిచ్చాయి.** ఈ మేరకు ఏపీ అంగన్‌వా**డీ వర్కర్స్,** హెల్పర్స్ యూనియన్(**సీఐటీయూ), ఏపీ అం**గన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అ**సోసియేషన్(**ఏఐటీయూసీ), ఏపీ ప్రగతిశీల **అంగన్‌వాడీ** వర్కర్స్, హెల్పర్స్ యూని**యన్(ఐఎఫ్‌టీయూ)** రాష్ట్ర ప్రధాన కార్యదర్శు**లు సుబ్బరా**వమ్మ, లలితమ్మ, వీఆర్ జ్యోతి **సోమవారం** సంయుక్త ప్రకటన విడుదల చేశా**రు. 21న దేశ**వ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించాలని అఖిల భారత అంగన్‌వాడీ యూనియన్ నిర్ణయించిందని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే ఏపీలో చేపట్టే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు పిలుపునిచ్చారు.

‘సూపర్ సిక్స్’తో ప్రజల్లో సానుకూలత

పార్టీ నేతల టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి : ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తున్నందునే ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమం విజయవంతమైందని సీఎం చంద్రబాబు అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ అధ్యక్షులు, కో–ఆర్డినేటర్లు, జోనల్ కో–ఆర్డినేటర్లు, గ్రామ, మండల స్థాయి కార్యకర్తలతో ఆయన సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జ్‌లు ఏ గ్రామానికి.. ఏ సమయంలో వెళ్తున్నారో యాప్ ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రతిపక్షం చేసే ప్రచారాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన కార్యకర్తలు, నేతలను అభినందించారు.

హామీ లేని పంట రుణాలు మంజూరు చేయాలి

ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: ఆర్బీఐ నిబంధనల ప్రకారం హామీ లేని పంట రుణాలు మంజూరు చేయాలని, భూ యజమాని బ్యాంకుకు ఉన్న బకాయిలతో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంట రుణాలు జారీ చేయాలని ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఉపాధ్యక్షులు మర్నేడి యల్ల మందారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర లీడ్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ దాస్యం శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

గిరిజన గురుకులాల్లో ‘వేతన’ కష్టాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 199 గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) పనిచేస్తున్న రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ అధ్యాపకులుసహా మూడువేలకు పైగా సిబ్బంది సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది జూన్, జూలై మాసాలకు సంబంధించిన జీతాలు జాప్యం చేయడంతో ప్రభుత్వ యంత్రాంగం చుట్టూ వారు రోజుల తరబడి ప్రదక్షిణలు చేశారు. ఎట్టకేలకు రెండు రోజుల క్రితం జూన్ వేతనాన్ని చెల్లించిన ప్రభుత్వం, జూలై జీతాన్ని పెండింగ్ పెట్టింది.

‘అవుట్ సోర్సింగ్’కు అడుగడుగునా దగా.. దగా..

కాగా, గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న 1,659 మంది అవుట్ సోర్సింగ్ టీచర్లను కూటమి ప్రభుత్వం అడుగడుగునా దగా చేస్తోంది. ఎన్నికల ముందు వారిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని నమ్మబలికిన కూటమి అటు తర్వాత వారిని వదిలేసింది. హామీల అమలుకు గతేడాది అవుట్ సోర్సింగ్ టీచర్లు ఆందోళన చేపట్టడంతో మంత్రి సంధ్యారాణి గిరిజన సంక్షేమ అధికారుల సమక్షంలో చర్చలు జరిపి అన్ని విధాలుగా ఆదుకుంటామంటూ హామీలు ఇచ్చారు. సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నప్పటికీ ప్రభుత్వం హామీలు అమలుచేయలేదు. డిమాండ్లు నెరవేర్చాలంటూ జాతీయ ఎస్టీ కమిషన్ ఇచ్చిన ఆదేశాలను సైతం కూటమి ప్రభుత్వం బేఖాతరు చేసింది.

ఎక్సైజ్ శాఖలో అప్పుల అప్పారావు!

మద్యం దుకాణదారుల వద్ద రూ.లక్షల్లో వసూళ్లు

- సెలవులో పంపిన ఉన్నతాధికారులు
- అప్పులు అడగకుండా ఎత్తుగడలు
- చినబాబు అండ ఉందంటూ పరోక్ష బెదిరింపులు
- తిరిగి ఇక్కడికే వస్తానంటూ హెచ్చరికలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం


అప్పుల అప్పారావు... ఇది సినిమా పేరు కాదు. విశాఖలోని ఎక్సైజ్ సీఐకు ఉన్న మరో మారుపేరు. గతంలోనే అనేక ఆరోపణలతో జైలుకు కూడా వెళ్లి వచ్చిన సీఐ తన అసలు బుద్ధిని మాత్రం మార్చుకోలేదు. పైగా కీలకమైన శివారు ప్రాంతంలో పోస్టింగును పై నుంచి ఒత్తిడి తెచ్చి మరీ దక్కించుకున్న ఆయన యథావిధిగా వసూళ్లకు దిగారు. తనకు అవసరాలు ఉన్నాయి.. అప్పు ఇవ్వాలంటూ తెలిసిన అన్ని మద్యం షాపుల యాజమానులతో పాటు బార్ల యజమానుల నుంచి భారీగా వసూలు చేసినట్టు తెలుస్తోంది. రూ.లక్షల్లో ఇలా వసూలు చేసిన నేపథ్యంలో సెలవులో వెళ్లాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించారు. తద్వారా గత నెల రోజులుగా కార్యాలయం వైపునకు సదరు సీఐ రాలేదని సమాచారం. అప్పటివరకు పక్క స్టేషన్ ఎక్సైజ్ సీఐకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో తిరిగి తానే ఇక్కడకు వస్తానంటూ చెబుతున్నారని.. చినబాబు సిఫార్సుతో మరోసారి ఇక్కడే రాజ్యమేలుతానని కూడా పరోక్షంగా బెదిరింపులకు దిగుతున్నట్టు తెలుస్తోంది. తద్వారా తనకు అప్పులిచ్చిన వారు తిరిగి అడగకుండా ముందరి కాళ్లకు బంధాలు వేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

పోస్టింగుపైనా రచ్చ రచ్చే..!

వాస్తవానికి సదరు సీఐ పోస్టింగు వ్యవహారంలోనూ ఎక్సైజ్‌శాఖలో మొదట రచ్చ రచ్చ నడిచింది. మొదటగా మహారాణిపేట సీఐగా పోస్టింగు కోసం ఆయన ప్రయత్నించారు. అయితే, ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయనే పోస్టింగు ఇచ్చేందుకు వెలగపూడి ఒప్పుకోలేదని అప్పట్లో ప్రచారం జరిగింది. అంతేకాకుండా విశాఖలో ఎక్కడా పోస్టింగు ఇచ్చేందుకు ఆయన అంగీకరించకపోవడంతో పాటు ఇతర ఎమ్మెల్యేలకు కూడా సూచించినట్టు వార్తలు గుప్పుమన్నాయి. అయితే తనకున్న పలుకుబడితో నేరుగా చినబాబు ద్వారా సిఫారసు చేయించుకుని శివారు ప్రాంతంలో పోస్టింగును ఆయన దక్కించుకోవడం గమనార్హం. కీలకమైన ఆ స్టేషన్‌లో అప్పటికే ఓ సీఐను నియమించగా ఆయన్ని తప్పించి మరీ ఈయన పోస్టింగ్ పొందాడు. సీనియర్ ఎమ్మెల్యే కూడా పై నుంచి వచ్చిన ఆదేశాలతోనే ఆయన పోస్టింగ్‌కు తలూపినట్టు ప్రచారం జరిగింది. నిజానికి ఆయనపై తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. దొంగచలానాల కేసులో ఆయన కేసులను ఎదుర్కోవడంతో పాటు జైలుకు కూడా వెళ్లొచ్చారు. గతంలో నడిచిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వసూలైన మొత్తంలో వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటువంటి అధికారిని మొదటగా ఇక్కడ నియమించేందుకు పోస్టింగు వ్యవహారాలన్నీ చూసిన వెలగపూడి ఒప్పుకోలేదు. అయినప్పటికీ పైన తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి సీనియర్ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చి మరీ పోస్టింగును దక్కించుకున్నట్టు తెలుస్తోంది.

అందరి వద్దా అప్పులే...!

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎత్తివేసింది. ఈ స్థానంలో ప్రైవేటు దుకాణాలకు తెరలేపింది. దీంతో ఈయన వసూళ్లకు మంచి అవకాశం లభించింది. తన పరిధిలో ఏర్పాటైన ప్రతీ ప్రైవేటు మద్యం దుకాణం యజమాని నుంచి ఆయన అప్పులు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఎవరైనా అప్పులు ఇచ్చేందుకు నిరాకరిస్తే... ఏదో ఒక సాకుతో ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇలా ప్రైవేటు మద్యం దుకాణదారుల నుంచి లక్షల్లో అప్పులు తీసుకున్నారు. అంతేకాకుండా బార్ల యజమానుల నుంచి కూడా అప్పులకు తెగబడినట్టు తెలుస్తోంది. మొత్తంగా రూ.లక్షల్లో తీసుకున్న అప్పులను ఆయన ఎవరికీ తిరిగి చెల్లించలేదని సమాచారం. వీరందరూ కాస్తా ఉన్నతాధికారులకు సిఫారసు చేయడంతో సెలవులో వెళ్లిపోవాలంటూ ఆదేశించారు. అయితే, తాను సెలవులో మాత్రమే వెళుతున్నానని, తిరిగి ఇక్కడకే వస్తానంటూ పరోక్షంగా బెదిరింపులకు దిగుతూ.. అప్పులిచ్చిన వారు తిరిగి అడగకుండా జాగ్రత్త పడుతున్నారు. అంతేకాకుండా నేరుగా చినబాబు పేరు కూడా చెబుతుండటంతో ఎవరూ నోరెత్తడం లేదని సమాచారం.



‘మా ప్రభుత్వంలోనే అప్పులు ఎక్కువ’

- **టీడీపీ నేత**, బయోడైవర్సిటీ బోర్డు **చైర్మన్ విజయకుమార్**
- **కూటమి** ప్రభుత్వంలో అమ్మకం **పన్ను తగ్గిందని** అంగీకారం
- **రెవెన్యూ** లోటు నిధుల్ని వైఎస్సార్ **సీపీ సాధించిందని** వెల్లడి

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వంలో కంటే తమ **కూటమి ప్రభుత్వం**లో రూ. 3 వేల కోట్లు అప్పు **ఎక్కువ తేవడం** నిజమేనని టీడీపీ నేత, బయోడైవ**ర్సిటీ బోర్డు చైర్మన్** నీలాయపాలెం విజయకుమార్ **అంగీకరించారు.** సోమవారం మంగళగిరిలోని టీడీపీ **కార్యాలయంలో** ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.45 వేల కోట్ల అప్పుతేగా, తమ ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరం అదే నాలుగు నెలల్లో రూ.48 వేల కోట్ల అప్పు తెచ్చిందన్నారు. అలాగే గత ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వంలో అమ్మకం పన్ను సుమారు రూ.400 కోట్లు తగ్గిన విషయం కూడా నిజమేనన్నారు. 2014–19 మధ్యకాలంలో తాము కేంద్రం నుంచి సాధించాల్సిన రెవెన్యూ లోటును సాధించలేకపోయామని పరోక్షంగా ఒప్పుకున్నారు. అప్పట్లో తమ హయాంలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. గతంలో తాము అడిగితే కేంద్రం ఇవ్వలేదని, కానీ 2023–24 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ఆ నిధులు రూ.17 వేల కోట్లు సాధించిందని చెప్పుకొచ్చారు. కాగ్ లెక్కలపై వైఎస్సార్‌సీపీ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించే సందర్భంలో ఆయన కూటమి ప్రభుత్వంలోని ఆర్థికాంశాలను వివరించే క్రమంలో ఈ నిజాలను ఒప్పుకోవడం గమనార్హం.

పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

- ‘కర్మయోగి’ని బలవంతంగా రుద్దవద్దు
- హైస్కూల్ ప్లస్‌ల్లో పీజీటీలను నియమించాలి
- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రైమరీ స్కూల్స్ హెడ్‌మాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీఎస్ హెచ్‌ఎం ఫోరం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఇప్పటికీ పలు జిల్లాల్లో వీరికి పెండింగ్ వేతనాలు చెల్లించలేదని ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అలాగే, పీఎస్ హెచ్‌ఎంలకు జాబ్ చార్ట్ విడుదల చేసి, లీప్ యాప్‌లో డెజిగ్నేషన్ మార్చాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఉపాధ్యాయులపై కర్మయోగి యాప్‌ను బలవంతంగా రుద్దడం సరికాదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు పేర్కొన్నారు. ఈ యాప్‌లోని ఆన్‌లైన్ కోర్సులో భాగంగా ఇచ్చిన 56 వీడియోలు ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి చేయాలని బలవంతం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ తరగతులు ప్రారంభమై 3 నెలలవుతున్నా కొన్ని బాలికల హైస్కూల్ ప్లస్‌ల్లో అధ్యాపకులు లేక విద్యార్థులు నష్టపోతున్నారని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆర్థికశాఖ నుంచి అనుమతి పొందిన 1,852 పోస్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను డిప్లాయ్‌మెంట్ పద్ధతిలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయా సంఘాల నేతలు సోమవారం ప్రకటన విడుదల చేశారు.

సీసీఆర్సీ కార్డులుంటేనే పంట రుణాలు, సంక్షేమ ఫలాలు

వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్

సాక్షి, అమరావతి: కౌలురైతులకు పంట రుణాలు, సంక్షేమ ఫలాలు అందించడంలో పంట సాగుదారుల హక్కుల కార్డులు కీలకపాత్ర పోషిస్తాయని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ఆధ్వర్యంలో సీసీఆర్సీలు పొందిన కౌలురైతులకు పంట రుణాల మంజూరుపై సోమవారం వెబెక్స్ ద్వారా జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 2025–26లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం మాత్రమే అర్హులైన రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. 2024–25 సీజన్‌లో సీసీఆర్సీలు పొందిన కౌలు రైతులకు రూ4,474.11 కోట్ల పంట రుణాలు మంజూరు చేశామని తెలిపారు. 2025–26లో ఇప్పటి వరకు 5.99 లక్షల కార్డులు జారీ చేయగా, 75,858 మందికి రెన్యూవల్ చేశామన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పంట హక్కు సాగుదారుల చట్టం -2019 ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా, పంట నష్టపరిహారంతో పాటు వివిధ రకాల ప్రభుత్వ పథకాల లబ్ధిని అందిస్తున్నామని తెలిపారు.

‘దేవుడా.. ఈ రోజు ప్రాణాలతో ఉంచు!’

- రివర్ రాఫ్టింగ్‌లో ప్రతిరోజూ నేను కోరుకున్నది ఇదే..
- ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రయాణం ఆపలేదు
- 28 రోజుల్లో 1040 కి.మీ. రివర్ రాఫ్టింగ్ పూర్తి చేశాం
- 12 మంది బృందంలో నేనొక్కదాన్నే మహిళను..
- ‘సాక్షి’తో ఆర్మీ వైద్యాధికారి వాసుపల్లి కవిత


బ్రహ్మపుత్ర నది ఒడ్డున సేదతీరుతున్న కవిత

సాక్షి, విశాఖపట్నం: ‘బ్రహ్మపుత్ర నదిలో రాఫ్టింగ్ మొదలుపెట్టిన రెండు గంటల్లోనే ప్రవాహం పెరిగింది. పెద్ద అలలా నీరు రావడం, అదే సమయంలో రాళ్లు ఎక్కువగా ఉండటంతో రాఫ్ట్ అదుపు తప్పి కిందపడిపోయాను. బ్రహ్మపుత్ర ప్రయాణమే ఆఖరుదని అనుకున్నాను. ఆ క్షణంలో దేవుడ్ని, దేశాన్ని ప్రార్థించుకున్నాను. కష్టమ్మీద మళ్లీ రాఫ్ట్‌లోకి ఎక్కాను. ఇక అక్కడి నుంచి వెనుదిరగలేదు. ప్రపంచ రికార్డు సాధించే దిశగా సాగిన మా ప్రయాణం విజయవంతమైంది. బ్రహ్మపుత్రలో రివర్ రాఫ్టింగ్ చేసిన తొలి మహిళగా గుర్తింపు పొందాను’అని వెల్లడించారు ఆర్మీ మేజర్, వైద్యాధికారి వాసుపల్లి కవిత. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరుకు చెందిన మేజర్ కవిత.. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు. విశాఖలోని తూర్పు నౌకాదళానికి ఇటీవల వచ్చిన ఆమె తన అనుభవాలను ‘సాక్షి’తో పంచుకున్నారు.

దేవుడికి, దేశానికి ప్రార్థించి..

1,040 కిలోమీటర్ల బ్రహ్మపుత్ర నదిని 28 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇండో–టిబెటెన్ బోర్డర్ నుంచి బంగ్లాదేశ్ సరిహద్దు వరకు మా ప్రయాణం సాగింది. ప్రతిరోజూ ఉదయం అల్పాహారం చేసి, దేవుడికి, దేశానికి ప్రార్థించి మా ప్రయాణం మొదలుపెట్టేవాళ్లం. 28 రోజుల్లో పూర్తి చేయాలంటే సమయం వృథా చేయకూడదు. అందుకే ఆహారం కూడా మితంగా, బోట్‌లోనే తీసుకునేవాళ్లం. ఒక్కోసారి 12 గంటలపాటు ఏకధాటిగా రాఫ్టింగ్ చేశాం. అనుకున్నది సాధించాం.

సాహస క్రీడలకు స్వర్గధామం

‘అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భారత్ వెనుకబడి ఉంది.. మన దేశంలో వీటికి ప్రాధాన్యం లేదు’అని చాలా మంది అంటారు. మేం దానిపైనే దృష్టి సారించాం. ఈ రాఫ్టింగ్‌తో ఒక మెట్టు ఎక్కాం. ఇకపై బ్రహ్మపుత్ర రివర్ రాఫ్టింగ్ పేరు చెబితే మొదట మా పేరే వినిపిస్తుంది. ఈశాన్య, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న ప్రాధాన్యం సాహస పర్యాటకానికి లేదు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, జీవ వైవిధ్యంతో కూడిన సాహస పర్యాటకానికి ప్రపంచ గుర్తింపు తీసుకురావాలన్నదే మా ప్రయత్నం.

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు!

వైద్యులకు మానసిక స్థైర్యం ఉంటుంది కానీ, శారీరకంగా దృఢంగా ఉండరని చాలా మంది అంటుంటారు. అది తప్పని నిరూపించాలని ఎప్పుడూ అనుకునేదాన్ని. చిన్నప్పటి నుంచి నా ఆలోచనలు ఇలాగే ఉండేవి. పాఠశాల రోజుల్లో క్రీడలపై ఎక్కువ దృష్టి పెట్టాను. మగవాళ్లతో పోలిస్తే మహిళలు ఎందులోనూ తక్కువ కాదని చెప్పాలన్నదే నా ఉద్దేశం. ఇప్పుడు దాన్ని నిరూపించాను.

రాష్ట్రపతి మెడల్‌తో ఆత్మవిశ్వాసం

అరుణాచల్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నప్పుడు 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న గోరీచెన్ బేస్ క్యాంప్‌కు మెడికల్ ఆఫీసర్‌గా నాలుగైదుసార్లు వెళ్లాను. నన్ను గమనించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటినీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ డైరెక్టర్.. ‘మీరు కూడా ట్రెక్ చేయవచ్చు కదా’అని సలహా ఇచ్చారు. అప్పుడే రాఫ్టింగ్ కోర్సులో చేరాను. ఆ సమయంలోనే నేనెందుకు గోరీ చెన్ పర్వతాన్ని అధిరోహించకూడదు? అనిపించింది. నా మీద నాకు నమ్మకం వచ్చాక పర్వతారోహణకు సిద్ధమయ్యాను. ఒక రోజు ట్రెక్‌లో చాలా మంది ఉన్నారు. పైకి వెళ్తున్నప్పుడు పైనుంచి ఒక పెద్ద రాయి దొర్లుకుంటూ వచ్చింది. వెంట్రుకవాసిలో తప్పించుకున్నాను. విజయవంతంగా శిఖరాన్ని చేరి దేశ పతాకాన్ని ఎగురవేశాను. అదే సమయంలో ట్రెక్ చేస్తున్న ఓ మహిళ ఊపిరాడక ఇబ్బంది పడుతోంది. వెంటనే స్పందించి ఆమె ప్రాణాలు కాపాడాను. ఎంబీబీఎస్ చేసినందుకు ఆ రోజు ఎంతో ఆనందం కలిగింది. ఈ సంఘటనకు గానూ రాష్ట్రపతి నుంచి విశిష్ట సేవా పతకం అందుకున్నాను.

నాన్న భరోసా.. అమ్మ ఆత్మవిశ్వాసం!

నాన్న రామారావు రైల్వే క్లర్క్. అమ్మ గృహిణి. నాకు ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా, నా చదువు పూర్తి చేయడానికి నాన్న ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారు. ఎంబీబీఎస్ అయ్యాక పీజీ చేస్తానని చెప్పాను. అప్పుడు నాన్న ఆర్థిక పరిస్థితిని వివరించారు. వైద్య వృత్తిలో స్థిరపడాలనుకుంటున్న సమయంలో, ఆర్మీలో కూడా మెడికల్ ఆఫీసర్‌గా పని చేయవచ్చని తెలుసుకున్నాను. ఈ విషయం అమ్మానాన్నలకు చెప్పగా.. రక్షణ రంగం అనగానే వాళ్లు కొంచెం భయపడ్డారు. అక్కడ బాగుంటే కొనసాగుతాను, లేదంటే తిరిగి వచ్చి వైద్య వృత్తిలో స్థిరపడతానని వారికి నచ్చజెప్పాను. నాన్న భరోసా ఇచ్చారు. అమ్మ ఆత్మవిశ్వాసాన్ని నింపింది. అందుకే కెప్టెన్‌గా మొదలై.. మేజర్ స్థాయికి చేరుకున్నాను.

సుడిగుండంలో చిక్కుకున్నా..

మొదటి రోజు ప్రయాణం చాలా సవాలుగా అనిపించింది. రాక్ సర్ఫింగ్ సమయంలో రాఫ్ట్ బోల్తాపడి రాళ్ల మధ్య ఇరుక్కుపోయాను. సేఫ్టీ కయాక్‌ను పట్టుకొని 200 మీటర్ల వరకు ప్రయాణించాను. రెస్క్యూ సిబ్బంది సాయంతో అతి కష్టం మీద మళ్లీ రాఫ్ట్‌లోకి వచ్చాను. కొద్ది దూరం వెళ్లాక, మరోసారి టీమ్ మొత్తం 6 అడుగుల లోతైన నీటిలో పడిపోయాం. అక్కడ ఏర్పడిన సుడిగుండంలో నేను చిక్కుకున్నప్పుడు ఇక నా పని అయిపోయిందని అనుకున్నాను. ‘ప్రతి నిమిషం నిన్ను నువ్వు రక్షించుకోవడానికి, నీ టీమ్‌ను నడిపించడానికి ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కో’అని అమ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చి.. బలంగా ప్రయత్నించి బయటపడ్డాను. ఇలా వారం రోజుల పాటు ప్రయాణం నరకప్రాయంగా సాగింది. అయినా ఎక్కడా వెనకడుగు వేయలేదు. నిర్దేశించుకున్న 28 రోజుల్లో 1,040 కిలోమీటర్ల రివర్ రాఫ్టింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాం.


రివర్ రాఫ్టింగ్‌లో మేజర్ కవిత బృందం


మేజర్ కవితకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంస(ఫైల్)

రక్షణ రంగంలో నారీశక్తి



రక్షణ రంగంలో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారు. ఇక్కడ పనిలో పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. యూనిఫాం వేశాక స్త్రీ, పురుష భేదాలు ఉండవు. నారీశక్తికి ఇక్కడ ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోంది. బ్రహ్మపుత్ర రివర్ రాఫ్టింగ్‌లో మొత్తం 12 మంది సభ్యులుండగా, అందులో నేను ఒక్కదాన్నే మహిళను. అయినా ఆ భేదం ఎక్కడా కనిపించలేదు. మేమంతా ఒకే బృందంగా అడుగు ముందుకు వేశాం.

ఎవరెస్ట్ ఎక్కుతా.. పీజీ చేస్తా!

ఈ ప్రపంచ రికార్డు నన్ను మరిన్ని సాహస యాత్రల వైపు నడిపిస్తోంది. సింధు ఉపనది జస్కర్ నదిలో రాఫ్టింగ్ చేయాలనుకుంటున్నాను. రాఫ్టింగ్ క్రీడకు పుట్టినిల్లు అయిన అమెరికాలోని అత్యంత ప్రమాదకరమైన కొలరాడో నదిలో రాఫ్టింగ్ చేయాలన్నది నా కోరిక. మకాలు పర్వతారోహణతో పాటు ప్రతిష్టాత్మకమైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి కూడా అడుగులు వేస్తున్నాను. వైద్య వృత్తిలో భాగంగా స్పోర్ట్స్ మెడిసిన్ లేదా ఆప్తమాలజీలో పీజీ కూడా చేస్తాను.

'కన్ను లేనిదే కలికాలమే లేద'ని సామెత. అయితే వ్యాధుల్లేకుండా కూడా ఈ కలికాలం లేదు. పైగా ఈ వ్యాధులన్నీ అంతటి కీలకమైన కంటిని దెబ్బతీసే అవకాశం లేకపోలేదు. డయాబెటిస్, రక్తపోటు వంటివి కనిపించినప్పుడు ఇంకేవైనా అవయవాలు దెబ్బతిన్నాయో చూడటంతోపాటు డాక్టర్లు కంటి పరీక్షలూ విధిగా నిర్వహిస్తారు. అలాగే మైగ్రేన్ మొదలుకొని థైరాయిడ్, రక్తహీనత (అనీమియా) వరకు ఎన్నో రకాల వ్యాధులు కంటి చూపుపై తమ దుష్ప్రభావాన్ని చూపే అవకాశముంది. అందుకే నేరుగా కంటికి వచ్చే ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర వ్యాధుల వల్ల కంటిపై పడే దుష్ప్రభావాలు ఎలా ఉంటాయో, వాటి వల్ల కంటికి వచ్చే సమస్యలేమిటో తెలుసుకుందాం...

• వ్యాధులు... ప్రభావాలు

కంటిపై కన్నేస్తాయి!



ఎవరిలోనైనా ఏదైనా వ్యాధి వచ్చిందంటే చాలా సందర్భాల్లో అది ఆ అవయవానికో లేదా ఆ అవయవం ఏ వ్యవస్థదైతే ఆ వ్యవస్థకు మాత్రమే పరిమితమని అపోహ పడుతుంటాం. ఉదాహరణకు రక్తహీనత ఏర్పడిందంటే... అది రక్తం సరఫరా అయ్యే అన్ని అవయవాలతో పాటు కంటిపైనా తన దుష్ప్రభావాన్ని చూపవచ్చు. ఇక థైరాయిడ్‌కు ఏదైనా జబ్బు వస్తే అది థైరాయిడ్‌కు మాత్రమే పరిమితం కాకపోవచ్చు. అలా కంటిపై ప్రభావం చూపేందుకు అవకాశమున్న కొన్ని ఆరోగ్య సమస్యలూ, వ్యాధులు, కండిషన్స్ తాలూకు ఉదాహరణలు... ● డయాబెటిస్ ● రక్తపోటు ● థైరాయిడ్ ● రక్తహీనత (అనీమియా) ● కొలాజెన్ వాస్క్యులార్ డిసీజ్ ● ఆటోఇమ్యూన్ డిసీజెస్ ● కొన్ని రకాల ఇన్ఫెక్షన్స్ ● కొన్ని ట్యూమర్లు (గడ్డలు) ● వంశపారంపర్యంగా వచ్చే కొన్ని రకాల (హెరిడిటరీ) వ్యాధులు. ఇవి మాత్రమే కాదు... మనం వాడే కొన్ని రకాల మందులు, మన హార్మోన్లలో చోటుచేసుకునే అసమతౌల్యతలు... ఇవి కూడా కంటిపైన దుష్ప్రభావాలను చూపవచ్చు. అందుకే కొన్ని వ్యాధులు ఉన్నవారు, కొన్ని మందులు తీసుకునేవారు విధిగా వాటి వల్ల తమ కంటిపై ఏదైనా చెడు ప్రభావాలు కనిపిస్తాయా అని తెలుసుకోవాలి. అలాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టరును సంప్రదించాలి.



డాక్టర్ రవికుమార్ రెడ్డి
సీనియర్
కంటి వైద్య నిపుణులు

కొన్ని జబ్బులూ... కంటిపై అవి చూపే దుష్ప్రభావాలు...

డయాబెటిస్

ఈరోజుల్లో ఇంటికి ఒకరికైనా ఉండే లైఫ్‌స్టైల్ వ్యాధి ఇది. ఈ సమస్య వచ్చినవారిలోని కనీసం 20 శాతం మందిలో దాని దుష్ప్రభావాలు కంటిపైనా పడే అవకాశాలుంటాయి. డయాబెటిస్ వల్ల కంటికి వచ్చే వ్యాధులివే...

● **డయాబెటిక్ రెటినోపతి :** కంటివెనక ఉండే రెటీనా అనే తెరపై పడే ప్రతిబింబం నుంచి మెదడుకు సిగ్నల్స్ అందడం వల్లనే మనం చూడగలం. డయాబెటిస్ కారణంగా రక్తనాళాలు మొద్దుబారడంతో రెటినాకు అందాల్సిన పోషకాలు, ఆక్సిజన్ అందకపోవడంతో రెటీనా పనితీరు క్రమక్రమంగా తగ్గే అవకాశముంటుంది. ఫలితంగా దృష్టిలోపం వచ్చే ముప్పు ఉంటుంది. అందుకే డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలూ, కంటి నరాలు మొద్దుబారుతున్నాయా అన్న విషయాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ ఉండాలి.

● **గ్లకోమా :** డయాబెటిస్ ఉన్నవారికి కంట్లో నల్ల ముత్యం లేదా నీటికాసులు అనే గ్లకోమా బారిన పడే ముప్పు ఉంటుంది. గ్లకోమా ఉన్నవాళ్లలో కంట్లో ఉండే ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్ అనే ఒత్తిడి పెరిగి మనం చూసే దృష్టి విస్తృతి (ఫీల్డ్ ఆఫ్ విజన్) క్రమంగా తగ్గిపోతుంది. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు గ్లకోమా కండిషన్ ఏమైనా వచ్చిందా అని తరచూ కంటి డాక్టర్ చేత పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

● **క్యాటరాక్ట్ :** కంట్లోని లెన్స్ తన పారదర్శకతను కోల్పోయే కండిషన్‌ను కాటరాక్ట్ అంటారన్న విషయం తెలిసిందే. వయసు పెరగడమే (ఏజింగ్ మాత్రమే) కాకుండా డయాబెటిస్ వల్ల కూడా కాటరాక్ట్ వచ్చే అవకాశమున్నందువల్ల చక్కెర వ్యాధితో బాధపడేవారు క్యాటరాక్ట్‌కు సంబంధించిన పరీక్షలూ చేయించుకోవాలి. ఎందుకంటే సాధారణ ఆరోగ్యవంతులతో పోలిస్తే డయాబెటిస్ ఉన్నవాళ్లకు క్యాటరాక్ట్ పదేళ్లు ముందుగానే వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ.

● **ఆప్టిక్ న్యూరోపతీ :** డయాబెటస్ వల్ల నరాలు మొద్దుబారి తమ చైతన్యాన్ని కోల్పోతాయన్న విషయం తెలిసిందే. అన్ని నరాలతో పాటు ఆప్టిక్ నర్వ్‌కు కూడా ఈ ముప్పు పొంచి ఉంటుంది. మిగతా నరాల విషయం ఎలా ఉన్నా చూపునిచ్చే ఆప్టిక్ నర్వ్ దెబ్బతింటే జీవితమంతా చీకటయ్యే ముప్పు ఉన్నందున డయాబెటిస్ ఉన్నవారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా కంటిపరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

● డయాబెటిస్ ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, వ్యాయామం చేస్తూ రక్తంలో చక్కెర మోతాదులను ఎప్పుడూ అదుపులో పెట్టుకుంటూ ఉండటం ● క్రమం తప్పకుండా తమ వ్యక్తిగత వైద్యులతో పాటు కంటి డాక్టర్ ఫాలో అప్‌లో ఉండటం.

మైగ్రేన్

ఇది ఒక రకం తలనొప్పి. తరచూ వస్తూ పోతూ... చాలా తీవ్రంగా బాధించే ఈ తలనొప్పి చాలామందిలో నుదుటికి ఒకవైపే రావచ్చు. అందుకే కొందరు దీన్ని పార్శ్వపు నొప్పి అని కూడా పిలుస్తారు. టీనేజ్ పిల్లల్లో తీవ్రంగా వచ్చి వాళ్ల చదువుపై కూడా ప్రభావం చూపే ఈ నొప్పిలో కన్ను కూడా చాలా నొప్పిగా ఉన్నట్లుగా అనిపిస్తుంటుంది. దాంతో పాటు కంటికి సంబంధించిన ఈ కింద లక్షణాలూ కనిపిస్తాయి. అవి... ● చూపు సరిగా కనిపించకుండా మసకమసగ్గా కనిపించడం ● నుదుటి మీద ఒకవైపున లేదా ఒక పక్క కన్నుగుడ్డులో తీవ్రమైన నొప్పి ఉండటం ● తాత్కాలికంగా చూపు తగ్గడం లేదా తాత్కాలికంగా ఏమీ కనిపించకపోవడం ● కంటి కండరాలకూ, కనురెప్పలకూ తాత్కాలికంగా పక్షవాతం రావడం.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

కొన్ని అంశాలు మైగ్రేన్ తలనొప్పిని తక్షణం ప్రేరేపిస్తాయి. ఉదాహరణకు కొన్ని రకాల సుగంధద్రవ్యాల వాసనా లేదా అగరుబత్తీల వాసనలు మైగ్రేన్‌ను ప్రేరేపించి వెంటనే తలనొప్పి వచ్చేలా చేస్తాయి. ఇలా మైగ్రేన్ తలనొప్పిని ప్రేరేపించే అంశాలను ట్రిగ్గరింగ్ ఫ్యాక్టర్స్ అంటారు. తమకు తలనొప్పి ఏ అంశం వల్ల వస్తుందో గుర్తించి దాని నుంచి దూరంగా ఉండటం వల్ల దీన్ని చాలావరకు నివారించవచ్చు. ఇక మైగ్రేన్‌కు సంబంధించి డాక్టర్లు రెండురకాల చికిత్సలు చేస్తారు. మొదటిది... నొప్పి తక్షణమే తగ్గేందుకు చేసే చికిత్స, రెండోది దీర్ఘకాలంలో ఈ నొప్పి మళ్లీ మళ్లీ రాకుండా నివారించేందుకు ఇచ్చే ప్రివెంటివ్ చికిత్స. ఈ రెండు రకాల ఈ మందులను బాధితులు తప్పనిసరిగా వాడాలి.

రక్తపోటు (హైపర్‌టెన్షన్)

రక్తపోటు ఉన్నవారిలో కొందరికి అకస్మాత్తుగా చూపు కొంత మసకబారవచ్చు. లేదా దాదాపుగా చూపు కనిపించకపోవచ్చు. దీనికి అనేక కారణాలుంటాయి. రక్తపోటు కారణంగా...

- రెటీనాకు సంబంధించిన ప్రధాన రక్తనాళం (సిర)లోగానీ లేదా ఇతరత్రా ఏదైనా చిన్న రక్తనాళం (బ్రాంచ్ ఆఫ్ బ్లడ్ వెసెల్)లోగానీ రక్తం గడ్డకట్టి క్లాట్ ఏర్పడి అది అడ్డుపడే ముప్పు ఉండవచ్చు.
- రెటీనాకు సంబంధించిన ప్రధాన ధమని లేదా ధమని శాఖలో రక్తం గడ్డకట్టి రక్తప్రవాహానికి ఆ క్లాట్ అడ్డుపడవచ్చు.
- ఆప్టిక్ న్యూరోపతి అనే నరాలకు సంబంధించిన సమస్య రావచ్చు.
- కన్నులోని ఒక భాగమైన విట్రియల్ ఛేంబర్‌లో రక్తస్రావం కావచ్చు.
- గ్లకోమా వచ్చే ముప్పు కూడా ఉంటుంది.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

● రక్తపోటు ఉన్నవారు ● బీపీని అదుపులో ఉంచే ప్రయత్నాలు చేస్తుండాలి ● ఉప్పు, నూనె పదార్థాలు చాలా తక్కువగా తీసుకోవాలి ● కంటికి సంబంధించిన సమస్య వస్తే మందులు వాడటం లేదా లేజర్ చికిత్స లేదా శస్త్రచికిత్స చేయించుకోవాలి.

థైరాయిడ్ సమస్య

ఈ థైరాయిడ్ గ్రంథి స్రవించే హార్మోన్ కారణంగా మన శరీరంలోని అనేక సంక్లిష్టమైన జీవక్రియలు సజావుగా జరుగుతాయి. ఇది గొంతు వద్ద ఊపిరితిత్తుల్లోకి గాలి తీసుకెళ్లే నాళం చుట్టూతా అలముకున్నట్టుగా ఉంటుంది. ఈ గ్రంథిలో ఏదైనా లోపం ఏర్పడినప్పుడు దాని లక్షణాలూ / దుష్ప్రభావాలు కంటి దగ్గరా బయటపడతాయి. థైరాయిడ్ సమస్య వచ్చినప్పుడు కంటి దగ్గర కనిపించే లక్షణాలివి...

● కన్నుగుడ్డు బయటకు పొడుచుకు వచ్చినట్లుగా కనిపించడం (ప్రాప్టోసిస్) ● ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డిప్లోపియా) ● కంటికి రంగులను చూసే శక్తి క్షీణించడం (డిఫెక్టివ్ కలర్ విజన్) ● కన్ను పొడిబారిపోవడం (డ్రై ఐ) ● కార్నియాకు సంబంధించిన సమస్యలు రావచ్చు.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

● థైరాయిడ్ సమస్య ఉన్నవారు ● డాక్టర్లు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలి ● అవసరాన్ని బట్టి డాక్టర్లు సూచించిన స్టెరాయిడ్స్ తీసుకోవాలి ● కొన్ని సందర్భాల్లో ఇమ్యునోసప్రెసెంట్స్ వాడాల్సి రావచ్చు ● అవసరాన్ని బట్టి రేడియోథెరపీ తీసుకోవాల్సిరావచ్చు ● కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్బిటోటమీ అనే శస్త్రచికిత్స చేయించాల్సి రావచ్చు.

గుండెజబ్బులు

కొన్ని రకాల గుండెజబ్బులు (కార్డియోవాస్క్యులార్ డిసీజెస్) కూడా కంటిపై దుష్ప్రభావాన్ని చూపవచ్చు. గుండె జబ్బుల కారణంగా కొందరిలో ఈ లక్షణాలు కనిపించవచ్చు. ఉదాహరణకు...

● అకస్మాత్తుగా చూపు మందగించడం
● తాత్కాలికంగా చూపు కోల్పోవడం
● కంటి చూపునకు / దృష్టిజ్ఞానానికి సహాయపడే నరానికి (ఆప్టిక్ నర్వ్‌కు) సంబంధించిన సమస్యలు.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

అసలు సమస్యకు (అండర్‌లైయింగ్ హార్ట్ ప్రాబ్లమ్‌కు) చికిత్స తీసుకోవడం వల్ల దాని కారణంగా వచ్చే కంటి సమస్యలూ తగ్గుతాయి. అలాగే తరచూ కంటి పరీక్షలూ చేయించుకుంటూ ఉండాలి.

డిస్‌లిపిడేమియా

రక్తంలో ఉండే కొన్ని రకాల కొవ్వు పదార్థాలు (ఉదా: కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరాయిడ్స్ వంటివి) ఉండాల్సిన మోతాదుల్లో కాకుండా హెచ్చుతగ్గులతో ఉన్నప్పుడు కంటి సమస్యలు రావచ్చు. అవి చూపును ప్రభావితం చేసే అవకాశం ఉంది.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

● కొవ్వులు తక్కువగానూ, పీచు ఎక్కువగానూ ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలి ● తాము తీసుకున్న కొవ్వులు దహనమయ్యేలా (బర్న్) అయ్యేలా వ్యాయాయం చేయాలి ● డాక్టర్లు కొవ్వుల మోతాదులను తగ్గించే మందులు సూచిస్తే వాటిని తప్పక వాడాలి.

మియస్థేనియా గ్రేవిస్

ఇది నరాలూ, కండరాలకు వచ్చే జబ్బు. ఈ జబ్బు వల్ల కండరాలు క్రమక్రమంగా శక్తిని కోల్పోతూ... ఒక దశలో పూర్తిగా చచ్చుబడినట్లుగా మారతాయి. పూర్తిగా శక్తిహీనంగా తయారవుతాయి. ఈ వ్యాధి వల్ల కలిగే దుష్ప్రభావంతో చూపు కూడా దెబ్బతింటుంది. కంటిపై ఈ వ్యాధి కనబరిచే దుష్ప్రభాలివే...

● పై కనురెప్ప గాని లేదా కింది కనురెప్పగానీ వ్యక్తి ప్రమేయం లేకుండా దానంతట అదే మూసుకుపోవడం (టోసిస్) ● ఒకే వస్తువు రెండుగా కనిపించడం (డిప్లోపియా).

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

● మియస్తేనియా గ్రేవిస్ జబ్బు ఉన్న వారు దాన్ని నియంత్రించుకునేలా డాక్టర్లు సూచించిన స్టెరాయిడ్స్ క్రమం తప్పకుండా వాడాలి. ● ఇమ్యూనోమాడ్యులేటర్స్ అనే మందులను వాడాల్సి ఉంటుంది ● కొందరిలో అరుదుగా ఒక్కోసారి శస్త్రచికిత్స అవసరం కావచ్చు.

సోరియాసిస్

సోరియాసిస్ వ్యాధిలో చర్మం పొడిబారి పొట్టు రాలుతున్నట్లుగా ఉంటుంది. సొంత రోగ నిరోధకశక్తి బాధితులపై ప్రతికూలంగా పనిచేయడంతో పాటు మరికొన్ని కారణాలతో వచ్చే ఈ జబ్బులో కన్ను కూడా ప్రభావితమయ్యే అవకాశాలుంటాయి. ఈ జబ్బు ఉన్నవాళ్లలో...

● రెటీనాకూ, తెల్లగుడ్డులో భాగమైన స్క్లెరా పొరకు మధ్య ఇన్‌ఫ్లమేషన్ రావడం (యువైటిస్) ● కార్నియాకు ఇన్‌ఫ్లమేషన్ రావడం (కెరటైటిస్), కంటిలో ఉండే కంజెంక్టివా అనే పొరకు ఇన్ఫెక్షన్ రావడం (కంజెక్టివైటిస్), కన్ను పొడిబారడం (డ్రై ఐ) వంటి లక్షణాలు కనిపించవచ్చు.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు...

సోరియాసిస్‌కు ఇప్పుడు గతంలో కంటే అధునాతనమైన చికిత్స ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు పూవా, గతంలో మాదిరిగా అల్ట్రావయొలెట్ రేడియేషన్ కిరణాలతో ఇచ్చే చికిత్సలు, ఇమ్యూనోమాడ్యులేటర్స్ అనే ఆధునిక తరహా చికిత్సలు. వీటిని తీసుకుంటూనే ఒకసారి కంటి వైద్యుడిని కూడా సంప్రదించాలి.

నిర్వహణ:
యాసీన్

రక్తహీనత (అనీమియా)

మన రక్తంలో ఉండే ఎర్ర రక్తకణాలే దేహంలోని అన్ని కణాలకూ అవసరమైన ఆక్సిజన్‌నూ, పోషకాలను మోసుకెళ్తుంటాయన్న విషయం తెలిసిందే. అనేక రకాల కారణాలతో కొంతమందిలో ఈ ఎర్రరక్త కణాల సంఖ్య (ఆర్బీసీ) తక్కువగా ఉండే కండిషన్‌ను రక్తహీనత (అనీమియా) అంటారు. మరికొందరిలో రరక్తకణాల సంఖ్య తగినంతగా ఉన్నా ఆక్సిజన్‌ను మోసుకుపోయే హిమోగ్లోబిన్ తక్కువగా ఉండవచ్చు. ఇలా రక్తహీనత ఉన్నవారిలో ఈ కింది లక్షణాలు కనిపిస్తాయి.

● రెటీనాపై రక్తస్రావం (రెటినల్ హేమరేజ్) ● కంటిలోని లెన్స్ తన పారదర్శకత కోల్పోవడం
● నరాల సమస్య వంటివి.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు... ● అనీమియాను తగ్గించే ఐరన్ టాబ్లెట్లు / ఐరన్ సప్లిమెంట్లు ఉన్న మందులు వాడటం ● ఐరన్, ఇతరత్రా విటమిన్లు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాలు తీసుకోవడం.

కొలాజెన్ వ్యాస్క్యులార్ డిసీజెస్

కొలాజెన్ అనేది శరీరంలోని ఒకరకం ప్రొటీన్లతో కూడిన కణజాలం. మన రోగనిరోధక శక్తి మన కణజాలాన్నే శత్రువుగా పరిగణించి మన కొలాజెన్ ప్రొటీన్లపై దాడి చేయడం వల్ల కొన్ని వ్యాధులు కనిపిస్తాయి. వాటన్నింటినీ కలిపి కొలాజెన్ వ్యాస్క్యులార్ డిసీజెస్‌గా చెబుతారు. ఆ వ్యాధులేమిటంటే...

● సిస్టమిక్ లూపస్ అరిథమెటోసిస్ (ఎస్ఎల్ఈ) ● కీళ్లనొప్పులు (జాయింట్‌పెయిన్స్) ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ ● వెజెనెర్స్ గ్రాన్యులోమాటోసిస్ వంటి వ్యాధులు.

● **ఎస్ఎల్ఈ (లూపస్) :** లూపస్ అంటే వుల్ఫ్ (తోడేలు) అని అర్థం. ముఖం మీద ముక్కుకు ఇరువైపులా మచ్చతో కనిపించే వ్యాధి తాలూకు ఒక లక్షణం. ఇది శారీరక వ్యవస్థలపై ప్రభావం చూపుతుంది కాబట్టి దీన్ని సిస్టమిక్ లూపస్ అరిథమెటోసస్ (ఎస్ఎల్ఈ) అని చెబుతారు.

లక్షణాలు... ● ముక్కుపై నుంచి చెంపలపైన ఇరువైపులా మచ్చల్లా కనిపించే దద్దుర్లలా (ర్యాష్) వస్తుంది. సూర్యకాంతి (ఫోటోసెన్సిటివిటీతో) వల్ల ఈ ర్యాష్ మరింత పెరగవచ్చు.

● పొలిపోయినట్లుగా ఉండే చర్మం ● కొందరిలో వెంట్రుకల మూలాలు మూసుకుపోవడం (లూపస్‌లో ఇది ఒక రకం). దీన్ని డిస్కాయిడ్ లూపస్ అంటారు. ఇది వచ్చిన వారిలో ర్యాష్ చేతులు, ముఖం మీద వస్తుంది. కొన్నిసార్లు ఒళ్లంతా ర్యాష్ కూడా రావచ్చు ● కారణం తెలియని జ్వరం ● బరువు తగ్గడం ● కాళ్లూ చేతులకు సంబంధించిన రెండు మూడు జాయింట్స్‌లో వాపు; రుమటాయిడ్ జబ్బుల్లోలా లూపస్‌లో జాయింట్స్ వాపు వచ్చి జాయింట్స్ ఒంగిపోతాయి. అయితే... రుమటిజంలోలా ఈ ఒంపు వల్ల శాశ్వత అంగవైకల్యం రాదు. ఇది కేవలం తాత్కాలికం.

● కొందరు డిప్రెషన్‌తో ఉద్వేగాలకు లోనవుతుంటారు. వీళ్ల సమస్యను మానసికమైన లేదా నరాలకు సంబంధించినదిగా పొరపాటు పడే అవకాశం ఉంది. ఇలాంటి వాళ్లలో ఏఎన్ఏ పరీక్ష నిర్వహించి- లూపస్ వల్ల మెదడుపై ఏదైనా దుష్ప్రభావం పడిందేమోనని పరీక్షించాలి.

● కొందరిలో ఫిట్స్ ● కొందరిలో జుట్టు రాలడం ● మరికొందరిలో నోటిలో, ముక్కులో పుండ్లు (అల్సర్స్) కూడా రావచ్చు. ఈ అల్సర్స్ వల్ల నొప్పి ఉండదు.

ఇక ఈ వ్యాధుల వల్ల కంటిపై పడే దుష్పరిణామమేమిటంటే... అరుదుగా కొందరిలో కళ్లలో రక్తపోటు పెరిగి (హేమరేజిక్ రెటినైటిస్) అంధత్వానికి దారితీయవచ్చు.

● కొందరిలో కంటి చూపు క్రమంగా తగ్గుతూ ఉండవచ్చు. వీటన్నింటితో పాటు కళ్లకు సంబంధించి కన్ను పొడిబారడం (డ్రై ఐ); రెటీనాకూ, తెల్లగుడ్డులో భాగమైన స్క్లెరా పొరకు మధ్య ఇన్‌ఫ్లమేషన్ రావడం (యువైటిస్); స్క్లెరా పొరకు ఇన్‌ఫ్లమేషన్; కార్నియాకు ఇన్‌ఫ్లమేషన్ రావడం (కెరటైటిస్) వంటి సమస్యలు రావచ్చు.

పిల్లల్లోనూ...

పిల్లల్లోనూ లూపస్ రావచ్చు. దీన్ని జువెనైల్ సిస్టమిక్ లూపస్ అని అంటారు. పిల్లల్లో జ్వరం వచ్చి రెండు మూడు కీళ్లలో వాపు రావడం ద్వారా ఇది కనిపిస్తుంది. ఎండను చూడలేక బాధపడుతుండే పిల్లల విషయంలో జువెనైల్ లూపస్ ఉందేమోనని అనుమానించి పరీక్షలు చేయించడం ముఖ్యం. పిల్లల్లో వచ్చినప్పుడు (నియోనేటల్ లూపస్)-పుట్టుకతోనే గుండె కవాటాలలో లోపం (కంజెనిటల్ హార్ట్ బ్లాక్) రావచ్చు. ఇలా పిల్లల్లో లూపస్ వస్తే అది కళ్లపై దుష్ప్రభావం చూపుతుంది కాబట్టి స్కూళ్లకు వెళ్లే వయసు పిల్లల్లో ప్రతి ఆర్నెల్లకు ఓమారు వైద్యపరీక్షలు, కంటి పరీక్షలు (మాక్యులార్ టెస్ట్) చేయించడం మంచిది.

పాటించాల్సిన సూచనలు / తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్సలు : ప్రధానమైన సమస్యలైన సిస్టమిక్ లూపస్ అరిథమెటోసిస్ (ఎస్ఎల్ఈ), కీళ్లనొప్పులు, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి సమస్యలకు చికిత్స తీసుకోవడంతో పాటు కంటికి సంబంధించిన సమస్యలకూ తగిన చికిత్స తీసుకోవాలి. ఇక పిల్లల్లో జువెనైల్ సిస్టమిక్ లూపస్‌ను గుర్తించడం సాధ్యం కాదు కాబట్టి స్కూల్ పిల్లలందరికీ కంటివైద్యుల ద్వారా ప్రతి ఆర్నెల్లకోమారు పరీక్షలు చేయించడం అవసరం.

బిజినెస్ రీల్

విద్యుత్ వాణిజ్య వాహనాలకు ఆదరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా, తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ వాణిజ్య వాహనాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని టీఐ క్లీన్ మొబిలిటీ చైర్మన్ అరుణ్ మురుగప్పన్ తెలిపారు. ఈ విభాగంలో ప్రస్తుతం సుమారు ఒక్క శాతంగా ఉన్న వీటి వాటా వచ్చే నాలుగైదేళ్లలో సుమారు 15 శాతానికి పెరగనుందని ఆయన చెప్పారు. చిన్న, భారీ ఈ-వాహనాలకు సంబంధించి తమకు నాలుగు విభాగాలు ఉన్నట్లు తెలిపారు. కీలకమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కొరత ప్రభావం రెండింటికే పరిమితం కావచ్చని పేర్కొన్నారు. టీఐ క్లీన్ మొబిలిటీ సంస్థ మోంట్రా బ్రాండ్ కింద ఈ-వాహనాలను విక్రయిస్తోంది. శ్రీరామ్ హర్ష భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో తొలి ఎలక్ట్రిక్-చిన్న వాణిజ్య వాహనాల (ఈ-ఎస్‌సీవీ) డీలర్‌షిప్‌ను ప్రారంభించిన సందర్భంగా అరుణ్ తెలిపారు. ఈ-వాణిజ్య వాహనాలపై సుమారు రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు చెప్పారు. త్వరలో విజయవాడ, వైజాగ్‌లో కూడా డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు హర్ష గ్రూప్ చైర్మన్ హర్షవర్ధన్ వివరించారు. మరోవైపు, ప్రస్తుతం సుమారు రూ. 700 కోట్లుగా ఉన్న ఆదాయాన్ని 2030 నాటికి రూ. 8,700 కోట్ల స్థాయికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు సంస్థటీఐ క్లీన్ మొబిలిటీ జలజ్ గుప్తా చెప్పారు.

5.2 శాతానికి నిరుద్యోగ రేటు



న్యూఢిల్లీ: గత నెల(జూలై)లో నిరుద్యోగ రేటు 0.4 శాతం తగ్గి 5.2 శాతానికి పరిమితమైంది. అంతక్రితం నెల అంటే జూన్‌లో ఇది 5.6 శాతంగా నమోదైంది. పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(పీఎల్ఎఫ్ఎస్) గణాంకాల ప్రకారం 2025 మే నెలలోనూ 5.6 శాతంకాగా.. తాజాగా నెమ్మదించింది. గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ విడుదల చేసిన వివరాలివి. కరెంట్ వీక్లీ స్టేటస్(సీడబ్ల్యూఎస్) ద్వారా సమీకరించిన తాజా గణాంకాలివి. వీటి ప్రకారం జూలైలో వయసుతో నిమిత్తంలేకుండా వ్యక్తుల నిరుద్యోగ రేటు 5.2 శాతానికి చేరింది. పురుషులలో నిరుద్యోగ రేటు 5.3 శాతంకాగా.. మహిళలలో 5.1 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాలలో వయసుతో నిమిత్తంలేని నిరుద్యోగ రేటు స్వల్పంగా పెరిగి 7.2 శాతాన్ని తాకగా.. గ్రామీణ ప్రాంతాలలో 0.5 శాతం తగ్గి 4.4 శాతానికి పరిమితమైంది. జూన్‌లో ఈ సంఖ్య పట్టణాలలో 7.1 శాతంకాగా.. గ్రామీణ ప్రాంతాలలో 4.9 శాతంగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-8-2025

విశాఖ	520-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	14,090.00	8.92
HEROMOTOCO	4,990.00	5.99
NESTLEIND	1,146.40	5.23
BAJFINANCE	905.05	5.06
BAJAJ-AUTO	8,592.00	4.61

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	405.3	-1.49
ETERNAL	314.1	-1.35
TECHM	1,470.50	-1.09
LT	3,640.00	-1.01
NTPC	336.3	-0.9

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,904
ఎన్ఎస్ఈ	1,06,994
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,793
ఎఫ్ఐఐ	+ 551
డీఐఐ	+ 4,104

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.78	$ 61.98
బ్రెంట్	66.67	$ 65.85

మేకిన్ ఇండియాపై జాగ్రత్త

- 'మనకు కావాల్సినవన్నీ మనమే తయారు చేసుకుందాం' అనే నినాదంగా మారకూడదు
- దీనితో పెట్టుబడులు, ఉత్పాదకతకు విఘాతం
- ఫార్మా, ఎలక్ట్రానిక్స్‌కి మినహాయింపులు శాశ్వతం కాదు
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



న్యూఢిల్లీ: 'మేకిన్ ఇండియా' నినాదమనేది 'మేక్ ఆల్ దట్ ఇండియా నీడ్స్' (భారత్‌కి కావల్సినవన్నీ ఇక్కడే తయారు చేసుకోవడం)గా మారకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరమని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పారు. దీనివల్ల చైనాకు వెళ్లే పెట్టుబడులను మనవైపు ఆకర్షించే అవకాశం కోల్పోతామని, ఉత్పాదకతపైనా తీవ్ర ప్రభావం పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మేకిన్ ఇండియా విజయవంతం కావడమనేది, రక్షణాత్మక ధోరణి కన్నా ఎంత మెరుగ్గా పోటీపడగలమనే దానిపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. మిగతావారితో పని లేకుండా విడిగా ఉండిపోవడం కాకుండా స్వేచ్ఛా విధానాలను అమలు చేయడం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని దువ్వూరి తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పునరుద్ఘాటించినట్లుగా ఆత్మనిర్భర భారత్ నినాద లక్ష్యం రక్షణ, ఇంధనంలాంటి సున్నిత రంగాల్లో వ్యూహాత్మకంగా స్వయం సమృద్ధి సాధించడమే కావాలే తప్ప దాన్ని ప్రతి ఒక్క దానికి అన్వయించుకోకూడదని తెలిపారు. భారత్‌కి మాత్రమే పరిమితం కాకుండా ప్రపంచానికి కూడా అవసరమైన వాటిని ఉత్పత్తి చేసే ఎగుమతుల ఆధారిత తయారీ హబ్‌గా దేశాన్ని తీర్చిదిద్దడమే మేకిన్ ఇండియా ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ''అయితే, 50 శాతం టారిఫ్‌ల వల్ల కీలకమైన అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తుల రేట్లు పెరిగిపోయి, ఈ లక్ష్యానికి విఘాతం కలుగుతుంది. డైవర్సిఫికేషన్ వ్యూహంలో భాగంగా చైనాకి ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తున్న ఇన్వెస్టర్లు, ఇప్పుడు ఆసియాలోనే అత్యధిక టారిఫ్‌లు ఎదుర్కొంటున్న మన దగ్గర ఇన్వెస్ట్ చేయడానికి సందేహిస్తారు'' అని దువ్వూరి తెలిపారు. ''ఆసియాలో బంగ్లాదేశ్, వియత్నాం, ఇండొనేషియా కన్నా భారత్‌పై అత్యధిక టారిఫ్‌లు వర్తిస్తుండటమనేది ఆందోళనకర అంశం. కీలక తరుణంలో చైనా ప్లస్ వన్‌గా ఎదగాలన్న ఆకాంక్షలను సాకారం చేసుకోవడానికి దీని వల్ల విఘాతం కలుగుతుంది'' అని చెప్పారు.

అమెరికాకు సగం ఎగుమతులపై టారిఫ్‌ల ప్రభావం ..

మన ఎగుమతుల్లో దాదాపు 20 శాతం వాటా ఉండే అమెరికా మార్కెట్లో 50 శాతం టారిఫ్‌లు విధిస్తే, కనీసం సగం ఎగుమతులపై ప్రభావం పడుతుందని దువ్వూరి తెలిపారు. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాభరణాలు, లెదర్‌లాంటి కార్మిక శక్తి ఎక్కువగా ఉండే రంగాలపై ప్రభావం ఉంటుందని చెప్పారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్‌కు టారిఫ్‌ల నుంచి మినహాయింపు ఉండటం శాశ్వతమేమీ కాదని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు కొనసాగుతున్న సమీక్షల వల్ల భవిష్యత్తులో వాటిని కూడా టారిఫ్‌ల పరిధిలోకి చేర్చే అవకాశం ఉందన్నారు.

రష్యా ఆయిల్ తగ్గించుకుంటే రేట్లు భగ్గు..

అమెరికా టారిఫ్‌లపై ఆందోళనతో భారత్ ఒక్కసారిగా చమురు దిగుమతులను రష్యా నుంచి గల్ఫ్‌కి మార్చుకుంటే, డిమాండ్‌కి తగినంతగా ఉత్పత్తి పెరగకపోవడం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమంటాయన్నారు. దీనివల్ల భారత కరెంటు అకౌంటు లోటు పెరగడం, రూపాయి మరింత బలహీనపడటం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరిగిపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయన్నారు. పశ్చిమాసియా, ఆఫ్రికన్ చమురు వైపుగా క్రమేపీగా మళ్లడం ఒక పరిష్కారమార్గం కాగలదని చెప్పారు. వాణిజ్య లోటు కన్నా ప్రయోజనాలపైనే అమెరికా, భారత్ దృష్టి పెడితే చర్చల్లో పురోగతి ఉంటుందని చెప్పారు.

500 బిలియన్ డాలర్ల వాణిజ్యం డౌటే..

ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలన్న భారత్-అమెరికా లక్ష్యం సాకారం కావడం మిథ్యేనని స్పష్టంగా తెలుస్తోందని దువ్వూరి చెప్పారు. మన ఎగుమతుల మీద పడే ప్రభావాలపై లెక్కలు వేసుకోవడానికి ముందు, అమెరికా మార్కెట్ కోల్పోవడం వల్ల వచ్చే నష్టాలను భర్తీ చేసుకునేందుకు ప్రపంచ దేశాలను చైనా తమ ఉత్పత్తులతో ముంచెత్తే ముప్పు గురించి కూడా మనం ఆలోచించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు, దేశీయంగా డెయిరీ, వ్యవసాయం అనేవి రాజకీయంగా చాలా సున్నితమైన రంగాలని, కోట్ల కొద్దీ ప్రజలకు జీవనోపాధి కల్పించడంతో పాటు దేశ ఆహార భద్రతకు కూడా ముడిపడి ఉన్నవని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అమెరికా దిగుమతులకు గంపగుత్తగా అనుమతించడం వాంఛనీయమూ, లాభదాయకమూ కూడా కాదని సుబ్బారావు చెప్పారు. అయితే, కొన్ని విషయాల్లో కాస్త పట్టు విడుపులతో వ్యవహరిస్తే చర్చల్లో ప్రతిష్టంభన తొలగేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

లిస్టింగ్ బాటలో క్లీన్‌మ్యాక్స్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

CleanMax POWERING SUSTAINABILITY

న్యూఢిల్లీ: వాణిజ్య, పారిశ్రామిక(సీఅండ్ఐ) పునరుత్పాదక ఇంధన సర్వీసుల సంస్థ క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 1,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 3,700 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా మొత్తం రూ. 5,200 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 1,125 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మిగిలిన పెట్టుబడులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2010లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా సీఅండ్ఐ కస్టమర్లకు నెట్ జీరో, కర్బనరహిత సొల్యూషన్లు సమకూర్చుతోంది. 2025 జూలై 31కల్లా 2.54 గిగావాట్ల నిర్వహణ సామర్థ్యం, 2.53 గిగావాట్ల కాంట్రాక్టెడ్ సామర్థ్యం కలిగి ఉంది. ఇవికాకుండా మరో 5.07 గిగావాట్ల ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి. డేటా సెంటర్లు, ఏఐ, టెక్నాలజీ, సిమెంట్, స్టీల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, రియల్టీ తదితర పలు రంగాలలోని క్లయింట్లకు సర్వీసులు అందిస్తోంది. గతేడాది(2024-25) ఆదాయం 13 శాతం వృద్ధితో రూ. 1,610 కోట్లను అధిగమించగా.. రూ. 28 కోట్ల నికర లాభం ఆర్జించింది.

రూ. 5,000 కోట్ల సమీకరణలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రూ. 5,000 కోట్ల వరకు నిధులను సమీకరించనున్నట్లు వెల్లడించింది. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ లేదా విదేశీ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్లు లేదా ఇతరత్రా సెక్యూరిటీల జారీ ద్వారా ఈ నిధులు సమీకరించనున్నట్లు వివరించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించేందుకు ఆగస్టు 21న కంపెనీ బోర్డు సమావేశం కానుంది.

సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ. 90.26 వద్ద క్లోజయ్యింది.

GMR

యూపీఐ సబ్సిడీ కేటాయింపులు పెంచే అవకాశం

ఎస్‌బీఐ నివేదిక



ముంబై: యూపీఐ, రూపే కార్డ్ లావాదేవీల ద్వారా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకి మద్దతునిచ్చేందుకు ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో కేటాయించిన రూ. 437 కోట్ల వార్షిక సబ్సిడీ మొత్తాన్ని మరింతగా పెంచే అవకాశం ఉందని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐకి చెందిన ఎకానమిస్టులు ఒక నివేదికలో పేర్కొన్నారు. గణాంకాల ప్రకారం ఈ వ్యవస్థ నిర్వహణ కోసం పరిశ్రమవర్గాలు రూ. 4,000 కోట్ల నుంచి రూ. 5,000 కోట్ల వరకు భారాన్ని మోస్తున్నాయని తెలిపారు. 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,000 కోట్లుగా ఉన్న సబ్సిడీ మొత్తాన్ని ఈ బడ్జెట్‌లో భారీగా కోత పెట్టడంతో కొన్ని యూపీఐ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు అనుమతించాలంటూ విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయని నివేదిక తెలిపింది. దీని ప్రకారం వ్యాపారులకు వ్యక్తులు చేసే చెల్లింపులపై 0.30 శాతం మేర మర్చంట్ డిస్కౌంట్ రేటును (ఎండీఆర్) వసూలు చేసుకునేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతిస్తోంది. అయితే, డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించే ఉద్దేశంతో 2020 నుంచి రూపే డెబిట్ కార్డు, భీమ్-యూపీఐ ద్వారా చెల్లింపులపై చార్జీలను తొలగించింది. మరోవైపు, చిన్న వర్తకులకు యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఉండదు. పైగా రూ. 2,000 వరకు లావాదేవీ మొత్తాలపై 0.15 శాతం వరకు ప్రోత్సాహకాన్ని కూడా పొందవచ్చు. ఈ ప్రోత్సాహకాన్ని వ్యాపారి బ్యాంకునకు ప్రభుత్వం చెల్లిస్తుంది. దాన్ని కస్టమర్ బ్యాంకుతో పాటు మిగతా వర్గాలన్నీ కలిసి పంచుకుంటాయి. ప్రస్తుతం యూపీఐ లావాదేవీల్లో అమెరికన్ సంస్థలకు చెందిన ఫోన్‌పే, గూగుల్‌పే ఆధిపత్యం నెలకొనడమనేది దేశీ ఫిన్‌టెక్ సంస్థలను తొక్కేసే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది.

స్టార్టప్‌లకు పన్ను లబ్ధి

- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు దన్ను
- 100 రోజుల సంస్కరణ అజెండా



న్యూఢిల్లీ: స్టార్టప్‌లకు పన్ను సంబంధ లబ్ధిని పెంచడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) మార్గదర్శకాలను మరింత సరళీకరించడం, పొరుగు దేశాల నుంచి పెట్టుబడులను ప్రోత్సహించడం తదితర అంశాలతో వాణిజ్యం, పరిశ్రమల శాఖ 100 రోజుల సంస్కరణల అజెండాకు తెరతీయనుంది. అంతేకాకుండా లెదర్, ఫుట్‌వేర్ పరిశ్రమకు మద్దతుగా కొన్ని పర్యావరణ నిబంధనలను సులభతరం చేయడం, ఈకామర్స్ కేంద్రాల ద్వారా ఎగుమతుల పెంపునకు నిబంధనలను సరళీకరించడం, వివిధ రంగాలకు అవసరమయ్యే ల్యాబ్ టెస్టింగ్, సర్టిఫికేషన్‌లను ఏకీకృతం చేయడం సైతం సంస్కరణలలో భాగంకానున్నట్లు వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. తదుపరి 100 రోజుల ట్రాన్స్‌ఫార్మేషన్ అజెండాలో భాగంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించేందుకు వేగవంత చర్యలకు తెరతీయనున్నట్లు తెలియజేశారు. తాజా ప్రతిపాదనలు దేశ ఎగుమతులతోపాటు.. ఎఫ్‌డీఐలకు ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు తెలియజేశారు. కాగా. 2025-26 ఏప్రిల్-జూలైలో ఎగుమతులు 3.07 శాతం పుంజుకుని 149.2 బిలియన్ డాలర్లను తాకగా.. దిగుమతులు మరింత అధికంగా 5.4 శాతం పెరిగి 244 బిలియన్ డాలర్లను దాటాయి. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 4 నెలల్లో వాణిజ్య లోటు 94.81 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది(2024-25) ఎఫ్‌డీఐలు 13 శాతం ఎగసి 50 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

జేఎస్‌డబ్ల్యూ, పోస్కో జట్టు

భారత్‌లో ప్లాంటు ఏర్పాటుకు ఒప్పందం



న్యూఢిల్లీ: దేశీ ఉక్కు దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దక్షిణ కొరియాకు చెందిన పోస్కో గ్రూప్ చేతులు కలిపాయి. భారత్‌లో వార్షికంగా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటును ఏర్పాటు చేసే దిశగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని కింద ఫ్యాక్టరీకి అనువైన ప్రదేశం, పెట్టుబడులు, వనరుల లభ్యత, ఇతరత్రా అంశాలకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై ఇరు సంస్థలు అధ్యయనం చేయనున్నాయి. కంపెనీలు పరిశీలిస్తున్న కీలక రాష్ట్రాల్లో ఒరిస్సా కూడా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి గతేడాది అక్టోబర్‌లోనే ఇరు సంస్థలు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోగా, దానికి కొనసాగింపుగా ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. భవిష్యత్తులో అంతర్జాతీయంగా ఉక్కు డిమాండ్‌ను తీర్చడంలో భారత్ కీలకపాత్ర పోషించనుందని, పరస్పర నమ్మకం, దీర్ఘకాలిక ఉమ్మడి విజన్‌కి అనుగుణంగా జేఎస్‌డబ్ల్యూతో జట్టు కట్టామని పోస్కో హోల్డింగ్స్ ప్రెసిడెంట్ లీ జూ-టే తెలిపారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్య సాకారానికి ఇది దోహదపడగలదని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సీఈవో జయంత్ ఆచార్య చెప్పారు.

లో-రిస్క్ విదేశీ ఇన్వెస్టర్లకు దన్ను

- సింగిల్ విండో గేట్‌వే ఏర్పాటు యోచనలో సెబీ



న్యూఢిల్లీ: దేశీ సెక్యూరిటీ మార్కెట్లలో పాల్గొనేందుకు తక్కువ రిస్కుగల విదేశీ ఇన్వెస్టర్లకు సింగిల్ విండో ద్వారా వీలు కల్పించాలని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదిస్తోంది. తద్వారా నిబంధనల అమలును సరళతరం చేయాలని ఆలోచిస్తోంది. దీంతో దేశీయంగా పెట్టుబడులను ఆకట్టుకునేందుకు మద్దతివ్వనుంది. ట్రస్టెడ్ విదేశీ ఇన్వెస్టర్లకు సింగిల్ విండో ద్వారా ఆటోమేటిక్, జనరలైజిడ్ యాక్సెస్(ఎస్‌డబ్ల్యూఏజీఏటీ(స్వాగత్)-ఎఫ్ఐ) పేరుతో తాజా మార్గదర్శకాలకు శ్రీకారం చుట్టనుంది. కొత్త విధానం అమల్లోకి వస్తే లోరిస్క్ విదేశీ ఇన్వెస్టర్లు సులభంగా పెట్టుబడులు చేపట్టేందుకు దారి ఏర్పడనుంది. దీంతో యూనిఫైడ్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ద్వారా వివిధ పెట్టుబడి అవకాశాలకు వీలు చిక్కనుంది. అంతేకాకుండా పలుమార్లు డాక్యుమెంటేషన్, అనుమతులు తదితరాలను సాధ్యమైనంతగా తగ్గించనుంది.

వేగవంతమైన ఆర్థిక వ్యవస్థ భారత్

జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్



ముంబై: భారత్ ప్రపంచంలో వేగవంతమైన వృద్ధితోపాటు, పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సజ్జన్ జిందాల్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు ఈ రూపంలో కౌంటర్ ఇచ్చారు. ఎన్ఎస్ఈ కార్యాలయంలో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ లిస్టింగ్ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''భారత్‌కు గొప్ప భవిష్యత్ ఉంది. ఎందుకంటే ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఒకటిగా ఉంది. ట్రంప్ ఏం మాట్లాడినా మనం పట్టించుకోవక్కర్లేదు'' అని పేర్కొన్నారు. జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ గురించి మాట్లాడుతూ.. కంపెనీ వేగంగా వృద్ధిని సాధిస్తుందన్నారు. రక్షణాత్మకంగా కాకుండా దూకుడుగా ఉండాలంటూ.. భారత్‌కు ఇదే అవసరమన్నారు. ''భారత్‌కు దూకుడైన కంపెనీలు కావాలి. వృద్ధి కావాలి'' అని వ్యాఖ్యానించారు.

టెలికం కంపెనీలకు లాభాల మోత!

- 12-14 శాతం పెరగొచ్చు
- డేటాకు పెరుగుతున్న డిమాండ్
- దీంతో అధిక ఆదాయం
- తగ్గుతున్న మూలధన వ్యయాలు
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: టెలికం కంపెనీల నిర్వహణ లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) 12-14% పెరగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. రూ.1.55 లక్షల కోట్లుగా ఉంటుందని తెలిపింది. డేటా వినియోగంతో సగటు యూజర్ నుంచి వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) పెరుగుతుందని పేర్కొంది. 5జీ సేవలను ప్రారంభించిన అనంతరం బలమైన పనితీరు, మూలధన వ్యయాల తీవ్రత తగ్గుతుండడం, మెరుగైన నగదు ప్రవాహాలు కంపెనీల రుణ పరపతికి మద్దతుగా నిలుస్తున్నట్టు వివరించింది. ఏఆర్‌పీయూ ప్రతి రూపాయి పెరుగుదలతో టెలికం కంపెనీలకు మొత్తంగా రూ.850-900కోట్లు సమకూరుతుందని వెల్లడించింది. టెలికం రంగంలో 93% చందాదారులను కలిగిన మూడు ప్రముఖ టెలికం కంపెనీలపై (జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్) అధ్యయనం చేసిన క్రిసిల్ రేటింగ్స్ ఈ నివేదికను విడుదల చేసింది. టారిఫ్‌ల పెంపుతో టెలికం కంపెనీల నిర్వహణ లాభం 2024-25లో 17% వృద్ధి చెందడం గమనార్హం.

ప్రీమియం ప్లాన్లు..

ఓటీటీ సేవల కోసం డేటాకు డిమాండ్ పెరుగుతుండడంతో దీన్నుంచి ప్రయోజనం పొందేందుకు టెలికం కంపెనీలు ప్రీమియం ప్లాన్లను ఆఫర్ చేస్తుండడాన్ని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక ప్రస్తావించింది. ఇది కూడా సగటు యూజర్ వారీ ఆదాయాన్ని పెంచుతుందని తెలిపింది. ఇక చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో టెలికం సేవల విస్తరణ మరో 4-5 శాతం పెరిగి 2026 మార్చి నాటికి 82 శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. వాయిస్ కాల్స్ ప్లాన్లను వినియోగిస్తున్న యూజర్లు డేటా ప్లాన్లకు మళ్లడం ఆదాయాన్ని పెంచుతుందని వివరించింది. ఈ ధోరణులతో టెలికం కంపెనీలకు ఆదాయం పెరుగుతుందని.. అదే సమయంలో కంపెనీలకు 60 శాతం వ్యయాలు స్థిరంగా ఉంటాయి కనుక నిర్వహణ లాభం అధికమవుతుందని పేర్కొంది. అలాగే, మూలధన వ్యయాల అవసరం తక్కువగా ఉండడంతో ఫ్రీక్యాష్ ఫ్లో (నికర మిగులు నిల్వలు) పెరుగుతుందని వివరించింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో 31 శాతంగా ఉన్న మూలధన వ్యయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 24-26 శాతానికి (ఆదాయంలో) పరిమితమవుతాయని క్రిసిల్ రేటింగ్స్ అసోసియేట్ డైరెక్టర్ నితిన్ బన్సాల్ తెలిపారు. స్పెక్ట్రమ్ కొనుగోళ్లు దాదాపుగా 2022-23 ఆర్థిక సంవత్సరంలోనే ముగిశాయని, తదుపరి స్పెక్ట్రమ్ పెట్టుబడులు 2030లో అవసరపడతాయని చెప్పారు. ఇవన్నీ కలసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.70,000 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లోకు దారితీస్తాయని తెలిపారు. కంపెనీల నికర రుణ భారం 3.4 రెట్ల నుంచి 2.7 రెట్లకు (మూలధనంతో దిగొస్తుందన్నారు.

రూ.225కు ఏఆర్‌పీయూ

''గత ఆర్థిక సంవత్సరంలో ఏఆర్‌పీయూ రూ.205గా ఉంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.220-225కు చేరుకుంటుంది. ప్రధానంగా అధిక డేటా వినియోగం ఇందుకు దోహదం చేస్తుంది. 5జీ నెట్‌వర్క్ లభ్యత మరింత విస్తృతమై 2026 మార్చి నాటికి 45-47 శాతానికి చేరుకుంటుంది. 2025 మార్చి నాటికి ఇది 35 శాతంగా ఉంది'' అని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ ఆనంద్ కులకర్ణి తెలిపారు. సోషల్ మీడియా యాప్‌లు, వీడియో స్ట్రీమింగ్, గేమింగ్, జెనరేటివ్ ఏఐ, డిజిటల్ మార్కెటింగ్ కోసం డేటా వినియోగం పెరుగుతున్నట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో సగటు యూజర్ నెలవారీ డేటా వినియోగం 27జీబీగా ఉంటే, అది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 31-32జీబీకి పెరుగుతుందన్నారు. ''టెలికం కంపెనీలు ప్లాన్లలో డేటా ప్రయోజనాలను తగ్గిస్తున్నాయి. లేదా అధిక డేటా ప్లాన్లపైనే 5జీ సేవలను ఆఫర్ చేస్తున్నాయి. ఈ చర్యలు కస్టమర్లు ప్రీమియం ప్లాన్లకు వెళ్లేలా చేస్తాయి. దీంతో కంపెనీల ఏఆర్‌పీయూ పెరుగుతుంది'' అని కులకర్ణి వివరించారు.



కపిల్ 'డబుల్'

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణ, రజత పతకాలు సొంతం

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్‌కు మూడు పతకాలు లభించాయి. ఇందులో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత యువ షూటర్ కపిల్ 'డబుల్ ధమాకా' సృష్టించాడు. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం నెగ్గిన కపిల్ టీమ్ విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. కపిల్, జొనాథన్ గావిన్ ఆంటోనీ, విజయ్ తోమర్‌లతో కూడిన భారత బృందం 1723 పాయింట్లు స్కోరు చేసి రజత పతకాన్ని దక్కించుకుంది. జొనాథన్ 582 పాయింట్లు, కపిల్ 579 పాయింట్లు, విజయ్ తోమర్ 562 పాయింట్లు సాధించారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన వ్యక్తిగత విభాగం ఫైనల్లో కపిల్ 243 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని పొందాడు. జొనాథన్ గావిన్ 220.7 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు.

'మిక్స్‌డ్'కు కొత్త శోభ

• సింగిల్స్ స్టార్లతో జోడీలు • సరికొత్తగా యూఎస్ ఓపెన్ • డబుల్స్ ఆటగాళ్ల గగ్గోలు

న్యూయార్క్: టెన్నిస్‌లో 'సోలో' స్టార్స్ కాస్త ఇకపై 'మిక్స్‌డ్ చాంపియన్స్ కాబోతున్నారు. సింగిల్స్ టైటిల్ కోసం సర్వశక్తులు ఒడ్డే పురుషుల, మహిళల సింగిల్స్ సీడెడ్లు ఇకపై జోడీగా స్ట్రాంగ్... డబుల్ స్ట్రాంగ్ పెర్ఫార్మెన్స్‌కు 'సై' అంటున్నారు. ఈ మేరకు యూఎస్ ఓపెన్ ఆర్గనైజర్లు గ్రాండ్‌స్లామ్‌లో సరికొత్త శోభను తీసుకొస్తున్నారు. 'మిక్స్‌డ్ డబుల్స్'కు సింగిల్స్ స్టార్‌లతో మరో దశకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈనెల 24న యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మొదలుకానుండగా... మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు మాత్రం మంగళవారం ప్రారంభంకానున్నాయి. రెండు రోజుల్లోనే మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌ను నిర్వాహకులు ముగించనున్నారు. ఫలితంగా ఎన్నడూ లేని విధంగా ప్రపంచ సింగిల్స్ స్టార్లంతా ఇప్పుడు మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ కోసం కూడా పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు యూఎస్ ఓపెన్ టోర్నీ నిర్వాహకులు జోడీలను ఎంపిక చేశారు. అల్‌కరాజ్, సినెర్, స్వియాటెక్, మాడిసన్ కీస్‌లు 'మిక్స్‌డ్ డబుల్స్' దశను మార్చే ఆట ఆడతారా లేదో కొన్ని రోజుల్లోనే తేలనుంది.

'మిలియన్' మార్పు

గతేడాది యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌ను సారా ఎరాని-వావసొరి (ఇటలీ) జోడీ గెలుచుకుంది. వీరిద్దరు ట్రోఫీతో పాటు 2 లక్షల డాలర్ల (రూ. 1 కోటీ 75 లక్షలు)ను పంచుకున్నారు. కానీ ఇప్పుడు మిక్స్‌డ్ ప్రైజ్‌మనీ ఏకంగా 10 లక్షల డాలర్లకు (రూ. 8 కోట్ల 73 లక్షలు) చేరింది. ఐదు రెట్లకు పెరిగిన మొత్తం సింగిల్స్ స్టార్లకు వరమైతే... స్పెషలిస్టు డబుల్స్ ప్లేయర్లకు గుండెకోతను మిగిల్చనుంది. ఒక్క ప్రైజ్‌మనే కాదు... ఆట కూడా మారింది. 6 గేమ్‌ల స్థానంలో 4 గేమ్‌లతో ఆడిస్తారు. అంటే 6-0, 6-1 స్కోర్లు కాస్తా 4-0, 4-1గా ఉంటాయి. 32 జోడీలకు బదులుగా 16 జోడీలనే బరిలో దించుతారు. అంటే ప్రీక్వార్టర్స్ నుంచే మిక్స్‌డ్ పోరు మొదలవుతుంది. ఒక్క మ్యాచ్ గెలవగానే ఆ జోడీ క్వార్టర్స్ చేరుతుంది. మ్యాచ్‌లు కూడా ప్రధాన వేదికల్లో నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నారు.



జోడీ కట్టించారిలా...

స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ సరికొత్త సమరాన్ని ఎమ్మా రాడుకాను (బ్రిటన్)తో కలిసి ప్రారంభిస్తాడు. ఇటలీ సంచలనం యానిక్ సినెర్ (ఇటలీ)... కాటరీనా సినియకోవా (చెక్ రిపబ్లిక్)తో జోడీ కట్టాడు. షెడ్యూల్ ప్రకారం ఎమ్మా నవారో (అమెరికా)తో సినెర్ ఆడాల్సి ఉండగా... ఆమె తప్పుకోవడంతో చెక్ స్టార్‌ను జతచేశారు. సెర్బియా దిగ్గజం జొకోవిచ్ తన దేశానికే చెందిన డానిలోవిక్‌తో మిక్స్‌డ్ టైటిల్ కోసం పోటీపడనున్నాడు. స్వియాటెక్ (పోలాండ్)-కాస్పర్ రూడ్ (నార్వే), మాడీసన్ కీస్-టియాఫె (అమెరికా), నయోమి ఒసాకా (జపాన్)-మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్), జ్వెరెవ్ (జర్మనీ)-బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్), రుబ్లెవ్ (రష్యా)- కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్), రీలి ఒపెల్కా-వీనస్ విలియమ్స్ (అమెరికా), టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)- రిబాకినా (కజకిస్తాన్) తదితర హేమాహేమీ జోడీలు ఈసారి కొత్తగా మిక్స్‌డ్ డబుల్స్ బరిలో ఉన్నారు.

మరి మా సంగతేం కాను?

పాత ఒక రోత... కొత్త ఒక వింత.. తాజాగా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో కొత్త మిక్సింగ్‌పై అసలు సిసలైన డబుల్స్ ఆటగాళ్లు గగ్గోలు పెడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటీపీ, డబ్ల్యూటీఏలతో పాటు వందకు పైగా టోర్నీలు జరుగుతున్నాయి. కానీ మిక్స్‌డ్ డబుల్స్ మాత్రం కేవలం నాలుగే నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో నిర్వహిస్తారు. ఇందులోనే పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్ ఆడే ప్లేయర్లు అదనంగా మిక్స్‌డ్ జోడీ కడతారు. సాధారణంగా గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రైజ్‌మనీ కూడా ఎక్కువ. తొలిరౌండ్లో ఓడినా పెద్ద మొత్తంలోనే వస్తాయి. అలాంటి సువర్ణావకాశాన్ని ఇప్పుడు యూఎస్ ఓపెన్ నిర్వాహకులు సరికొత్త మిక్స్‌తో మార్చేయడంతో స్పెషలిస్టు డబుల్స్ ఆటగాళ్ల ఆదాయానికి గండికొట్టారు. మిగతా మూడు గ్రాండ్‌స్లామ్‌ల నిర్వాహకులు సైతం ఇదే ధోరణిని అవలంబిస్తే డబుల్స్ ప్లేయర్లకు కోలుకోలేని దెబ్బ పడుతుంది. గత యూఎస్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ విజేతగా నిలిచిన ఇటలీ జంట సారా ఎరాని-వావసొరి నిర్వాహకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శించారు.



ఆర్చరీ లీగ్‌కు మోగిన సైరన్

అక్టోబర్‌లో ఆరు జట్లతో టోర్నీ • బరిలో జ్యోతి సురేఖ, ధీరజ్, దీపిక, అభిషేక్







న్యూఢిల్లీ: దేశంలో ఫ్రాంచైజీ లీగ్ నిర్వహిస్తున్న క్రీడల జాబితాలో ఆర్చరీ కూడా చేరింది. ఈ ఏడాది అక్టోబర్‌లో తొలిసారి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)ను నిర్వహించనున్నారు. టోర్నీకి సంబంధించిన ఫార్మాట్, ఇతర వివరాలను భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) సోమవారం ప్రకటించింది. ప్రపంచంలో ఇలాంటి లీగ్ నిర్వహించడం ఇదే తొలిసారి అని ఏఏఐ అధ్యక్షుడు అర్జున్ ముండా వెల్లడించారు. యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్లడ్‌లైట్లలో 11 రోజుల పాటు పోటీలు జరుగుతాయి. టోర్నీలో ఆరు ఫ్రాంచైజీ జట్లు పాల్గొంటున్నాయి. డ్రాఫ్ట్ ద్వారా వివిధ జట్లలోకి ఆటగాళ్లను ఏఏఐ ఎంపిక చేస్తుంది. టీమ్ పేర్లు, యాజమాన్యపు వివరాలు మాత్రం నిర్వాహకులు ఇంకా వెల్లడించలేదు. భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా అగ్రశ్రేణి ఆర్చర్లంతా ఇందులో పాల్గొంటారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఒక్కో జట్టులో నలుగురు పురుషులు, నలుగురు మహిళలు చొప్పున ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. వీరిలో కనీసం ఇద్దరు విదేశీ ఆర్చర్లను తీసుకోవచ్చు. బరిలోకి దిగే నలుగురు ఆర్చర్లలో కనీసం ఒకరైనా విదేశీ ఆటగాడు ఉండాలి. కొత్త తరహాలో నిబంధనలతో రికర్వ్‌లో 70 మీటర్లు, కాంపౌండ్‌లో 50 మీటర్ల లక్ష్యంతో ఆర్చర్లు పోటీపడతారు. లీగ్‌లో పాల్గొనే భారత ఆటగాళ్లను ప్రపంచ ర్యాంకింగ్స్‌తో పాటు ఇటీవల జరిగిన సెలక్షన్ ట్రయల్స్ ఆధారంగా ఎంపిక చేశారు. రికర్వ్ విభాగంలో ప్రపంచ మూడో ర్యాంకర్ దీపిక కుమారి, ప్రపంచ 14వ ర్యాంక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందని బొమ్మదేవర ధీరజ్‌తోపాటు సీనియర్లు తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్ బరిలోకి దిగుతారు. కాంపౌండ్ విభాగంలో వరల్డ్ రికార్డు నెలకొల్పిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ (ప్రపంచ 3వ ర్యాంకర్), అభిషేక్ వర్మ, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ రిషభ్ యాదవ్ పోటీ పడతారు. ఈ అగ్రశ్రేణి ఆర్చర్లతో పాటు రికర్వ్ విభాగంలో అంకిత, భజన్ కౌర్, నీరజ్ చౌహాన్, రాహుల్, రోహిత్ కుమార్, మృణాల్ చౌహాన్, సచిన్ గుప్తా, కృష్ కుమార్... కాంపౌండ్ విభాగంలో ప్రథమేశ్, ప్రియాన్ష్, పర్నీత్ కౌర్, అమన్ సైనీ, ఒజస్ దేవ్‌తలే, సాహిల్ రాజేశ్ జాదవ్, చిట్టిబొమ్మ జిజ్ఞాస్, ప్రతీక్ ప్రదీప్, అవ్‌నీత్ కౌర్, మధుర ధమన్‌గాంవ్‌కర్ కూడా ఈ లీగ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



మెయిన్ 'డ్రా'కు సురేశ్ అర్హత

న్యూఢిల్లీ: విన్‌స్టన్-సాలెమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ దక్షిణేశ్వర్ సురేశ్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. అమెరికాలోని నార్త్ కరోలినాలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో ప్రపంచ 352వ ర్యాంకర్ సురేశ్ 6-3, 6-4తో ప్రపంచ 300వ ర్యాంకర్ ఐడన్ మాయో (అమెరికా)పై గెలుపొందాడు. రెండో రౌండ్‌లో సురేశ్ 1-6, 7-6 (7/4), 6-3తో ప్రపంచ 126వ ర్యాంకర్ అలెజాంద్రో టబిలో (చిలీ)పై విజయం సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తు, 75 కేజీల బరువున్న సురేశ్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 74వ ర్యాంకర్ మరియానో నవోని (అర్జెంటీనా)తో తలపడతాడు. తమిళనాడులోని మదురై పట్టణానికి చెందిన సురేశ్ గత ఏడాది ఇదే టోర్నీలో క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. డబుల్స్ విభాగంలో మాత్రం లూకా పౌ (బ్రిటన్)తో కలిసి ఏకంగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లి సంచలనం సృష్టించాడు.

'ఆ క్షణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను'

• లార్డ్స్‌లో చివరి వికెట్‌తో ఆనందం
• భారత్‌తో సిరీస్ సంతృప్తినిచ్చింది
• ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ వ్యాఖ్య





లండన్: ఇంగ్లండ్ ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ వేసిన బంతి భారత ఆటగాడు సిరాజ్ బ్యాట్‌ను తాకి కింద పడిన బంతి అనూహ్యంగా అతని వెనుక వైపునకు వెళ్లి స్టంప్స్‌కు తగిలింది. అంతే...చివరి వికెట్ తీసిన ఇంగ్లండ్ లార్డ్స్ మైదానంలో 22 పరుగులతో అద్భుత విజయాన్ని అందుకుంది. అప్పటికే 29 బంతులు ఆడి జడేజాకు సహకరించిన సిరాజ్ తీవ్ర నిరాశలో మునిగిపోగా, బౌలర్ బషీర్ సంబరాలు చేసుకున్న ఈ దృశ్యం అభిమానులను ఇంకా వెంటాడుతూనే ఉంది. ఈ మ్యాచ్‌లో ఎడమ చేతికి గాయమైన బషీర్ రెండో ఇన్నింగ్స్‌లో 35 బంతులు మాత్రమే వేసి ఈ కీలక వికెట్ పడగొట్టాడు. ఈ ఘటనను బషీర్ చాలా సంతోషంగా గుర్తు చేసుకున్నాడు. ఆ అనుభూతి తాను ఎప్పటికీ మర్చిపోలేనని అతను వ్యాఖ్యానించాడు. 'మేం పట్టుదలగా ప్రయత్నిస్తున్నా వికెట్ మాత్రం దక్కడం లేదు. బయట కూర్చున్న నేను ఎలాగైనా మైదానంలోకి దిగాలని పదే పదే కోరుకున్నాను. నాపై నమ్మకంతో స్టోక్స్ అవకాశం ఇచ్చాడు. నేను మ్యాచ్ ఫలితాన్ని మార్చగలగడం సంతోషాన్నిచ్చింది. సిల్లీ పాయింట్‌లో రూట్‌ను పెట్టి సిరాజ్‌పై ఒత్తిడి పెంచుతూ ప్రతీ బంతి భిన్నంగా వేసేందుకు ప్రయత్నించాం. సిరాజ్ ఆ బంతిని ఆడాక అసలేం అర్థం కాలేదు. అందరూ ఎటు పోయింది అని చూస్తున్నారు. నాకైతే అస్సలు కనిపించలేదు. మావాళ్ల స్పందన చూసిన తర్వాతే నేనూ స్పందించాను. ఆ క్షణం నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. లార్డ్స్‌లాంటి ప్రత్యేక మైదానంలో స్టేడియం నిండుగా ఉన్న అభిమానుల మధ్య లభించిన ఆ ఆనందానికి మించి ఇంకేం ఉంటుంది' అని బషీర్ భావోద్వేగం ప్రదర్శించాడు. ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ ఇచ్చిన సూచనలతోనే తన ఆఫ్ స్పిన్ బౌలింగ్ ఎంతో మెరుగైందని బషీర్ అన్నాడు. తనకు అలీ ఎంతో సహకరించాడని బషీర్ చెప్పాడు. 'తొలి టెస్టు సమయంలోనే మొయిన్ అలీని కలిశాను. క్యారమ్ బాల్ వేయమని అతను ప్రోత్సహించాడు. దాంతో ప్రాక్టీస్‌తో మెరుగుపర్చుకున్నా. ఇంగ్లండ్‌లో ఒక ఆఫ్‌స్పిన్నర్ రాణించడం అంత సులువు కాదు. అలీ నన్ను సరిగ్గా మార్గనిర్దేశనం చేశాడు. ఇంగ్లండ్ శిబిరానికి ఆయన వచ్చిన తర్వాత నా మీద నాకు నమ్మకం పెరిగింది' అని బషీర్ వెల్లడించాడు. లార్డ్స్ మ్యాచ్ తర్వాత గాయంతో బషీర్ చివరి రెండు టెస్టులకు దూరమయ్యాడు. భారత్‌తో సిరీస్ చాలా అద్భుతంగా సాగిందని, పలువురు గొప్ప ఆటగాళ్లకు ప్రత్యర్థిగా తలపడి తాను ఎంతో నేర్చుకున్నానన్న ఈ ఇంగ్లండ్ స్పిన్నర్...తన ప్రదర్శన పట్ల సంతృప్తి వ్యక్తం చేశాడు.

డోపింగ్‌లో దొరికిన ట్రిపుల్ జంపర్ షీనా

'నాడా' సస్పెన్షన్ వేటు



న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో పతకాలెన్నో సాధించిన ట్రిపుల్ జంపర్ షీనా వార్కే డోపింగ్‌లో దొరికిపోయింది. ఆమె నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఆమెపై సస్పెన్షన్ వేటు వేసింది. కేరళకు చెందిన 32 ఏళ్ల షీనా ఈ ఏడాది ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లోనూ రజత పతకంతో మెరిసింది. ఫెడరేషన్ కప్‌లో కాంస్యం గెలుచుకుంది. ఆసియా ఇండోర్ చాంపియన్‌షిప్ (2018)లో రజతం గెలిచింది. రెండేళ్ల క్రితం హాంగ్జౌ ఆసియా క్రీడల్లో కూడా ఆమె పోటీపడింది. డోపింగ్‌లో పట్టుబడిన షీనాను సస్పెండ్ చేస్తున్నట్లు 'నాడా' వర్గాలు తెలిపాయి. అయితే ఆమె తీసుకున్న ఉత్ప్రేరకాలెంటో నాడా బహిర్గతపరచలేదు. డోపింగ్ పాజిటివ్ ఫలితాల రేటింగ్‌లో భారత్ 3.8 శాతంతో చైనా, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, రష్యాల కంటే ముందువరుసలో నిలవడం భారత క్రీడల ప్రతిష్టను మసకబారుస్తోంది. ఒక్క అథ్లెటిక్స్‌లోనే ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) జరిపిన పరీక్షల్లో 1223 పాజిటివ్ కేసులుంటే ఇందులో 61 మంది భారత అథ్లెట్లు ఉండటం క్రీడావర్గాలను కలవరపెడుతోంది.



దులీప్ ట్రోఫీకి ఇషాన్, ఆకాశ్‌దీప్ దూరం

అభిమన్యుకు ఈస్ట్‌జోన్ పగ్గాలు

కోల్‌కతా: వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్, పేసర్ ఆకాశ్ దీప్ దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌కు దూరమయ్యారు. ఈ ఇద్దరు గాయాల నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఈస్ట్‌జోన్ జట్టుకు అందుబాటులో లేరని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వర్గాలు తెలిపాయి. దేశవాళీ సీజన్‌లో భాగంగా దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్‌జోన్‌తో ఈస్ట్‌జోన్ తలపడాల్సి ఉంది. ఇదివరకే ప్రకటించిన జట్టులో ఈస్ట్‌కు ఇషాన్ కిషన్ నాయకత్వం వహించాల్సి ఉంది. ఇపుడు అతను లేకపోవడంతో అభిమన్యు ఈశ్వరన్ జట్టును నడిపించనున్నాడు. ఇషాన్, ఆకాశ్ స్థానాల్లో ఆశిర్వాద్ స్వైన్ (ఒడిశా), ముఖ్తార్ హుస్సేన్ (బిహార్)లను తీసుకున్నారు. ఈ నెల 28 నుంచి ఇరు జట్ల మధ్య బెంగళూరులోని బీసీసీఐ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో అదరగొట్టిన బెంగాల్ పేసర్ ఆకాశ్ దీప్ కూడా దేశవాళీ ఆటకు దూరమయ్యాడు. ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలోని పునరావాస శిబిరంలో కోలుకుంటున్న ఆకాశ్‌దీప్‌ను ఇంకొన్నాళ్లు బరిలో దించకూడదని బోర్డు వైద్య బృందం సూచించడంతో అతన్ని తప్పించారు. అన్ని అనుకున్నట్లు జరిగితే ఆకాశ్ దీప్ స్వదేశంలో అక్టోబర్‌లో విండీస్‌తో జరిగే సిరీస్‌కు అందుబాటులోకి వస్తాడు. మరోవైపు ఇషాన్ కిషన్ త్వరలో జరిగే ఆసియా కప్‌కూ దూరం కానున్నాడు. ఇంగ్లండ్‌లో గాయపడిన రిషభ్ పంత్ స్థానాన్ని భర్తీ చేయాల్సిన ఇషాన్ కూడా గాయం నుంచి కోలుకోకపోవడంతో ఇప్పుడు సంజూ సామ్సన్, జితేశ్ శర్మలలో ఒకరికి చాన్స్ లభించనుంది.

ఈస్ట్‌జోన్ జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), రియాన్ పరాగ్, సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్, దేనిశ్ దాస్, శ్రీదమ్ పాల్, శరణ్‌దీప్ సింగ్, కుమార్ కుశాగ్ర, ఆశిర్వాద్, ఉత్కర్ష్ సింగ్, మనీశ్, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, ముఖ్తార్ హుస్సేన్, షమీ.




ముంబైలో నీళ్లలోనే జనం సంచారం


ఆగిపోయిన కూరగాయల బండి


గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని తోసుకెళ్తూ..

మహారాష్ట్రలో వాన బీభత్సం

ముంబై: మహారాష్ట్రను వర్షాలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్రంలోని 36 జిల్లాలకుగాను కనీసం సగం జిల్లాల్లో ఈ నెల 21వ తేదీ వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని అంచనా వేసిన వాతావరణ విభాగం సోమవారం ఆరంజ్ అలెర్ట్ జారీ చేసింది. సోమవారం నాందేడ్ జిల్లాలోని ముఖెడ్ తాలుకాలో వర్షాలు, వరదల్లో ఏడుగురు చనిపోయారు. వరదల్లో చిక్కుకుపోయిన కనీసం 200 మందిని సహాయక సిబ్బంది రక్షించారు. ఆర్మీ బృందాన్ని సహాయక చర్యల కోసం పంపించారు. జిల్లాలోని లెండి డ్యామ్‌లో భారీగా వరద చేరింది. ఇంకా, మహానగరం ముంబైలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం ఉదయం రెడ్ అలెర్ట్ జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపైకి నీరు చేరడం, చెట్లు విరిగిపడటంతో కనీసం 40 ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. మాతుంగ పోలీస్ స్టేషన్ పరిధిలో వరద నీటిలో నిలిచిపోయిన స్కూలు బస్సు నుంచి ఆరుగురు చిన్నారులను పోలీసులు రక్షించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో సోమవారం ఉదయం ముంబై విమానాశ్రయంలో కొన్ని విమానాల ల్యాండింగ్ ఆలస్యమైంది. ఒక విమానాన్ని దారి మళ్లించారు. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి కొంత మెరుగైందని అధికారులు తెలిపారు. అవసరమైతేనే ఇళ్ల వదిలి బయటకు రావాలని ప్రజలకు అధికారులు సూచనలు చేశారు. అరేబియా సముద్రంలో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు. ముంబైలో సోమవారం 6 నుంచి 8 గంటల వ్యవధిలో 177 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని సీఎం ఫడ్నవీస్ చెప్పారు. దీంతో, లోకల్ రైళ్లు కనీసం 10 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి. సబర్బన్ రైళ్లు, సెంట్రల్ రైల్వే మార్గంలోని లోతట్టు ప్రాంతాల్లో పట్టాలపైకి నీరు చేరడంతో రాకపోకలు ఆలస్యమయ్యాయి. ముంబైలోని విద్యాసంస్థలకు సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సెలవు ప్రకటించారు. వర్షాలు కొనసాగే అవకాశాలుండటంతో మంగళవారం సైతం సెలవు ప్రకటించారు.

హిమాచల్‌లో మళ్లీ విరిగిన కొండచరియలు

- దెబ్బతిన్న 400 రోడ్లు, 1,000 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- 15 గ్రామపంచాయతీలకు తెగిపోయిన సంబంధాలు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌పై రుతు పవనాల ప్రభావం తీవ్రంగా పడింది. భారీ వర్షాలతో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో కులు జిల్లాలో కనీసం 15 గ్రామ పంచాయతీలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రాష్ట్రంలోని మూడు జాతీయ రహదారులు సహా 400కు పైగా రోడ్లు దెబ్బతిన్నాయి. కులు, మండి, లాహౌల్ స్పితి జిల్లాల్లో వెయ్యి వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకుండా పోయాయి. కొండ ప్రాంతాల్లో రహదారులపైకి భారీగా బురదమట్టి, చెట్లు చేరడంతో వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. కులు జిల్లాలో చండీగఢ్-మనాలి జాతీయ రహదారి సహా 64 రోడ్లపై కొండచరియలు విరిగి పడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఔట్-సయింజ్ మార్గంలోని పగల్ నాలా వద్ద కొండచరియలు విరిగి రోడ్డును మూసివేయడంతో 15 గ్రామ పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. బజౌరా చెక్ పోస్ట్ వద్ద పెద్ద సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు, ప్రయాణికుల విజువల్స్ బయటకు వచ్చాయి. కసోల్-కుల్లు రహదారి పలు చోట్ల పూర్తిగా కొట్టుకుపోయింది. అదేవిధంగా, మండి జిల్లాలో 21వ నంబర్ జాతీయ రహదారి సహా 202 రోడ్లు మూతబడ్డాయి. ఇంకా, సిర్మౌర్‌లో 28 రహదారులు, కంగ్రాలో 27, సిమ్లాలో 8, ఉనాలో 7, లాహౌల్ స్పితిలో 6 రహదారులు ధ్వంసమయ్యాయి. మండిలో 44, కులులో 9 నీటి సరఫరా పథకాలపై తీవ్ర ప్రభావం పడింది. రాష్ట్రంలో జూన్ 20వ తేదీ నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సంబంధించిన ఘటనల్లో కనీసం 261 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు వెల్లడించారు.


సిమ్లాలో రహదారి దెబ్బతినడంతో తాత్కాలిక వంతెన మీదుగా వెళ్తున్న స్కూలు విద్యార్థులు

ధర్మస్థల ఫిర్యాదీదారు యూటర్న్

శివాజీనగర: కర్ణాటకతో పాటు దేశమంతటా సంచలనం సృష్టిస్తోన్న ధర్మస్థలలో వందలాది మృతదేహాలను పూడ్చిపెట్టారనే కేసులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మాజీ పారిశుధ్య కార్మికుడు అయిన ఫిర్యాదిదారు యూ టర్న్ తీసుకున్నట్లు తెలిసింది. అబ్బే.. అక్కడ అలాంటిది ఏదీ జరగలేదు, కొందరి ఒత్తిడి వల్లనే అలా చెప్పినట్లు సిట్ విచారణలో వెల్లడించాడని సమాచారం. గత 20 రోజులుగా అతడు సూచించిన విధంగానే 20కి పైగా ప్రదేశాలలో సిట్ అధికారులు, పోలీసులు ముమ్మరంగా సోదాలు చేశారు. ఒకటి రెండు చోట్ల కొన్ని అస్థికలు తప్ప మృతదేహాలు దొరకలేదని తెలుస్తోంది. దీంతో సిట్ అధికారులు ముసుగుమనిషిగా పేరొందిన ఫిర్యాదిదారున్ని లోతుగా ప్రశ్నిస్తున్నారు. తనపై ముగ్గురు వ్యక్తులు ఒత్తిడి చేసి అలా చెప్పించారని తెలిపాడు. ఇలా ఉండగా, సోమవారం కర్ణాటక అసెంబ్లీ సమావేశంలోనూ ఈ అంశంపై ఉద్రిక్తత ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ధర్మస్థల క్షేత్రంపై దుష్ప్రచారం చేస్తోందని ప్రతిపక్ష బీజేపీ నాయకులు ఆరోపించారు.

బందీల విడుదలకు ఒప్పందం చేసుకోండి

యుద్ధం వెంటనే ఆపండి
- రోడ్డెక్కిన వేలాది మంది ఇజ్రాయెలీలు
- రహదారుల దిగ్బంధం, 38 మంది అరెస్టు

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ గాజాపై సైనిక చర్యకు ప్రణాళికలు వేస్తుండగా.. ఇజ్రాయెలీలు నిరసన బాట పట్టారు. గాజాపై యుద్ధం ముగించాలని, బంధీలను విడుదల చేయడానికి హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. ర్యాలీలను నిర్వహించారు. జెరూసలేం, టెల్ అవీవ్‌లను కలిపే ప్రధాన రహదారిని ప్రదర్శనకారులు దిగ్బంధించారు. ఆదివారం దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో వేలాది మంది ఇజ్రాయెలీలు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ర్యాలీల్లో ఇజ్రాయెల్ జెండాలను ఊపుతూ, బందీల ఫొటోలను ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. కొమ్ము బూరలు ఊది, డ్రమ్స్ మోగించి నిరసన తెలిపారు. ప్రధాన రహదారులను దిగ్బంధించారు. దీంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు 38 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఇజ్రాయెల్ నటి గాల్ గాడోట్ కూడా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. బందీల కుటుంబాలను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ ర్యాలీకి ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ హాజరై ప్రదర్శనకారులకు తన సంఘీభావాన్ని తెలిపారు. 'దేశాన్ని బలోపేతం చేసే ఏకైక విషయం. అద్భుతమైన స్ఫూర్తితో ప్రజలు బయటకు అడుగు పెట్టారు'అని ఆయన ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. బందీల కుటుంబాలు నిర్వహించిన ఈ సమ్మెకు వ్యాపార సంస్థలు సైతం మద్దతు ఇచ్చాయి. సిబ్బందిని నిరసనల్లో పాల్గొనేందుకు స్వచ్ఛందంగా మూసేశారు. వేసవి సెలవుల కారణంగా పాఠశాలలపై ఎలాంటి ప్రభావం పడలేదు. యెమెన్ క్షిపణి ప్రయోగిస్తుందని వైమానిక దాడి సైరన్లు హెచ్చరించడంతో స్థానిక సమయం ప్రకారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ప్రదర్శనలు తాత్కాలికంగా నిలిపివేశారు.

అయితే.. హమాస్ లొంగిపోకుండా యుద్ధాన్ని ముగించాలనే పిలుపు ఆ గ్రూపును బలోపేతం చేస్తుందని ప్రధాని నెతన్యాహు అన్నారు. ఇది బందీల విడుదల మరింత ఆలస్యం చేస్తుందని హెచ్చరించారు. మంత్రివర్గ సమావేశంలో మాట్లాడిన ఆయన గాజా నగరాన్ని సైన్యం స్వాధీనం చేసుకునే ప్రణాళికలను పునరుద్ఘాటించారు. ఈ చర్యను ఇజ్రాయెలీలు, ముఖ్యంగా బందీల కుటుంబాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇది బతికి ఉన్న బందీల ప్రాణాలకు ముప్పని భయపడుతున్నారు.

వార్షిక ఫాస్టాగ్‌కు అనూహ్య స్పందన

న్యూఢిల్లీ: కొత్తగా ప్రవేశపెట్టిన వార్షిక ఫాస్టాగ్‌కు వాహనదారుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఆగస్టు 15న ప్రారంభించినప్పటి నుంచి కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే 5 లక్షల మందికి పైగా ఈ పాస్‌ను తీసుకున్నారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల పైఉన్న 1,150 టోల్ ప్లాజాలకు వర్తిస్తుంది. ఏకకాలంలో రూ.3 వేలు చెల్లించిన వాహనదారులు ఈ పాస్‌తో 200 టోల్ ప్లాజాల మీదుగా ప్రయాణించొచ్చు.

నైజీరియాలో పడవ మునక.. 40 మంది గల్లంతు

అబుజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సొకొటొ రాష్ట్రంలోని గొరొనియో ప్రాంతంలోని ఓ నదిలో ప్రయాణికుల పడవ మునిగిపోయింది. ఈ ఘటనలో 10 మందిని మాత్రమే కాపాడగలిగామని విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది. మరో 40 మంది జాడ కోసం ముమ్మరంగా అన్వేషణ సాగిస్తున్నామంది.

కార్చిచ్చుతో స్పెయిన్ కకావికలం

స్పెయిన్‌లో దేశవ్యాప్తంగా మంటలు
- రెండు దశాబ్దాల్లో అత్యంత దారుణమైన వేసవి


పోర్చుగల్‌లోని ట్రాంకోసోలో కమ్ముకొస్తున్న కార్చిచ్చు


స్పెయిన్‌లో ఔరెన్స్‌లో కార్చిచ్చు అడ్డుకునేందుకు సిద్ధమైన ఫైర్ ఫైటర్లు

మాడ్రిడ్: వాతావరణంలో మార్పులు యూరప్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే తుర్కియే, పోర్చుగల్ మంటల బారిన పడగా... స్పెయిన్‌లో కార్చిచ్చు కొనసాగుతోంది. దేశం మొత్తం తీవ్ర కార్చిచ్చు ప్రమాదంలో ఉంది. మంటల్లో ఇప్పటికే 3లక్షల 90 వేల ఎకరాలు దగ్ధమయ్యాయి. శుక్రవారం దేశవ్యాప్తంగా 14 చోట్ల కార్చిచ్చులు చెలరేగగా.. ఇప్పుడు 20 ప్రాంతాలకు మంటలు విస్తరించాయి. మంటలను అదుపు చేసేందుకు మరో 500 మంది సైనికులను ప్రభుత్వం మోహరించింది. వాయువ్య గలిసియా ప్రాంతంలో మంటలను అదుపు చేయడానికి 2వేల మంది అగ్నిమాపక సిబ్బంది కష్టపడుతున్నారు. వేడిగాలుల కారణంగా ఎండిపోయిన అడవులన్నీ తగలబడి పోతున్నాయి. రెండు వారాలుగా కొనసాగుతున్న వేడిగాలులతో ఇది రెండు దశాబ్దాల్లో ఇదే అత్యంత దారుణమైన వేసవిగా నమోదైందని అత్యవసర చీఫ్ వర్జీనియా బార్కోన్స్ అన్నారు.

ఇళ్ళకు ఇంకా ముప్పు పొంచి ఉండటంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మంటలు అదుపు చేస్తున్న చోట వెలువడిన పొగ, బూడిదను పీల్చకుండా ఉండటానికి ప్రజలు ఫేస్ మాస్కులు ధరించాలని, ఇళ్లనుంచి బయటికి రావద్దని అధికారులు సూచించారు. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ (113 డిగ్రీల ఫారెన్‌హీట్) వరకు చేరే అవకాశం ఉందని స్పెయిన్ జాతీయ వాతావరణ సంస్థ హెచ్చరించింది. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. మంటలను ఎదుర్కోవడానికి స్పెయిన్‌కు ఫ్రాన్స్, ఇటలీ ఇప్పటికే సహాయం అందిస్తుండగా.. ఇతర యురోపియన్ దేశాలు కూడా సాయమందించనున్నాయి. దక్షిణ యూరప్ రెండు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత దారుణమైన కార్చిచ్చు సీజన్‌ను ఎదుర్కొంటోంది. ఇందులో స్పెయిన్ అత్యంత ఎక్కువగా దెబ్బతిన్నది. కార్చిచ్చుతో గత వారంలో ముగ్గురు మరణించారు.

పోర్చుగల్‌లో..

పొరుగున ఉన్న పోర్చుగల్ కూడా మంటలతో పోరాడుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 1,550 చదరపు కి.మీ (600 చదరపు మైళ్ళు) విస్తీర్ణంలో కార్చిచ్చులు అటవీ సంపదను దగ్ధం చేశాయి. ఎనిమిది పెద్ద మంటలను వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది అదుపు చేస్తున్నారు. పర్యాటక ప్రాంతమైన పియోదావో సమీపంలోనూ కార్చిచ్చు చెలరేగింది. ట్రాంకోసోలో కార్చిచ్చు ఎనిమిది రోజులుగా మండుతోంది. మంటలను అదుపు చేయడానికి 4వేలకు పైగా అగ్నిమాపక సిబ్బంది, 1,300 వాహనాలు అలాగే 17 విమానాలను మోహరించింది. 1980ల నుంచి యూరప్ ప్రపంచ సగటు కంటే రెండు రెట్లు వేగంగా వేడెక్కుతుండటంతో తరచూ కార్చిచ్చులు చెలరేగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణాలు మంటల తీవ్రతను మరింత పెంచుతున్నాయి. ఈ ప్రాంతం మరిన్ని కార్చిచ్చులకు బలయ్యే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

తుర్కియేలో..

తుర్కియే అడవుల్లోనూ కార్చిచ్చు కొనసాగుతోంది. 30 విమానాలు, 1,300 మంది అగ్నిమాపక సిబ్బందితో మంటలను అదుపు చేస్తున్నామని జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఫారెస్ట్రీ తెలిపింది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు, పొడి పరిస్థితులు, బలమైన గాలుల కారణంగా జూన్ చివరి నుంచే తుర్కియే వందలాది మంటలతో అతలాకుతలమైంది. ఇటీవల చెలరేగిన కార్చిచ్చుల్లో 19 మంది మృతి చెందారు. ప్రస్తుతం కొనసాగుతున్న కార్చిచ్చు కారణంగా ముందు జాగ్రత్త చర్యగా ఆరు గ్రామాలను ఖాళీ చేయించినట్లు కనక్కలే ప్రావిన్స్ గవర్నర్ ఒమర్ తోరామన్ తెలిపారు.

శుభాంశు చరిత్ర సృష్టించారు

ఐఎస్ఎస్‌లో అడుగిడటం దేశ అంతరిక్ష చరిత్రలో నూతనాధ్యాయం

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రశంసలు
- లోక్‌సభలో చర్చలో పాల్గొనని ప్రతిపక్షం
- ఓట్ల చోరీ అంశంపై వాకౌట్
- నేడు తిరిగి చర్చించే అవకాశం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో కాలుమోపి చరిత్ర సృష్టించిన భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. యాగ్జియం-4 మిషన్‌లో భాగంగా అమెరికా నుంచి అంతరిక్షంలోకి దూసుకెళ్లి, విజయవంతంగా యాత్రను పూర్తి చేసుకున్న శుభాంశు శుక్లా ఆదివారం అమెరికా నుంచి స్వదేశానికి చేరుకోవడం, అపూర్వ స్వాగతం అందుకోవడం తెల్సిందే. సోమవారం లోక్‌సభలో శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపే తీర్మానాన్ని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ ప్రవేశపెట్టారు. శుభాంశు సాధించిన లక్ష్యాలను, భారత అంతరిక్ష ఆకాంక్షలకు వాటి ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా వివరించారు. అయితే, ఓట్ల చోరీ ఆరోపణలపై చర్చ చేపట్టాలంటూ ప్రతిపక్ష పార్టీలు నినాదాలతో సభను హోరెత్తిస్తున్నాయి. జాతికే గర్వకారణంగా శుభాంశు సాధించిన ఘనతను కొనియాడే విషయంలో కలిసి రావాలంటూ మంత్రి జితేంద్ర సింగ్ పదేపదే చేసిన వినతిని ప్రతిపక్షాలు పట్టించుకోలేదు. దీంతో, నిరసనల నడుమే ఆయన మాట్లాడారు. శుభాంశు శుక్లా సాధించిన విజయాలపై ప్రశంసలు కురిపించారు.

వికసిత్ భారత్‌కు నాంది

శుభాంశు శుక్లా సాధించిన ఘనతను ప్రశంసిస్తూ తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి జితేంద్ర సింగ్ 'ఐఎస్ఎస్‌లోకి అడుగిడిన మొట్టమొదటి భారతీయ వ్యోమగామి- 2047 నాటికి వికసిత్ భారత్-అంతరిక్ష రంగం పాత్ర' అంశంపై ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న ప్రతిపక్షాలు మన వ్యోమగామి, గగన్‌యాత్రి శుభాంశు శుక్లా సాహసాన్ని తక్కువ చేస్తూ వాకౌట్ చేయడం దురదృష్టకరం'అని పేర్కొన్నారు. 'శుభాంశు శుక్లా అందరికీ ఆదర్శంగా మారారు. నేడు ప్రతి చిన్నారి కూడా శుభాంశు శుక్లా స్థాయికి ఎదగాలని కలలు కంటున్నారు. ప్రపంచమంతా మనవైపే చూస్తోంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ మనం సాధించిన అంతరిక్ష రంగ సాంకేతిక పురోగతి ఎంతగానో ఉపయోగపడింది'అని ఆయన పేర్కొన్నారు. 2040లో చంద్రుడిపై భారతీయుడు కాలుమోపడం ద్వారా వికసిత్ భారత్‌కు నాంది పలుకుతారని మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. అంతరిక్ష రంగంలో ప్రవేశపెట్టిన ప్రైవేట్ రంగ భాగస్వామ్యం తదితర సంస్కరణలను వివరించారు. వీటి ఫలితంగా భారతీయ అంతరిక్ష రంగం 8 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి వచ్చే పదేళ్లలో ఏకంగా 45 బిలియన్ డాలర్లకు చేరుకోనుందన్నారు. 2026లో రోబోతో వ్యోమమిత్ర, 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌ను చేపట్టనున్నామని ప్రకటించారు. 2035లో సొంత అంతరిక్ష కేంద్రం, 2040కల్లా చంద్రుడిపైకి మొట్టమొదటి భారత వ్యోమగామి అడుగుపెట్టే దిశగా కృషి జరుగుతోందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల సభ్యుల అంతరాయాలతో నిలిచిపోయిన చర్చ మంగళవారం తిరిగి కొనసాగనుంది.

ఈసీ చీఫ్‌పై ప్రతిపక్షాల అభిశంసన!

న్యూఢిల్లీ: 'ఓటు చోరీ'ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షం పరిశీలిస్తోంది. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢి తెలిపారు. అయితే అభిశంసన నెగ్గడానికి పార్లమెంటు ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతం ప్రతిపక్షానికి ఈ సంఖ్య లేదు. భారత ఓటింగ్ ప్రక్రియ సమగ్రతను ప్రశ్నించిన రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను జ్ఞానేష్ కుమార్ ఖండించడం తెలిసిందే. అయితే.. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒక రాజకీయ పార్టీకి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను అభిశంసించే ప్రక్రియ న్యాయమూర్తి అభిశంసన మాదిరిగానే ఉంటుంది. సాధారణంగా అవినీతి, అసమర్థత అభిశంసనకు కారణాలుగా చూపవచ్చు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అటువంటి తీర్మానానికి ఎటువంటి ముందస్తు అవకాశం లేదు.

జవాన్‌పై చేయిచేసుకున్న టోల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విధులకు వెళ్తున్న ఆర్మీ జవాన్‌పై యూపీలోని టోల్‌బూత్ సిబ్బంది దాడి చేశారు. మీరట్‌లోని ఒక టోల్ బూత్ వద్ద జరిగిన ఘర్షణలో ఆయనను స్తంభానికి కట్టేసి కొట్టారు. సైనికుడిపై దాడి చేస్తున్న వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో నలుగురు టోల్‌బూత్ సిబ్బందిని పోలీసులు అరెస్టు చేశారు. కపిల్ కవాడ్ అనే ఆ సైనికుడు భారత సైన్యంలోని రాజ్‌పుత్ రెజిమెంట్‌లో పనిచేస్తున్నారు. ఆయన సెలవుల కోసం ఇంటికి వచ్చారు. మళ్లీ విధులకోసం శ్రీనగర్‌లోని తన పోస్టుకు వెళ్లడానికి ఢిల్లీ విమానాశ్రయానికి బయల్దేరారు. రద్దీగా ఉన్న భూని టోల్ బూత్ వద్ద ఆయన చిక్కుకున్నారు. అయితే.. తన విమానానికి ఆలస్యం అవుతుండటంతో కపిల్ కారు దిగి టోల్ బూత్ సిబ్బందితో మాట్లాడటం ప్రారంభించారు. అది కాస్తా వాగ్వాదానికి దారి తీయడంతో ఐదుగురు టోల్ బూత్ ఉద్యోగులు కపిల్‌ను, అతని బంధువును కొట్టారు. కొంతమంది కపిల్‌ను స్తంభానికి బిగించి, అతని చేతులు వెనక్కి లాగి పట్టుకోగా, మరికొందరు కర్రతో కొడుతున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపించింది. సీసీటీవీ ఫుటేజ్, వీడియోలను పరిశీలించిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మిగిలినవారి కోసం గాలింపు చేపట్టారు.

లోపాలతో ఎయిరిండియా విమానాలు రద్దు

మిలన్/కొచ్చి: ఇటలీలోని మిలన్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిరిండియా విమానం నిర్వహణ సమస్యల కారణంగా రద్దు చేశారు. రద్దు వల్ల కలిగిన అసౌకర్యంపై ఎయిరిండియా విచారం వ్యక్తం చేసింది. 'ఆకస్మిక రద్దుకు చింతిస్తున్నాం. మిలన్‌లోని మా గ్రౌండ్ సిబ్బంది ప్రయాణికులందరికీ హోటల్ వసతిని ఏర్పాటు చేసింది. అలాగే ప్రయాణికుల అభీష్టం మేరకు టికెట్ రద్దు లేదా రీ షెడ్యూలింగ్ చేశాం. రద్దు చేసుకున్నవారికి రీఫండ్ చేశాం'అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులను వీలైనంత త్వరగా వారి గమ్యస్థానానికి చేర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ తెలిపింది.

కొచ్చిలోనూ టేకాఫ్ రద్దు..: కొచ్చి నుంచి ఢిల్లీకి వెళ్తున్న ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ రద్దయ్యింది. ఇంజన్‌లో వైబ్రేషన్ వస్తోందని పైలట్ నివేదించారు. దీంతో ప్రయాణికులు దింపేసి తదుపరి ప్రయాణానికి ప్రత్యామ్నాయ విమానం ఏర్పాటు చేశారు. తనిఖీల కోసం విమానాన్ని బేకు తిరిగి తీసుకెళ్లారు.

ఢిల్లీలో స్కూళ్లకు మళ్లీ బాంబు బూచీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని 32 స్కూళ్లకు సోమవారం బాంబు బెదిరింపులు అందాయి. దీంతో, స్కూళ్ల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు. ఆయా స్కూళ్లలోని విద్యార్థులందరినీ ఇళ్లకు పంపించి, సోదాలు జరపగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాధిత స్కూళ్లలో అత్యధికం ద్వారక ప్రాంతంలోనివే. ఇందులో ఢిల్లీ పబ్లిక్ స్కూల్(డీపీఎస్), మోడర్న్ కాన్వెంట్ స్కూల్, శ్రీరాం వరల్డ్ స్కూల్ తదితరాలున్నాయి. ఉదయం 7.30 గంటల నుంచి 12.25 గంటల మధ్యలో ఈ-మెయిళ్ల ద్వారా బెదిరింపులు అందినట్లు పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. దీంతో, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసు బృందాలు అక్కడికి చేరుకుని క్షుణ్నంగా తనిఖీలు జరిపారు. ఎలాంటి పేలుడు పదార్థాలు కనిపించకపోవడంతో బెదిరింపులు వట్టివేనని తేల్చారు.

డిసెంబర్‌లో మయన్మార్ ఎన్నికలు

నేపిడా: మయన్మార్‌లో ఇంకా అంతర్యుద్ధం కొనసాగుతుండగానే.. సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో జాతీయ ఎన్నికలకు జుంటా పిలుపునిచ్చింది. ఐదేళ్లుగా అంతర్యుద్ధంతో దెబ్బతిన్న దేశంలో జరుగుతున్న తొలి ఎన్నికలకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. దశల వారీగా తేదీలను తరువాత ప్రకటిస్తామని మయన్మార్ యూనియన్ ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఎన్నికల కోసం మొత్తం 55 రాజకీయ పార్టీలు నమోదు చేసుకోగా, వాటిలో తొమ్మిది పార్టీలు దేశవ్యాప్తంగా పోటీ చేయనున్నాయి. కొత్తగా ఏర్పడిన తాత్కాలిక యంత్రాంగం దేశవ్యాప్తంగా 300 కి పైగా నియోజకవర్గాల్లో ఓటింగ్ నిర్వహించాలని యోచిస్తున్నట్లు ప్రకటించింది. వీటిలో ప్రస్తుతం సైన్యాన్ని వ్యతిరేకించే సాయుధ గ్రూపులు ఆధీనంలో ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి. నోబెల్ గ్రహీత ఆంగ్ సాన్ సూకీ నేతృత్వంలోని ప్రభుత్వం 2020లో గెలిచిన తరువాత.. 2021లో తిరుగుబాటుదారులు ప్రభుత్వాన్ని కూలిృవేశారు. తిరుగుబాటు తరువాత, సైనిక దళం దేశాన్ని అత్యవసర పరిస్థితి కింద పాలించింది. నాటి నుంచి మయన్మార్ హింసతో అట్టుడుకుతోంది.

నిలకడగా నవీన్ పట్నాయక్ ఆరోగ్యం

భువనేశ్వర్: బీజేడీ చీఫ్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ ఆరోగ్యం నిలకడగా ఉందని భువనేశ్వర్‌లోని ఎస్‌యూఎం అల్టిమేట్ మెడికేర్ ఆస్పత్రి సోమవారం సాయంత్రం తెలిపింది. డీ హైడ్రేషన్ సమస్యతో ఆదివారం ఈ ఆస్పత్రిలో చేరారు. 'ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది, ఆరోగ్యం మెరుగవుతోంది. ఐసీయూ నుంచి కేబిన్‌కు తరలించామని ఆస్పత్రి ఒక బులెటిన్‌లో పేర్కొంది. తన క్షేమం కోరుకుంటున్న రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ నవీన్ పట్నాయక్ ఓ వీడియో విడుదల చేశారు. 'ఎస్‌యూఎం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నారు. నన్ను చూడాలని ఉంటే, మీరు భువనేశ్వర్‌లోని నా నివాసం నవీన్ నివాస్‌లోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నా. ధన్యవాదాలు'అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో జనం ఆస్పత్రి వద్దకు తరలివస్తున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు వీడియో విడుదల చేశారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు..

ఇద్దరు పోలీసులు మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు

ట్రిమంటన్: అమెరికాలోని ఉటాహ్ నగరంలో ఆదివారం చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ఇద్దరు పోలీసు అధికారులు చనిపోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రిమంటన్ ప్రాంతంలో కాల్పులు జరుగుతున్నాయంటూ సమాచారం అందడంతో పోలీసులు డాగ్ స్క్వాడ్ సహా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తి వారిపైకి యథేచ్ఛగా కాల్పులకు దిగాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు పోలీసులు చనిపోగా మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనలో పోలీసు జాగిలం సైతం గాయపడింది. వెంటనే స్పందించిన చుట్టుపక్కల వారు అగంతకుడిని పట్టుకున్నారు. ఆయుధంతోపాటు అతడిని పోలీసులకు అప్పగించారు.

ఆ కేడెట్లను విధుల్లోకి తీసుకోండి: సుప్రీం

న్యూఢిల్లీ: శిక్షణ సమయంలో గాయపడిన, దివ్యాంగులుగా మారిన కేడెట్లకు బీమా సదుపాయం వర్తింపజేయడం, ఇతరత్రా విధుల్లోకి తీసుకునే విషయాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా ఈ కేసుపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. గాయపడటంతోనో, దివ్యాంగులుగా మారడం వల్లనో వీరు ధైర్యం, ఉత్సాహం కోల్పోలేదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఇలాంటి వారికి అందజేస్తున్న పరిహారం చాలా తక్కువని తెలిపింది. వీరిని డెస్క్ ఉద్యోగాలు లేదా ఇతర విధుల్లోకి చేర్చుకునే విషయం పరిశీలించాలని కోరింది. తదుపరి విచారణను సెప్టెంబర్ నాలుగో తేదీకి వాయిదా వేసింది. ఆలోగా ఇదే అంశంపై వివిధ హైకోర్టుల్లో కేసులు వేసిన వారి అభిప్రాయాలను, కేంద్రం వివరణను అందించాలని అదనపు సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించారు.

జాతీయ పాలకుడిగా పేరొందిన తొలి భారతీయ రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర



1. అశోకుడి ఎన్నో పాలనా సంవత్సరంలో కళింగ యుద్ధం జరిగింది?
 1) 1వ 2) 2వ
 3) 8వ 4) 13వ
2. అశోకుడి శాసనాల్లో ఉపయోగించని లిపి?
 1) అరామిక్ 2) ఖరోష్టి
 3) బ్రాహ్మి 4) సంస్కృతం
3. అశోకుడు శ్రీనగర్ పట్టణ నిర్మాత అని తెలిపే గ్రంథం?
 1) రాజతరంగిణి 2) పరిశిష్ట పర్వన్
 3) అశోకవదన 4) దివ్యవదన
4. అశోకుడి శాసనాలు.. ఎవరి శాసనాలను పోలి ఉన్నాయి?
 1) ఆంటియోకస్-2 2) టాలమీ-2
 3) మాగాస్ 4) డేరియస్
5. మౌర్యుల కాలంలో శిస్తు వసూలుకు అధిపతి?
 1) సమాహర్త 2) సన్నిధాత
 3) రూపదర్శక 4) కరణిక
6. ఏ సమయంలోనైనా తనను కలిసేందుకు ఏ అధికారులకు అశోకుడు అనుమతినిచ్చాడు?
 1) రజ్జుకలు 2) యుక్తలు
 3) పతివేదకులు
 4) ధమ్మ మహామాత్రులు
7. సుదర్శన తటాకాన్ని నిర్మించినవారు?
 1) చంద్రగుప్త మౌర్య
 2) అశోకుడు
 3) రుద్రదమన
 4) ఆర్యాతుషస్ప
8. మౌర్యుల కాలంలో విష్టి అంటే..?
 1) ఒక రాష్ట్రం 2) ఒక జిల్లా
 3) బలవంతపు శ్రమ
 4) ఒక నాణెం
9. పన్నుల వ్యవస్థను ప్రస్తావించిన అశోకుని శాసనం?
 1) రుమ్మిందై శాసనం
 2) నిగాలిసాగర్ శాసనం
 3) కాందహార్ శాసనం
 4) బారాబర్ శాసనం
10. మౌర్యుల కాలంలో గొప్ప విద్యాకేంద్రం?
 1) తక్షశిల 2) ఉజ్జయినీ
 3) నలంద 4) వల్లభి
11. రాణి శాసనంలో పేర్కొన్న అశోకుడి రాణి ఎవరు?
 1) విదీష మహాదేవి
 2) అసంధిమిత్ర 3) కారువాకి
 4) తిస్యరక్షిత
12. మౌర్యుల ఆస్థానానికి రాయబారిగా రానివారు?
 1) మెగస్తనీస్ 2) డైమాకస్
 3) డైనోసియస్ 4) పాట్రోకిల్స్
13. మెగస్తనీస్ ప్రకారం.. మౌర్యుల కాలంలో సమాజాన్ని ఎన్ని వర్గాలుగా విభజించారు?
 1) రెండు 2) నాలుగు
 3) ఆరు 4) ఏడు
14. 'ఒకే చక్రంతో బండి ఏ విధంగా నడవలేదో పరిపాలన కూడా ఒకే వ్యక్తి ద్వారా నడవలేదు' అని వ్యాఖ్యానించినవారు?
 1) మెగస్తనీస్ 2) కౌటిల్యుడు
 3) చంద్రగుప్తుడు 4) వి.ఎ. స్మిత్
15. అశోకుడు ధమ్మ ప్రచారానికి చేపట్టిన చర్యల్లో లేనిది?
 1) ధమ్మ గురించి తెలుపుతూ శిలా శాసనాలు, స్తంభ శాసనాల జారీ
 2) ధమ్మ మహామాత్రల నియామకం
 3) స్వీయ ధమ్మ యాత్రలు చేయడం
 4) ధమ్మ ఉల్లంఘనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం
16. అశోకుడు ఏటా తన పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా మానవతా దృక్పథంతో కొంత మంది ఖైదీలను విడుదలచేసేవారని తెలిపే శాసనం?
 1) 5వ స్తంభ శాసనం
 2) మొదటి శిలాశాసనం
 3) 13వ శిలాశాసనం
 4) 4వ స్తంభ శాసనం
17. భారతదేశంలో తొలిసారిగా నౌకాదళాన్ని ఏర్పాటు చేసిన పాలకులు?
 1) నందరాజులు 2) మౌర్యులు
 3) కుషాణులు 4) గుప్తులు
18. మౌర్యుల కాలంలో ఎంత శాతం భూమిశిస్తు (భాగ)గా వసూలు చేశారు?
 1) 1/8 2) 1/6 - 1/4
 3) 1/3 4) 1/2
19. మౌర్యులు గయ వద్ద నిర్మించిన గుహల్లో అతి పెద్దది?
 1) కర్ణచౌపార గుహ
 2) సుధాముని గుహ
 3) లోమస రుషి గుహ
 4) గోపికా గుహ
20. సముద్రగుప్తుడి అలహాబాద్ ప్రశస్తిపై ఏయే రాజుల శాసనాలు ఉన్నాయి?
 1) అశోకుడు, జహంగీర్
 2) అశోకుడు, కనిష్కుడు
 3) జహంగీర్, ఫిరోజ్ షా తుగ్లక్
 4) అశోకుడు, అక్బర్
21. అశోకుడిలానే 'దేవానాం ప్రియ' అనే బిరుదు ధరించిన మౌర్యచక్రవర్తి ఎవరు?
 1) సంప్రతి 2) బిందుసారుడు
 3) దశరథుడు
 4) బృహద్రథుడు
22. అశోకుడి సామ్రాజ్యంలో లేని ప్రాంతం?
 1) కేరళ 2) తమిళనాడు
 3) కాశ్మీర్ 4) 1, 2
23. అశోకుడు తన పొరుగు రాజులుగా కింది వారిలో ఎవరిని పేర్కొన్నాడు?
 1) చోళులు, పాండ్యులు
 2) సత్య పుత్రులు
 3) కేరళ పుత్రులు
 4) పైవారందరూ
24. కౌటిల్యుడు పేర్కొన్న సప్తాంగాల్లో లేనిది?
 1) స్వామి 2) కోశ
 3) ప్రదేశ 4) దండ
25. గ్రీకు రాజ్యాల్లో అశోకుడి సమకాలీనులు కానివారు?
 1) ఆంటియోకస్ 2) మాగాస్
 3) జేక్జెస్ 4) టాలమీ ఫిలడెల్ఫస్
26. ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకి రాసిన అశోకుడి శిలా శాసనం ఏది?
 1) ఎర్రగుడి సూక్ష్మ శిలాశాసనం
 2) లంపక శిలాశాసనం
 3) షాబాజ్‌గిరి శిలాశాసనం
 4) మాన్‌షేరా శిలాశాసనం
27. మౌర్య ప్రభుత్వ గుత్తాధిపత్యం లేని అంశం?
 1) అడవులు 2) గనులు
 3) రేవులు 4) జూద గృహాలు
28. మౌర్యుల పాలనా భాష?
 1) సంస్కృతం 2) ప్రాకృతం
 3) ఖరోష్టి 4) అర్ధమాగధి
29. కిందివాటిలో మౌర్యుల రాగి నాణెం ఏది?
 1) పణం 2) సువర్ణం
 3) నిష్క 4) మషాక
30. జాతీయ పాలకుడిగా పేరొందిన తొలి భారతీయ రాజు?
 1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
 3) సముద్రగుప్తుడు 4) అక్బర్
31. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
 1) యూథిడియస్ 2) యూకట్రిడస్
 3) డెమిట్రియస్ 4) మినాండర్
32. మహేశ్వర అనే బిరుదును ధరించిన విదేశీ రాజు?
 1) కుజుల కాడ్‌ఫైసెస్
 2) ఆంటియాల్ సిడాస్
 3) విమా కాడ్‌ఫైసెస్
 4) హెలియో డోరస్
33. వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
 1) పాశుపతం 2) కాపాలికం
 3) కాలాముఖం 4) అఘోర శైవం
34. పాంచావొ అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
 1) కుజుల కాడ్‌ఫైసెస్
 2) కనిష్కుడు
 3) వీమా కాడ్‌ఫైసెస్
 4) హువిష్కుడు
35. కనిష్కుడు ఎవరి సలహాపై కుండల వనంలో నాలుగో బౌద్ధ సంగీతి నిర్వహించాడు?
 1) వసుమిత్రుడు
 2) అశ్వఘోషుడు
 3) శీలభద్రుడు 4) పార్శ్వ
36. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
 1) హువిష్కుడు 2) వాసుదేవుడు
 3) రెండో కనిష్కుడు
 4) వశిష్కుడు
37. ఎవరి పాలనా కాలంలో కశ్యపమాతంగ చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
 1) మౌర్యులు 2) శుంగులు
 3) శకులు 4) కుషాణులు
38. హుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
 1) బ్రాహ్మణ 2) క్షత్రియ
 3) వైశ్య 4) శూద్ర
39. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
 1) నరవర్ధన 2) ఆదిత్యవర్ధన
 3) ప్రభాకరవర్ధన
 4) హర్షవర్ధన
40. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
 1) రెండో ధ్రువసేనుడు
 2) రెండో ప్రవరసేనుడు
 3) మూడో ధ్రువసేనుడు
 4) మూడో ప్రవరసేనుడు
41. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
 1) దండి 2) భండి
 3) వ్యాఘ్రకేతు 4) నిఘ్రూత
42. సకలోత్తరపథేశ్వర అనే బిరుదు ఉన్న రాజు ఎవరు?
 1) గ్రహవర్మ 2) శశాంక
 3) హర్ష 4) భాస్కరవర్మ
43. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికారులకు భూదానాలు చేసిన రాజవంశం?
 1) శాతవాహనులు
 2) గుప్తులు 3) ఇక్ష్వాకులు
 4) పుష్యభూతులు
44. ఏ వర్గాన్ని హుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
 1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
 3) వైశ్యులు 4) శూద్రులు
45. బాణుడి ప్రకారం హర్షుడి కాలంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
 1) సతీసహగమనం
 2) వరకట్నం
 3) కన్యాశుల్కం
 4) వితంతు వివాహాల నిషేధం
46. హర్షుడు ఆదరించిన మతం?
 1) హిందూ మతం 2) బౌద్ధ మతం
 3) జైన మతం 4) వైష్ణవ మతం
47. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
 1) వైష్ణవం 2) బౌద్ధం
 3) శైవం 4) జైనం
48. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
 1) సముద్రగుప్తుడు
 2) హర్షవర్ధనుడు
 3) రెండో చంద్రగుప్తుడు
 4) యశోధర్ముడు
49. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరించిన రాజు?
 1) రెండో పులకేశి
 2) మొదటి మహేంద్రవర్మ
 3) హర్షుడు
 4) రెండో నరసింహవర్మ
50. రెండో పులకేశి ఏ యుద్ధంలో మొదటి మహేంద్రవర్మను అంతం చేశాడు?
 1) పుల్లలూరు యుద్ధం
 2) కొప్పం యుద్ధం
 3) సంగమేశ్వర యుద్ధం
 4) మణిమంగళ యుద్ధం
51. గుజరాత్‌పై అరబ్బుల దాడిని తిప్పికొట్టిన చాళుక్యరాజు?
 1) రెండో పులకేశి
 2) మొదటి విక్రమాదిత్యుడు
 3) రెండో విక్రమాదిత్యుడు
 4) రెండో కీర్తివర్మ
52. రెండో పులకేశి క్రీ.శ.642లో జరిగిన ఏ యుద్ధంలో మొదటి నరసింహవర్మ చేతిలో అంతమయ్యాడు?
 1) మణిమంగళ యుద్ధం
 2) కంచి యుద్ధం
 3) అనిల్‌వారా యుద్ధం
 4) బనవాసి యుద్ధం
53. బాదామీ చాళుక్యుల రాజ చిహ్నం?
 1) వరాహం 2) వృషభం
 3) సింహం 4) పులి
54. ఐహోల్ శాసనాన్ని రచించిన వారు?
 1) హరిసేనుడు 2) రవికీర్తి
 3) మొదటి పులకేశి 4) బాణుడు
55. అవనీసింహ అనే బిరుదున్న పల్లవ రాజు?
 1) సింహవిష్ణు
 2) రెండో నరసింహవర్మ
 3) మొదటి మహేంద్రవర్మ
 4) మొదటి పరమేశ్వర వర్మ
56. మహాబలిపురంలోని ఆదివరాహ దేవాలయంలో ఉన్న పల్లవరాజు విగ్రహం ఎవరికి సంబంధించింది?
 1) మొదటి నరసింహవర్మ
 2) రెండో నరసింహవర్మ
 3) సింహవిష్ణు
 4) అపరాజిత వర్మ
57. ఏ పల్లవరాజును సైనికుడు, పాలనాదక్షుడు, మత సంస్కర్త, భవన నిర్మాత, కవి, సంగీతకారుడు అని పిలిచేవారు?
 1) రెండో నరసింహవర్మ
 2) మొదటి మహేంద్రవర్మ
 3) రెండో పరమేశ్వరవర్మ
 4) రెండో నందివర్మ

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 4
5) 1	6) 3	7) 1	8) 3
9) 1	10) 1	11) 3	12) 4
13) 4	14) 2	15) 4	16) 1
17) 2	18) 2	19) 4	20) 1
21) 3	22) 4	23) 4	24) 4
25) 3	26) 1	27) 4	28) 2
29) 4	30) 1	31) 3	32) 3
33) 1	34) 2	35) 4	36) 2
37) 4	38) 3	39) 4	40) 1
41) 2	42) 3	43) 4	44) 4
45) 2	46) 2	47) 3	48) 4
49) 3	50) 1	51) 3	52) 1
53) 1	54) 2	55) 1	56) 3
57) 2			

'శూరమణి', 'పైరు పచ్చలు' లాంటి పదాల్లో ఉన్న సమాసం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

సమాసాలు

సమ ప్రాధాన్యం ఉన్న రెండు వేర్వేరు పదాలు ఏకపదంగా సమసించి కొత్త అర్థాన్ని సూచించడాన్ని 'సమాసం' అంటారు.

ఉదా: 'పని', 'మనిషి' అనే రెండు వేర్వేరు పదాలు కలిసి 'పనిమనిషి' అనే సమాస పదం ఏర్పడింది.

పద ప్రాధాన్యాన్ని అనుసరించి సమాసాలు ఆరు రకాలు.. అవి:

1) అవ్యయీభావ సమాసం
2) తత్పురుష సమాసం
3) ద్వంద్వ సమాసం
4) బహువ్రీహి సమాసం
5) కర్మధారయం
6) ద్విగువు

ఉపాధ్యాయ పోటీ పరీక్షల్లో సమాసాలపై తప్పనిసరిగా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు వీటిపై అవగాహన పెంచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. 'చంపకవతి పట్టణం' ఏ సమాసం?
 1) విశేషణ పూర్వ పద కర్మధారయం
 2) సంభావన పూర్వ పద కర్మధారయం
 3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
 4) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
2. 'సూర్యచంద్రులు' ఏ సమాసం?
 1) బహువ్రీహి
 2) విశేషణ ఉభయ పద కర్మధారయం
 3) ద్వంద్వ సమాసం
 4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
3. 'అబ్జముల వంటి పదములు' విగ్రహ వాక్యానికి సమాస పదం ఏమిటి?
 1) పాదాబ్జములు 2) అబ్జపదాలు
 3) పదాబ్జములు 4) అబ్జపాదాలు
4. 'నలుదెసలు' అనేది ఏ సమాసం?
 1) ద్వంద్వ 2) ద్విగువు
 3) విశేషణ పూర్వ పద కర్మధారయం
 4) రూపకం
5. కింది వాటిలో ద్విగు సమాసం కానిది ఏది?
 1) పంచకావ్యాలు 2) చతుర్వేదాలు
 3) వేషభాషలు 4) ఎనిమిది మూరలు
6. కలువ కన్నులు అనేది ఏ సమాసం?
 1) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
 2) ఉపమాన పూర్వ పద కర్మధారయం
 3) విశేషణ పూర్వ పద కర్మధారయం
 4) ద్వంద్వ సమాసం
7. 'రాజభటుడు' ఏ సమాసం?
 1) సప్తమీ తత్పురుష
 2) పంచమీ తత్పురుష
 3) షష్ఠీ తత్పురుష
 4) ప్రథమా తత్పురుష
8. 'పాపభీతి' ఏ సమాసం?
 1) ద్వితీయా తత్పురుష
 2) తృతీయా తత్పురుష
 3) పంచమీ తత్పురుష
 4) సప్తమీ తత్పురుష
9. 'మృదుమధురం' ఏ సమాసం?
 1) విశేషణ పూర్వ పద కర్మధారయం
 2) విశేషణ ఉభయ పద కర్మధారయం
 3) విశేషణ ఉత్తర పద కర్మధారయం
 4) ద్వంద్వ సమాసం
10. 'అమెరికా రాయబారి' ఏ సమాసం?
 1) సప్తమీ తత్పురుష
 2) పంచమీ తత్పురుష
 3) షష్ఠీ తత్పురుష
 4) సంభావన పూర్వపద
11. 'వయోవృద్ధుడు' ఏ సమాసం?
 1) తృతీయా తత్పురుష
 2) ద్వంద్వ 3) చతుర్థీ తత్పురుష
 4) విశేషణ పూర్వ పద కర్మధారయం
12. 'విధాతృనానతి' ఏ సమాసం?
 1) పంచమీ తత్పురుష
 2) సప్తమీ తత్పురుష
 3) షష్ఠీ తత్పురుష
 4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
13. కింది వాటిలో ద్విగు సమాసాన్ని గుర్తించండి.
 1) విద్యాధికులు 2) స్త్రీ పురుషులు
 3) భారతదేశం
 4) ఏభై సంవత్సరాలు
14. 'కాశీ పట్టణం' ఏ సమాసం?
 1) రూపక సమాసం
 2) సంభావనా పూర్వపద కర్మధారయం
 3) సప్తమీ తత్పురుష
 4) పంచమీ తత్పురుష
15. 'కొండ యొక్క మలుపు' - సమాస పదం?
 1) కొండదరి మలుపు
 2) కొండమలుపు 3) కొండనున్న మలుపు
 4) కొండ పక్క మలుపు
16. 'సత్యదూరం' - ఏ సమాసం?
 1) పంచమీ తత్పురుష
 2) ద్వంద్వ సమాసం 3) షష్ఠీ తత్పురుష
 4) ద్వితీయా తత్పురుష
17. 'నెలతాల్పు' - ఏ సమాసం?
 1) ప్రథమా తత్పురుష
 2) ద్వితీయా తత్పురుష
 3) తృతీయా తత్పురుష
 4) రూపక సమాసం
18. 'దేశభక్తి' - ఏ సమాసం?
 1) సప్తమీ తత్పురుష
 2) ద్వంద్వ సమాసం
 3) విశేషణ పూర్వ పద కర్మధారయం
 4) తృతీయా తత్పురుష
19. కింది వాటిలో తృతీయా తత్పురుష సమాసం ఏది?
 1) పొట్టకూడు 2) ధనహీనుడు
 3) రాక్షసభయం 4) రాజశ్రేష్ఠుడు
20. 'అసత్యం' - ఏ సమాసం?
 1) ద్వంద్వ సమాసం
 2) నఞ్ బహువ్రీహి 3) నఞ్ తత్పురుష
 4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
21. 'సంఘ సంస్కర్తలు' - ఏ సమాసం?
 1) బహువ్రీహి 2) ద్వితీయా తత్పురుష
 3) ద్వంద్వ సమాసం
 4) సప్తమీ తత్పురుష
22. 'శక్తిని అనుసరించి' విగ్రహ వాక్యంగా ఉన్న సమాస పదం ఏది?
 1) శక్తి ప్రకారం 2) శక్త్యానుసారం
 3) యథాశక్తి 4) శక్తిననుసరించి
23. 'ప్రతి నిత్యం' - ఏ సమాసం?
 1) ప్రథమా తత్పురుష
 2) అవ్యయీభావ సమాసం
 3) ద్వితీయా తత్పురుష
 4) చతుర్థీ తత్పురుష
24. కింది వాటిలో అవ్యయీభావ సమాసం కానిది?
 1) నిశ్చలం 2) ప్రతి దినం
 3) నిరుపయోగం 4) అన్యాయం
25. 'అర్ధరాత్రి' ఏ సమాసం?
 1) అవ్యయీభావం
 2) ప్రథమా తత్పురుష
 3) ద్వంద్వ సమాసం
 4) ద్వితీయా తత్పురుష
26. కింది వాటిలో ప్రథమా తత్పురుష సమాసం కానిది?
 1) నడిరేయి 2) మధ్యాహ్నం
 3) మద్యపానుడు 4) అర్ధరాజ్యం
27. 'కనకాభిషేకం' - ఏ సమాసం?
 1) చతుర్థీ తత్పురుష
 2) తృతీయా తత్పురుష
 3) ద్వితీయా తత్పురుష
 4) సప్తమీ తత్పురుష
28. కింది వాటిలో రూపక సమాసం కానిది?
 1) విద్యాగంధం 2) లతాలలనలు
 3) త్రిజగములు 4) కోపాగ్ని
29. కమలనాభుడు - ఏ సమాసం?
 1) షష్ఠీ తత్పురుష
 2) ద్వంద్వ సమాసం
 3) పంచమీ తత్పురుష
 4) బహువ్రీహి
30. కింది వాటిలో బహువ్రీహి సమాసం కానిది?
 1) ముక్కంటి 2) రాజాజ్ఞ
 3) చంచలాత్ములు
 4) బాష్పపూరితనయన
31. కింది వాటిలో ద్వితీయా తత్పురుష సమాసం కానిది?
 1) హితార్థకాంక్షులు 2) జలధరం
 3) ధనాఢ్యుడు 4) విద్యార్థులు
32. 'అర్ధశతాబ్ది' ఏ సమాసం?
 1) ద్వితీయా తత్పురుష
 2) ప్రథమా తత్పురుష
 3) ద్విగు సమాసం
 4) తృతీయా తత్పురుష
33. 'అమృతతుల్యములు' ఏ సమాసం?
 1) చతుర్థీ తత్పురుష
 2) ద్వంద్వ సమాసం
 3) పంచమీ తత్పురుష
 4) తృతీయా తత్పురుష
34. కింది వాటిలో చతుర్థీ తత్పురుష సమాసం ఏది?
 1) ఆవుదూడ 2) భిక్షాపాత్ర
 3) నోటిమాట 4) విద్యాగురుడు
35. 'అథమాథముడు' - ఏ సమాసం?
 1) నఞ్ తత్పురుష
 2) చతుర్థీ తత్పురుష
 3) పంచమీ తత్పురుష
 4) సప్తమీ తత్పురుష
36. 'ద్వారకవాటం' - ఏ సమాసం?
 1) ద్వంద్వ సమాసం
 2) పంచమీ తత్పురుష
 3) సప్తమీ తత్పురుష
 4) షష్ఠీ తత్పురుష
37. కింది వాటిలో సప్తమీ తత్పురుష సమాసం?
 1) దాస్యవిముక్తులు 2) నోటిమాట
 3) సమాజ రుగ్మతలు 4) జీవనోపాధి
38. కింది వాటిలో నఞ్ తత్పురుష సమాసం కానిది?
 1) అద్వైతం 2) అసాధ్యం
 3) అసత్యం 4) క్రియాలోలురు
39. 'పుణ్యభూమి' ఏ సమాసం?
 1) విశేషణ పూర్వ పద కర్మధారయం
 2) ద్వంద్వ సమాసం
 3) సప్తమీ తత్పురుష
 4) ఉపమాన పూర్వ పద కర్మధారయం
40. కింది వాటిలో విశేషణ పూర్వ పద కర్మధారయ సమాసం కానిది?
 1) తెల్లగుర్రం 2) చిరకాలం
 3) గాజుబాలు 4) చిరుగాలి
41. 'మామిడిగున్న' ఏ సమాసం?
 1) విశేషణ పూర్వ పద కర్మధారయం
 2) విశేషణ ఉత్తర పద కర్మధారయం
 3) ద్వంద్వ
 4) షష్ఠీ తత్పురుష
42. 'ఉదార విశాలం', 'ఇరుగు పొరుగు' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?
 1) విశేషణ ఉత్తర పద కర్మధారయం
 2) విశేషణ పూర్వ పద కర్మధారయం
 3) విశేషణ ఉభయ పద కర్మధారయం
 4) ఉపమాన పూర్వపద కర్మధారయం
43. 'కాటుక కొండ' పదంలో ఉన్న సమాసం?
 1) విశేషణ పూర్వ పద కర్మధారయం
 2) ద్వంద్వ సమాసం
 3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
 4) ఉపమాన ఉత్తర పద కర్మ ధారయం
44. 'శూరమణి', 'పైరు పచ్చలు' లాంటి పదాల్లో ఉన్న సమాసం?
 1) ద్వంద్వ సమాసం
 2) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
 3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
 4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
45. 'మోక్షలక్ష్మి', 'అంకశయ్య' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?
 1) రూపకం 2) ద్వంద్వ
 3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
 4) విశేషణ పూర్వ పద కర్మధారయం
46. కింది వాటిలో సంభావనా పూర్వ పద కర్మధారయ సమాస పదమేది?
 1) సంసార సాగరం
 2) ఆస్యగహ్వరం 3) కడిమి చెట్టు
 4) వేదార్థములు
47. 'నవనాడులు', 'నూరు పద్యాలు' పదాల్లో ఉన్న సమాసం ఏది?
 1) ద్వంద్వ 2) ద్విగు సమాసం
 3) ప్రథమా తత్పురుష
 4) అవ్యయీభావ సమాసం
48. కింది వాటిలో ద్వంద్వ సమాసం కానిది?
 1) అర్ఘ్యపాద్యములు
 2) ధైర్య సాహసాలు
 3) ఐదుదినాలు
 4) సౌభాగ్య సౌఖ్యాలు
49. 'బాలుడి నుండి గోపాలుని వరకు' అనే విగ్రహ వాక్యానికి సమాస పదం?
 1) బాలగోపాలం 2) గోపాల బాలం
 3) ఆబాలగోపాలం 4) ఆగోపాలబాలం

సమాధానాలు

1) 2;	2) 3;	3) 3;	4) 2;
5) 3;	6) 2;	7) 3;	8) 3;
9) 2;	10) 3;	11) 1;	12) 3;
13) 4;	14) 2;	15) 2;	16) 3;
17) 2;	18) 1;	19) 2;	20) 3;
21) 2;	22) 3;	23) 2;	24) 4;
25) 2;	26) 3;	27) 2;	28) 3;
29) 4;	30) 2;	31) 3;	32) 2;
33) 4;	34) 2;	35) 3;	36) 4;
37) 3;	38) 4;	39) 1;	40) 3;
41) 2;	42) 3;	43) 3;	44) 2;
45) 1;	46) 3;	47) 2;	48) 3;
49) 3.			

రాజ్యాంగ ప్రవేశికను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో మొదటి భాషాప్రయుక్త రాష్ట్రం ఏది?
ఎ) ఆంధ్రరాష్ట్రం బి) తమిళనాడు
సి) పంజాబ్ డి) గుజరాత్

2. శ్రీబాగ్ ఒప్పందం ఎవరి మధ్య కుదిరింది?
ఎ) ఆంధ్ర-తెలంగాణ నాయకులు
బి) రాయలసీమ-ఆంధ్ర నాయకులు
సి) ఆంధ్ర-మద్రాస్ రాష్ట్ర నాయకులు
డి) పైవారందరి మధ్య

3. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కమిటీ అనేది రాజ్యాంగ పరిషత్ ఉప సంఘం. దీని అధ్యక్షుడిగా ఎవరు పనిచేశారు?
ఎ) ధార్ బి) హెచ్.సి.ముఖర్జీ
సి) నెహ్రూ, పటేల్, రాజేంద్రప్రసాద్
డి) ఫజల్ అలీ

4. రాష్ట్రాల సరిహద్దులను మార్పు చేసే అధికారం పార్లమెంట్‌కు ఏ విధంగా ఉంది?
ఎ) రాష్ట్రాల విన్నపం మేరకు
బి) విదేశీ దురాక్రమణ కారణంగా
సి) రాష్ట్రాల సమ్మతి లేకుండానే
డి) రాష్ట్రాల సమ్మతితో

5. కింద ఇచ్చిన వారిలో పెద్దమనుషుల ఒప్పందంలో పాల్గొనని తెలంగాణ నాయకుడు?
ఎ) మర్రి చెన్నారెడ్డి
బి) పి.వి.నరసింహారావు
సి) జె.వి.నరసింగరావు
డి) కె. వెంకట రంగారెడ్డి

6. ఆంధ్ర, తెలంగాణ నాయకుల మధ్య పెద్దమనుషుల ఒప్పందం ఎప్పుడు కుదిరింది?
ఎ) ఫిబ్రవరి-1955
బి) ఫిబ్రవరి-1956
సి) మార్చి-1955
డి) నవంబర్-1956

7. నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో స్థానిక పాలన (పంచాయతీరాజ్) మంత్రిగా పని చేసి తర్వాత ముఖ్యమంత్రి అయినవారు?
ఎ) పి.వి.నరసింహారావు
బి) బూర్గుల రామకృష్ణరావు
సి) కాసు బ్రహ్మానందరెడ్డి
డి) జలగం వెంగళరావు

8. కింది వాటిలో సరైంది?
ఎ) అక్టోబర్ 1, 1953న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది
బి) ఆంధ్ర రాష్ట్ర శాసన సభ మొదటి స్పీకర్ - వెంకట్రామయ్య
సి) ఆంధ్ర రాష్ట్ర రాజధాని-కర్నూలు
డి) పైవన్నీ

9. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి?
ఎ) బెజవాడ గోపాల్ రెడ్డి
బి) కె.వి.రంగారెడ్డి
సి) నీలం సంజీవరెడ్డి
డి) టంగుటూరి ప్రకాశం పంతులు

10. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలి ముఖ్యమంత్రి ఎవరు?
ఎ) మర్రి చెన్నారెడ్డి
బి) పి.వి.నరసింహారావు
సి) జలగం వెంగళరావు
డి) టంగుటూరి అంజయ్య

11. పూర్తికాలం ముఖ్యమంత్రిగా పని చేసిన ఏకైక తెలంగాణ వ్యక్తి ఎవరు?
ఎ) పి.వి.నరసింహారావు
బి) మర్రి చెన్నారెడ్డి
సి) టి.అంజయ్య
డి) జలగం వెంగళరావు

12. కింది వారిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పని చేయని వారు?
ఎ) కె.వి.రంగారెడ్డి
బి) జె.వి.నరసింహారావు
సి) కొనేరు రంగారావు
డి) మర్రి చెన్నారెడ్డి

13. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి హోంశాఖ మంత్రి ఎవరు?
ఎ) బెజవాడ గోపాల్‌రెడ్డి
బి) కె.వి.రంగారెడ్డి
సి) కళా వెంకట్రావ్
డి) కల్లూరి సుబ్బారావు

14. హైదరాబాద్ రాష్ట్ర ఏకైక స్పీకర్?
ఎ) కాశీనాథరావు వైద్య
బి) సాలార్ జంగ్
సి) మాడపాటి హనుమంతరావు
డి) పై ఎవరు కాదు

15. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ ఎవరి మంత్రివర్గం నుంచి తప్పుకున్నారు?
ఎ) నీలం సంజీవరెడ్డి
బి) కాసు బ్రహ్మానందరెడ్డి
సి) దామోదరం సంజీవయ్య
డి) పి.వి.నరసింహారావు

16. కింది వాటిలో సరికాని జత?
ఎ) ప్రాథమిక హక్కులు - అమెరికా
బి) సమాఖ్య ప్రభుత్వం - బ్రిటన్
సి) కాగ్ వ్యవస్థ - బ్రిటన్
డి) ఆదేశిక సూత్రాలు - ఐర్లాండ్

17. తెలంగాణలో నిర్మితమైన మొదటి రైలు మార్గం?
ఎ) సికింద్రాబాద్ - వాడి
బి) సికింద్రాబాద్ - గుల్బర్గా
సి) కాచిగూడ - మహబూబ్‌నగర్
డి) కాచిగూడ - వరంగల్

18. సింగరేణి కాలరీస్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1921 బి) 1890
సి) 1937 డి) 1943

19. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథ రచయిత?
ఎ) మాడపాటి హన్మంతరావు
బి) బూర్గుల రామకృష్ణారావు
సి) సురవరం ప్రతాపరెడ్డి
డి) రావి నారాయణరెడ్డి

20. తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధి కోసం ఆంధ్ర సారస్వత పరిషత్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1923 బి) 1943
సి) 1947 డి) ఏదీకాదు

21. మహ్మదీ యులను ఏకం చేసి వారి అభివృద్ధికి కృషి చేసేందుకు 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్'ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1927 బి) 1944
సి) 1952 డి) 1957

22. తెలంగాణ ప్రాంతంలో దళిత ఉద్యమాలకు ఆద్యుడు?
ఎ) భాగ్యరెడ్డి వర్మ
బి) అరిగె రామస్వామి
సి) బి.యస్.వెంకట్రావ్
డి) సంగం లక్ష్మీబాయి

23. నిజాం ప్రభుత్వంపై సర్దార్ పటేల్ చొరవతో భారత సైన్యం జరిపిన సైనిక చర్య?
ఎ) ఆపరేషన్ పోలో
బి) ఆపరేషన్ బ్లూస్టార్
సి) ఆపరేషన్ పీస్
డి) ఆపరేషన్ డిజాస్టర్

24. హైదరాబాద్ రాష్ట్ర ఆవిర్భావం?
ఎ) 1-10-1953 బి) 17-9-1948
సి) 17-9-1952 డి) 17-9-1949

25. నిజాం ప్రభుత్వంపై జరిపిన 'ఆపరేషన్ పోలో'కు ఎవరు నాయకత్వం వహించారు?
ఎ) జనరల్ కరియప్ప
బి) జనరల్ మెనేక్ష
సి) మేజర్ జనరల్ జె.యస్.చౌదరి
డి) ఎవరూ కాదు

26. ప్రభుత్వ ఉద్యోగాలలో హైదరాబాదీలకు ప్రాధాన్యం కల్పిస్తూ 'ముల్కీ' నిబంధనలను ఎప్పుడు ప్రవేశ పెట్టారు?
ఎ) 1910 బి) 1919
సి) 1927 డి) 1952

27. 1953 డిసెంబర్ 22న ఏర్పాటైన రాష్ట్రాల పునర్విభజన కమిటీ అధ్యక్షుడెవరు?
ఎ) జస్టిస్ సర్కారియా
బి) జస్టిస్ ఫజల్ అలీ
సి) జస్టిస్ శ్రీకృష్ణ డి) జస్టిస్ వర్మ

28. 1958లో ఏర్పాటైన తెలంగాణ ప్రాంతీయ కమిటీ మొదటి అధ్యక్షుడు ఎవరు?
ఎ) మొయినుద్దీన్ బి) అచ్యుతరెడ్డి
సి) జగన్నాథరావు డి) హయగ్రీవాచారి

29. తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1999 బి) 2001
సి) 2003 డి) 2006

30. రాజ్యాంగ ప్రవేశికను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) కెనడా డి) దక్షిణాఫ్రికా

31. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని లోక్‌సభ స్థానాల్లో తెలంగాణ ప్రజా సమితి ఎన్ని స్థానాలను నెగ్గింది?
ఎ) 8 బి) 9 సి) 11 డి) 13

32. ఉమ్మడి రాష్ట్రంలో మొదటిసారిగా రాష్ట్రపతి పాలనను ఎప్పుడు విధించారు?
ఎ) 1969 బి) 1971
సి) 1973 డి) 1975

33. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1973లో ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా ఆరు సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు?
ఎ) 29వ సవరణ బి) 30వ సవరణ
సి) 32వ సవరణ డి) 36వ సవరణ

34. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్‌గా ఎవరు వ్యవహరించారు?
ఎ) స్వామిగౌడ్
బి) శ్రీనివాస్‌గౌడ్
సి) ఆచార్య కోదండరామ్
డి) రసమయి బాలకిషన్

35. శ్రీకృష్ణ కమిటీలో సభ్యుడు కానివారు?
ఎ) ప్రొఫెసర్ రవిందర్ కౌర్
బి) ప్రొఫెసర్ వి.కె.దుగ్గల్
సి) ప్రొఫెసర్ రణబీర్ సింగ్
డి) జస్టిస్ వర్మ

36. తెలంగాణ లోక్‌సభ, రాజ్యసభ స్థానాల సంఖ్య?
ఎ) 10,5 బి) 17,7
సి) 15,8 డి) 20,10

37. తెలంగాణ విధాన సభ, విధాన పరిషత్ సభ్యుల సంఖ్య?
ఎ) 130, 50 బి) 120, 45
సి) 119, 40 డి) 119, 50

38. తెలంగాణ లోక్‌సభ స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎన్ని సీట్లు కేటాయించారు?
ఎ) 6, 3 బి) 7, 3
సి) 3, 2 డి) 3, 3

39. తెలంగాణ విధాన సభలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కేటాయించిన సీట్లెన్ని?
ఎ) 20, 10 బి) 19, 12
సి) 15, 10 డి) 30, 15

40. తెలంగాణ సాధన కోసం హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 10-3-2011 బి) 10-3-2012
సి) 13-4-2011 డి) 2-5-2011

41. రాజ్యాంగం అంటే?
ఎ) ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యనున్న సంబంధాన్ని తెలియజేసే శాసనం
బి) దేశ పరిపాలన విధానానికి మూల శాసనం
సి) రాజ్యాధికారాన్ని నియంత్రించి వ్యక్తి స్వేచ్ఛను కాపాడే శాసనం
డి) పైవన్నీ

42. ఏ చట్టం ద్వారా విద్య అభివృద్ధి కోసం బడ్జెట్‌లో లక్ష రూపాయలు కేటాయించారు?
ఎ) 1773 రెగ్యులేటింగ్ చట్టం
బి) 1813 చార్టర్ చట్టం
సి) 1833 చార్టర్ చట్టం
డి) 1853 చార్టర్ చట్టం

43. ఏ చట్టం ద్వారా బ్రిటన్‌లో భారత వ్యవహారాల కార్యదర్శి పదవిని ఏర్పాటు చేశారు?
ఎ) 1858 విక్టోరియా మహారాణి ప్రకటన
బి) 1861 కౌన్సిల్స్ చట్టం
సి) 1892 కౌన్సిల్స్ చట్టం
డి) 1909 మింటో-మార్లె సంస్కరణల చట్టం

44. 1919 మాంటెంగ్-చేమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టానికి సంబంధించి సరికానిది?
ఎ) ద్వంద పాలన ప్రవేశపెట్టడం
బి) కేంద్రంలో ద్విసభ విధానం ప్రవేశ పెట్టడం
సి) సీఏజీ(కాగ్) వ్యవస్థను ప్రవేశపెట్టడం
డి) అడ్వకేట్ జనరల్ పదవి ఏర్పాటు

45. షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని తొలిసారిగా ఎక్కడ ఉపయోగించారు?
ఎ) సైమన్ కమిషన్
బి) రౌండ్ టేబుల్ సమావేశాలు
సి) కమ్యూనల్ అవార్డు
డి) పుణే ఒప్పందం

46. కింది వాటిలో ఏ చట్టాన్ని భారత రాజ్యాంగ 'మాగ్నాకార్టా'గా పేర్కొంటారు?
ఎ) 1909 మింటో-మార్లే చట్టం
బి) 1919 మాంటెంగ్-చేమ్స్‌ఫర్డ్ చట్టం
సి) 1935 భారత ప్రభుత్వ చట్టం
డి) పై ఏవీ కాదు

47. రాజ్యాంగ పరిషత్ ఉపాధ్యక్షుడెవరు?
ఎ) వి.టి.కృష్ణమాచారి
బి) టి.టి.కృష్ణమాచారి
సి) కె.ఎం.మున్షీ
డి) సర్దార్ పటేల్

48. భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన బ్రిటిష్ ప్రధానమంత్రి?
ఎ) విన్సెంట్ చర్చిల్
బి) రాంసీమెక్ డొనాల్డ్
సి) లార్డ్ క్లెమెంట్ అట్లీ
డి) పై ఎవరూ కారు

సమాధానాలు

1) ఎ;	2) బి;	3) ఎ;	4) సి;
5) బి;	6) బి;	7) సి;	8) డి;
9) డి;	10) బి;	11) డి;	12) డి;
13) ఎ;	14) ఎ;	15) బి;	16) బి;
17) ఎ;	18) ఎ;	19) సి;	20) బి;
21) ఎ;	22) ఎ;	23) ఎ;	24) బి;
25) సి;	26) బి;	27) బి;	28) బి;
29) బి;	30) బి;	31) సి;	32) సి;
33) సి;	34) సి;	35) డి;	36) బి;
37) సి;	38) సి;	39) బి;	40) ఎ;
41) డి;	42) బి;	43) ఎ;	44) డి;
45) ఎ;	46) సి;	47) ఎ;	48) సి;

This level of connectedness has changed..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. To curbing the spread of violence, (1)/ authorities brought under curfew (2)/ more areas in the State, (3)/ here three youths were killed. (4)/ No error (5)
2. Not only was the actress over the moon (1)/ as winning an award, (2)/ but was also deeply touched by the support (3)/ she got from the industry. (4)/ No error (5)
3. Hectic schedules can take a toll (1)/ on anybody and (2)/ the solutions to this is (3)/ a quick holiday to some exotic location. (4)/ No error (5)
4. We have hired (1)/ an advertising agency to prepare (2)/ a campaign to encourage (3)/ people votes. (4)/ No error (5)
5. During the training programme (1)/ the new recruits (2)/ will be briefed about how their role (3)/ in the new organization. (4)/ No error (5)

Directions (Q. No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given in bold in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Sheela unnecessarily **picked up** a quarrel with him and left the party.
1) picking up 2) picked
3) picked on 4) has picked up
5) No correction required
7. Harish has the guts to **rise from** the occasion and come out successfully.
1) in rising from 2) to raise with
3) to rise against 4) to rise to
5) No correction required
8. I need not offer any explanation, my behaviour **is speaking itself**.
1) speaks about itself
2) has been speaking
3) speaks for itself
4) will speak to itself
5) No correction required
9. The equipment is in such poor condition that we have **no alternative** to buy new ones.
1) many alternative like
2) any alternative except
3) no other alternative
4) no alternative but
5) No correction required
10. Since the deadline has been changed from next week to this Wednesday you should **give this work priority**.
1) priority this work
2) prioritized this work
3) not give priority this work
4) be given this work priority
5) No correction required

Directions (Q. No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. With all the bid information being available and tracked online, corruption has considerably reduced.
B. Today, most, i.e. over ninety-five per cent, households, in the city enjoy broadband connection.
C. All city contracts are now bid for online.
D. Over twenty years ago the city government, Central Government and the private sector made a concerted effort to shift the economy to include IT.
E. As our cities do expand and become more complex, such a system will make governance more manageable.
F. This level of connectedness has changed not only the city's economy but also how it is governed and how business is conducted.

11. What is the FOURTH sentence after rearrangement?
1) C 2) B 3) D 4) E 5) F
12. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) E 4) F 5) C
13. What is the LAST sentence after rearrangement?
1) A 2) C 3) B 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
1) B 2) C 3) D 4) E 5) F
15. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Being a successful businessman demands ____ work, honesty, persuasive skills and sound market ____.
1) light; info 2) smart; expo
3) hard; knowledge
4) nice; experience 5) well; skill
17. ____ to the heavy rains many multi-storey office buildings were badly damaged.
1) Because 2) In spite
3) In addition 4) Since
5) Owing
18. A firm that specializes in the ____ of handwriting claims that it can assess more than three hundred personality ____.
1) analyze; charts
2) analysis; traits
3) study; quality
4) scrutiny; value
5) learn; worth
19. A recent research ____ the election board for, first of all, failing to replace ____ voting machines.
1) praise; latter
2) appreciate; former
3) applaud; outnumbered
4) criticized; outmoded
5) gifted; outdated
20. Acid rain and snow result ____ the chemical reactions ____ industrial emissions of sulfur dioxide and nitrogen oxides.
1) for; because 2) off; among
3) with; because
4) since; between
5) from; between

Directions (Q. No. 21-25): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Steven Spielberg's first films ____ (21) made at a time when directors were the most important people in Hollywood. His more recent ones were made at a time when marketing ____ (22) the industry. That he has remained the most powerful filmmaker in the world during both periods says ____ (23) for his talent and his flexibility. No one else has put together a more popular body of work. Yet, within the entertainer there is ____ (24) an artist. When entertainer and artist came fully together, the result was E.T., a remarkable fusion of mass appeal and stylistic mastery. His most important contributions to modern movies came out of his insight that there was an enormous ____ (25) to be created if old-style B-movie stories could be made with A-level craftsmanship. The story lines were the stuff of Saturday serials, but the filmmaking was cutting edge and delivered what films have always promised: something amazing that we hadn't seen before.

21. 1) were 2) was 3) are
4) is 5) been
22. 1) exercise 2) controlled
3) demanded 4) prospered
5) progressed
23. 1) many 2) much
3) something 4) anything
5) all things
24. 1) almost 2) all ways
3) most 4) also 5) among
25. 1) mass 2) cult
3) population 4) people
5) audience

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

In recent times, India has grown fast not only compared to its own past but also in comparison with other nations. But there cannot be any room for **complacency** because it is possible for the Indian economy to develop even faster and also to spread the benefits of this growth more widely than has been done thus far. Before going into details of the kinds of micro-structural changes that we need to conceptualize and then proceed to implement it is worthwhile elaborating on the idea of inclusive growth that constitutes the defining concept behind this government's various economic policies and decisions. A nation interested in inclusive growth views the same growth differently depending on whether the gains of the growth are heaped primarily on a small segment or shared widely by the population. The latter is cause for celebration but not the former. In other words, growth must not be treated as an end in itself but as an instrument for spreading prosperity to all. India's own past experience and experience of other nations suggests that growth is necessary for eradicating poverty but it is not sufficient condition. In other words policies for promoting growth need to be **complimented** with policies to ensure that more and more people join in the growth process and, further, that there are mechanisms in place to redistribute some of the gains to those who are unable to partake in the market process and, hence, get left behind.

A simple way of giving this idea of inclusive growth a sharper form is to measure a nation's progress in terms of the progress of its poorest segment, for instance the bottom 20% of the population. One could measure the per capita income of the bottom quintile of the population and also calculate the growth rate of income; and evaluate our economic success in terms of these measures that pertain to the poorest segment. This approach is attractive because it does not ignore growth like some of the older heterodox criteria did. It simply looks at the growth of income of the poorest sections of the population. It also ensures that those who are outside of the bottom quintile do not get ignored, if that were done, then those people would in all likelihood drop down into the bottom quintile and so would automatically become a direct target of our policies. Hence the criterion being suggested here is a statistical summing up of the idea of inclusive growth, which, in turn leads to two corollaries to wish that India must strive to achieve high growth and that we must work to ensure that the weakest segments benefit from the growth.

26. The author's central focus is on
1) Applauding India's economic growth not only against its own past performance, but against other nations
2) Emphasizing the need for economic growth which is the sole determinant of a country's prosperity
3) Emphasizing inclusive growth where gains of growth are shared widely by the population
4) Emphasizing high growth
5) Least bothered about the policies
27. The author suggests policies which will help
1) Develop economic growth
2) Better distribution of incomes irrespective of rate of growth
3) Develop economic growth and redistribute economic gains to those getting left behind
4) Put an emphasis on the development of the poorest segments of society
5) People who are below poverty line
28. According to the author, India's economy has grown but there is no room for complacency as
a) Growth eradicates poverty
b) Growth has resulted in prosperity for all.
Which of the statements given above is/ are correct?
1) a only 2) b only
3) Both a and b 4) Neither a nor b
29. The synonym of **compliment** is
1) Approve 2) Applaud
3) Administer 4) Admonish
5) Adverting
30. The antonym of **complacency**
1) Smugness 2) Satisfaction
3) Contentment 4) Anxiety
5) Gratification

ANSWERS

1) 1;	2) 2;	3) 3;	4) 4;
5) 3;	6) 5;	7) 4;	8) 3;
9) 4;	10) 5;	11) 5;	12) 3;
13) 1;	14) 3;	15) 2;	16) 3;
17) 5;	18) 2;	19) 4;	20) 5;
21) 1;	22) 2;	23) 3;	24) 4;
25) 5;	26) 3;	27) 3;	28) 4;
29) 2;	30) 4.		